www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
వెల: రూ.6.00
పేజీలు: 16 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం
సంపుటి: 58
సంచిక: 318
ఆదివారం | 4-3-2018
శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 1.08 తదుపరి చవితి; నక్షత్రం: హస్త రా. 8.16 తదుపరి చిత్త; వర్జ్యం: శే. ఉ. 6.38, తె. 4.17-5.53; దుర్ముహూర్తం: సా. 4.46-5.33; అమృతఘడియలు: మ. 2.26-4.00; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 6.19
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



శూన్యం నుంచి శిఖరానికి

"నా ప్రభుత్వంపై ఇన్నాళ్లుగా భయాన్ని, అబద్ధాలను, అయోమయాన్ని ప్రచారం చేశారు. అలాంటివాటన్నిటికీ ప్రజలు ఇచ్చిన సమాధానమే ఈ ఫలితాలు. వాస్తుశాస్త్రం ప్రకారం ఈశాన్యం చాలా ముఖ్యమైనది. ఇప్పుడు ఆ ప్రాంతంలోని అధికభాగం బీజేపీ ఏలుబడిలోకి వచ్చింది. త్రిపురలో బీజేపీ విజయం సామాన్యమైనది కాదు. అది శూన్యం నుంచి శిఖరానికి ప్రయాణం. త్రిపుర, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో హింసారాజకీయాలకు ప్రాణాలు కోల్పోయిన బీజేపీ కార్యకర్తలకు ఈ విజయం అంకితం"

-ప్రధాని నరేంద్ర మోదీ

వేసవి చిటపటలు

పెరుగుతున్న ఎండలు

సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం 12



లాలాజలంతో షుగర్ గుర్తింపు

వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక స్ట్రిప్స్ 2



నువ్వు గర్వపడేలా ఉంటానమ్మా!

-జాన్వీ కపూర్

-చిత్రజ్యోతిలో..

ఎర్రకోటపై కాషాయ జెండా

త్రిపురలో బీజేపీ చరిత్రాత్మక విజయం

25 ఏళ్ల సీపీఎం పాలనకు తెర

కమలానికి కలిసొచ్చిన ఈశాన్యం

ఎర్రరంగు వెలిస్తే కాషాయం పైకి తేలుతుంది. త్రిపుర ఎన్నికల ఫలితాలు ఈ నిజాన్నే నిరూపించాయి. ప్రతి ఓటు యంత్రం నుంచి ఏదో మంత్రం వేసినట్లుగా బయటపడిన కమల దళాలు... 'ఎర్ర'కోటను ముంచేశాయి. పాతికేళ్లుగా ఉన్న లెఫ్ట్ సర్కారు పట్ల ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత.. కసిగా మారిందని రుజువు చేశాయి. జనాభాలో 90 శాతానికి పైగా క్రైస్తవులున్న నాగాలోనూ మిత్రపక్షాలతో కలిసి బీజేపీ పాగా వేసింది. ఒక్క మేఘాలయలో కాంగ్రెస్ చెప్పుకోదగ్గ స్థాయిలో స్థానాలు సాధించినప్పటికీ అంతిమంగా అధికారం చేతికి చిక్కుతుందా అనేది అనుమానమే.

దక్షిణం నుంచి ఎదురుగాలి

'ఈశాన్యం' బాగా కలిసి వచ్చిందని... సంబరపడుతున్న కమలనాథులకు... దక్షిణం నుంచి ఎదురుగాలి మొదలైంది. కేంద్రం చేసిన అన్యాయంపై ఏపీ ప్రజలు, ప్రభుత్వం ఇప్పటికే మండిపడుతుండగా... తెలంగాణ సీఎం, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కమలంపై యుద్ధభేరీ మోగించారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా కూటమి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.. దేశానికి నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

- త్రిపురలో బీజేపీ కూటమికి మూడింట రెండొంతుల మెజారిటీ
- రాష్ట్రమంతటా కలిపి కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు కేవలం 50 వేలే
- నాగాలాండ్‌లో చేతికి గుండు సున్నా
- అక్కడా పాగా వేసిన కమలం
- మిత్రుల సాయంతో పీఠం ఖాయం
- మేఘాలయలో హంగ్.. హోరాహోరీ

అగర్తల/షిల్లాంగ్/కోహిమా, మార్చి 3: ఎర్రకోట బద్దలైంది! రెండున్నర దశాబ్దాల అప్రతిహత వామపక్ష పాలనకు కాలం చెల్లింది! ఎర్రకోటపై కాషాయ జెండా ఎగిరింది. 'మాణిక్ సర్కార్' కాదు ఇక 'మోదీ సర్కార్' అన్న బీజేపీ నినాదం ఫలించింది! మిషన్ ఈశాన్యంలో బీజేపీ భారీ విజయం సాధించింది. ప్రధాని మోదీ చెప్పిన పరివర్తన త్రిపురలో సాధ్యమైంది. ఈశాన్య రాష్ట్రమైన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. 60 సీట్ల అసెంబ్లీలో 59 సీట్లకు ఎన్నికలు జరిగాయి. సీపీఎం అభ్యర్థి మృతితో ఓ స్థానంలో ఎన్నిక జరగలేదు. సొంతంగా 35 సీట్లు; మిత్రపక్షం ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో కలిసి 44 సీట్లను సాధించింది. మూడింట రెండు వంతుల సీట్లను దక్కించుకుంది. ఇక్కడి

మిగతా 16వ పేజీలో...



కేంద్రంపై అవిశ్వాసం

చీప్ పాలిటిక్స్

హోదాపై స్పష్టత ఇవ్వాలి

- ఇస్తామని 'చెబితే' ఇచ్చి తీరాల్సిందే
- దేశ రాజకీయ వ్యవస్థ విఫలమైంది
- మార్పు కోసం నేనే ముందుకొస్తా!
- దేశానికి నాయకత్వం వహిస్తా!
- తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటన

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'కేంద్రం నవ్యాంధ్రకు ప్రత్యేక హోదాపై స్పష్టత ఇవ్వడంలేదు. ఇస్తామని చెబితే... ఇవ్వండి. లేదంటే... ఇవ్వం అని చెప్పేయండి. తమాషా కాకపోతే ఏమిటిదంతా?' అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఏం చెప్పినా కుండబద్దలు కొట్టినట్లు ప్రజలకు చెప్పాలన్నారు. "రోజూ అక్కడ ప్రజలు, పార్టీలు ఆవేదన చెందడమేమిటి? ఇలా ఉండొచ్చునా? ఇంత గందరగోళం ఏ దేశంలో అయినా ఉంటుందా?" అని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశ రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైందని, దేశంలో అసహనం నెలకొందని అభిప్రాయపడ్డారు. దేశానికి నాయకత్వం వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో

మిగతా 2వ పేజీలో...



5


ఐటీలో ఏపీ అగ్రస్థానం

ఎన్టీఆర్ ట్రస్టు 20వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ మెమోరియల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో టోమోథెరపీ యంత్రాన్ని కూడా ప్రారంభించారు.

ఆంధ్రాకు అన్యాయం!

ఇది ముమ్మాటికీ నిజం.. పవన్ జేఎఫ్‌సీ నిర్ధారణ

- కేంద్రం ఇంకా 74,542 కోట్లు ఇవ్వాలి
- ఆర్థిక సంఘం హోదా వద్దనలేదు
- 'ప్యాకేజీ' కింద పైసా రాల్చలేదు
- బుందేల్‌ఖండ్ ప్యాకేజీ అమలు చేయాలి
- విద్యాసంస్థలకు 10వేల కోట్లు రావాలి
- పన్నుల లెక్క 3820 కోట్లు ఇవ్వాలి
- ఉమ్మడి ఆస్తులు ఇప్పటికైనా పంచాలి
- కడప ఉక్కు, విశాఖ జోన్ ఇవ్వాల్సిందే



అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'నవ్యాంధ్రకు కేంద్రం ఇవ్వాల్సింది కొండంత! ఇచ్చింది గోరంత' అని జనసేన అధిపతి పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఏర్పడిన నిజ నిర్ధారణ సంఘం (జేఎఫ్‌సీ) స్పష్టం చేసింది. ప్రత్యేక హోదా/ప్యాకేజీ, రెవెన్యూ లోటు భర్తీ, విద్యా సంస్థలకు నిధులు, ఆస్తుల పంపిణీ... ఇలా ఏ అంశంలోనూ ఏపీకి

మిగతా 5వ పేజీలో...

తండ్రి పేరూ రాయలేరు

మున్సిపల్ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల తీరిది 11

మోదీ! ఏపీపై ఎందుకీ కోపం!

కొత్త పలుకు

ఏపీ విషయంలోగానీ, ఏపీ సీఎం చంద్రబాబు విషయంలో గానీ ప్రధాని మోదీ తొలినుంచి పెడసరంగానే ఉంటున్నారు.

విశాఖపట్నంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు అబుదాబి యువరాజును ఆహ్వానించాలని చంద్రబాబు భావించారు. ఇందుకుగాను కేంద్రప్రభుత్వం అనుమతి కోరుతూ లేఖ పంపారు. విదేశీ వ్యవహారాలశాఖ సదరు లేఖను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపింది. అయితే ప్రధానమంత్రి కార్యాలయం నుంచి సదరు లేఖ అబుదాబి రాయబార కార్యాలయానికి చేరనేలేదు.

'నరేంద్రమోదీకి - చంద్రబాబుకు మధ్య ఏమైనా గొడవలు ఉన్నాయా? పోలవరం విషయంలో క్వారీలు వేయమని మా శాఖ అధికారులకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయట!' అని ఉమాభారతి చెప్పుకొచ్చారు.

నియోజకవర్గాల సంఖ్య పెంచే విషయంలో కూడా ప్రధాని కార్యాలయం వద్దు అని హింట్ ఇచ్చిందట!

రాష్ట్రానికి సహాయం చేసే విషయంలో కేంద్రంలోని పలువురు మంత్రులు సుముఖంగా ఉన్నారు. అయితే ప్రధానమంత్రి నుంచి సంకేతాలు రానందున తామేమీ చేయలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 4

ఈసారి బీజేపీనే ప్రతిపక్షం!

రేపటి నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 5

సభకు రాకూడదని వైసీపీ నిర్ణయం

మా సంగతేంటి?

'సీనియారిటీ'ని గుర్తించడంలేదంటూ ఎంపీడీవోల ఆందోళన 3

ఇతర శాఖల అధికారులకు పోస్టింగ్‌పై నిరసన

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓ పారిశ్రామికవేత్త తన కుమార్తె వివాహాన్ని ఘనంగా, భిన్నంగా చేయాలనుకున్నారు. వేదిక.. అంటూ శ్రీలంకలోని ఓ విలాసవంతమైన రిసార్ట్ పేరును పెళ్లి పత్రికలో ముద్రించారు. ఎంపిక చేసిన 200 మంది అతిథులకు పెళ్లి కార్డుతోపాటు ఫ్లైట్ టికెట్లూ అందించారు. ఇంట్లో బయలుదేరిన క్షణం నుంచి పెళ్లి చూసుకుని తిరిగి వచ్చే దాకా సకల ఏర్పాట్లు చేశారు. నవ దంపతులకే కాదు ఆ పెళ్లికి వెళ్లి వచ్చిన వారందరికీ అదో మరపురాని అనుభూతి!



సండే స్పెషల్

పెళ్లికి ఉందో ప్లేసు!

దూర తీరాలకు, విదేశాలకు.. మధురమైన స్మృతిగా వివాహ వేడుక



- పెరుగుతున్న డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్
- ప్యాలెస్ హోటళ్లు, విలాసాల రిసార్టులకే తొలి ఓటు
- విదేశాల్లో థాయ్‌ల్యాండ్, దుబాయ్, శ్రీలంక జోరు
- ఒక్కో అతిథిపై రూ.30వేల కనీస ఖర్చు

2



యమునను ప్రార్థిస్తే కృష్ణుని ప్రార్థించినట్లే..



'కృపాపారావారాం తపన తనయామ్ తాపశమనీమ్..' అంటూ యమునా నది గురించి శంకరభగవత్పాదులు ప్రార్థన చేశారు. 'తపన తనయాం' అంటే.. యమున సూర్యుని కుమార్తె. ఆమె సముద్రమంత దయగల్గినది (కృపాపారావారాం). యమున తల్లి సంధ్య (విశ్వకర్మ కుమార్తె). తన భర్త అయిన సూర్యుని తేజస్సు దుర్నిరీక్ష్యమైపోవడంతో విలోల అయ్యిందామె. సూర్యునివైపు చూడలేక వంకరటింకర చూపులు చూసింది. అప్పుడు సూర్యుడు.. 'నీవు నా వంక విలోలవై చూస్తున్నావు. అందువల్ల నీకు అలలతో ప్రవాహవేగం కలిగి ప్రవహించే నది కుమార్తెగా జన్మించుగాక' అలా యమున పుట్టింది. గంగానది కాశీ వరకూ దక్షిణానికి వచ్చి అక్కడ ఉత్తరానికి తిరుగుతుంది. యమున వెనుకకు తిరగదు. ముందుకే వెళ్తుంది. వెనుకకు రాని కాలప్రవాహం యమున. ఆ తల్లి పేరు చెప్పగానే కృష్ణభగవానుడు గుర్తొస్తాడు. కృష్ణుడు పుట్టినప్పటి నుంచీ యమునతో అనుబంధం ఉంది. కారాగారంలో పుట్టిన కృష్ణుడు నందవ్రజానికి చేరడానికి వీలుగా రెండుగా చీలి దారిచ్చింది యమునా నదే. నిజానికి యమున కాలప్రవాహం. ఎవరికీ చోటివ్వదు. ఎవరైనా సరే కాలంలో పడిపోవాల్సిందే. కానీ.. ఆ తల్లి కృష్ణుడికి దారిచ్చింది. అంటే కాలస్వరూపంగా ఆమెకు కృష్ణుడు ప్రియం. అందుకే ఆ తల్లిని 'మురారి ప్రేయస్యాం' అని శంకర భగవత్పాదులు కీర్తించారు. ఇక, యమునా నదికి కాళింది అనే పేరు కూడా ఉంది. గరుత్మంతుడికి భయపడి భార్యాబిడ్డలతో కాళింది అడుగున తిష్ఠవేసిన కాళీయ సర్పాన్ని కృష్ణుడు మర్దించి అక్కడి నుంచి సముద్రానికి వెళ్లేలా చేశాడు. అలా కాళీయుని విషజ్వాలల నుంచి యమున ముక్తమైంది. అలాగే.. నందవ్రజంలో ఉన్నప్పుడు కృష్ణుడు నిత్యం యమునలో స్నానం చేసేవాడు. కృష్ణుడు గోవర్ధనగిరిని చిటికెనవేలితో ఎత్తింది యమున ఒడ్డునే. అందుకే.. యమునను ప్రార్థన చేస్తే కృష్ణుని ప్రార్థించినట్లే.

Paramjyothi
పరంజ్యోతి

- చాగంటి కోటేశ్వరరావు శర్మ







పెళ్లికి ఉందో ప్లేసు!







క్రికెటర్ కోహ్లీ, అందాల నటి అనుష్క శర్మ ఎవరికి వారు, వేర్వేరుగా వారి కుటుంబ సభ్యులతో కలిసి విమానాలు ఎక్కారు. ఇటలీలోని ఓ రిసార్ట్‌లో సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్నారు!

టాలీవుడ్ జోడీ నాగ చైతన్య, సమంతల పెళ్లికి గోవాలో అంగరంగ వైభవంగా జరిగింది. విలాసవంతమైన హోటల్‌లో సన్నాయి మేళం మోగింది.

ఇది.. డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్! ఒకప్పుడు సెలబ్రిటీలకు సంపన్నులకు మాత్రమే పరిమితమైన ఈ ట్రెండ్‌వైపు ఇప్పుడు ఎగువ మధ్యతరగతి వారూ దృష్టి సారిస్తున్నారు.



పెళ్లంటే...

పందిళ్లు, సందళ్లు, తప్పట్లు, తాళాలు, తలంబ్రాలు.. మూడే ముళ్లు... ఏడే అడుగులు! మొత్తం కలిసి వందేళ్లు!

ఇది అంతటా ఉండేదే! మరి.. ప్రత్యేకంగా ఉండాలంటే? ఆ పందిరి ఊటీలోనో, కొడైకెనాల్‌లోనో పడాలి! లేదా తాళాలు ఇటలీలోనో, బాలీలోనో మోగాలి. అపురూపమైన ఆ ఏడడుగులు స్వర్గంలో వేసినట్లుగా ఉండాలి! అలా జరగాలంటే 'డెస్టినేషన్ వెడ్డింగ్' చేసుకోవాలి.అంటే మరేం లేదు! పెళ్లికొడుకు, పెళ్లికూతురు తరపువారి గెస్టులంతా ఏ దూర ప్రాంతానికో వెళ్తారు. 3, 4 రోజులు అక్కడే ఉంటారు! ఆడుతూ, పాడుతూ, తుళ్లుతూ, తూగుతూ గడుపుతారు.అంగరంగ వైభవంగా పెళ్లి వేడుకను జరిపిస్తారు.ఇది బాగా డబ్బున్న, విభిన్నమైన 'టేస్ట్' ఉన్న వాళ్ల వ్యవహారం!

'కొత్త'గా ఉండాలని...

పెళ్లికొడుకు ఊరు, లేదా పెళ్లికూతురి స్వస్థలం! అదీ కాదంటే తిరుపతిలోనో, మరో గుడిలోనో! అతి మధురమైన ఘట్టాన్ని పుట్టి పెరిగిన ఊళ్లో, తెలిసిన వాతావరణంలో జరుపుకొంటే మజా ఏముంటుంది? ఇది సంపన్నులు, సెలబ్రిటీల ప్రశ్న! దీనికి సమాధానంగానే 'డెస్టినేషన్' వెడ్డింగ్‌లు వచ్చాయి. ఉదయ్‌పూర్, జైపూర్, జోధ్‌పూర్‌లోని 'ప్యాలెస్' హోటళ్లలో రాజసంగా ఒక్కటవ్వాలనే జంటలు కొన్ని! ఊటీ, కొడైకెనాల్, వర్కల, కోవలం, మున్నార్ ప్రాంతాల్లోని రిసార్టులు, టీ తోటల్లో ప్రకృతి రమణీయత మధ్య జరిగే పరిణయాలు కొన్ని! నేలకు దూరంగా.. నీలాల నీటికి దగ్గరగా అండమాన్ చేరుకుని పెళ్లాడే వారు కొందరు! ఇంకా మన దేశంలో సిమ్లా, గోవా, ఆగ్రా తదితర ప్రాంతాలు డెస్టినేషన్ వెడ్డింగ్‌కు పేరొందాయి. సంపన్నులతోపాటు ఎగువ మధ్యతరగతిలోనూ ఇలాంటి వివాహాల పట్ల ఆసక్తి పెరుగుతోంది.



చలో విదేశాలకు...

భారతీయ సంపన్నులు, సెలబ్రిటీల పెళ్లి వేడుకలకు మకావు, థాయ్‌లాండ్, బాలి, టర్కీ, మారిషస్, దుబాయ్, శ్రీలంక, మలేషియా వంటి దేశాలు 'డెస్టినేషన్'లుగా మారుతున్నాయి. కొన్ని దేశాల పర్యాటక శాఖలు భారతీయ డెస్టినేషన్ వెడ్డింగ్‌ల ఏర్పాట్లకు ప్రత్యేక విభాగాలను, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలను నియమిస్తున్నాయి. ఉదాహరణకు అహ్మదాబాద్‌కు చెందిన 'రెడ్ ఈవెంట్స్' సంస్థ మకావు టూరిజం అధికారిక వెడ్డింగ్ ప్లానర్! థాయ్‌లాండ్ పర్యాటక శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. 'రండి.. ఇక్కడి ప్రదేశాలు చూడండి. వివాహాలకు వేదికలుగా మార్చండి' అని పిలుస్తోంది. అక్కడ ఏటా 300కుపైగా ఇండియన్ డెస్టినేషన్ వెడ్డింగ్‌లు జరుగుతున్నాయి.ఖర్చు, దూరం, ఆనందపరంగా చూస్తే థాయ్‌లాండ్‌లో వెడ్డింగ్ బెస్ట్ అని భారతీయులు భావిస్తున్నారు. శ్రీలంక పర్యాటక శాఖ కూడా భారతీయ పర్యాటకులు, వెడ్డింగ్‌లను ప్రోత్సహిస్తోంది. దేశీయంగా డెస్టినేషన్ వివాహాల వాటా 25% పెరిగితే, అంతర్జాతీయ లోకేషన్స్‌కు 10% పెరిగిందని ప్రముఖ వెడ్డింగ్ ప్లానర్ జుజెర్ లక్డ్‌వాలా చెప్పారు. సల్మాన్‌ఖాన్ సోదరి అర్పిత వివాహాన్ని హైదరాబాద్‌లో నిర్వహించింది ఆయనే. షాహిద్‌కపూర్ పెళ్లిని, ఐసీఐసీఐ చందాకొచర్ కుమార్తె వివాహాన్ని విదేశాల్లో జరిపించారాయన.

తెలుగు రాష్ట్రాల్లో డెస్టినేషన్ 'వేదికలు'

'డెస్టినేషన్' పేరెత్తగానే ఉత్తరాదికో, ఇతర రాష్ట్రాలకో వెళ్లనక్కర్లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే ఘనమైన వేడుకలకు వేదికలు ఉన్నాయి. హైదరాబాద్‌కు దూరంగా ఉన్న పలు రిసార్ట్‌లకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి, నాలుగైదు రోజులు ఇక్కడే మకాం వేసి ఘనంగా వివాహ వేడుకలు జరిపించుకుంటున్నారు. సల్మాన్‌ఖాన్ సోదరి అర్పితా ఖాన్ పెళ్లి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ధూమ్‌ధామ్‌గా జరిగిన సంగతి తెలిసిందే. ఇది కాక ప్రగతి రిసార్ట్స్, లియోనియా రిసార్ట్స్, ఆలంకృత, ధోలా రి ధానీ వంటి వాటిలో కూడా డెస్టినేషన్ వివాహాలు జరుగుతున్నాయి. హైటెక్స్, హెచ్ఐసీసీ లాంటి చోట్ల గదులన్నీ బుక్ చేసుకుని వివాహ వేడుకలను నిర్వహిస్తున్నారు కొందరు. ఏపీలోనూ విజయనగరం జిల్లా భోగాపురం మండలం అమటాంరాయవలస సమీపంలోని సన్ రే రిసార్ట్ సంపన్నుల వివాహాలకు డెస్టినేషన్‌గా మారింది. తూర్పు గోదావరిలోనూ డెస్టినేషన్ పెళ్లిళ్లు జరుగుతున్నాయి. వైజాగ్ సంగతి చెప్పనే అక్కర్లేదు. ఇటీవల విశాఖలోని పలు హోటళ్లు డెస్టినేషన్ వెడింగ్స్‌కు వేదికలయ్యాయి.



ఖర్చు తడిసిమోపెడు!

'డెస్టినేషన్ వెడ్డింగ్' అనుభూతి ఎంత బాగుంటుందో ఖర్చు అంతే ఘనంగా ఉంటుంది. ఉదాహరణకు ఉదయ్‌పూర్‌లోని ప్యాలెస్ హోటల్‌లో పెళ్లి చేయాలంటే ఒక్కరోజు పెళ్లి వేడుక, రిసెప్షన్ విందుకు ఒక్క అతిథికి రూ.10 వేల దాకా వసూలు చేస్తారు. కనీసం 150 మందికి చార్జ్ చేస్తారు. అంటే రూ.15 లక్షలు! ఇది ఆహారం, కనీససదుపాయాల ఖర్చే. సంగీత్, లైటింగ్, వినోదాలు, రూమ్‌లు, ఇతర సదుపాయాలకు లక్షల్లోనే కట్టాలి. అన్ని రకాల ఖర్చులు కలిపితే ఒక్కో అతిథికి కనీసం రూ.30వేల నుంచి లక్ష దాకా కట్టాలి!

- స్పెషల్ డెస్క్, హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి

కూతురి పెళ్లికి 2.5 కోట్లు..

హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త తన ముద్దుల తనయ వివాహాన్ని ఇటీవల మారిషస్‌లో జరిపించారు. అక్కడి ఒక ద్వీపంలో 5 రోజుల పాటు జరిగిన ఈ వివాహానికి 300 మందిని ప్రత్యేకంగా తీసుకువెళ్లారు. వెల్‌కమ్ డే ఫంక్షన్ మొదలు మెహందీ, సంగీత్, బీచ్ పార్టీ, వెడ్డింగ్.. అన్నీ అక్కడే నిర్వహించారు. దాదాపు రూ.2.5 కోట్లు ఖర్చయిందట. 'మాకు బాగా సన్నిహితమైన వారికి మాఅమ్మాయి పెళ్లిని ఓ మరపురాని అనుభూతిగా మలచాలనుకున్నాం. అన్నీ వెడ్డింగ్ ప్లానరే చూశారు. మేం చాలా హ్యాపీ' అని చెప్పారాయన. (పేరు వెల్లడించలేదు)

కేంద్రంపై అవిశ్వాసం చీప్ పాలిటిక్స్!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీకి సంబంధించి కేంద్రంపై అవిశ్వాసం ప్రవేశ పెట్టడం 'సిల్లీ'గా కొట్టిపడేశారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరమే లేదన్నారు. 'పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెట్టడమనేది ఓ చీప్ పొలిటికల్ స్టంట్. మొత్తం దేశ పరిస్థితిని అది మారుస్తుందా?' అని ప్రశ్నించారు. 'దేశ రాజకీయాల్లో మార్పు'పై కేసీఆర్ సుదీర్ఘంగా స్పందించారు. "ప్రస్తుత రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైంది. దేశంలో అసహనం నెలకొంది. మార్పు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. దేశం కొత్త దిశలో సాగాల్సి ఉంది. ప్రబలమైన గుణాత్మక మార్పు రావాల్సి ఉంది. ఈ పరివర్తనకు నేను చొరవ తీసుకుంటాను. సరైన సమయంలో ఇది కార్యరూపం దాలుస్తుంది. రాబోయే సాధారణ ఎన్నికల్లో కూడా పాల్పంచుకుంటుంది" అని ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీలేని కూటమి ఏర్పాటవుతుందని... అది మూడో ఫ్రంట్ కాకుండా, 'మెయిన్ ఫ్రంట్' అవుతుందని తెలిపారు. "మూస పద్ధతిలో దేశం సాగుతోంది. ప్రజలను వంచిస్తున్నారు. ప్రజలు ఆ వంచన నుంచి బయట పడాలన్నదే నా తపన. అందుకోసం తప్పకుండా చేయాల్సిన పని చేస్తాను. దేవుడు మన్నిస్తే, ఆరోగ్యం సహకరిస్తే తప్పకుండా నాయకత్వం వహిస్తా. అమెరికా అలా ఉంది.. చైనా ఇలా ఉందనే కథలు ఇంకెంతకాలం వినాలి? మనలో మార్పు రాదా? పరివర్తన కోసం ప్రబలమైన చొరవ నేను తీసుకుంటాను. కలిసి వచ్చే వారంతా కలిసి వస్తారు. కొంతమంది మాట్లాడారు. నేను చెప్పిన దానిని వాళ్లు వంద శాతం సమర్థించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నాకు వ్యక్తిగతంగా సన్నిహితులు. మొన్న ఢిల్లీ వెళ్లినప్పుడు వ్యక్తిగతంగా చాలా విషయాలు పంచుకున్నాం. చంద్రబాబు నాయుడుతో ఈ విషయంలో ఇంకా మాట్లాడలేదు. ఎవరు వచ్చినా స్వాగతిస్తాం. ఇప్పటికే ఆలోచనలు ప్రారంభమయ్యాయి" అని కేసీఆర్ తెలిపారు.

మార్పు మొదలైతే కార్చిచ్చే

గొప్ప ప్రబలమైన మార్పు తెచ్చి, అద్భుతమైన పన్ను విధానాలు తీసుకొచ్చి, రైతాంగానికి అద్భుతమైన సబ్సిడీలు ఇచ్చి, వారిని ఆదుకునే పరిస్థితి రావాలని కేసీఆర్ ఆకాంక్షించారు. "ఒకళ్లపై మరొకరు విమర్శలు తప్ప ఇంకేమీ వద్దా? ప్రబలమైన మార్పు అవసరమైనప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందనేది నాకు తెలిసి మూడుసార్లు రుజువైంది. ఒకటి జనతా పార్టీ ఏర్పాటు. 60 రోజుల్లోనే పార్టీ పుట్టింది బ్రహ్మాండంగా స్వీప్ చేసి పడేసింది. రెండోది ఎన్టీఆర్ ఆధ్వర్యంలోని తెలుగుదేశం పార్టీ. ఎనిమిది తొమ్మిది నెలల్లో పుట్టింది స్వీప్ చేసి పడేసింది. మూడోది టీఆర్ఎస్ పార్టీ. పుట్టింది ఆ వెంటనే 60 రోజుల్లో పంచాయతీ ఎన్నికల్లో స్వీప్ చేసి పడేసింది" అని వివరించారు. తాను మోదీకి వ్యతిరేకం కాదని, ఆయనకు మంచి స్నేహితుడినని కేసీఆర్ తెలిపారు.

మస్తు.. కల్యాణాలు!

- 2 రోజుల్లో 'రాజధాని'లో 50 వేల పెళ్లిళ్లు
- నేడు అన్నవరంలో 500జంటలు ఏకం
- మూఢంతో గత మూడునెలలుగా బంద్
- ఐదురోజులుగా తిరిగి పడుతున్న ముడి
- వచ్చే మూడునెలలూ రాష్ట్రంలో ఇదేఊపు
- దొరకని కల్యాణ, ఫంక్షన్, కన్వెన్షన్ హాళ్లు
- పాఠశాలల్ని సైతం బుక్ చేస్తున్న వైనం
- పెళ్లి జంటలతో ఆలయాలు కిటకిట

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

మూఢం పోయింది! రాష్ట్రమంతటా పెళ్లి సందడి ఊపందుకొంది. మంచిది కాదనే కారణంగా గత మూడు నెలలుగా పెళ్లి మండపాలు మూగబోయాయి. ఇప్పుడేమో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు సరిపోక, పాఠశాలలను కూడా కొన్నినెలల ముందే బుక్ చేసుకొంటున్న పరిస్థితి! రానున్న రెండు రోజుల్లో తిథి, వారం, నక్షత్రం, యోగ, కరణంలు కుదిరిన ముహూర్తాలు ఉన్నాయి. దీంతో నవ్యాంధ్ర రాజధాని ప్రాంతంలో ఆదివారం, సోమవారాల్లో ఏకంగా యాభై వేల పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆదివారం అన్నవరం స్వామి సన్నిధిలో 500 జంటలు ఏకం అవుతున్నాయి. దీంతో పెళ్లిళ్లు చేసుకోవడానికి వచ్చే జంటలు, వారి కుటుంబాలతో ప్రధాన పుణ్యక్షేత్రాలు కిటకిటలాడిపోతున్నాయి. వచ్చే మూడు నెలలు కూడా ఇదే ఊపు ఉంటుందని పెళ్లిళ్ల మధ్యవర్తులు చెబుతున్నారు. జిల్లాల్లో కల్యాణ మండపాలు ఖాళీ లేక.. ఖాళీప్రదేశాల్లో స్టేజీలు, షామియానాలు వేస్తున్నారు. ప్రతి కుటుంబానికి 10కి పైగా ఆహ్వానాలు అందుతుండటంతో, ఏ ఫంక్షన్‌కు వెళ్లాలో, ఎవరికి కాదని చెప్పాలో తేల్చుకోలేక, తికమక పడుతున్నాయి. ఒక్కో పురోహితుడు రోజుకు మూడు నుంచి నాలుగు పెళ్లిళ్లు జరుపుతున్నాడు నెల్లూరు జిల్లాలో వచ్చే రెండు రోజుల్లో ఏడువేల జంటలు, ఈ రోజుల్లో గుంటూరు జిల్లాలో ఐదు వేల జంటలు ఏకం అవుతున్నాయి. ఆదివారం కర్నూలులో ఆరువేలు,



కడప జిల్లాలో మూడు వేలు, ప్రకాశం జిల్లాలో 1,200 పెళ్లిళ్లు జరగనున్నాయి. వచ్చే 12వ తేదీ లోపు శ్రీకాకుళం జిల్లాలో మూడు వేల పెళ్లిళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పశ్చిమ గోదావరిజిల్లాలో కల్యాణ మండపాలు, ఆలయాల్లో ఖాళీ లేక, తమ ఇళ్ల దగ్గరే చాలామంది పెళ్లి ఏర్పాట్లు చేసుకొంటున్నారు. కొంతమంది పాఠశాలలనే పెళ్లి మండపాలుగా మారుస్తున్నారు. విశాఖపట్నం జిల్లాలో వంటవాళ్లకు బాగా కొరత ఏర్పడింది. విడి రోజుల్లో రూ. 400 నుంచి రూ. 600 చేతిలో పెడితే వంట మనిషి వచ్చేవాడు. అలాంటిది ఇప్పుడు రూ.1,200 ఇస్తామన్నా వంట మనుషులు దొరకడం లేదని క్యాటరింగ్ సర్వీసు యజమానులు చెబుతున్నారు. ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో, పెళ్లి తంతుకు డబ్బులు అవసరమైనవారితో శనివారం ప్రకాశం జిల్లా ఒంగోలులో కౌంటర్లు కిక్కిరిసిపోయాయి.

పుణ్యక్షేత్రాల్లో..

తిరుమలలో టీటీడీ కల్యాణవేదికతో పాటు కల్యాణమండపాలు, ప్రైవేట్ మఠాలు భారీగా బుక్ అయ్యాయి. శనివారం రాత్రి సుమారు 90 పెళ్లిళ్లు జరిగాయి. విశాఖ జిల్లాలోని సింహాచలం కొండ పెళ్లి చేసుకొనే జంటలతో కిటకిటలాడుతోంది. కర్నూలు జిల్లాలోని మహానంది, కాల్వబుగ్గ వంటి ప్రసిద్ధ క్షేత్రాల తోపాటు స్థానికంగా ఉన్న వివిధ ప్రముఖ ఆలయాలు కల్యాణ కళ సంతరించుకొన్నాయి.

ఈ రోజుల్లోనే ఎందుకు..

ఆదివారం (నాలుగో తేదీ) ఉదయం 9.52 నుంచి 10.14 వరకు హస్త నక్షత్రం, మేషలగ్నం ఉంది. దీనిని బలమైన ముహూర్తంగా భావిస్తారు. గురువారం (ఎనిమిదో తేదీ).. ఫాల్గుణ సప్తమి అనూరాధ నక్షత్రం, మేష లగ్నం ఉంది. శనివారం (పదోతేదీ).. మూలా నక్షత్రం, మేష లగ్నం నెలకొంది. సోమవారం (12వ తేదీ) ఉ.షా నక్షత్రం, మేష లగ్నంలో ఉంది. ఇవి దాటితే తెలుగు కాలమానం ప్రకారం హేవళంబి నామ సంవత్సరం ముగిసి.. విళంబి మొదలయ్యాక (18వ తేదీ) తిరిగి శుభ ముహూర్తాలు ఉంటాయి.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	41.0	17.0
శ్రీకాకుళం	38.0	20.0
గుంటూరు	37.5	19.0
రాజమండ్రి	37.5	20.0
హైదరాబాద్	36.9	20.6



నీళ్ల బొట్టయినా రాల్చని నల్లా! లోపలైనా చుక్క అందకపోదా? అని చిలుకమ్మ ఆశ. దాని దప్పిక తీరితే.. తాను తాగొచ్చంటూ పైన మరో చిలుక ఆరాటం! కానీ చుక్క రాలలేదు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో కనిపించింది దృశ్యం.

వేసవి చిటపటలు

- తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఎండలు

విశాఖపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి ముగిసి నిండా వారం కూడా కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే వేసవి చిటపటలు ప్రారంభమయ్యాయి! చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా ఉండడంతో ఉదయం పది గంటల నుంచే ఎండ ఎక్కువగా ఉంటోంది. పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తుండడంతో వాతావరణం వేడిగా మారుతోంది. పొడిగాలులు వీస్తుండడంతో మధ్యాహ్న సమయానికి అనేక చోట్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. శనివారం కృష్ణాజిల్లా నందిగామలో 39.3 డిగ్రీలు, కర్నూలు, జంపమహేశ్వరపురంలలో 39 డిగ్రీల చొప్పున నమోదైంది. ఇదే సమయంలో రాత్రి చల్లని వాతావరణం కొనసాగుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. శీతాకాలం ముగింపు, వేసవి ప్రారంభ సమయంలో వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉంటాయని, సాయంత్రానికి క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి అక్కడక్కడా వర్షాలు కురుస్తుంటాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 75 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 10 గంటలు, దివ్యదర్శనానికి 2గంటల సమయం పడుతోంది. సోమవారం సేవలకు సంబంధించి విజయా బ్యాంకులో ఆదివారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, విశేష పూజ:125 టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

-ఆంధ్రజ్యోతి, తిరుమల

నడకతో గుండె భద్రం

వాషింగ్టన్, మార్చి 3: రోజూ నడకతో బరువు తగ్గడంతో పాటు పలు అనారోగ్య సమస్యలు దరిచేరవు. అందుకే నడకను మంచి వ్యాయామంగా వైద్యులు సూచిస్తుంటారు. అయితే, వారంలో పలుమార్లు కనీసం 40నిమిషాలు నడవడం ద్వారా మహిళల్లో గుండె వైఫల్యం 25% తగ్గుతుందట. అమెరికాలోని సెయింట్ విన్సెంట్ ఆస్పత్రికి చెందిన సొమాలీ రస్లా నేతృత్వంలోని బృందం 83 వేలమంది మహిళలపై నిర్వహించిన సర్వేలో ఈ విషయం తెలిసింది.

యాంటీబయోటిక్స్‌తో కేన్సర్ చికిత్సపై ప్రభావం

న్యూయార్క్, మార్చి 3: జలుబు, దగ్గు, జ్వరం నుంచి కేన్సర్ వరకు ఏ వ్యాధికైనా యాంటీబయోటిక్స్‌ను వైద్యులు సూచిస్తుంటారు. అయితే యాంటీబయోటిక్స్‌ను అతిగా వాడటం ప్రమాదకరం అంటున్నారు అమెరికాలోని అగస్టా యూనివర్సిటీ పరిశోధకులు. వీటిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల శరీరంలోని తెల్లరక్తకణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి రోగనిరోధకశక్తి తగ్గడంతోపాటు కేన్సర్ చికిత్సపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందని హెచ్చరిస్తున్నారు.



జలవనరుల శాఖ ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న దేవినేని

'పోలవరం' కడుతున్నందుకే
ప్రతిపక్షాలకు భయం

- జూన్ నాటికి 'వంశధార-నాగావళి': దేవినేని

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పోలవరం పూర్తయితే ఇక తమకు పుట్టగతులుండవన్న భయంతో కేవీపీ రామచంద్రరావు ఢిల్లీలో కూర్చుని వైఎస్ రాజశేఖరరెడ్డి ఆత్మతో లెటర్లు రాస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. అయితే ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పోలవరం ప్రాజెక్టు ఆగదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దివంగత ఇంజనీరు కె.శ్రీరామకృష్ణయ్య జయంతి సందర్భంగా విజయవాడలోని జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో శనివారం 16వ జలవనరుల శాఖ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి ఉమ మాట్లాడుతూ పట్టిసీమ వల్ల రూ.1600 కోట్ల ప్రజాధనం మట్టిపాలేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. అప్పట్లో రాయలసీమకు సాగు, తాగునీటిని అందించే సోమశిల- కండలేరు కాలువలు తవ్వేటప్పుడు రాళ్ల క్వారీని ఎందుకు తవ్వుతున్నారని అక్కడ ప్రజలు, ఇంజనీర్లు అనుకునే వారని, అదే ఇప్పుడు జలవనరుగా మారిందని చెప్పారు. రామకృష్ణయ్య ముందు చూపు వల్లే రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, తిరుమల, కాళహస్తి ప్రజలు తెలుగుగంగ నీళ్లు తాగుతున్నారని, లేకుంటే పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. వంశధార- నాగావళి ప్రాజెక్టులు జూన్ కంతా పూర్తి చేసితీరుతామన్నారు.

మా సంగతేంటి?

'సీనియారిటీ'ని గుర్తించడంలేదంటూ ఎంపీడీవోల ఆందోళన

- ఇతర శాఖల అధికారులకు పోస్టింగ్‌పై నిరసన
- నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులా?
- పీఆర్, ఆర్డీ ఉద్యోగుల అసహనం
- త్వరలో మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యలు..
- స్పందించకపోతే సమ్మెబాట?

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సీనియారిటీని గుర్తించకుండా.. పదోన్నతుల విషయాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం ఏళ్ల తరబడి తాత్సారం చేస్తోందంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ(ఆర్డీ) ఉద్యోగులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమను డైరెక్ట్ ఎంపీడీఓలుగా నియమించిన తెలుగుదేశం ప్రభుత్వమే సీనియారిటీ కల్పించి పదోన్నతులు కల్పిస్తుందని ఆశగా ఎదురుచూస్తుంటే.. అదే పోస్టు లో రిటైరయ్యే పరిస్థితులు దాపురించాయని వాపోతున్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోనందున ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

పునర్వ్యవస్థీకరణ జాప్యంపై మండిపాటు!

ఇటీవల ప్రభుత్వం పలు శాఖల కుదింపు సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ పునర్వ్యవస్థీకరణకు ప్రతిపాదనలు తయారు చేసింది. డివిజన్ స్థాయిలో డీడీఓ పోస్టులు సృష్టించడంతో పాటు ఆయా మండలాలకు స్థాయిని నిర్ణయించి, ఎంపీడీఓల సర్వీసును బట్టి అక్కడ నియమించడం, ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించి పంచాయతీలను బలోపేతం చేయడం తదితర కీలక నిర్ణయాలు ఈ ప్రతిపాదనల్లో ఉంది. ఇలా అయితే ఈ శాఖలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీఓ వరకు ప్రతి ఒక్కరికీ పదోన్నతి కల్పించే అవకాశం ఉంది. అయితే ఎన్నికల తర్వాతనే పునర్వ్యవస్థీకరణ అంటూ స్వయానా మంత్రి నారా లోకేశ్ తనను కలిసిన అధికారులతో చెప్పడంతో ఆ శాఖ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. ఇతర శాఖలకు చెందిన అధికారులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోకి ఇక నుంచి రానీయబోమని తొలినాళ్లలో మంత్రి లోకేశ్ చెప్పినా, ఆ హామీలను గాలికొదిలి రెవెన్యూ అధికారులను డ్వామా పీడీలుగా నియమించారని ఆరోపిస్తున్నారు. డ్వామా పీడీలుగా సీనియర్ ఎంపీడీఓలను నియమిస్తామని హామీ ఇచ్చిన మంత్రి పేషీలోనే నెలల తరబడి ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచారని, చివరికి రెవెన్యూ అధికారులతో పాటు ఇద్దరు ఎంపీడీఓలను పీడీలుగా నియమించారని పేర్కొంటున్నారు. తమకంటే జూనియర్లను, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన లేని రెవెన్యూ అధికారులను నియమిస్తూ, గ్రూప్-1 ద్వారా ఉద్యోగంలో చేరి 20 ఏళ్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాల్లో అనుభవమున్న తమను విస్మరించడం ఎంత వరకు న్యాయమంటూ అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఎంపీడీఓలను కాదని నిబంధనలకు విరుద్ధంగా జడ్పీ సీఈఓ పోస్టులన్నీ రెవెన్యూ అధికారులు, డీపీఓలతో భర్తీ చేయడం, డీపీఓ పోస్టుల్లో కేవలం డీఎల్పీఓలను మాత్రమే నియమించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర శాఖల అధికారులకు
అవకాశాలు!

ఎంపీడీఓ పోస్టులకు పదోన్నతి లేకపోవడంతో దానికి ఫీడర్ కేడర్‌గా ఉన్న ఈఓ పీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సూపరింటెండెంట్లు అందరూ పదోన్నతి కోల్పోతున్నారని, ఎంపీడీఓలకు జేడీ, డీడీ, ఏడీ కేడర్ కల్పించిన ప్రభుత్వం.. ఉన్నత అవకాశాలను మాత్రం ఇతర శాఖలకు కట్టబెట్టడం అన్యాయమని పీఆర్ వర్గాలు వాపోతున్నాయి. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి అయినా... ఆ ఆదేశాలను రద్దు చేయించాలని ఆయా వర్గాలు నిర్ణయించుకున్నాయి. ఇటీవల కర్నూలు జిల్లాలో డ్వామా పీడీగా సహకార శాఖ అధికారిని నియమించడంతో పీఆర్, ఆర్డీ ఉద్యోగుల నిరసనలతో ఆ జిల్లాలు అట్టుడికిపోయాయి. దీంతో ఆయా రాష్ట్ర సంఘ నేతలు రంగంలోకి దిగి.. ఈ సమస్యలన్నీ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన స్పందనను బట్టి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించాలని ఓ సమావేశంలో తీర్మానించారు. అలాగే పునర్వ్యవస్థీకరణ ద్వారా డీపీఓ కార్యాలయాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల ఎస్టాబ్లిష్‌మెంట్ సబ్జెక్టును తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పీఆర్ ఉద్యోగులు గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేయాలంటే డిప్యుటేషన్ ఆదేశాలు అవసరం లేదంటూ ఉన్న ప్రతిపాదనలు పరిష్కరించాలని కోరుతున్నారు.



తిరుమలేశుని సేవలో సుజనా చౌదరి

తిరుమల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి సుజనాచౌదరి శనివారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు ఆశీర్వాదం చేశారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు లడ్డూ ప్రసాదాలు, చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడి వివాహం తర్వాత కుటుంబ సమేతంగా తిరుమల వచ్చామన్నారు. అందరం కలిసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నామన్నారు. ఇదిలా ఉంటే... సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్‌కుమార్‌మిశ్రా కూడా శనివారం తిరుమలలో శ్రీ వేంకశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ఒడిశాలో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి నాలుగో కేంద్రం

హైదరాబాద్,మార్చి3(ఆంధ్రజ్యోతి): ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ నాలుగో ద్వితీయ శ్రేణి కేంద్రమైన బిజయానంద పట్నాయక్ ఐ సెంటర్‌ను ఒడిశాలోని కియోంఝర్‌లో ఏర్పాటు చేసింది. ఒడిశా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రతాప్ జేనా శనివారం దీనిని ప్రారంభించారు.

'శేషాద్రి'లో 3.5 కిలోల బంగారం పట్టివేత

తెనాలి క్రైం, మార్చి 3: రాజమండ్రి నుంచి చెన్నై తరలిస్తున్న 3.5 కిలోల బంగారం బిస్కెట్లను జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్పీ కేవీ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం... చెన్నై నుంచి రాజమండ్రి వెళ్లే శేషాద్రి ఎక్స్‌ప్రెస్ శనివారం తెల్లవారుజామున 2 గంటలకు తెనాలి చేరుకుంది. ఆ రైలులో జీఆర్‌పీ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జనరల్ బోగీలోని ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో.. వారి బ్యాగులను తనిఖీ చేశారు. ఆ బ్యాగుల్లో 3.5 కేజీల బంగారం బిస్కెట్లు ఉన్నాయి.

అగ్నికీలల్లో వృద్ధదంపతులు

- భర్త సజీవ దహనం..భార్య పరిస్థితి విషమం

చేబ్రోలు, మార్చి 3: అగ్నికీలలకు వృద్ధుడు సజీవ దహనమైన సంఘటన గుంటూరు జిల్లా చేబ్రోలులో శనివారం చోటుచేసుకుంది. తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పోగుల మల్లయ్య పూరి గుడిసెలో మంటలు చెలరేగాయి. గాఢనిద్రలో ఉన్న దంపతులు మల్లయ్య(66), దేవకమ్మ మంటల్లో చిక్కుకున్నారు. మల్లయ్య సజీవ దహనం కాగా, దేవకమ్మ ఒంటికి నిప్పంటుకోవడంతో బయటకు వస్తూ మురుగుకాల్వలో పడిపోయింది. ఆమెను గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో పక్కనే ఉన్న మరో రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

విజయవాడకు హౌస్‌ఫెడ్ కార్యాలయం

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సహకార గృహనిర్మాణ సంఘాల సమాఖ్య (ఏపీ హౌస్‌ఫెడ్) ప్రధాన కార్యాలయం హైదరాబాద్ నుంచి విజయవాడకు మారింది. ఫెడరేషన్‌లో 754 గృహనిర్మాణ సహకార సంఘాలు ఉన్నాయి. విభజన నేపథ్యంలో సమాఖ్య రుణాలను ఇరు రాష్ట్రాలకు విభజించామని ఎండీ అలీఅక్బర్‌బాషా తెలిపారు. ఎల్ఐసీ రుణాలను ఏపీ హౌస్‌ఫెడ్‌కు రూ.28.03కోట్లు, తెలంగాణకు రూ.16.16 కోట్లు, అలహాబాద్ బ్యాంకు రుణాలను ఏ పీకి రూ.19.71కోట్లు, తెలంగాణకు రూ. 11.37కోట్లుగా విభజించామని తెలిపారు.

వ్యక్తిగత గోప్యత చాలా అవసరం

- చట్టాలపై మహిళలకు అవగాహన పెరగాలి
- విద్య, ఉద్యోగాల్లో హక్కుల అమలుతోనే అభివృద్ధి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత గోప్యత చాలా అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ప్రత్యేకించి మహిళలకు 'రైట్ టు ప్రైవసీ' ఉండాలని, సామాజిక కట్టుబాట్ల నుంచి నేటికీ వారికి స్వేచ్ఛ కలగలేదని అభిప్రాయపడ్డారు. మహిళలు తమ హక్కులు తెలుసుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లా విభాగంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. 'మానవ హక్కులు: దృక్పథాలు- ప్రాధాన్యతలు' అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో జస్టిస్ రమణ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్య, ఉద్యోగాల్లో హక్కుల అమలుతోనే స్వేచ్ఛ, సమానత్వం లభిస్తాయని, దీన్నిబట్టే ప్రజలు గౌరవంగా, హుందాగా జీవించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. న్యాయవిద్య చదివినవారికి సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉన్నాయన్నారు. హక్కులను పరిరక్షించడంతో పాటు సామాన్య ప్రజలకు హక్కుల గురించి అవగాహన పెంపొందించే బాధ్యత న్యాయ విద్యార్థులపై ఉంటుందన్నారు. సమాజాన్నీ, చట్టాలను సమాంతరంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. మాతృభాష, మాతృభూమిని ఎన్నటికీ మరువకూడదన్నారు. తెలుగువాడిగా పుట్టినందుకు, తెలుగు మాట్లాడుతున్నందుకు గర్విస్తున్నానని చెప్పారు. తెలుగు సాహిత్యాన్ని విధిగా చదవాలని, శ్రీశ్రీ రాసిన 'మహాప్రస్థానం' చదివితే నిరాశ నుంచి బయటపడొచ్చని జస్టిస్ రమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో నేషనల్ లా స్కూల్‌లో రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ టీవీ సుబ్బారావు, పద్మావతి వర్సిటీ వీసీ వి.దుర్గాభవాని తదితరులు ప్రసంగించారు.



జస్టిస్ ఎన్వీ రమణకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ ఈవో సింఘాల్



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళావెంకటరావు కుమార్తె సాయిని అన్నపూర్ణ యశస్వి వివాహం జెట్టి జగన్నాథరావు కుమారుడు వీరవెంకట వరుణ్‌తో శనివారం రాత్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరగ్గా... వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

బ్రాహ్మణ హితైషి చంద్రబాబు

- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనందసూర్య

చోడవరం, మార్చి 3: ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాహ్మణ హితైషి అని, అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో బ్రాహ్మణుల సంక్షేమానికి 210 కోట్ల రూపాయలు కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్య అన్నారు. శనివారం విశాఖ జిల్లా చోడవరంలో స్వయంభూ గౌరీశ్వరాలయ ప్రాంగణంలో జరిగిన బ్రాహ్మణ కృతజ్ఞతాభివందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన ఏ ప్రభుత్వాలూ బ్రాహ్మణులను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే బ్రాహ్మణ కార్పొరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటుచేసి దానికి బడ్జెట్ కేటాయించారన్నారు. రానున్న బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి మరిన్ని నిధులు కేటాయిస్తామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఇప్పటికే స్పష్టం చేశారన్నారు.

నెల్లూరులోనే 'ఇర్రి' ఇన్నోవేషన్ సెంటర్

నెల్లూరు (వ్యవసాయం) మార్చి 3 : రాష్ట్రంలో ఇన్నోవేషన్ సెంటరు ఏర్పాటుకోసం అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఇర్రి) బృందం శనివారం నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాలలో పర్యటించి, స్థలాలను పరిశీలించింది. ఇర్రి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూమోరెల్ నేతృత్వంలోని డాక్టర్ నఫీస్‌మోహ్‌తోపాటు అధికారులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ వల్లభనేని దామోదర్‌నాయుడు పరిశీలనకు వచ్చారు. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాలెం, ముత్తుకూరు మండలంలోని నారికేళపల్లి ప్రాంతాలలో వ్యవసాయ భూములను పరిశీలించి ఇన్నోవేషన్ సెంటరు ఏర్పాటుకు సాధ్యసాధ్యాలు సరిచూశారు. కాగా, తొలుత రాజధానికి దగ్గరగా ఉండే గుంటూరు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటరు ఏర్పాటు చేయాలని బృందం సంకల్పించింది. అయితే దక్షిణ భారతదేశంలోనే తొలి సెంటరును నెల్లూరులో ఏర్పాటు చేస్తేనే మిగతా ప్రాంతాలకు ఉపయోగంగా ఉంటుందని వర్సిటీ అధికారులు సూచిస్తున్నట్టు తెలుస్తోంది. నెల్లూరులో పరిశోధన కేంద్రం ఉండటం, దేశంలోనే ఖ్యాతి పొందిన పరిశోధనల్లో ఒక్కటిగా రాణిస్తుండటంతో ఇక్కడే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బృందం ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు సమాచారం.

రామేశ్వరంలో శ్రీదేవి అస్థికలు నిమజ్జనం

చెన్నై, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అతిలోకసుందరి శ్రీదేవి అస్థికలను శనివారం రామేశ్వరం సముద్రంలో నిమజ్జనం చేశారు. ఆమె భర్త బోనీకపూర్, ఇతర కుటుంబ సభ్యులు రామేశ్వరం వెళ్లి ఈ క్రతువు పూర్తి చేశారు. గత నెల 24వ తేదీన దుబాయ్‌లో మరణించిన శ్రీదేవికి 28వ తేదీన ముంబైలో అంత్యక్రియలు నిర్వహించిన విషయం తెలిసిందే. శుక్రవారం ముంబై నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై వచ్చిన బోనీకపూర్ బృందం.. ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో రామేశ్వరం వెళ్లి అస్థికలను నిమజ్జనం చేసింది.

చిన్నారుల కోసం 'పలకరింపు'

- నేటి నుంచి కొత్త పథకం
- ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- శిశు మరణాల నివారణే లక్ష్యం
- కొత్తగా రాష్ట్ర ఆరోగ్య బులెటిన్ విడుదల

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని శిశు మరణాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో 5 సంవత్సరాలలోపు చిన్నారులు ఎక్కువగా మృతి చెందుతున్నారు. పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలతో చనిపోతున్న వారి శాతమే వీరిలో ఎక్కువగా ఉంటోంది. ఈ సమస్య పరిష్కారం కోసం 'పలకరింపు' అనే పేరుతో కొత్త పథకాన్ని ప్రభుత్వం తీసుకువస్తోంది. ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు ఆదివారం విజయవాడలో ప్రారంభిస్తారు. సుమారు 21 రోజులపాటు అంటే మార్చి 5వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ చిన్నారుల 'పలకరింపు' కార్యక్రమం జరుగుతుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో అప్పుడే పుట్టిన వారి దగ్గర నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులపై దృష్టి పెడతారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,20,86,624 ఇళ్లను సిబ్బంది సందర్శిస్తారు. ఇందుకోసం 57,555 బృందాలను సిద్ధం చేశారు. 42,219 మంది ఆశవర్కర్లు, 51,545 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, లక్ష మంది మెప్మా కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, పేదరిక నిర్మూలన శాఖ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది ఇందులో భాగస్వాములు అవుతున్నారు. పలకరింపులో నాలుగు అంశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారా లేదో తెలుసుకుంటారు. పోషకాహారం లోపం ఉన్న పిల్లలను గుర్తిస్తారు. అలాంటి పిల్లల తల్లిదండ్రులను పిలిచి తగిన జాగ్రత్తలు చెబుతారు. అనారోగ్యంగా ఉన్న చిన్నారుల గురించి కూడా ఆరా తీస్తారు. అక్కడే పరీక్షించి మందులు ఇస్తారు. మరీ తీవ్రమైతే ఆస్పత్రికి తీసుకెళ్తారు. పుట్టకతోనే లోపాలు ఉన్న పిల్లలను, బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి ఆరోగ్యసూత్రాలు చెప్పి తగిన వైద్యసాయం చేస్తారు. పలకరింపులో భాగమైన వారందరికీ రెండు వారాలుగా శిక్షణ కూడా ఇచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, ఐఎంఏ, ఐఏపీలు ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నాయి.



నేడు హెల్త్ బులెటిన్ విడుదల

'పలకరింపు' కార్యక్రమంతో పాటు 'స్టేట్ హెల్త్ బులెటిన్'ను కూడా సీఎం చంద్రబాబు ఆదివారం విడుదల చేస్తారు. రాష్ట్ర ఆరోగ్య పరిస్థితిని తెలియజేసేందుకు ప్రతినెలా ఒక హెల్త్ బులెటిన్ విడుదల చేయాలని గతంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిస్థితి మొత్తం ఇందులో ఉంటుంది. ప్రజలు ఎక్కువగా ఏ సమస్యతో బాధపడుతున్నారు. సీజనల్ వారీగా ప్రజలపై ప్రభావం చూపించే వ్యాధుల వివరాలూ ఉంటాయి. అనారోగ్య సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ సూచిస్తారు.



తెలుగు భాషను ప్రభుత్వం చంపేస్తోంది

- యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

నరసరావుపేట టౌన్, మార్చి 3 : రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషను చేజేతులా చంపేస్తోందని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. శనివారం గుంటూరుజిల్లా నరసరావుపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనా వ్యవస్థ తెలుగులో ఉండాలని, అసెంబ్లీ ప్రొసీడింగ్స్ తెలుగులోనే ఉండాలని ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఇచ్చారని, కాని వాటిని అధికారులు అమలు చేయటం లేదని, అమలు చేయాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రిదేనన్నారు. గోదావరి పుష్కరాలు ఆఖరి రోజున రాజమండ్రికి తెలుగు విశ్వ విద్యాలయాన్ని తెస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, మూడున్నర ఏళ్లైనా హైదరాబాద్‌లో ఉన్న విశ్వ విద్యాలయాన్ని తీసుకు రాలేదన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగు బోధనగా ఒక సబ్జక్టు తప్పనిసరి అని ముఖ్యమంత్రి చెప్పారని, కానీ దీనికి సంబంధించిన ఉత్తర్వులు మాత్రం రాలేదన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న మంచి పనులను అభినందిస్తున్నానని, ఐతే తెలుగు భాషకు సంబంధించి చర్యలు చేపట్టక పోవటం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానన్నారు.

పోస్టుమార్టంలో తీవ్ర జాప్యం

- హైకోర్టు ఆదేశాలతో ఫోరెన్సిక్ బృందం రాక

భద్రాచలం/చింతూరు, మార్చి 3: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పూజారి కాంకేర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన పదిమంది మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మృతదేహాలను శనివారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మధ్యాహ్నానికి కాని పోస్టుమార్టం మొదలుపెట్టలేదు. మృతుల వివరాలు తెలుపుతూ సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ నుంచి ప్రకటన వెలువడిన తర్వాత ఎస్పీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మృతుల వివరాలు వెల్లడించారు. ఒక్కో మృతదేహానికి పోస్టుమార్టం చేయడానికి గంట నుంచి గంటన్నర సమయం పడుతోందని తెలిసింది. శనివారం రాత్రికి దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ మృతదేహాన్ని మాత్రమే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతదేహాలను భద్రపరిచేందుకు ఆరు ఫ్రీజర్లను అందుబాటులో ఉంచారు. మృతదేహాలు కుళ్లిపోతుండటంతో బంధువులకు చివరిచూపు దక్కదేమో అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఫోరెన్సిక్, సీనియర్ వైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించాలని, దీనిని వీడియో తీయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ కృపాల్‌సింగ్ నేతృత్వంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. వైద్యశాల పరిసరాలను సాయుధ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు సూచించగా...'మీ పద్ధతిలో చేయాలంటే నేను చేయలేను. కోర్టు మార్గదర్శకాల మేరకే చేస్తా' అని ఆ వైద్యుడు పోలీసులకు చెప్పినట్లు సమాచారం.



మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

మృతుల్లో ఏడుగురు మహిళలు

మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యుడు, సెంట్రల్ రీజినల్ బ్యూరో (సీఆర్‌బీ) దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, దళ సభ్యులు ఐతూ (తిప్పాపురం), బుద్రి (ఛత్తీస్‌గఢ్‌లోని సింగం గ్రామం), ఏరియా కమిటీ సభ్యురాలు, సెంట్రల్ రీజినల్ బ్యూరో (సీఆర్‌సీ) డాక్టర్ల బృందానికి చెందిన రామి (సుకుమా జిల్లా వీరాపురం), సీఆర్‌సీ ఏరియా సెక్షన్ కమాండర్ పొడియం మల్లేష్ (ఇంద్రావతి గ్రామం), రంగాయిగూడెం సీఆర్‌సీ దళ సభ్యురాలు కోసి, దళ సభ్యురాలు సుక్కి (గంగులూరు) మరణించారు. మరో ముగ్గుర్ని గుర్తించాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ మృతదేహం మినహా మిగిలిన మృతదేహాలు ఎవరివనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. మిగతా వారు దళ సభ్యురాళ్లు కమల, రత్న, సోంబి అని సమాచారం.

ఏపీలో టీఆర్‌ఎస్ శాఖ ఏర్పాటు చేయండి

- మా 'హోదా' కోసం పోరాడండి
- టీఆర్‌ఎస్ ఎంపీలకు ఏపీ వ్యక్తి వినతి

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విజయవాడలో దాదాపు వెయ్యి మంది టీఆర్‌ఎస్ సానుభూతిపరులం ఉన్నామని.. తమ కోసం ఏపీలో పార్టీ శాఖను ఏర్పాటు చేయాలని టీఆర్‌ఎస్ ఎంపీలను విజయవాడకు చెందిన కొణిజేటి ఆదినారాయణ కోరారు. టీఆర్‌ఎస్ ఎంపీ సమావేశం సందర్భంగా ఆయన శనివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌కు వచ్చారు.

టీఆర్‌ఎస్ కండువా ధరించి వచ్చిన ఆదినారాయణ తనకు తాను ఏపీ టీఆర్‌ఎస్ నేతగా చెప్పుకున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం అక్కడి ఎంపీలు సరిగ్గా పోరాటం చేయడం లేదని ఆయన అన్నారు. తమ కోసం టీఆర్‌ఎస్ ఎంపీలు పోరాడాలని గులాబీ పూలు ఇచ్చి విజ్ఞప్తి చేశారు.



ఆర్కే RK

కొత్తపలుకు


మోదీ! ఏపీపై ఎందుకీ కోపం!

'ఆంధ్ర ప్రదేశ్‌కు న్యాయం చేసే విషయమై మాట్లాడుకుందాం రండి' అని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫోన్ చేసి పిలిచారు. ఇది ఒక రకంగా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టే! రాష్ట్రంలో ఇప్పుడు పరిస్థితులు చేయి దాటిపోయాయి. తూతూమంత్రంగా సహాయం చేస్తే ప్రజలు సంతృప్తిపడే పరిస్థితి లేదు. కొన్ని మాసాల క్రితం ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా ప్రజలు శాంతించారు. రాజకీయ రణగొణ ధ్వనులు కూడా తగ్గాయి. ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ అమలు విషయంలో అతీగతీ లేని నేపథ్యంలో, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్న అభిప్రాయం బలంగా వ్యాపించడంతో రాష్ట్రంలో మళ్లీ వేడి రాజుకుంది. తెరమరుగైన ప్రత్యేకహోదా అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది. ఇది ఒక రకంగా బీజేపీ పెద్దలు చేసుకున్న స్వయంకృతాపరాధమే! విభజన హామీల అమలు విషయమై మిత్రపక్షాలైన తెలుగుదేశం– బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం కూడా మొదలైన తర్వాత అమిత్‌షా ఇప్పుడు తీరిగ్గా, మాట్లాడుకుందాం రండి అని అంటున్నారంటే రాష్ట్రానికి న్యాయం చేసే విషయంలో కేంద్రం పెద్దల చిత్తశుద్ధిపై అనుమానాలు రేకెత్తకుండా ఎలా ఉంటాయి? ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చొరవ తీసుకుని ఉండి ఉండకపోతే, 'మాట్లాడుకుందాం రండి' అని కూడా అమిత్‌షా ఫోన్ చేసి ఉండేవారు కాదేమో! గురువారంనాడు వెంకయ్య నాయుడు నివాసంలో జరిగిన సమావేశంలో 'ఈ రోజు సాయంత్రమే మీ ముఖ్యమంత్రికి ఫోన్ చేసి మాట్లాడతాను' అన్న అమిత్‌షా శుక్రవారం సాయంత్రంగానీ ఫోన్ చేయలేదు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో సంప్రదించిన తర్వాతే ఫోన్ చేద్దామన్న ఉద్దేశంతో అమిత్‌షా జాప్యం చేశారేమో తెలియదు. రాష్ట్రానికి న్యాయం చేయడంతోపాటు తెలుగుదేశం పార్టీతో మైత్రీబంధం కొనసాగించే విషయంలో బీజేపీ పెద్దలకు ఏ మేరకు ఆసక్తి ఉందన్నది సందేహంగానే ఉంది. ఎందుకంటే తెలుగుదేశం పార్టీని వదలుకోకూడదని మోదీ– షా ద్వయం భావిస్తూ ఉండి ఉంటే పరిస్థితిని ఇంత దూరం రానిచ్చే వారు కాదన్న అభిప్రాయం ఉంది.

> వెంకయ్య నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రానికి ఎన్నోకొన్ని సాధించడానికి ప్రయత్నించారు. అది గమనించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనను తెలివిగా మంత్రి పదవి నుంచి తప్పించి చేతులు– కాళ్లు కట్టేసినట్టు ఉండే ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టి, తెలుగు రాష్ట్రాలలో తిరగడానికి ఒక ప్రత్యేక విమానం, నాలుగు హెలికాప్టర్లు ఇచ్చి నోరు కట్టేశారు. వెంకయ్యను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినప్పుడే 'పాపం వెంకయ్య' అని నేను వ్యాఖ్యానించాను.

పార్లమెంటు సమావేశాలు వాయిదాపడి నెల రోజులు అవుతున్నా, తెలుగుదేశం పార్టీ విధించిన గడువు సమీపిస్తున్నా కేంద్ర పెద్దలలో కదలిక రాకపోవడమే ఈ సందేహాలకు కారణం. ఉభయకుశలోపరిగా వ్యవహరిస్తున్న వెంకయ్య నాయుడు చొరవ తీసుకోవడం వల్లనే అమిత్‌షా ఇప్పుడైనా ఫోన్ చేశారనీ, లేనిపక్షంలో పట్టించుకుని ఉండేవారు కాదనీ చెబుతున్నారు. బీజేపీకి చెందిన స్థానిక నాయకులు రెండుగా విడిపోవడం కూడా పరిస్థితి సంక్లిష్టంగా మారడానికి కారణం. ఒకవర్గం నాయకులు అదేపనిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఫిర్యాదులు చేయడంతోపాటు తమకు స్వేచ్ఛను ఇస్తే తమ సత్తా ఏమిటో చూపుతామని అంటున్న మాటలను బీజేపీ అధిష్ఠానం నమ్ముతున్నట్టుగా చెబుతున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలంగానే ఉందనీ, రానున్న ఎన్నికలలో మళ్లీ అధికారంలోకి వస్తుందనీ కేంద్ర ప్రభుత్వ నిఘా వర్గాలు నివేదికలు ఇచ్చినా, స్థానిక బీజేపీ నాయకుల మాటలకే ఆ పార్టీ అధిష్ఠానం ఎక్కువ విలువ ఇస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఈ కారణంగానే రెండు పార్టీల మధ్య దూరం పెరుగుతున్నా బీజేపీ అధిష్ఠానం లెక్క చేయడంలేదన్నది ఒక అభిప్రాయం. పరిస్థితి అదుపు తప్పిన తర్వాత ఇప్పుడు అమిత్‌షా చర్చలకు పిలిచినా పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. రాష్ట్రానికి న్యాయం చేయాలని ఢిల్లీ పెద్దలకు ఉండి ఉంటే చర్చల ప్రతిపాదనకు ఇంత సమయం పట్టేదికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా చాలా ముందుకు వెళ్లారు. ప్రజలలోనూ బీజేపీ పట్ల ఆగ్రహావేశాలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఈ పరిస్థితులలో కేంద్రం కొంత సహాయం చేసినా ప్రజలు సంతృప్తి చెందకపోవచ్చు. అదే జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బీజేపీతో తెగదెంపులు చేసుకునే అవకాశం లేకపోలేదు. ఇప్పుడున్న పరిస్థితులలో బీజేపీతో స్నేహం కొనసాగిస్తే ఆయన రాజకీయంగా మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది. అలా జరగకుండా ఉండాలంటే కేంద్రప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరించవలసి ఉంటుంది. అది జరగాలంటే తెలుగుదేశం పార్టీతో మైత్రీబంధాన్ని కొనసాగించడం రాజకీయంగా తమకు అవసరమని మోదీ– షా ద్వయం భావించాలి. రాష్ట్రహక్కుల కోసం ప్రస్తుతం పోరాటం చేస్తున్న చాలామంది భారతీయ జనతాపార్టీతో ఇంకెందుకు? కేంద్రమంత్రులు రాజీనామా చేయాలని కోరుతున్నారు. ఇదే జరిగితే తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా జరిగే నష్టం పెద్దగా ఉండదుగానీ, రాష్ట్రానికి మాత్రం నష్టం జరుగుతుంది. కేంద్రం నుంచి లభిస్తున్న అరకొర సాయం కూడా ఆగిపోతుంది. రాష్ట్రం మరింత ఇబ్బందుల్లోకి వెళుతుంది. అలా అని ప్రజలు సంతృప్తిపడేలా సాయం లభించని పక్షంలో తమ ప్రయోజనాలను పణంగా పెట్టి బీజేపీతో మైత్రీబంధాన్ని తెలుగుదేశం పార్టీ కొనసాగించలేదు. ఇంటా–బయటా వస్తున్న ఒత్తిళ్లకు తలొగ్గి ఎంతోకొంత అదనపు సహాయం ప్రకటించినా ఎన్నికల నాటికి చంద్రబాబు నాయుడు తమతో ఉంటారన్న గ్యారంటీ లేదని కమలనాథులు అనుమానిస్తున్నారు. ఈ కారణంగానే ఎలాగూ తమనుంచి దూరమయ్యే చంద్రబాబు కోసం ఏదైనా ఎందుకు చేయాలన్న అభిప్రాయంతో బీజేపీ నాయకులు ఉన్నారు. దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవలసింది ఒక్కటే! వచ్చే ఎన్నికలలో గానీ, ఆ తర్వాతగానీ చంద్రబాబు అవసరం తమకు ఉందా? లేదా? అన్నదానిపై మోదీ– షా ద్వయం ఒక నిర్ణయానికి వస్తే తప్ప ఏపీ సమస్య పరిష్కారం కాదు. చంద్రబాబు అవసరం ఉందని వారు భావిస్తే పరిస్థితి ఒకలా ఉంటుంది. లేనిపక్షంలో మరోలా ఉంటుంది. ఆందోళనలు, ఉద్యమాల వల్ల ఫలితం ఏమీ ఉండదు. ఎంపీల రాజీనామాలు, మంత్రుల రాజీనామాలు, అవిశ్వాస తీర్మానాలు వగైరా ప్రతిపాదనలు ఆయా రాజకీయపార్టీల వ్యూహాలలో భాగమే తప్ప... సదరు చర్యల వల్ల ఏమాత్రం ఫలితం ఉండదు. ఏపీ ప్రజలు ఎంత ఆగ్రహంగా ఉన్నా బీజేపీ కోల్పోయేది ఏమీలేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ బలం ఏపాటిదో అందరికీ తెలుసు! సొంతబలం లేని చోట మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ బలంపై ఆధారపడటమా? లేదా? అన్నది తేల్చుకోవలసింది కమలనాథులే! ఈ విషయంలో స్పష్టత వస్తే రాష్ట్రానికి న్యాయం చేసే విషయంలో పురోగతి ఉంటుంది. లేనిపక్షంలో అమిత్‌షా సమక్షంలో ఈ నెల 5న జరిగే చర్చల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. పవన్ కల్యాణ్ ఏర్పాటుచేసిన నిజనిర్ధారణ కమిటీ నివేదిక, రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలు అరణ్యరోదనే అవుతాయి. రాజకీయ అవసరాలను బట్టి బంధాలు– ప్రేమలు ఉంటాయి. బెంగళూరు మెట్రోరైలుకు 17 వేల కోట్ల రూపాయలు కేటాయించారంటే ఆ రాష్ట్రంపై ప్రత్యేక ప్రేమ ఉండి కాదు. అక్కడ త్వరలో ఎన్నికలు ఉన్నందున బీజేపీకి రాజకీయంగా అవసరం. ఏపీలో కూడా రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనుకుంటే బీజేపీ పెద్దలు ముందుకు కదులుతారు. లేనిపక్షంలో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధం కావలసి ఉంటుంది. భారతీయ జనతాపార్టీ మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధిస్తామని కొంతమంది నాయకులు ప్రకటిస్తున్నారుగానీ... చంద్రబాబు అవసరంగానీ, ఏపీ అవసరంగానీ తమకు లేదని బీజేపీ పెద్దలు భావిస్తే మెడలు వంచే పరిస్థితి ఎక్కడ ఉంటుంది? ప్రగల్భాల వల్ల ఫలితం ఉండదు. ఆచరణాత్మకంగా ఆలోచిస్తే కనీసం అశాంతి అయినా ఉండదు.

> ఏపీ ప్రజలు ఎంత ఆగ్రహంగా ఉన్నా బీజేపీ కోల్పోయేది ఏమీలేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ బలం ఏపాటిదో అందరికీ తెలుసు! సొంతబలం లేనిచోట మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ బలంపై ఆధారపడటమా? లేదా? అన్నది తేల్చుకోవలసింది కమలనాథులే! ఈ విషయంలో స్పష్టత వస్తే రాష్ట్రానికి న్యాయం చేసే విషయంలో పురోగతి ఉంటుంది. లేనిపక్షంలో అమిత్‌షా సమక్షంలో ఈ నెల 5న జరిగే చర్చల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఏపీలో కూడా రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనుకుంటే బీజేపీ పెద్దలు ముందుకు కదులుతారు. లేనిపక్షంలో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధం కావలసి ఉంటుంది.



ముందు నుంచీ మంటే...

ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యవహారశైలిని గమనిస్తే ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేసే విషయంలో ఆయన ఉదారంగా వ్యవహరిస్తారన్న నమ్మకం కలగడం లేదు. ఆయన చూపు, మనస్సు అంతా గుజరాత్‌పైనే ఉంటుంది. ఇందుకు అనేక ఉదంతాలు ఉన్నాయి. ఏపీ విషయంలోగానీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలోగానీ ఆయన మొదటినుంచి పెడసరంగానే ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిపాదనలను కనీసం పరిశీలించడానికి కూడా ప్రధానమంత్రి ఇష్టపడటం లేదని చెబుతున్నారు. కొంత కాలం క్రితం చంద్రబాబు ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక ప్రతిపాదనను అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, అలాంటివి చాలా పంపుతూనే ఉంటారు అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారని అంటున్నారు. మరో సందర్భంలో విశాఖపట్నంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు అబుదాబి యువరాజును ఆహ్వానించాలని చంద్రబాబు భావించారు. ఇందుకుగాను కేంద్రప్రభుత్వం అనుమతి కోరుతూ లేఖ పంపారు. విదేశీ వ్యవహారాలశాఖ సదరు లేఖను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపింది. అయితే, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి సదరు లేఖ అబుదాబి రాయబార కార్యాలయానికి చేరనేలేదు. దీంతో అబుదాబి యువరాజు ద్వారా రాష్ట్రానికి ఎంతోకొంత పెట్టుబడులు పొందవచ్చునన్న రాష్ట్రప్రభుత్వం ఆశ నెరవేరలేదు. మరో సందర్భంలో పోలవరం విషయంలో కూడా ప్రధానమంత్రి కార్యాలయం జోక్యంచేసుకుని ఇబ్బందులు సృష్టించే ప్రయత్నం జరిగింది. అప్పుడు కేంద్ర జలవనరుల మంత్రిగా ఉమా భారతి ఉన్నారు. ఆమె సమక్షంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొన్నారు. అప్పుడు చంద్రబాబుతో కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి అమర్యాదకరంగా ప్రవర్తించారు. ఇది జరిగిన కొద్ది రోజులకు ఉమాభారతి తనను కలిసిన ఏపీకి చెందిన ఒకరితో మాట్లాడుతూ, "నరేంద్రమోదీకి– చంద్రబాబుకు మధ్య ఏమైనా గొడవలు ఉన్నాయా? పోలవరం విషయంలో కొర్రీలు వేయమని మా శాఖ అధికారులకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయట! వ్యక్తిగతంగా నేను చంద్రబాబు అభిమానిని. కానీ ఎందుకు ఇలా జరుగుతుందో తెలియడం లేదు" అని చెప్పుకొచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలలో నియోజకవర్గాల సంఖ్య పెంచే విషయంలో కూడా ప్రధానమంత్రి కార్యాలయం 'వద్దు' అని హింట్ ఇచ్చిందట! దీంతో సంబంధిత అధికారులు ఫైలులో రాజ్యాంగ సవరణ అవసరం అని రాశారు. అటార్నీ జనరల్ కూడా అదే అభిప్రాయం వ్యక్తంచేశారు. నిజానికి రాజ్యాంగ సవరణ అవసరం లేదనీ, కావాలనుకుంటే ఇప్పుడు కూడా నియోజకవర్గాల సంఖ్య పెంచుకోవచ్చుననీ సంబంధితశాఖ అధికారి నాకు చెప్పారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సంకేతంతోనే నియోజకవర్గాల పెంపు అంశం పెండింగ్‌లో పడిపోయిందని ఆ అధికారి వివరించారు. తాజా పరిణామాల విషయానికి వస్తే రాష్ట్రానికి సహాయం చేసే విషయంలో కేంద్రంలోని పలువురు మంత్రులు సుముఖంగా ఉన్నారు. అయితే ప్రధానమంత్రి నుంచి సంకేతాలు రానందున తామేమీ చేయలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం రాష్ట్రానికి చెందిన ఒకరు ఒక కేంద్రమంత్రిని కలిసి 'మీరు ప్రధానమంత్రికి సన్నిహితులు కదా! రాష్ట్రానికి సహాయం చేయమని సూచించవచ్చు కదా' అని అడిగారు. దీనికి సదరు కేంద్రమంత్రి బదులిస్తూ, 'ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఈ విషయంలో మా ప్రధానమంత్రి శిలలా ఉంటున్నారు. మేము ఎవ్వరం ఏమీ చేయలేకపోతున్నాం. ఆయన మా మాటలు వినే పరిస్థితిలో లేరు" అని అన్నారు. చెప్పుకొంటూ పోతే ఇలాంటి ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. వెంకయ్య నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రానికి ఎన్నోకొన్ని సాధించడానికి ప్రయత్నించారు. అది గమనించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనను తెలివిగా మంత్రి పదవి నుంచి తప్పించి చేతులు– కాళ్లు కట్టేసినట్టు ఉండే ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టి, తెలుగు రాష్ట్రాలలో తిరగడానికి ఒక ప్రత్యేక విమానం, నాలుగు హెలికాప్టర్లు ఇచ్చి నోరు కట్టేశారు. వెంకయ్యను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినప్పుడే 'పాపం వెంకయ్య' అని నేను వ్యాఖ్యానించాను. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ నాలుగేళ్లలో గుజరాత్‌కు మినహా మిగతా రాష్ట్రాలకు పెద్దగా చేసిందేమి లేదనే చెప్పవచ్చు. విదేశీ పెట్టుబడులు, ఇతరత్రా ప్రతిపాదనలు ఏమి వచ్చినా ఆయన గుజరాత్‌నే సూచిస్తారన్నది బహిరంగ రహస్యంగా మారింది. ఇతర దేశాల ప్రధానమంత్రులు, అధ్యక్షులు వచ్చినా వారిని కూడా నరేంద్రమోదీ గుజరాత్‌కు మాత్రమే తీసుకువెళుతున్నారు. మరే ఇతర రాష్ట్రానికి విదేశీ ప్రముఖులను ఆయన తీసుకువెళ్లిన దాఖలాలు లేవు. తాజాగా అహ్మదాబాద్‌లో భారీ విమానాశ్రయం నిర్మించడం మొదలుపెట్టారు. ప్రభుత్వ నిధులతో ఢిల్లీ– అహ్మదాబాద్ మధ్య ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ కారిడార్ మధ్యలో 50 టౌన్‌షిప్‌లు కూడా నిర్మించబోతున్నారు. గుజరాతీయులకు ముంబాయితో సంబంధాలు ఎక్కువ కనుక ఇప్పుడు ముంబాయిలో కూడా మరో భారీ విమానాశ్రయ నిర్మాణానికి పూనుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి భోగాపురం విమానాశ్రయానికి అతీగతీ లేకుండాపోయింది. అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను, బ్రిటన్ ప్రధానమంత్రి టోనీ బ్లెయర్‌ను అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు హైదరాబాద్‌కు ఆహ్వానించగలిగారు. ఇప్పుడు అబుదాబి యువరాజును కూడా విశాఖపట్నానికి రప్పించలేకపోయారు. నరేంద్రమోదీ వ్యవహారశైలిని దగ్గర నుంచి గమనిస్తున్న పలువురు అధికారులు కూడా ఆయన గుజరాత్‌కు మాత్రమే ప్రధానమంత్రినని భావిస్తున్నారనీ, భారతదేశానికి ప్రధానినని ఆయన అనుకోవడం లేదనీ వ్యాఖ్యానిస్తున్నారు. భారతీయ జనతాపార్టీలో చాలామంది ఇష్టపడే చంద్రబాబును నరేంద్రమోదీ మొదటినుంచి దూరం పెడుతూనే ఉన్నారు. 2014 ఎన్నికలలో కూడా ఆయన తొలుత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో పొత్తును ప్రతిపాదించారని ఒక కేంద్రమంత్రి చెప్పారు. అప్పుడు తాము అడ్డుపడి చంద్రబాబుతో పొత్తు పెట్టుకోవడమే మంచిదని సూచించడంతో మోదీ అంగీకరించారని ఆయన వివరించారు. దీన్నిబట్టి ప్రధాని మోదీకి చంద్రబాబు సహజ మిత్రుడు కాదని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులను అమిత్‌షా చర్చలకు ఆహ్వానించినా ఫలితం ఉంటుందా? అన్నది సందేహమేననీ, తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్ పార్లమెంట్‌లో తనను ఉద్దేశించి 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్' అని సంబోధించడాన్ని కూడా నరేంద్రమోదీ జీర్ణించుకోలేకపోతున్నారనీ చెబుతున్నారు. చంద్రబాబు ఎత్తుగడల వల్ల రాష్ట్రంలో బీజేపీ విలన్‌గా మారిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కొందరు చేస్తున్న ఫిర్యాదులు కూడా అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతున్నాయి. కర్ణాటకలో తెలుగు వారందరినీ బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్రమంత్రులు రెచ్చగొడుతున్నారని పురందేశ్వరి కూడా ఫిర్యాదు చేశారట! ప్రస్తుతం ఆమె కర్ణాటకలో తెలుగువారు నివసించే ప్రాంతాలకు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎవరి ఫిర్యాదులు ఎలా ఉన్నా, ఎవరి ఎత్తుగడల మర్మం ఎలా ఉన్నా ఏపీలో భారతీయ జనతాపార్టీ నాయకుల ఇళ్లల్లో మహిళలు కూడా రాష్ట్రానికి ఏదో ఒకటి చేయవచ్చుగా అని అడుగుతున్నారట!

> విశాఖపట్నంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు అబుదాబి యువరాజును ఆహ్వానించాలని చంద్రబాబు భావించారు. ఇందుకుగాను కేంద్రప్రభుత్వం అనుమతి కోరుతూ లేఖ పంపారు. విదేశీ వ్యవహారాలశాఖ సదరు లేఖను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపింది. అయితే, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి సదరు లేఖ అబుదాబి రాయబార కార్యాలయానికి చేరనేలేదు.

'బయటవాళ్లు కాదు– మా ఆవిడ కూడా మేము రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నామని భావిస్తోంది' అని బీజేపీకి చెందిన ఒక ముఖ్య నాయకుడు వ్యాఖ్యానించారు. సదరు నాయకుడి భార్య మాత్రమే కాదు, రాష్ట్ర ప్రజలందరూ అలాగే భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను వదులుకోవడమా? లేదా? అని మోదీ– షా ద్వయం నిర్ణయించుకోవాలి. రాష్ట్రాన్ని వదులుకోకూడదని అనుకుంటే తెలుగుదేశంపార్టీతో పొత్తును కొనసాగించాలి. అది జరగాలంటే ప్రజలకు సంతృప్తి కలిగించే స్థాయిలో సహాయం అందించాలి. తెలుగుదేశం లేకపోయినా వైసీపీ ఉంటుందిలే అని అనుకుంటే అది వేరే విషయం. అప్పుడైనా రాష్ట్రానికి ఎంతో కొంత సహాయం చేయక తప్పదు. ఏ సహాయం చేయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఉసురుపోసుకుంటారా? లేక ఆంధ్రులు కూడా కావాలనుకుంటారో బీజేపీ నాయకులే తేల్చుకోవాలి.

'డు' గొడవ...

ఇదిలా ఉండగా, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీని 'డు' అనేలా సంబోధించడం తెలంగాణలో ఇప్పుడు వివాదం అవుతోంది. సాధారణంగా సభామర్యాదలు పాటించే కేసీఆర్ నోటి వెంట అలా ఎందుకు వచ్చిందో తెలియదు. ఎంతటివారైనా అప్పుడప్పుడు నోరు జారుతుంటారు. ఈ అంశంపై మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత ఇప్పటికే వివరణ ఇచ్చారు. దీనిపై కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ కూడా అభ్యంతరం వ్యక్తంచేయడం, కేటీఆర్ వివరణ ఇవ్వడం జరిగింది. అయినా గురువారం రాత్రి జరిగిన ఒక విందు సమావేశంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్ దీనిపై స్పందిస్తూ, మోదీనే అవమానిస్తారా? మేము ఏమిటో చూపిస్తాం అని వ్యాఖ్యానించారట! అంతకు ముందు ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్పందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపుతామని హెచ్చరించారు. దేశ ప్రజలు బీజేపీకి కేంద్రంలో అధికారం ఇచ్చింది గిట్టని ముఖ్యమంత్రులను జైలుకు పంపడానికేనా? ఏపీలో కూడా బీజేపీని కాదనుకుంటే ఇబ్బందులు తప్పవు అని ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెచ్చరికలతో కూడిన సూచనలు చేస్తున్నారు. దేశ చరిత్రలో ఇటువంటి ధోరణి ఇప్పుడే చూస్తున్నాం. తమను ధిక్కరించే ముఖ్యమంత్రులను, నాయకులను జైళ్లకు పంపడం కోసమే ప్రధానమంత్రి ఉన్నారా? బీజేపీ విధానాలతో విభేదించే మీడియా సంస్థలకు కూడా హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి సంస్థలు ఉన్నది ఇందుకేనా? ప్రజాస్వామ్య వ్యవస్థలో భయపెట్టి పబ్బం గడుపుకోవాలనుకోవడం వాంఛనీయం, సమర్థనీయం కాదు. నరేంద్రమోదీపై ఎన్నో ఆశలతో 2014లో దేశప్రజలు ఆయనకు పట్టంకట్టారు. కుదిరితే కప్పు కాఫీ అన్నట్టుగా మీకు వీలైతే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రయత్నించండి. అంతేగానీ అధికారం ఉందికదా అని భయపెట్టి సాధించాలనుకోవడం ఏమిటి? అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. వచ్చే ఎన్నికలలో మళ్లీ గెలుస్తారో లేదో గ్యారంటీ లేనివారు కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపుతామనడం ఆక్షేపణీయమే! 42 ఎంపీ స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్– తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులను దూరంచేసుకోవడంలో విజ్ఞత ఏమిటో తెలియదు. ఇంత వివాదం రేకెత్తినా ఆ మాట తాను అన్లేదనే కేసీఆర్ చెప్పారు తప్ప, తన పదప్రయోగాన్ని ఉపసంహరించుకుంటానని గానీ, క్షమాపణ చెబుతున్నాననిగానీ ప్రకటించలేదు. దీన్ని చూసి, 'ఆడు మగాడ్రా బుజ్జీ' అని ప్రజలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆయనను అభినందిస్తున్నారంటే క్షేత్రస్థాయిలో బీజేపీ పరిస్థితి ఏమిటో తెలియడం లేదా? ■

> తమను ధిక్కరించే ముఖ్యమంత్రులను, నాయకులను జైళ్లకు పంపడం కోసమే ప్రధానమంత్రి ఉన్నారా? బీజేపీ విధానాలతో విభేదించే మీడియా సంస్థలకు కూడా హెచ్చరికలు జారీచేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో మళ్లీ గెలుస్తారో లేదో గ్యారంటీ లేనివారు కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపుతామనడం ఆక్షేపణీయమే! 42 ఎంపీ స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్– తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులను దూరంచేసుకోవడంలో విజ్ఞత ఏమిటో తెలియదు.

వ్యక్తిగతాలపై నైతిక తీర్పులెందుకు?



> మగ పోలీసు అధికారులు తమ అధికార బలంతో తమ దగ్గరికొచ్చే మహిళా ఫిర్యాదు దార్లని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోవటం, లైంగిక దోపిడీ చెయ్యటాన్ని మీడియా తప్పకుండా రిపోర్టు చెయ్యాలి–ముఖ్యంగా ఆయా స్త్రీలు అటువంటి ఫిర్యాదు చేస్తే. అది ప్రజలకి అవసరమయ్యే న్యూస్. కానీ వ్యక్తుల అంగీకారంతో నడిచే పరస్పర వ్యక్తిగత సంబంధాలని నైతిక చట్రంలో నడిపించే బాధ్యతని తెలుగు న్యూస్ ఛానెళ్లు తీసుకోవటం సబబేనా?

ఒక తెలుగు మీడియా ఛానెల్ జనవరి 22 అర్ధరాత్రి సునీత రెడ్డి అనే అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇంటిపై స్టింగ్ ఆపరేషన్ చేసి, ఆమె ఇంట్లోకి, పడకగదిలోకి ప్రవేశించి, ఇంకా బాత్ రూమ్‌లోకి గూడా చొచ్చుకు పోదామని ప్రయత్నించింది. ఆ తరువాత, ఆమె అనుమానపు భర్త చెప్పిన ఆరోపణలని నిర్ధారిస్తున్నామన్న వాదనతో, ఆమెని ఒక్క మాటైనా అడగాలనే కనీస జర్నలిస్టిక్ విలువలని పాటించకుండా, ఆమె గత జీవిత సమాచారాన్ని సెన్సేషనల్ రీతిలో చిలవలు పలవలుగా అల్లి పదుల సంఖ్యలో వీడియోల్ని ప్రసారం చేసింది. వారికొచ్చిన టీఆర్పీ రేటింగ్స్ చూసి ఇతర తెలుగు చానెళ్లు తాము కూడా ఆమెని ఏమీ అడక్కుండా, అదే రీతిలో రిపోర్టులు తయారు చేసి ప్రసారం చేశాయి. ఊరు పేరు లేని మరి కొంతమంది కూడా తమదైన రీతిలో రిపోర్టులు తయారు చేసి, తెలుగు ఛానెళ్లతో పాటు యూట్యూబ్‌లో పెట్టాయి. మొత్తం మీద, ఇప్పటికి వందల సంఖ్యలో ఈవిడ వ్యక్తిగత జీవితంపై యూట్యూబ్ లింకులున్నాయి. ఈ వీడియోలు చూసిన వారెవరికైనా, పదుల సంఖ్యలో హత్యలు, వందల కోట్ల డబ్బు దండుకున్న కిరాయి హంతకుడు నయీమ్ కన్నా ఈవిడే సమాజానికి హాని చేసిందనే అనుమానం కలుగక మానదు. అందుకేనేమో, పోలీసు డిపార్ట్‌మెంట్ కూడా ఆమెని సస్పెండ్ చేసి, తన 'నైతికతని' కూడా చాటుకుంది!

అసలు తెలుగు న్యూస్ ఛానెళ్ళకి వ్యక్తిగత జీవితాలపై ఆసక్తి ఎందుకు? దీన్ని న్యూస్ అనొచ్చా? టెలివిజన్ ఛానెళ్ళకి స్త్రీల పడగ్గదిలోకి ప్రవేశించే అహంకారం, అధికారం ఎట్లా వచ్చాయి? ఛానెళ్ళని భార్య పడగ్గదిలోకి తీసుకెళ్లి ఆమెను ప్రపంచం ముందు అవమానపరిచే భర్తను ఎలా అర్థం చేసుకోవాలి? ఆ భర్తకు తెలిసో తెలియకో సహకరించిన ఆమె తల్లిని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ వీడియోల్ని లక్షల సంఖ్యలో వీక్షించిన ప్రేక్షక లోకాన్ని ఎలా చూడాలి?

మీడియా రిపోర్టుల ప్రకారం అయన– ఆవిడ తనకు విడాకులు ఇవ్వట్లేదని, ఇవ్వకుండా వేరే మరొకరితో ఉంటోంది కాబట్టి, ఆవిడని ప్రపంచం ముందు 'ఎక్స్‌పోజ్' చేస్తే, తనకి విడాకులు ఇస్తుందన్న ఆశతో ఇట్లా చేశానని అంటున్నాడు. భారత దేశ న్యాయవ్యవస్థ ఇటువంటి అనుమాన పడే భర్తల కోసమే 'అడల్టరీ చట్టాన్ని', మహిళా సంఘాలు వద్దంటున్నా, ఇప్పటికీ అట్టిపెట్టింది. ఈ చట్టం ప్రకారం, తన భార్య వేరే వారితో సంబంధం పెట్టుకుందనే అనుమానం ఉంటే భర్త ఆ వ్యక్తిపై పై కేసు వెయ్యొచ్చు. ఈయన వేసాడు కూడా. కానీ విడాకుల కోసం ప్రయత్నించినట్లు ఎక్కడా మీడియాలో చెప్పలేదు. విడాకులకు లాయరు దగ్గరికి వెళ్ళటానికి బదులు ఈయన టెలివిజన్ ఛానెల్‌ని ఎందుకు పిలిచినట్లు? అక్కడే ఎవరికైనా అనుమానం రావాలి. ఆయనకి కావాల్సింది విడాకులు మాత్రమే కాదు, ప్రతీకారం కూడా. ఒక మంచి పోలీసు ఆఫీసరుగా పేరు తెచ్చుకున్న భార్యని దెబ్బకొట్టాలంటే ఆమెని ఒక 'వంచించే భార్య' స్థాయికి కుదించటం మంచి మార్గం అనుకున్నాడు. ఒక స్త్రీ ఉద్యోగపరంగా ఎంత గొప్ప స్థాయికి వెళ్లినా సరే, ఆమె లైంగికత పై మచ్చ తెస్తే చాలు సమాజమిచ్చే గౌరవం తగ్గిపోతుందని, పనిచేసే చోట తలెత్తుకుని తిరగలేదనీ ఈయనకి బాగా తెలుసు. ఆమె మళ్ళా నిలదొక్కుకోవటానికి చాలా కాలం పడుతుందని, ధైర్యం పోగొట్టుకుంటే, బహుశా ఎప్పటికీ నిలబడలేదని కూడా తెలుసు. మరి ఆవిడ స్వంత తల్లి కూడా అల్లుడిని సమర్థించింది కదా అనే ప్రశ్న వస్తుంది. కూతుళ్లు ఎంత పెద్ద స్థాయికి ఎదిగినా, వృత్తిపరంగా గౌరవం సంపాదించినా, భార్య స్థానంతో సంబంధం లేని సామాజిక స్థాయిని అందుకున్నా, వారిని కేవలం స్త్రీలుగా మాత్రమే చూసే తల్లుల్లో ఈవిడ ఒకరు. ఆమెను తప్పు పట్టాల్సిన అవసరం లేదు. కూతుళ్ళ శీలం, కాపురం నిలబెట్టే బాధ్యత తల్లుల పైనే పెట్టింది సమాజం మరి. ఆ తల్లిని చూసి జాలి పడటం తప్ప ఏమీ చెయ్యలేం. కూతురి కాపురం నిలబెట్టాలని చేసిన ప్రయత్నంలో లక్షల మంది ముందు ఆమెని దోషిగా నిలబెట్టానని తల్లికి అర్థమయిందో లేదో అనుమానమే. భర్తకి, తల్లికి సునీత రెడ్డితో ప్రత్యక్ష సంబంధం వుంది. కానీ, టెలివిజన్ చానెళ్లకి ఇటువంటి విషయాల్లో ఏం సంబంధం? సరే, కాస్సేపు పోలీసుల నైతిక విలువలని కాపాడే బాధ్యత మీడియా తీసుకుంది అనుకుందాం. వృత్తి పరంగా లంచం తీసుకుంటే, లేక ఒకరికి అన్యాయం చేస్తే, కొడితే, తిడితే, అక్రమంగా కేసులు పెడితే సునీత రెడ్డిపై స్కూప్ చెయ్యొచ్చు, స్టింగ్ ఆపరేషన్లు చెయ్యొచ్చు. అది ప్రజలకి అవసరమైన సమాచారం. కానీ, ఆమె వ్యక్తిగత జీవితంలోకి చొరబడి, భర్తకి, ఆమెకి ఏ గొడవలు ఉన్నాయో చూడకుండా, అతని అనుమానాన్ని నమ్మి, పోలీసుల గురించి ప్రజలకుండే వైముఖ్యాన్ని ఈ రకంగా వాడుకుని, ఆమె వ్యక్తిగత జీవితంపై దాడి చెయ్యటం ఏ రకమైన న్యూస్? మాకు పక్షపాతం లేదు, మగ పోలీసులు చేసినా ఇదే చేస్తున్నాం అని అనొచ్చు. అది మాత్రం సరైందా? పురుష ఆఫీసర్లు తమ అధికార బలంతో తమ దగ్గరికొచ్చే మహిళా ఫిర్యాదు దార్లని తమ వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోవటం, లైంగిక దోపిడీ చెయ్యటాన్ని తప్పకుండా రిపోర్టు చెయ్యాలి, ముఖ్యంగా ఆయా స్త్రీలు అటువంటి ఫిర్యాదు చేస్తే. అది ప్రజలకి అవసరమయ్యే న్యూస్. కానీ వ్యక్తుల అంగీకారంతో నడిచే పరస్పర వ్యక్తిగత సంబంధాలని నైతిక చట్రంలో నడిపించే బాధ్యతని తెలుగు న్యూస్ ఛానెళ్లు తీసుకోవటం సబబేనా?

అసలింతకీ ఈ తెలుగుమీడియా నైతికపోలీసులు తమ నైతికతని ఏ చట్ట పరిధిలో నిర్ణయించుకుంటున్నారు? వివాహేతర సంబంధాలు, బహుభార్యత్వం, భార్యలని చూసుకోకపోవటం ఇవన్నిటికీ చట్ట పరిధిలో ఉపశమనాలు వున్నాయి. దానికోసం ప్రయత్నించటానికి అనేకమంది న్యాయవాదులు, సంక్లిష్ట కుటుంబ చట్టాలు, వాటిని అమలుపరిచే న్యాయస్థానాలు దేశం నిండా, ప్రతి మండలంలో, జిల్లాలో వున్నాయి. మరి మన న్యూస్ ఛానెళ్ళకి వీటిపైన నమ్మకం లేదా?

వీగిపోతున్న పాత నైతికతని ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు, వాటి పరిధిలో పనిచేసే న్యాయస్థానాలు సరిగ్గా కాపాడట్లేదని తెలుగు న్యూస్ ఛానెళ్ళకి అభిప్రాయం ఉన్నట్లుంది. స్త్రీలు పబ్‌కి వెళ్తే సమస్య, స్త్రీలు పురుషులు కలిసి అర్ధరాత్రి యూనివర్సిటీలో లైబ్రరీ నుండి కలిసి వస్తే సమస్య, స్త్రీల బట్టలు పొట్టిగా బిగుతుగా వున్నా సమస్య, జీన్స్ వంటి 'పాశ్చాత్య' బట్టలైతే మరీ సమస్య, సమలైంగికులు కనపడితే, వినపడితే సమస్య; హీరోయిన్లకి తెలుగు సినిమాల్లో మంచి పాత్రలు వుండవు అంటే సమస్య, రాజకీయ పార్టీలలో స్త్రీలకి భాగస్వామ్యం లేదని అంటే సమస్య, మహిళా ప్రభుత్వ అధికారులు కొంచెం మంచిగా ట్రెండీగా బట్టలేసుకుంటే సమస్య, మహిళా, పురుష పోలీసు ఆఫీసర్లు కలిసి పని చేస్తే సమస్య, స్త్రీలు ఆల్కహాల్ తాగితే సమస్య. వారికి ఇవన్నీ ఆధునిక స్త్రీలు కుటుంబం, కమ్యూనిటీ (లేదా వీళ్ళు) పెట్టిన పరిధులు దాటుతున్నారనటానికి సూచనలు. ఇటువంటి 'దారి తప్పుతున్న' స్త్రీలని (వారికి సహకరించే పురుషులని) సరయిన దారికి తీసుకొచ్చే బృహత్తర బాధ్యత, కుటుంబ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ సరిగ్గా పోషించట్లేదనే బాధ తెలుగు మీడియాకి ప్రత్యేకంగా వున్నదని అర్థమవుతుంది.

ఇక్కడ ఇంకో ముఖ్యమైన ప్రశ్న– వ్యక్తిగత జీవితంలోకి మీడియా చొచ్చుకు రావటాన్ని ప్రేక్షకులు ఎందుకు ఒప్పుకుంటున్నారు? అన్నది. ఆధునిక జీవితంలో ప్రవేశించిన కొద్దీ వ్యక్తిగత జీవితంపై కుటుంబ నియంత్రణ కొంత మేరకు తగ్గుతుంది. అలాగే పట్టణీకరణ పెరిగే కొద్దీ వ్యక్తిగత జీవితాలలో సమస్యలని ఇప్పటి వరకూ మీడియేట్ చేసిన కుటుంబం, కుల సంఘాల ప్రభావం కూడా తగ్గి క్రమంగా పోలీసు స్టేషన్లు ప్రవేశిస్తున్నాయి. ఈ క్రమంలోనే కుటుంబ సమస్యలు, వ్యక్తిగత జీవితాలు మన టెలివిజన్‌లకు వినియోగ సరుకుగా మారాయి. అయితే టెలివిజన్ ప్రధానంగా వినోద మాధ్యమం, ఇతరుల సేవ కోసం పనిచేయదు. లాభాలు లేకుంటే కుదరదు.

అలాగే, కేవలం తమ వినోదం కోసం ఇటువంటి వీడియోల్ని చూసే ప్రేక్షకులని కూడా వదిలేద్దాం. తెలిసో, తెలియకో ఈ రకమైన నైతిక పోలీసు పాత్ర పోషిస్తున్న సాధారణ మీడియా రిపోర్టర్లు, ఇటువంటి స్టింగ్ ఆపరేషన్లతో సమాజ 'నైతికత' నిలబడుతుందని నమ్మేవాళ్ళు ఆగి ఆలోచిస్తే పైన చర్చించిన విషయాలు వారికే తడతాయి. తమని తాము ఆ వ్యక్తి స్థానంలో పెట్టుకుంటే, పర్యవసానాలు కూడా అర్థమవుతాయి.

వివాహేతర సంబంధం ఉందని అనుమానించిన స్త్రీని ఇతర దేశాల్లో రాళ్లు వేసి చంపుతారు. మన దేశంలో కుల, సమూహ కట్టుబాట్లు ధిక్కరించిన స్త్రీలని మంత్రగత్తెల పేరుతో చంపుతారు. వాటికీ ఈ స్టింగ్ ఆపరేషన్‌కీ తేడా ఏముంది? ఇటువంటి దుర్మార్గపు దాడి తరువాత ఆమె తన ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే పడే నరక యాతన ఎట్లా ఉంటుందో తలుచుకుంటే దడ పుడుతుంది. స్వంత తల్లి, కట్టుకున్న భర్త, అత్త ఇలా చేసిన తరువాత, మనుషులపై నమ్మకం పోతుంది. శెభాష్ అనిపించుకున్న చోటే, అందరికీ కాల్మొక్కి సస్పెన్షన్ ఎత్తివేయించుకోవాలి. ప్రజల వినోదం కోసం ఛానెళ్ల వెబ్‌సైట్‌లో పెట్టిన తన వ్యక్తిగత జీవితం గురించిన వీడియోలు తీయించటానికి లాయర్ నోటీసులు పంపించాలి. ఎందుకంటే, ఛానళ్ళు 'మీడియా ఫ్రీడమ్' వంకతో చేసింది తప్పని పొరపాటున కూడా ఒప్పుకోవు, క్షమాపణ చెప్పవు. వీడియోలు తమ వెబ్‌సైట్ల నుండి తియ్యవు. యూట్యూబ్‌లో వున్న వీడియోలు తియ్యాలంటే, వాళ్లకి కూడా నోటీసు పంపించాలి. ఇంకా ఇంకా ఎన్నో. అనుమానపు భర్త ప్రతీకార ఇచ్చని తృప్తి పరచటం కోసం ఒక స్త్రీని ఇంత క్షోభ పెట్టటం, సామాజిక శిక్షకి గురిచేయడం ఏ చట్ట ప్రకారం అమలుచేస్తున్న న్యాయమో పాఠకులే ఆలోచించాలి!

■ ఎ. సునీత

కేంద్ర రాష్ట్రాలు.. నిధులపై వివరణివ్వాలి

- పోలవరం ముందుకు సాగకుంటే రాష్ట్రానిదే బాధ్యత
- బాబువి విరుద్ధ ప్రకటనలు.. కేంద్రాన్ని ఎందుకు నిలదీయరు?
- టీడీపీ-బీజేపీ పరస్పర నిందలు.. ప్రజల్లో గందరగోళం
- కేంద్రం తీరుపై జనంలో అసహనం: పవన్ కళ్యాణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌ను ఎంతో అభివృద్ధి చేస్తామని పట్టించుకోకపోవడం అన్యాయమని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యులు పద్మనాభయ్య, కృష్ణారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులు అన్నారు. జేఎఫ్‌సీ నివేదికను శనివారమిక్కడ మీడియాకు విడుదల చేసిన సందర్భంగా పవన్ విలేకరులతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌కు వేల కోట్ల రూపాయల ప్రయోజనం చేకూరుస్తామని విభజన చట్టంలో చెప్పిన కేంద్రం దాన్ని నిలుపుకోలేదు. పోలవరానికీ నిధులిస్తామని మొండి చేయి చూపారు. రూ.పది వేల కోట్లకు పైగా రాష్ట్రానికి ఇస్తామని ఇంత వరకు ఎంత ఇచ్చారో చెప్పడంలో కేంద్రం విఫలమైంది. కాకినాడ, విశాఖపట్నం అభివృద్ధికీ ఇస్తామన్న నిధులివ్వలేదు. మా నివేదికలో ఈ వివరాలన్నీ పొందుపరిచాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివరణ ఇవ్వాలి' అని ఆయన డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల సమయంలో తాను టీడీపీకి, బీజేపీకి సహకరించానని.. విభజన హామీలు నెరవేరుస్తామని, ప్రత్యేక హోదా ఇస్తామంటే నమ్మానని తెలిపారు. 'ప్రత్యేక హోదా అంశాన్ని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారా అని 2016లో నేను తిరుపతిలో ప్రశ్నిస్తే... ప్రత్యేక ప్యాకేజీపై కేంద్రం అర్ధరాత్రి ప్రకటన చేసింది. రెండు పాచిపోయిన లడ్డూలు ఇచ్చిందనే చర్చ జరిగింది. అయినా సరే అవే బాగున్నాయి. ప్రజలకు అవసరం. అవే మాకు కావాలన్నారు. ఇప్పుడు అవి కూడా రాలేదని టీడీపీ వాళ్లు అంటున్నారు. రాష్ట్రాన్ని విడగొట్టేటప్పుడు ప్రత్యేకహోదా అనే తేనె రాసి వదిలేశారు. ఇస్తారని ఆశపడి ఓటేశాం. మళ్లీ ఇప్పుడు అవసరం లేదంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు ఇస్తున్నారు. హోదా కావాలంటారు. ప్యాకేజీ చాలంటారు.. ప్రజలను కన్‌ఫ్యూజ్ చేస్తున్నారు' అని ఆక్షేపించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలను కలిపినప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రాష్ట్ర విభజన జరిగిందని.. ఇప్పుడు కూడా పునర్విభజన చట్టం హామీలను నెరవేర్చకుంటే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని 2014 ఎన్నికల సందర్భంగా మోదీకి చెప్పానని గుర్తుచేసుకున్నారు. ఎంతో అనుభవమున్న వాళ్లని మద్దతిస్తే ఎందుకు కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని చంద్రబాబును ప్రశ్నించారు. 2014 రెవెన్యూ లోటుపై స్పష్టత లేదని కేంద్ర మంత్రి జైట్లీ అన్నారని.. ఏపీకి సంబంధించిన నిధులపై నలుగురు సీనియర్ ఐఏఎస్‌లను అడిగి సేకరించిన సమాచారంతో ఒక కమిటీ నివేదికనే తయారు చేయగలిగిందని, అలాంటిది కేంద్రానికి స్పష్టత లేకపోవడం ఏమిటని నిలదీశారు. కావాలనే ఇలా చేస్తోందా.. లేక అవగాహన రాహిత్యమా అని ప్రశ్నించారు. ఏపీలో ఏర్పాటుచేస్తామన్న 11 జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో తొమ్మిదింటికి ఆమోదం తెలిపారని చెప్పారు. వాటికి నిధుల్ని ఇప్పుడిచ్చినట్లుగా ఇస్తే రెండు దశాబ్దాలకు పైనే పడుతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు ఎంతో నష్టపోతారని తెలిపారు. 'పుండు మీద కారం చల్లిన విధంగా ఉంది. కేంద్రం తీరు ఏపీ ప్రజలను మరింత అసహనం, ఆందోళనకు గురి చేస్తోంది' అని మండిపడ్డారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. దాని బాధ్యతను రాష్ట్రం తీసుకోవడం వల్ల ప్రశ్నించే హక్కును కోల్పోయిందని చెప్పారు. పోలవరం ముందుకు వెళ్లకపోతే రాష్ట్రాన్నే నిందించాల్సి ఉంటుందన్నారు. రైల్వే జోన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆక్షేపించారు. రాంవిలాస్ పాశ్వాన్ ఊరు హాజీపూర్‌ను రైల్వేజోన్ ఎలా చేయగలిగారని ప్రశ్నించారు. ఏపీకి కావాలని అడిగిన ప్రతి దానికీ సాధ్యం కాదంటున్న కేంద్రం.. ఏది సాధ్యమవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత అన్యాయం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.. ఎందుకు భయపడుతోందని నిలదీశారు. టీడీపీ, బీజేపీ చేసిన పనికి తనని ప్రశ్నిస్తున్నారని.. వాళ్లు ఒకరిని ఒకరు నిందించుకుంటున్నారని, దీంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. దీనికి వీలైనంత త్వరగా చరమగీతం పాడాలన్నారు.



జేఎఫ్‌సీ నివేదికపై చర్చిస్తున్న ఉండవల్లి, పద్మనాభయ్య, పవన్, జేపీ

ఆంధ్రాకు అన్యాయం!

(మొదటి పేజీ తరువాయి)

తగిన న్యాయం జరగలేదని పేర్కొంది. జేఎఫ్‌సీ తన నివేదికను శనివారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. విభజన చట్టంలోని 15 అంశాలకు సంబంధించి తాము గుర్తించిన వివరాలను అందులో పొందుపరిచారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. 'హోదా కాదన్నారు. ప్యాకేజీ ప్రకటించారు. దానికింద కూడా పైసా చెల్లించలేదు' అని నిర్ధారించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పెరిగిన భూసేకరణ వ్యయాన్ని కూడా కేంద్రమే భరించాలని స్పష్టం చేశారు. ఇక... విభజన తర్వాత చేసిన ప్రతిపాదనలు, ఖర్చు అంటూ రెవెన్యూ లోటులో కోత విధించడం ఎంత మాత్రం సరికాదని జేఎఫ్‌సీ స్పష్టం చేసింది. మొత్తం లోటును కేంద్రం భర్తీ చేయాల్సిందేనని డిమాండ్ చేసింది. జేఎఫ్‌సీ నివేదికలోని ముఖ్యాంశాలు ఇవి...

ఆస్తులు విభజించాలి...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం ఆస్తుల్లో 95 శాతం తెలంగాణకు (అవి హైదరాబాద్‌లో ఉండడంతో) దక్కాయి. దీనివల్ల కనీసం 2020 వరకూ నవ్యాంధ్ర తీవ్ర రెవెన్యూ లోటు ఎదుర్కోనుంది. దేశంలో ఒక్క ఏపీ మాత్రమే ఈ దయనీయ స్థితిలో ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఆస్తుల పంపకానికి ఉద్దేశించిన కమిటీ తన పని పూర్తి చేసేందుకు చాలాకాలం పట్టేలా ఉంది. దీనివల్ల కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో అన్యాయం జరుగుతోంది.

గడువులోగా పోలవరం..

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రం పైనే ఉంది. పెరిగిన వ్యయ అంచనాలను, భూసేకరణ, పునరావాస ఖర్చులనూ కేంద్రమే భరించాలి.

వెనుకబడిన ప్రాంతాలకు...

రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల పురోగతి కోసం బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంటులో ప్రకటించారు. 24,350 కోట్ల విలువైన ప్రత్యేకాభివృద్ధి ప్యాకేజీని మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2015 జనవరిలో నీతి ఆయోగ్‌కు ప్రతిపాదనలు పంపింది. వీటిపై కేంద్రం నుంచి స్పందనే లేదు. ఏడు వెనుకబడిన జిల్లాలకు 50 కోట్ల చొప్పున 350 కోట్లను మూడేళ్లు ఇచ్చారు. రాబోయే సంవత్సరాల్లో మరో 1050 కోట్లను ఇస్తామంటున్నారు. కానీ... బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అమలు చేసి తీరాలి.

రాష్ట్రం ఏం చేయాలంటే...

కేంద్రం ఇచ్చిన నిధుల వినియోగ ధ్రువీకరణ (యూసీ) పత్రాలను రాష్ట్రం ఇవ్వాలి. తద్వారా మరిన్ని నిధులు పొందవచ్చు.

లోటు భర్తీ చేయాలి..

అగ్రికల్చర్ రిడెంప్షన్ (రూ.3068.35 కోట్లు), రైతు సాధికార సంస్థ (రూ.4001.32 కోట్లు), డిస్కం (రూ.1500 కోట్లు)లకు ఆర్థిక సహాయం, వృద్ధాప్య పింఛన్లు (రూ.3391.20 కోట్లు) కలిపి 2014-15 సంవత్సరానికి రాష్ట్రం మొత్తం రూ.16,078.76 కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కొంది. కానీ... ఆయా పథకాలు/నిర్ణయాలు విభజన తర్వాత తీసుకున్నారంటూ వాటిని కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. లోటు మొత్తాన్ని రూ.4117.89 కోట్లుగా మాత్రమే నిర్ధారించింది. అందులోనూ ఇప్పటికి రూ.3979.50 కోట్లనే విడుదల చేసింది. ఇంకా రూ.138.39 కోట్లను ఇవ్వాల్సి ఉంది. కేంద్ర వాదన నిర్హేతుకమని, పైన ఉటంకించినవన్నీ పాత పథకాలేనని, కొత్తగా పెరుగుదల లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా కేంద్రం పట్టించుకోలేదు. ఉద్యోగుల వేతన సవరణ కారణంగా పడిన భారం రూ.5325 కోట్లను కూడా ఆర్థిక లోటుగా పరిగణించాలన్న రాష్ట్రం అభ్యర్థనను కేంద్రం తోసిపుచ్చింది. ఇది తగదు. డిస్కంలు, వృద్ధాప్య పింఛన్లు, ఉద్యోగుల వేతన సవరణ బకాయిల వల్ల రాష్ట్రంపై పడిన భారం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలి.

'హోదా' లెక్క తేల్చండి...

ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వరాదని ఆర్థిక సంఘం చెప్పలేదు. నీతి ఆయోగ్ కూడా ఇలా చెప్పలేదు. ఎటువంటి చట్టబద్ధత లేని ఈ సంస్థ చెప్పిందంటూ కేంద్ర మంత్రివర్గ నిర్ణయాన్నే అమలు చేయకపోవడం దారుణం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేక హోదాకు ఏమాత్రం ప్రాధాన్యం లేదనడం సరికాదు. ఇప్పటికీ 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఉంది. హోదా ఇవ్వలేమని, దానికి సమానమైన ప్రయోజనాలు ప్యాకేజీ ద్వారా ఇస్తామని 2016 సెప్టెంబరు 8న జైట్లీ ప్రకటించారు. దీనికింద రూ.16,447 కోట్లు ఇస్తామన్నారు. ఇంతవరకూ ఒక్క పైసా కూడా విదల్చలేదు! ఇప్పటికైనా ప్రత్యేక హోదా ప్రయోజనాలన్నింటినీ ఏపీకీ వర్తింపజేయాలి.

రూ. 74వేల కోట్లు ఇవ్వాలి

- విభజన చట్టంలో పేర్కొన్న హామీల మేరకు ఏపీకి ఇంకా 74,542 కోట్లను చెల్లించాల్సి ఉంది.
- ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.16,447 కోట్లకుగాను ఇప్పటికి పైసా ఇవ్వలేదు.
- ఆర్థిక లోటు భర్తీకి రూ.16,078 కోట్లు చెల్లించాలి. కానీ... 3979 కోట్లే!
- వెనుకబడిన ప్రాంతాలకు రూ.24,350 కోట్లకుగాను ఇచ్చింది రూ.2,110 కోట్లు మాత్రమే.
- పన్నులలో అసమతుల్యతను సరిచేసేందుకు రూ.3820 కోట్లను రీఇంబర్స్ చేయాల్సి ఉంది.
- విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు రూ.6000 కోట్లు చెల్లించాలి. ఇప్పటికి ఏమీ ఇవ్వలేదు.
- కాకినాడ పెట్రో కాంప్లెక్స్‌కు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కింద రూ.5000 కోట్లకుగాను ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.
- జాతీయస్థాయి విద్యాసంస్థలకు రూ.11,673 కోట్లు అవసరం. ఇందులో రూ.853 కోట్లను మాత్రమే ఇచ్చారు. ఇంకా రూ.10,800 కోట్లను ఇవ్వాల్సి ఉంది.

రాజధానిపై ఇద్దరి బాధ్యత

రాజధాని అమరావతి నిర్మాణం విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ నత్తనడక నడుస్తున్నాయి. ప్రకటించి నాలుగేళ్లయినా దీని డిజైన్లు, అంచనాలు, డీపీఆర్‌ల తయారీలో రాష్ట్రం వెనుకబడింది. శాశ్వత కట్టడాల పనులు ప్రారంభం కాలేదు. వివిధ ప్రాజెక్టులపై వెచ్చించిన నిధులూ అంతంతే. వెంటనే రాష్ట్రం సవివర అంచనాలు కేంద్రానికి పంపాలి, కేంద్రం తదనుగుణంగా నిధులు ఇవ్వాలి.

అమరావతికి రవాణా...

రాష్ట్రాభివృద్ధికి గణనీయంగా తోడ్పడే 5 కీలక రహదారి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మరోకపక్క కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలోని హైవేల అభివృద్ధికి రూ.72,000 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించినా... పై ఐదు ప్రాజెక్టులు అందులో లేవు. 180 కిలోమీటర్ల పొడవైన, రూ.20,000 కోట్ల విలువైన అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు డీపీఆర్‌ను మాత్రమే ఎన్‌హెచ్ఏఐ రూపొందిస్తోంది.

విజయవాడ- అమరావతి- గుంటూరుల మధ్య 106.56 కిలోమీటర్ల పొడవైన నూతన రైల్వే లైన్‌ను కేంద్ర రైల్వే మంత్రి ఈ ఏడాది జనవరి 16న ప్రకటించారు. దీని సర్వే, డీపీఆర్ తయారీ కోసం రూ.3272 కోట్లు అవసరం కాగా 2017-18, 2018-19 బడ్జెట్లలో రూ.10 కోట్ల చొప్పున మాత్రమే కేటాయించారు. నూతన మెట్రో విధానం ప్రకారం విజయవాడ మెట్రో ప్రాజెక్ట్‌ను లైట్‌మెట్రోగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను సిద్ధం చేస్తుండగా, విశాఖపట్నం మెట్రోపై మాత్రం రాష్ట్రం అభిప్రాయం ఇంకా స్పష్టంగా తెలియడం లేదు.

ఇండస్ట్రియల్ కారిడార్

నాలుగు నోడ్స్‌తో కూడిన విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ఒక్కొక్క దానికి రూ.3,000 కోట్ల చొప్పున మొత్తం రూ.12,000 కోట్లు అవసరం. అయితే విశాఖపట్నం, చిత్తూరు నోడ్స్‌కు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నందున వాటికైనా రూ.6వేల కోట్లు ఇవ్వాలి. ఈ ప్రతిపాదననూ కేంద్రం పెండింగ్‌లో ఉంచింది.

ఉక్కు, రేవు, జోన్...

కడపలో స్టీల్ ప్లాంట్‌కు అనుకూలంగా మెకాన్ సంస్థ ఇచ్చిన నివేదికను కేంద్రం ఆమోదించాలి. దుగరాజుపట్నం రేవు సాధ్యం కాదని నీతి ఆయోగ్ చెప్పింది. కేంద్రం సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం దానికి ప్రత్యామ్నాయం తెలపాలి. విశాఖ రైల్వే జోన్ విషయాన్ని కేంద్రం నాన్చుతోంది. కేంద్రం ఇప్పటికైనా ప్రజాభిప్రాయం మేరకు జోన్ ప్రకటించాలి.

పన్నుల తేడాతో తంటా

విభజన చట్టంలో పొందు పరిచిన మేరకు పన్ను వసూళ్లలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఏపీలో కార్యకలాపాలు సాగించే పలు సంస్థల ప్రధాన కార్యాలయాలు హైదరాబాద్‌లో ఉండడంతో అవి చెల్లించే పన్నులు తెలంగాణకే దక్కుతున్నాయి. మరోకపక్క అప్పులను మాత్రం జనాభా ప్రాతిపదికన నిర్ణయించడంతో ఆంధ్రప్రదేశ్‌కు నష్టం వాటిల్లుతోంది. అలాగే... తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో అత్యధికం నేటికీ కార్యరూపం దాల్చలేదు. వాటిని కూడా సత్వరమే అమలు పరచేందుకు కేంద్రం ఒక నిర్దిష్ట కార్యాచరణను వెంటనే ప్రకటించాలని జేఎఫ్‌సీ తన నివేదికలో పేర్కొంది.


త్రిపురలో బీజేపీ విజయంతో విశాఖలో బీజేపీ నేతలు కామినేని, హరిబాబు, వీర్రాజు, గంగరాజు, మాధవ్ సంబరాలు

ఎదురుదాడి వద్దు... చేసింది చెబుదాం

హద్దు మీరొద్దు.. హుందాగా ఉందాం

- బీజేపీ శాసనసభా పక్షానికి దిశానిర్దేశం
- వ్యక్తిగత విమర్శలు, దూషణలు తగవు
- స్పష్టం చేసిన ఏపీ బీజేపీ చీఫ్ హరిబాబు

విశాఖపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'మిత్రపక్షమైన టీడీపీపై ఆగ్రహంతో ఎదురుదాడికి దిగొద్దు. సంయమనంతో వ్యవహరించండి. రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో అసెంబ్లీ వేదికగా ప్రజలకు తెలియజేయండి' అంటూ బీజేపీ ప్రజాప్రతినిధులకు శాసనసభాపక్ష సమావేశం సూచించింది. విశాఖపట్నంలో రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష సమావేశం శనివారం జరిగింది. దీనికి రాష్ట్ర అధ్యక్షులు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు అధ్యక్షత వహించగా, ఢిల్లీ నుంచి వచ్చిన రాష్ట్ర ఇన్‌ఛార్జి సతీశ్ పర్యవేక్షించారు. మంత్రి మాణిక్యాలరావు, ఎంపీ గోకరాజు గంగరాజు, శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు. కేవలం 11 మందితో నిర్వహించిన అంతర్గత సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. టీడీపీ కావాలని బీజేపీపై బురద జల్లుతోందని, దీనిని తిప్పికొట్టాలని, అసెంబ్లీలో ఎదురుదాడికి దిగుతామని కొందరు సమావేశంలో ప్రస్తావించారు. దీనికి హరిబాబు అంగీకరించలేదు. వ్యక్తిగత విమర్శలు, దూషణలు వద్దని హితవు పలికారు. పార్టీ అధిష్ఠానం సూచన మేరకు నడుచుకుందామన్నారు. తెలుగుదేశం మిత్రపక్షం కాబట్టి ఇంతవరకు ఎలా వ్యవహరించామో ఇకపైనా అలాగే ప్రవర్తించాలని సూచించారు. ఇప్పటివరకు విభజనచట్టంలో పేర్కొన్న హామీల్లో కేంద్రం వేటిని అమలు చేసింది? ఇంకా చేయాల్సినవి ఏమిటి? అనేవి స్పష్టంగా ప్రజలకు తెలిసేలా అసెంబ్లీలో మాట్లాడాలని సూచించారు. అలాగే ఎటువంటి హామీలు ఇవ్వకుండా రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, సంస్థల గురించి చెప్పాలని హరిబాబు పేర్కొన్నారు. ప్రత్యేకహోదా విషయంలో టీడీపీ నాయకులకు కొన్ని అపోహలు ఉన్నాయని, దేశంలో 11 రాష్ట్రాలకు హోదా ఉందని చెబుతున్నారని, దానిపై కూడా శాసనసభలో సమగ్రంగా మాట్లాడాలని సూచించారు. ఆ 11 రాష్ట్రాలకు ఏడాదికి రూ.250 కోట్లు మాత్రమే అందుతున్నాయని..ఆ విషయం అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఇందుకోసం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలను, ధన్యవాద తీర్మాన సమయాన్ని వినియోగించుకోవాలన్నారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేక హోదా విషయంలో కొందరు అధికారులు, నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని విష్ణుకుమార్ రాజు అన్నారు. టీడీపీ నాయకులు ఎంత బురద జల్లినా తాము మాత్రం సంయమనంతో వ్యవహరిస్తామన్నారు. గత నాలుగేళ్లలో ఇంతమంది ఇలా సమావేశమై చర్చించుకోలేదని, ఇదే మొదటిసారి అని, కచ్చితంగా తమ వ్యూహంతో తాము ముందుకెళ్తామన్నారు. బీజేపీ 2019 ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీయే విజయం సాధిస్తుందని అన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ... కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయడానికి 2022 వరకు సమయం ఉందని, 2017 వరకు బాగానే ఉన్న టీడీపీ ఇప్పుడే ఎందుకు ఇలా వ్యవహరిస్తోందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. టీడీపీ అసహనానికి కారణాలు ఏమిటో తెలియాలన్నారు.

మోదీ నాయకత్వానికి దేశమంతా ఆమోదం: హరిబాబు

దేశమంతా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్న సంగతి త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల్లో బీజేపీ విజయంతో రుజువైందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కె.హరిబాబు అన్నారు. శాసనసభాపక్ష సమావేశం ముగిసిన తర్వాత విలేకర్లతో మాట్లాడారు. ఏపీకి హోదా, ప్యాకేజీ తదితర విషయాలను కేంద్రం చూసుకుంటుందని పేర్కొన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, కడపలో ఉక్కు కర్మాగారం, దుగరాజుపట్నం పోర్టు హామీలను నెరవేర్చాల్సి ఉందని, వాటిని కూడా వివరిస్తామన్నారు. ప్రత్యేక హోదాపై అపోహలు వున్నాయని, దీనిపై సభ్యులు సమయం చూసుకొని అసెంబ్లీలో మాట్లాడతారన్నారు.

సభలో బీజేపీనే ప్రతిపక్షం!

రేపటి నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- సభకు రాకూడదని వైసీపీ నిర్ణయం.. పూర్తి సన్నద్ధతతో అధికార టీడీపీ



అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బీజేపీనే ప్రతిపక్ష పాత్ర పోషించనుంది. ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఈ సమావేశాలను బహిష్కరిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పాత్ర బీజేపీకి దక్కనుంది. ఏపీ అసెంబ్లీలో బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా..అందులో ఇద్దరు మంత్రులు. మంత్రులు మాట్లాడలేరు కాబట్టి మిగిలిన ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలే మాట్లాడాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సాయం రావడం లేదని టీడీపీ ఎంపీలు పార్లమెంటులో ఆందోళనలకు సన్నద్ధం అవుతున్నారు. ఇదే సమయంలో ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ వాదనను వినిపించే అవకాశం ఉంది. రాష్ట్రానికి రావాల్సిన సాయంపై ఈ రెండుపార్టీల మధ్య మాటల యుద్ధం అసెంబ్లీలో కొంత వేడి పుట్టించే వీలుంది. రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రసంగంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. మంగళ, బుధవారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆయనకు కొనసాగింపుగా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆ తర్వాత బడ్జెట్‌పై సభలో చర్చ జరుగుతుంది. ఈసారి సమావేశాల్లో రాష్ట్రానికి కేంద్ర సాయం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పోలవరం, పంటలకు గిట్టుబాటు ధరలు, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల రాక, పంటలకు గిట్టుబాటు ధరల కల్పన, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రోడ్డు ప్రమాదాలు, పేదల గృహ నిర్మాణం, జన్మభూమి వినతుల పరిష్కారం, రాయలసీమలో హైకోర్టు, అమరావతి నిర్మాణం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పథకాలపై ప్రజలకు సమాచారం ఇవ్వడానికి ఈ సమావేశాలను ఒక వేదికగా వినియోగించుకోవాలని అధికార తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ప్రతిపక్షం లేదని మంత్రులు సరైన సన్నద్ధత లేకుండా వస్తే ఊరుకొనేది లేదని, ప్రతి అంశంపైనా పూర్తి సమాచారంతో వచ్చి మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మార్చి నెలాఖరు వరకూ సమావేశాలు ఉంటాయి. ఈసారి రాజ్యసభ సభ్యుల ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. 3 ఎంపీ స్థానాలకు నామినేషన్ల దాఖలు చేయడానికి ఈ నెల 12వ తేదీ చివరిరోజు. ఒకవేళ పోటీ అనివార్యమైతే మార్చి 23వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఇందులో ఎమ్మెల్యేలు ఓట్లు వేయాల్సి ఉంటుంది.

చేసినవారే 'అన్యాయ'మంటున్నారు

- అశాస్త్రీయంగా విభజన: అశోక్.. పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం:కొనకళ్ళ
- ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టం:మురళీమోహన్



(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): రాష్ట్ర విభజన ద్వారా ఏపీకి అన్యాయం చేసినవారే ఇప్పుడు అన్యాయమంటూ మొసలి కన్నీరుకారుస్తున్నారని కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు ఎద్దేవా చేశారు. విజయనగరం పట్టణంలో ఐదు గ్రంథాలయ భవనాలకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించినవారే రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారనడం హాస్యాస్పదమన్నారు. హామీల సాధనకు ఎంత దూరమైనా వెళ్తామని బందరు ఎంపీ కొనకళ్ళ నారాయణ గుడివాడలో ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాదని ఎంపీలుగా కొనసాగడం మనస్కరించడం లేదన్నారు. మరో ఎంపీ మురళీమోహన్ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని కొవ్వూరు, రాజమహేంద్రవరంలో అన్నారు. హోదానో, ప్యాకేజో చంద్రబాబు తేల్చుకోలేకపోయారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనడం సరికాదని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ గుంటూరులో అన్నారు.

బహిష్కరణ సిగ్గుచేటు: నారాయణ

నెల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అయిన అసెంబ్లీని ప్రతిపక్షం బహిష్కరించడం సిగ్గుచేటని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ విమర్శించారు. నెల్లూరులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అసెంబ్లీకి రానప్పుడు వైసీపీకి ప్రతిపక్షపాత్ర ఎందుకని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యేలకు తమను గెలిపించుకున్న ప్రజల సమస్యలను పరిష్కరించే అవకాశం ఇవ్వకుండా జగన్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అందుకే చాలా మంది ఎమ్మెల్యేలు వైసీపీని వీడారని, మరి కొంతమంది కూడా బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జగన్ వ్యవహారశైలిని ప్రజలు గమనిస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేరని అన్నారు.


శివరాంపురంలో పార్టీ ముఖ్యులు, ఎంపీల భేటీలో మాట్లాడుతున్న జగన్

21న మోదీపై అవిశ్వాసం

- 20 వరకూ హోదా పోరు.. ఏప్రిల్ 6న ఎంపీల రాజీనామా
- అసెంబ్లీకి హాజరవ్వం.. బాబుకు పవన్ పార్ట్‌నర్: జగన్

ఒంగోలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా కోసం ఈ నెల 20వ తేదీ వరకు పార్లమెంటు లోపలా, బయటా పోరాటం చేయాలని.. 21న కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వైసీపీ నిర్ణయించింది. పాదయాత్రలో ఉన్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నాయకత్వాన శనివారం ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం శివరాంపురం వద్ద ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. గత అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు సోమవారం నుంచి మొదలయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు కూడా హాజరు కాకూడదని తీర్మానించారు. రాజ్యసభ ఎన్నికలకు పోలింగ్ అవసరమైతే ఆ రోజు మాత్రమే అసెంబ్లీకి వచ్చి ఓటు వేయాలని నిర్ణయించారు. అలాగే ఢిల్లీ బయల్దేరిన పార్టీ నాయకుల వాహన శ్రేణిని జగన్ జెండా ఊపి సాగనంపారు. సమావేశం నిర్ణయాలను నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. 'ప్రత్యేక హోదాపై 5న ఢిల్లీలో ధర్నా, తర్వాత పార్లమెంటులో పోరాటం అనంతరం ఈ నెల 21న ఎన్‌డీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడదాం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పార్ట్‌నర్. టీడీపీకి చెందిన 20 మంది ఎంపీలు అవిశ్వాసానికి మద్దతిచ్చే బాధ్యతను ఆయనే తీసుకోవాలి. ఏప్రిల్ 6న స్పీకర్ ఫార్మాట్‌లో పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీలూ లోక్‌సభకు రాజీనామా చేయాలి' అని జగన్ చెప్పారని తెలిపారు. 'వైసీపీకి ప్రస్తుతం 44 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. తదనుగుణంగా రాజ్యసభకు పోటీ పెట్టకుండా ఏకగ్రీవ ఎన్నిక జరిగేలా చూడాలి. కానీ చంద్రబాబు మా ఎమ్మెల్యేలకు భారీ ఆఫర్లు ఇస్తున్నారు. వారు వాటిని తిరస్కరించి నిజాయితీతో వ్యవహరిస్తున్నారు. వారిపై నాకు గౌరవం పెరిగింది' అని జగన్ అన్నట్లు చెప్పారు. కాగా.. 'వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగే టీడీపీ అభ్యర్థులను ఓటుకు రూ. 5వేలు అడిగి తీసుకోండి! కానీ ఓటు మాత్రం ఆత్మసాక్షిగా వేయండి' అని జగన్ ప్రజలకు సూచించారు. పాదయాత్రలో భాగంగా దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దొనకొండ ప్రాంతం రాజధాని ఏర్పాటుకు అనుకూలమని కేంద్ర కమిటీ సిఫారసు చేస్తే దాన్ని చంద్రబాబు బుట్టదాఖలు చేశారని ఆరోపించారు. సిరులు పండించే భూములున్న అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ పార్టీ అభ్యర్థిగా బాదం మాధవరెడ్డిని జగన్ ప్రకటించారు.

హోదా వచ్చే వరకూ పోరాటం: రాజకీయేతర జేఏసీ

న్యూఢిల్లీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ సాధించే వరకు తమ పోరాటం ఆగబోదని నాన్ పొలిటికల్ జేఏసీ ప్రధాన కార్యదర్శి మెండు చక్రపాణి స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో జేఏసీ నిరసన తెలియజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఏపీ భవన్‌లో భిక్షాటన, సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామన్నారు.

విభజన సమస్యల పరిష్కార కమిటీ 12న భేటీ

న్యూఢిల్లీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలో హామీల అమలు, రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు, షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనలో తలెత్తుతున్న సమస్యలపై చర్చించడానికి ఈనెల 12న ఢిల్లీలో రెండు వేర్వేరు సమావేశాలు జరుగనున్నాయి. ఈ మేరకు కేంద్ర రాష్ట్ర సంబంధాల విభాగం అదనపు కార్యదర్శి టీవీఎస్ఎన్ ప్రసాద్ రెండు రాష్ట్రాలకు లేఖ రాశారు. అదేరోజు సీఎస్‌ల సమావేశం జరుగుతుందని అధికారవర్గాలు తెలిపాయి.

ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు



కరెంట్ అఫైర్స్

జాతీయం

మూడో అంతర్జాతీయ యోగా ఉత్సవాలు



మూడో అంతర్జాతీయ యోగా ఉత్సవాలు మార్చి 1న ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరుగనున్న ఈ వేడుకల్లో ప్రపంచంలోని 150 దేశాలకు చెందిన 600 మంది పాల్గొంటున్నారు. ఈ ఉత్సవాలను ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ ప్రారంభించారు.

మహిళా సురక్షిత నగరాలకు 2,900 కోట్లు

నగరాలను మహిళలకు సురక్షితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,900 కోట్లు కేటాయించింది. ఇందుకోసం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నోలను ఎంపిక చేసింది. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. నిర్భయ నిధుల్లో నుంచి ఖర్చు చేయ నున్న మొత్తం రూ.2,919.55 కోట్లలో ఢిల్లీకి రూ.663.67 కోట్లు, ముంబైకి రూ.252 కోట్లు, బెంగళూరుకు రూ.667 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో వీడియో పర్యవేక్షణ, ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు, వీడియో ఫీడ్ షేరింగ్ ఉన్న పెట్రోలింగ్ వ్యాన్‌లను, మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.

ముగిసిన త్రివిధ దళాల విన్యాసాలు

అరేబియా సముద్రంలో మూడు వారాలుగా జరుగుతున్న త్రివిధ దళాల విన్యాసాలు మార్చి 1న ముగిశాయి. ఇందులో నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీకి చెందిన ఫైటర్ జెట్లు, ఐఎన్ఎస్ విక్రమాదిత్య, పదాతిదళాలు పాల్గొన్నాయి. 'పశ్చిమ్ లెహర్' పేరుతో పశ్చిమ తీర ప్రాంతంలో ఫిబ్రవరి 12న ఈ విన్యాసాలను ప్రారంభించారు. త్రివిధ దళాల పరస్పర సామర్థ్యాలను, కార్యాచరణ సంసిద్ధతను పరీక్షించేందుకే ఈ విన్యాసాలు చేపట్టారు. ఇందులో నేవీకి చెందిన ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఈస్టర్న్, వెస్టర్న్ నావిక దళాలు, జలాంతర్గాములు, 22వ కిల్లర్ స్క్వాడ్రన్, గస్తీ నౌకలు, తేలికపాటి యుద్ధ విమానాలు మిగ్ 29కె, పీ - 8ఐ, ఐఎల్ - 38ఎస్‌డీ, రిమోట్‌తో నడిచే విమానాలు పాల్గొన్నాయి.

ఆంగ్ల 'జనగణమన'కు 99 వసంతాలు!

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జాతీయ గీతాన్ని ఆంగ్లంలోకి అనువదించి ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి 99ఏళ్లు పూర్తయ్యాయి. దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా 1919లో చిత్తూరు జిల్లా మదనపల్లెలోని బీటీ కళాశాలను సందర్శించిన ఠాగూర్... ఇక్కడ ఐదు రోజుల పాటు బస చేశారు. ఈ సమయంలోనే కళాశాలలోని బీసెంట్ హాల్లో అప్పటి ప్రిన్సిపాల్ జేమ్స్ కజిన్స్ సతీమణి మార్గరెట్ కజిన్స్ జాతీయగీతానికి బాణీలు కట్టారు. ఆ తర్వాతే ఇప్పుడు మనం పాడుకుంటున్న రూపంలో 'జనగణమన' మదనపల్లె నుంచి దేశ వ్యాప్తంగా విస్తరించింది. ఆయన ఇక్కడ ఉన్నప్పుడే మార్గరెట్ విజ్ఞప్తి మేరకు తరగతి గది నం.204లో జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించారు. 1919 ఫిబ్రవరి 28న తన స్వదస్తూరితో ఉన్న ఆ ప్రతిని జేమ్ కజిన్స్‌కు ఠాగూర్ బహూకరించారు. 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' పేరిట అనువదించిన ఆ ప్రతి నకలు బీటీ కళాశాలలో ఇప్పటికీ భద్రంగా ఉంది.

శతాబ్ది రైలుకు మహిళా టీటీఈలు

భారత రైల్వే మరో నూతన అధ్యాయానికి తెరతీయనుంది. ముంబై - అహ్మదాబాద్ మధ్య నడిచే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో కేవలం మహిళా ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ల (టీటీఈ)నే నియమించాలని నిర్ణయించింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. శతాబ్దిలో 30 మంది మహిళా టీటీఈల బృందం విధులు నిర్వహించనుంది.

తేజస్ కీలక పరీక్ష విజయవంతం

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన తేలికపాటి యుద్ధవిమానం (ఎల్‌సీఏ) 'తేజస్' మరో కీలక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఫిబ్రవరి 26న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన తేజస్ ఎల్ఎస్‌పీ8 విమానం తిరిగీ సురక్షితంగా చేరుకోవటంతోపాటు, ఇంజిన్ ఆన్‌లో ఉండగానే ఇంధనం నింపుకుంది. ఇలాంటి సదుపాయం ఉన్న భారత వైమానిక దళ విమానాల్లో తేజస్ మొట్టమొదటిది. తేజస్‌కు ఉన్న ఈ సౌలభ్యంతో ఇంధనం నింపుకునే సమయం సగానికి సగం తగ్గిపోతుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు

ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు కర్ణాటక రాష్ట్రంలో ఆవిష్కృతమైంది. 'శక్తి స్థల'గా పిలిచే ఈ మెగా ప్రాజెక్టును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య మార్చి 1న తిరుమణిలో ప్రారంభించారు. సుమారు 13 వేల ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేశారు. పార్కు పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే 2 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. దీనికి చేసిన వ్యయం రూ. 16,500 కోట్లు. ఈ ప్రాజెక్టు కోసం భూమిని రైతుల నుంచి 28 సంవత్సరాల పాటు లీజుకు తీసుకున్నారు. ఇందుకుగానూ ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ. 21 వేల చొప్పున అద్దె చెల్లిస్తారు. 2,300 మంది రైతులు ఈ ప్రాజెక్టు కోసం భూములు లీజుకిచ్చారు.

భారత పర్యటనలో జోర్డాన్ రాజు



జోర్డాన్ రాజు, మహ్మద్ ప్రవక్త వంశంలో 41వ తరానికి చెందిన అబ్దుల్లా-2-బిన్ అల్-హుస్సేన్ ఫిబ్రవరి 27 నుంచి మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించారు. ఇందులో భాగంగా మార్చి 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై పోరు, ఆరోగ్య రంగం, ఐటీ, కస్టమ్స్, రక్షణ, వాణిజ్య రంగాల్లో సహకారంపై ఇరు దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. అంతేకాకుండా 'ఇస్లామిక్ సంస్కృతి: అవగాహన పెంపొందించుట, సంయమనం' అంశంపై నిర్వహించిన సదస్సులో జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 బిన్ అల్ హుస్సేన్‌తో కలిసి మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా అబ్దుల్లా సోదరుడు ప్రిన్స్ ఘాజీ బిన్ ముహమ్మద్ తలాల్ రచించిన 'ఏ థింకింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లాం' అనే పుస్తకం ఉర్దూ కాపీని జోర్డాన్ రాజుకు ప్రధాని మోదీ బహూకరించారు.



సీఆర్పీఎఫ్ బైక్ అంబులెన్స్

ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యం కల్పించేందుకు గాను సీఆర్పీఎఫ్ బైక్ అంబులెన్స్‌ను ప్రారంభించింది. మోటారు సైకిళ్లపై సాయుధ భద్రతా సిబ్బంది రక్షణ మధ్య వైద్య బృందాలు అవసరమైన చోటుకు చేరుకుని వైద్యం అందించనున్నాయి. మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న బీజాపూర్ - దంతేవాడ జిల్లాలకు చెందిన దాదాపు 70 గ్రామాల ప్రజలకు ఈ సేవలు ఉపయోగపడతాయి.

'శ్రమ్' పురస్కారాల ప్రదానం

దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో నైపుణ్యంతో, నిజాయితీగా పనిచేసే సిబ్బందికి, కార్మిక అభివృద్ధికోసం పనిచేసిన 338 మందిని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ 'ప్రధాన మంత్రి శ్రమ్'పురస్కారాలతో సత్కరించింది. ఏటా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకటించే ఈ అవార్డులను ఫిబ్రవరి 26న ఢిల్లీలో ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కె.రామ్‌ప్రసాద్, హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు చెందిన సి.కుమార్, జి.గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రాజేందర్ ప్రసాద్ పురస్కారాలు దక్కించుకున్నారు.

రాష్ట్రీయం

టీ-యాప్ ఫోలియో



వివిధ ప్రభుత్వ శాఖల సేవలను ఒకేవేదిక ద్వారా అందించే ఉద్దేశంతో రూపొందించిన 'టీ-యాప్ ఫోలియో' యాప్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కె.తారకరామారావు ఫిబ్రవరి 28న హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ తరహా సేవలను ప్రస్తుతం కర్ణాటక అందిస్తుండగా.. రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు సంబంధించి అడంగల్ / పహాణీ, ఆర్వోఆర్ 1బి, మ్యుటేషన్, ఈ-పట్టాదారు పాసు పుస్తకం, ఎఫ్ఎంబీ పత్రం, ఇనాం భూముల స్వాధీనత హక్కు ధ్రువీకరణ, ఆదాయ, కుల, జనన, మరణ, నివాస, ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు వంటి 150 రకాల సేవలను ఈ యాప్ ద్వారా పొందొచ్చు.

కేన్సర్ కేర్‌పై టాటా ట్రస్ట్‌తో ఒప్పందం

కేన్సర్ వ్యాధి, గుర్తింపు, నివారణ చర్యల్లో భాగంగా తెలంగాణా ప్రభుత్వం టాటా మెమోరియల్ ట్రస్ట్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సమగ్ర క్యాన్సర్ కేర్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1న టాటా మెమోరియల్ ట్రస్ట్‌తో అండర్ స్టాండింగ్ మెమోరాండంపై సంతకాలు చేసింది. క్యాన్సర్‌ను ప్రాథమికంగానే గుర్తించాలనే ప్రధాన లక్ష్యంతో పాటు అన్ని స్థాయిల్లోనూ ఆరోగ్య సంరక్షణ అందిచాలనేది లక్ష్యంగా పెట్టుకుంది.

సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు

సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు విశాఖపట్నంలో జరిగింది. ఈ ఏడాది భాగస్వామ్య సదస్సులో 4,253 మంది పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు. రూ. 4.39 లక్షల కోట్ల విలువైన 734 ఒప్పందాలు కుదిరాయి. 50 దేశాల నుంచి 280 మంది విదేశీ ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

టీఎస్‌కాప్‌నకు ఎన్‌సీఆర్‌బీ ట్రోఫీ

తెలంగాణ పోలీసు విభాగం రూపొందించిన 'టీఎస్‌కాప్' నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ట్రోఫీ - 2017ను గెలుచుకుంది. ఫిబ్రవరి 28న చెన్నైలో జరిగిన ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్ లో భాగంగా ట్రోఫీని తమిళనాడు ముఖ్య మంత్రి పళనిస్వామి చేతుల మీదుగా అదనపు డీజీ అంజనీకుమార్ అందుకున్నారు. ఎన్‌సీఆర్‌బీ ఏటా నిర్వహించే టెక్నాలజీ అమలు, వినియోగం, పోలీసు శాఖలో కంప్యూటీకరణ తదితర అంశాలపై పోటీ నిర్వహిస్తోంది. ఇందులో అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు పోటీ పడగా టీఎస్‌కాప్‌కు ఈ ట్రోఫీ లభించింది.

టాటా - బోయింగ్ ఏరోస్పేస్ ప్రారంభం



ప్రఖ్యాత విమానాల తయారీ సంస్థ బోయింగ్, దేశీ దిగ్గజం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఉమ్మడిగా రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ బాడీ తయారీ కేంద్రం మార్చి 1న ప్రారంభమైంది. భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జెస్టర్, రతన్ టాటా, బోయింగ్ సీఈవో లీన్ కారెట్, మంత్రి కేటీఆర్‌లతో కలిసి రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ దీనిని ప్రారంభించారు. బోయింగ్‌కు చెందిన ఏహెచ్ 64 అపాచీ హెలికాప్టర్ల తయారీకి కీలకమైన 'ఫ్యూజ్ లేజ్ (ప్రధాన ఫ్రేమ్)'ను, కొన్ని ఏరోస్ట్రక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేస్తారు. ఈ భాగాలు అంతర్జాతీయంగా 15 దేశాలకు ఎగుమతి కానున్నాయి.

క్రీడలు

ముగిసిన వింటర్ ఒలింపిక్స్

దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో ఫిబ్రవరి 9 నుంచి 25 వరకు వింటర్ ఒలింపిక్స్ జరిగాయి. ఆరంభ వేడుకల్లో ఉమ్మడిగా మార్చ్ పాస్ట్‌లో పాల్గొన్న దక్షిణ కొరియా, ఉత్తర కొరియా అథ్లెట్లు.. ముగింపు వేడుకల్లో మాత్రం వేర్వేరు జెండాలతో కవాతు చేశాయి. ఈ ఒలింపిక్స్‌లో నార్వే 14 స్వర్ణాలు సహా 39 పతకాలతో పట్టికలో అగ్రస్థానంలో నిలవగా.. జర్మనీ 14 స్వర్ణాలతో పాటు 31 పతకాలతో రెండో స్థానం సాధించింది. కెనడా 11 స్వర్ణాలు సహా 29 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది.

విజయ్ హజారే విజేత కర్ణాటక

దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీని కర్ణాటక జట్టు గెలుచుకుంది. ఫిబ్రవరి 27న ఢిల్లీలో జరిగిన ఫైనల్లో సౌరాష్ట్ర జట్టును ఓడించి మూడో సారి ఈట్రోఫీని కైవసం చేసుకుంది.


లారెస్ స్పోర్ట్స్ అవార్డులు



లారెస్ స్పోర్ట్స్ అకాడమీ ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఆటతీరును కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఏటా పురస్కారాలను అందజేస్తుంది. ఈ సారి అవార్డులను ఫిబ్రవరి 27న మొనాకోలో ప్రదానం చేసింది. ఇందులో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారునితోపాటు అత్యుత్తమ పునరాగమన ప్లేయర్ (బెస్ట్ కమ్‌బ్యాక్ అవార్డు)గా స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్నిస్ ఆటగాడు రోజర్ ఫెడరర్ నిలిచాడు.

వార్తల్లో వ్యక్తులు

శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం



కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి (82) మహా నిర్యాణం చెందారు. కొంతకాలంగా రక్తపోటు, తీవ్ర మధుమేహం, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన ఫిబ్రవరి 28న పరమపదించారు. తమిళనాడులోని తిరువారూర్ జిల్లా మన్నార్గుడి - తిరుత్తురైపూండి మధ్యలో ఉన్న ఇరుల్‌నీక్కి అనే గ్రామంలో 1935 జూలై 18న జయేంద్ర సరస్వతి జన్మించారు. ఆయన అసలు పేరు సుబ్రహ్మణ్యం మహాదేవ. సుబ్రహ్మణ్యం మేజర్ అయిన రోజు అంటే 1954 మార్చి 22న చంద్రశేఖరేంద్ర సరస్వతి తన వారసుడిగా సుబ్రహ్మణ్యం మహాదేవ అయ్యర్ పేరు ప్రకటించి, జయేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. 1994లో చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి శివైక్యం కావడంతో జయేంద్ర సరస్వతి 69వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లూ బాల పెరియవాళ్ (చిన్నస్వామి)గా భక్తులు వ్యవహరిస్తున్న విజయేంద్రసరస్వతి.. కంచి కామకోటి 70వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. స్వామి జయేంద్ర సరస్వతి నిర్యాణం చెందిన వెంటనే ఆయన పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. 1969, మార్చి 13వ తేదీన తిరువళ్లూరు జిల్లా తండలం గ్రామంలో తెలుగు కుటుంబంలో జన్మించిన ఆయన్ని 13 ఏళ్ల ప్రాయంలోనే.. అంటే 1983, మే 29వ తేదీన జయేంద్ర సరస్వతి వారసుడిగా ప్రకటించారు. ఆయన అసలు పేరు శంకర నారాయణన్.

శ్రీదేవి మరణం



ప్రముఖ నటి శ్రీదేవి (54) ఫిబ్రవరి 24న దుబాయ్‌లో మరణించారు. 1963 ఆగస్టు 13న తమిళనాడులోని శివకాశీలో జన్మించారు శ్రీదేవి. ఆమె అసలు పేరు శ్రీ అమ్మయాంగర్ అయ్యప్పన్. నాలుగేళ్ల వయసులోనే చలనచిత్ర పరిశ్రమకు బాలనటిగా శ్రీదేవి పరిచయమ్యారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 300కిపైగా చిత్రాల్లో నటించారు. భారత ప్రభుత్వం 2013లో ఆమెను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

ఆర్థికం

హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ - 2018

ప్రస్తుతం చైనా, అమెరికా తర్వాత మన దేశంలోనే ఎక్కువ మంది సంపన్నులున్నారు. మార్చి 1న వెలువడిన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ - 2018' ప్రకారం... ప్రస్తుతం మన దేశంలో 100 కోట్ల డాలర్లు (బిలియన్) లేదా అంత కంటే ఎక్కువ ఆస్తులు ఉన్న వారి సంఖ్య 131. గత ఏడాదితో పోలిస్తే కొత్తగా 31 మంది ఈ జాబితాలో చేరారు. ఈ సంవత్సరం కూడా 45 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.92 లక్షల కోట్లు) ఆస్తులతో ముకేశ్ అంబానీ అత్యంత సంపన్నుడిగా నిలిచారు. గౌతమ్ అదానీ 14 బిలియన్ డాలర్ల (సుమారు రూ.91,000 కోట్లు) ఆస్తులతో రెండో స్థానంలో నిలిచారు. హురున్ సంపన్నుల జాబితా ప్రకారం... ప్రస్తుతం ముకేశ్ అంబానీ ప్రపంచంలోని అత్యంత సంపన్నుల్లో 19వ స్థానంలో, అదానీ 98వ స్థానంలో ఉన్నారు. రంగాల వారీగా చూస్తే మన దేశంలోని అత్యంత సంపన్నుల్లో 19 మంది ఫార్మా రంగానికి, 14 మంది ఆటోమొబైల్ రంగానికి, 11 మంది కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగానికి చెందిన వ్యక్తులు ఉన్నారు. ప్రపంచంలోని 68 దేశాల్లో 100 కోట్ల డాలర్ల (బిలియన్ డాలర్లు) కంటే ఎక్కువ సంపద ఉన్న వ్యక్తులు 2,694 మంది, కంపెనీలు 2,157 ఉన్నాయి. వీరి సంపద మొత్తం విలువ 10.5 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.682.5 లక్షల కోట్లు). ప్రపంచ జీడిపిలో ఇది 13.2 శాతానికి సమానం. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న బిలియనీర్లలో 819 మంది చైనాలో ఉంటే, అమెరికాలో 571 మంది మాత్రమే ఉన్నారు. ఈ సంవత్సరం 123 బిలియన్ డాలర్ల ఆస్తులతో అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. తర్వాత 102 బిలియన్ డాలర్ల ఆస్తులతో వారెన్ బఫెట్ రెండో స్థానంలో, 90 బిలియన్ డాలర్ల ఆస్తులతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ మూడో స్థానంలో, 79 బిలియన్ డాలర్ల ఆస్తులతో ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ నాలుగో స్థానంలో నిలిచారు.

భారత వృద్ధి రేటు 7.6 శాతం: మూడీస్

అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ భారత్ వృద్ధి రేటును 2018 సంవత్సరానికి 7.6 శాతంగా అంచనా వేసింది. 2016 నాటి డీమోనిటైజేషన్, 2017లో తీసుకొచ్చిన జీఎస్టీ ప్రతికూల ప్రభావాల నుంచి కోలుకుంటుందని చెప్పటానికి కొన్ని సంకేతాలు కనిపిస్తున్నాయని తన నివేదికలో పేర్కొంది. 2018 సంవత్సరానికి సంబంధించిన వృద్ధి అంచనాలను మార్పు చేయకుండా గతంలో వెల్లడించిన మేరకు 7.6 శాతం నమోదవుతుందని స్పష్టం చేసింది. 2019లో 7.5 శాతంగా ఉంటుందని తెలిపింది. ప్రముఖ వర్ధమాన దేశాల్లో భారత్, ఇండోనేషియా దేశాల వృద్ధి అంచనాలను మాత్రమే మార్పు చేయడం లేదని పేర్కొంది.

ఫ్యుజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్లు

మోసాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వారు, రుణం ఎగవేసి అదృశ్యమైన వారికి సంబంధించి అన్ని ఆస్తులను స్వాధీనం చేసుకుని వాటిని వెంటనే విక్రయించే అధికారం కల్పించే ఫ్యుజిటివ్ ఎక నమిక్ అఫెండర్స్ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ మార్చి 1న ఆమోదం తెలిపింది. దీని ప్రకారం ప్రత్యేక కోర్టు అనుమతితో బకాయిలను తక్షణమే రాబట్టుకునేందుకు వీలు పడుతుంది. ఆర్థిక నేరగాళ్లతోపాటు రూ.100 కోట్లకు పైగా రుణ బకాయి పడి విదేశాలకు పారిపోయిన వారికీ ఇదే వర్తిస్తుంది. మార్చి 5 నుంచి మొదలయ్యే బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటు ఆమోదం కోసం ప్రవేశపెడతారు.



రామచంద్రారెడ్డి ఉప్పుల

జాబ్ కార్నర్

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలోని ఏఎన్‌సీ యూనిట్స్ హెడ్ క్వార్టర్స్ 16 కోర్ - గ్రూప్ సి పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీలు :** 23
- **పోస్టులు :** ఫైర్ ఇంజిన్ డ్రైవర్ 4, ఫైర్‌మన్ 16, ఇండస్ట్రియల్ మజ్‌దూర్ 3
- **అర్హత :** 10వ తరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతోపాటు సంబంధిత విభాగంలో పరిజ్ఞానం, నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
- **వయసు :** 18 నుంచి 25 ఏళ్లు.
- **ఎంపిక విధానం :** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష ఇలా :** రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్ అనే నాలుగు విభాగాలు ఉంటాయి. ప్రతి విభాగం నుంచి 25 ప్రశ్నలు (25 మార్కులు) ఇస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ మినహా మిగిలిన ప్రశ్నలను ఇంగ్లీషు, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. రాత పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అభ్యర్థులు అర్హత పొందాలంటే ప్రతి విభాగంలో కనీసం 33 శాతం మార్కులు సాధించాలి. రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులను మాత్రమే తదుపరి ఎంపిక ప్రక్రియకు పరిగణనలోకి తీసుకుంటారు.
- **దరఖాస్తు ఫీజు :** రూ.25
- **దరఖాస్తుకు చివరి తేదీ :** మార్చి 19, 2018.
- **వెబ్‌సైట్ :** www.indianarmy.nic.in

జేఆర్‌ఎఫ్

నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (ఎన్ఏఆర్ఎల్) - జేఆర్‌ఎఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీలు :** 18
- **పోస్టుల వారీగా ఖాళీలు :** జూనియర్ రీసెర్చ్ ఫెలో-15, రీసెర్చ్ అసోసియేట్స్-3
- **అర్హత :** సంబంధిత లేదా అనుబంధ విభాగంలో పీహెచ్‌డీ /ఎంఇ / ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశించిన మేర అనుభవం తప్పనిసరి.
- **వయసు :** జేఆర్‌ఎఫ్‌లకు 30 ఏళ్లు, రీసెర్చ్ అసోసియేట్స్‌కు 35 ఏళ్లు.
- ఎంపిక: టెస్ట్ / ఇంటర్వ్యూ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ :** మార్చి 25, 2018
- **దరఖాస్తు హార్డ్ కాపీ స్వీకరణకు చివరి తేదీ :** మార్చి 30, 2018.
- **వెబ్‌సైట్ :** www.narl.gov.in

కౌన్సెలింగ్

ఇండస్ట్రియల్ బయో టెక్నాలజీతో అవకాశాలు..

ప్ర: 2016లో పీజీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) పూర్తి చేశాను. ఇప్పటి వరకు సరైన ఉద్యోగం లభించలేదు. కాబట్టి ఉన్నత స్థాయి కోర్సులు చేద్దామనుకుంటున్నాను. ఏ కోర్సులను ఎంచుకుంటే మంచిదో వాటిని ఏ సంస్థలు అందిస్తున్నాయో తెలపండి

- బి. చైతన్య, వరంగల్

జ: మీరు ఏ రంగంలో కోర్సులు చేయదలచుకున్నారో స్పష్టంగా తెలపలేదు. మీ సబ్జెక్టు పరంగానా లేదా వేరే సబ్జెక్టును ఎంచుకోవాలనుకున్నారా అనే విషయంపై స్పష్టత లేదు. సబ్జెక్టు పరంగా చూస్తే ఆర్గానిక్ కెమిస్ట్రీలో చెప్పుకోతగ్గ కోర్సులేమీ ఉండవు. కానీ ఈ విభాగానికి దగ్గరగా ఉండే 'డ్రగ్ డిజైన్' లో షార్ట్ టర్మ్ ట్రైనింగ్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సులకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉంది. లేదంటే ఎంఫిల్ కానీ పీహెచ్‌డీ కానీ చేయవచ్చు. తెలుగు రాష్ట్రాల్లోని యూనివర్సిటీల తోపాటు యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, అన్నా యూనివర్సిటీలు ఎంఫిల్ కోర్సులను అందిస్తున్నాయి. ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ/ తత్సమాన కోర్సులు చేసిన అభ్యర్థులకు ఫార్మా పరిశ్రమలో ఉన్నత అవకాశాలు లభిస్తాయి.

ప్ర: తమిళనాడు శస్త్ర యూనివర్సిటీలో 'ఇండస్ట్రియల్ బయో టెక్నాలజీ' కోర్సులో సీటు వచ్చింది. ఈ విభాగంపై నాకు అవగాహన లేదు. దీనికి సంబంధించిన వివరాలను, ఉద్యోగావకాశాల గురించి తెలపండి



- కె. మనీషా, హైదరాబాద్

జ: మీరు చేరేది ఎంఎస్సీ లేదా బీటెక్ అనే విషయాన్ని స్పష్టం చేయలేదు. ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీకి సంబంధించి ఉద్యోగావకాశాలు బాగానే ఉన్నప్పటికీ మన దేశంలో మాత్రం తక్కువనే చెప్పాలి. లైఫ్ సైన్సెస్‌లో ఈ విభాగం అంత విస్తృతమైంది కాదు. ఇందులో ఎంఎస్ / పీహెచ్‌డీ చేసిన వారికి మాత్రమే మంచి అవకాశాలు లభిస్తాయి. బయోటెక్నాలజీ విభాగాల్లో కేవలం బీటెక్ /ఎంఎస్సీ అర్హతతో ఉద్యోగం దొరకడం అసాధ్యం. ఒక వేళ దొరికినా ప్రాజెక్ట్ అసిస్టెంట్ తరహా ఉద్యోగాలే తప్ప అంతకు మించిన గ్రేడ్ పోస్టులు ఉండవు.

ప్ర: మా అమ్మాయి బీటెక్ (ఈసీఈ) పూర్తి చేసింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్‌లో పీజీ చేయాలనుకుంటుంది. ఈ కోర్సుని మన దేశంలో చేయడం మంచిదా లేక విదేశాల్లో చేస్తే అవకాశాలు బాగుంటాయా? తెలియజేయండి

- ఆర్. మాధురి, కాకినాడ

జ: ఇంజనీరింగ్ విభాగాలన్నింటిలో ఈసీఈ ప్రధానమైంది. దీనికి సంబంధించిన ప్రధాన కోర్ సబ్జెక్టులో పీజీ చేయడం ప్రయోజనకరం. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్‌ను కోర్సును విదేశాల్లో చేయడమే మంచిది. ఎందుకంటే ఇక్కడి చాలా యూనివర్సిటీల్లో ఈ కోర్సుకు సంబంధించి అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది, మౌలిక వసతులు అందుబాటులో ఉండడం లేదు. అందుకే చాలా మంది అభ్యర్థులు ఈ విభాగంలో ఎంఎస్ చేయడానికి విదేశాలకు వెళుతున్నారు. ఇది పూర్తిగా జాబ్ ఓరియంటెడ్ కోర్సు. కాబట్టి ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో నిపుణులకు అవకాశాలు విరివిగా ఉన్నాయి. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన ఉద్యోగ సమాచారాన్ని www.environmental-engineer.com/ సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

- డాక్టర్ యు.ఎస్.ఎన్. మూర్తి, సీనియర్ సైంటిస్ట్.

ఆమె...
వెండితెరకు 'చాందినీ'...
ప్రేక్షకులకు 'అతిలోక సుందరి'...
ప్రేక్షక లోకానికి 'వసంత కోకిల'...
మరి తాను పాలించిన సినీ సామ్రాజ్యానికి ఆమె ఎలా గుర్తుండిపోతుంది?
సినీ ప్రముఖుల జ్ఞాపకాల్లో ఆమె వేసిన ముద్ర ఎలాంటిది?
శ్రీదేవి గురించి ఆమె తోటి బాటసారులు ఏమంటున్నారు?
శ్రీదేవి స్మృతుల సుమమాల ఇదిగో...



ఇంటర్వ్యూలు:
రెంటాల జయదేవ

ఒక శకం ముగిసింది

ఊహించని పరిణామం ఏంటంటే అది శ్రీదేవి నిష్క్రమణ. ఆ భగవంతుడు చాలా అన్యాయం చేశాడు. నా మనసు మనసులో లేదు. శ్రీదేవి కుటుంబానికి, మా కుటుంబానికి ఎంతో సాన్నిహిత్యం. ఆమెతో ఎన్నెన్నో జ్ఞాపకాలు... నేను మద్రాసు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో శిక్షణ తీసుకొంటున్న రోజులవి. అప్పుడే ఆమె కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'పదునారు వయదినిలే' విడుదలైంది. కమల్‌హాసన్, రజనీకాంత్, శ్రీదేవి కాంబినేషన్‌లో అప్పట్లో సంచలనం. ఎగబడి చూశాం. ఎందుకంటే రజనీకాంత్ మా ఇన్‌స్టిట్యూట్ నుంచి వెళ్లిన మా సీనియర్. నేను ఎంతగానో ఇష్టపడే కమల్‌హాసన్... వీళ్లందరూ ఉన్నారు. శ్రీదేవి ఆ సినిమాలో ముద్దమందారంలా ఉంటుంది. యువ హృదయాలను కట్టిపడేసింది. ఆ చిత్రాన్ని కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ దృష్టిలో కాకుండా ఒక ఎడ్యుకేటివ్ పర్పస్‌తో చూశాం. ఆ చిత్రాన్ని ఎన్ని సార్లు చూసినా నిన్నా మొన్నా చూసినట్టు ఉంటుంది. ఆ చిత్రాన్నే తర్వాత రాఘవేంద్రరావు గారు 'పదహారేళ్ల వయసు'గా తీశారు. ఆ తర్వాత 'మూండ్రామ్ పిరై' (తెలుగులో 'వసంతకోకిల') ఇలా ఆమె నటించిన తమిళ సినిమాలన్నీ ఇన్‌స్టిట్యూట్‌లో ఉండగా చూశా.

1980లో....

మా కాంబినేషన్‌లో తొలిచిత్రం 'మోసగాడు'. మద్రాసులోని ప్రసాద్ స్టూడియోలో 'మోసగాడు' చిత్రంలోని పాట చిత్రీకరిస్తున్నారు. తొలిసారి శ్రీదేవిని కలిసింది కూడా అప్పుడే! అంతకు ముందు ఆ అవకాశం రాలేదు. ఆ సినిమా దర్శకుడు క్రాంతికుమార్ నా తొలి చిత్రం 'పునాది రాళ్లు' నిర్మాత. అప్పటి నుంచి నా సినీ కెరీర్‌కు సలహాలు, సూచనలు ఇస్తున్న మార్గదర్శి. ఆయన నిర్దేశకత్వంలో నా కెరీర్‌కు బాటలు వేసుకుంటున్న సమయం అది. మళ్లీ ఆయనే 'మోసగాడు' చిత్రం చేయడానికి సిద్ధమవుతున్న సమయంలో విలన్ పాత్ర ఆఫర్ చేశారు. అందులో శోభన్‌బాబు, శ్రీదేవి హీరో, హీరోయిన్లు. పైగా శ్రీదేవి అందులో ద్విపాత్రాభినయం. "శ్రీదేవి రెండో పాత్ర చాలా రఫ్ అండ్ టఫ్. విలన్ అయినా ఆమె పాత్రతో పాటలు ఉంటాయి" అని క్రాంతికుమార్ చెప్పారు. కానీ, శ్రీదేవి లాంటి హీరోయిన్‌తో హీరోగానే చేయాలని ఏ హీరోకి ఉండదు. నాకూ అలానే అనిపించింది. కానీ తప్పని సరై క్రాంతికుమార్ మాట కాదనలేక ఆ సినిమా చేశాను.

వెర్సటైల్ యాక్టర్

ఏం చెప్పినా అలవోకగా చేసేయడం శ్రీదేవిలో ఉన్న ప్రత్యేకత. ఆ సినిమాలో రెండో పాత్ర కోసం సిగరెట్ తాగడం... ఇలా కాస్త యాంటీ హీరోయిన్‌లా చేసింది. ఏ పాత్ర చేసినా అందులో పరకాయ ప్రవేశం చేస్తుంది. ఒక్కొక్కరు ఒక్కో భావోద్వేగాన్ని పండించడంలో నిష్ణాతులు. కానీ ఆమె నటనకు హద్దుల్లేవు. ఎలాంటి పాత్రలోనూ ఒదిగిపోతుంది. నేను డ్యాన్సులు ఎంత బాగా చేసినా, ఆమెతో డ్యూయెట్ అనగానే కాస్త ఆచితూచి ప్రిపేరయ్యేవాడిని. డ్యాన్స్‌లో అంత నిష్ణాతురాలు ఆమె. అంతటి వైవిధ్యం, విశిష్టత ఉన్న నటీమణి.

మా కాంబినేషన్ ఎలా కుదిరిందంటే....

'దొంగమొగుడు' సినిమా తీసిన నిర్మాత ఎస్పీ వెంకన్నబాబు అప్పట్లో నా డేట్లు, శ్రీదేవి డేట్లు చూసేవారు. శ్రీదేవితో హీరోగా చేయాలన్న నా కోరిక తెలుసుకున్నారు. ఆయన ప్రయత్నాలు చేశారు. వాటి ఫలితమే 'రాణికాసుల రంగమ్మ' చిత్రం. ఆ సినిమాలో నేను హీరోనే. కానీ నెగటివ్ షేడ్స్ ఉంటాయి. సినిమా చేస్తున్నంతసేపు ఎంజాయ్ చేస్తూ చేశాం.


'జగదేకవీరుడు అతిలోక సుందరి'లో...

అయితే మళ్లీ అనుకోకుండా నేను బిజీ అయిపోవడం, ఆ సమయంలోనే ఆమె హిందీలోకి వెళ్లాడం జరిగింది. ఇక్కడ ఎన్టీఆర్, అక్కినేని వంటి అగ్రహీరోలతో హీరోయిన్‌గా నటించే దశకు చేరుకుంది. అలా కెరీర్‌లో ముందుకెళ్లిపోయింది శ్రీదేవి.

ఆ పేరే... మా అమ్మాయికి పెట్టా!

ఒకానొక సమయంలో శ్రీదేవి సొంత సినిమాలో నన్నే హీరోగా అనుకుంటున్నారని తెలిసి మాట్లాడదామనుకున్నా. ఇంతలో శ్రీదేవి వాళ్ల అమ్మగారితో కలిసి మా ఇంటికి వచ్చింది. బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ సరోజ్‌ఖాన్ కంపోజ్ చేసిన నృత్యాలు ఉండేలా ఓ మ్యూజికల్ లవ్‌స్టోరీ నిర్మిద్దామన్నది వారి ఆలోచన.

(మిగతా నవ్య లోపలి పేజీలో..)



చిరంజీవి

ఒక్క చూపు.. వంద భావాలు

శ్రీదేవి గారంటే మా అక్కినేని వారి ఇంట్లో మనిషే అనుకుంటాం. నాన్న గారి సినిమాల్లో ఆమె తల్లి రాజేశ్వరి గారు నటించారు. ఆ తరువాత శ్రీదేవి... కూతురిగా మొదలు హీరోయిన్ దాకా రకరకాల పాత్రల్లో నటించారు. హీరోను కాక ముందు, నేను, అన్నయ్య నిర్మాతలుగా వ్యవహరించి, మా సంస్థలో తీసిన సినిమాల్లో కూడా నాన్న గారి సరసన శ్రీదేవి చేశారు. అందుకే, ఆమెతో మాకు ప్రత్యేక అనుబంధం. ఆమె బాలనటిగా వేస్తున్నప్పుడు చూశాను తప్ప, పరిచయం లేదు. అయితే, మా 'ప్రేమాభిషేకం' చిత్రం 365 రోజులు ఆడిన సందర్భంగా అన్నపూర్ణా స్టూడియోలో జరిగిన ఫంక్షన్‌లో ఆమెను తొలిసారి కలిసి... మాట్లాడా. అప్పటి నుంచి మా బంధం కొనసాగింది. నేనెప్పుడూ చెబుతుంటా హీరోల్లో నా ఫేవరెట్ అమితాబ్ ... హీరోయిన్లలో శ్రీదేవి అని! హీరో అయిన తొలి రోజుల్లోనే ఆమెతో కలసి 'ఆఖరి పోరాటం' చేసే అవకాశం వచ్చింది. అప్పటికే ఆమె నటించిన 'మిస్టర్ ఇండియా' లాంటి సినిమాలెన్నో వచ్చాయి. దేశంలో నంబర్ వన్ తారగా వెలుగుతున్నారు. ఆ టైమ్‌లో ఆమెతో నటించే అవకాశం రావడంతో బాగా ఎగ్జైటయ్యా. కొద్దిగా నెర్వస్‌గా కూడా ఫీలయ్యా. పక్కా ప్రొఫెషనల్ శ్రీదేవి తోటి నటుడిగా నేను కంఫర్టబుల్‌గా ఉండేలా చూశారు.

నెర్వస్‌గా ఫీలయ్యా...

ఆమె అద్భుతమైన డ్యాన్సర్. మా ఇద్దరి మధ్య మంచి పాటలున్నాయి. మీ ముందు జనం నన్నెలా చూస్తారండీ అనేవాణ్ణి. కానీ, ఆమె మాత్రం నవ్వేసి, నేను డ్యాన్స్‌లు రిహార్సల్ చేస్తుంటే ఓపిగ్గా ఉంటూ, బాగా సహకరించేవారు. ఆ సినిమాలో లతా మంగేష్కర్ పాడగా మా మీద తీసిన 'తెల్ల చీరకు తకధిమి...' పాట అప్పట్లో పెద్ద హిట్. ఆ తరువాత కూడా ఆమెతో చాలా మంచి జ్ఞాపకాలున్నాయి. 'గోవిందా గోవిందా', 'ఖుదాగవా' లాంటి సినిమాల అనుభవాలున్నాయి. షూటింగ్ కబుర్లు, సరదా విశేషాలు బోలెడు. ఆమెతో షూటింగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుండేవాణ్ణి. అప్పట్లో హిందీ 'శివ' అయిన తరువాత ఇంకేమీ చేయలేదు.



'ఆఖరి పోరాటం'లో...

తెలుగు మీదే దృష్టి పెట్టాలనుకున్నా. నాలుగేళ్ల గ్యాప్ వచ్చింది. ఉన్నట్టుండి ఒకసారి శ్రీదేవి ఫోన్ చేసి, 'ఖుదా గవా' సినిమా గురించి చెప్పింది. 'మంచి పాత్ర, మంచి సినిమా. నువ్వు చేయాలి. బాగుంటుంది' అంది. అటు అమితాబ్, ఇటు శ్రీదేవి... నా ఫేవరెట్ స్టార్స్ ఇద్దరూ నటిస్తున్న సినిమా అనే సరికి ఎగిరి గంతేశా. ఆ సినిమా షూటింగ్ కూడా చాలా సాఫీగా సాగిపోయింది. నేపాల్‌లో ముక్తినాథ్ దగ్గర ఆ సినిమా షూటింగ్ చేస్తున్నాం. శ్రీదేవి, నేను... ఇలా నలుగురైదుగురం కలసి గుర్రాల మీద దేవుడి దర్శనానికి వెళ్లాం. దర్శనమైపోయే సరికి చీకటి పడుతోంది. ఆ రాత్రి నేను అక్కడే ఉందామని అనుకున్నా. శ్రీదేవి వెళ్లిపోతానంది. 'నేనొక్కదాన్ని వెళ్లలేను. నువ్వు తోడు రా' అని అడిగింది. అది ఇప్పటికీ గుర్తుండిపోయింది.

నాన్న గారి కడచూపు కోసం...

నాన్న గారికి శ్రీదేవి క్లోజ్. ఎప్పుడైనా సరదాగా ఫోన్‌లో వాళ్లు మాట్లాడుకొనేవాళ్లు. అలాగే మా అమ్మ గారికి కూడా! ఎప్పుడూ మా అమ్మను 'అమ్మా... అమ్మా..' అనే పిలిచేది. నాన్న గారు పోయినప్పుడు శ్రీదేవి చాలా బాధపడ్డారు. ఎలాగైనా చూడాలని, ఎక్కడెక్కడ నుంచో హడావిడిగా వచ్చింది. ఆఖరి నిమిషంలో అందుకోగలిగింది. వ్యక్తిగతంగా మంచి మనిషి, మంచి వ్యక్తిత్వం. అంతే సున్నిత స్వభావురాలు శ్రీదేవి. చాలామంది ఆమె ముభావంగా ఉంటుందనుకుంటారు. కానీ, ఆమె తనకు ఇష్టమైన, దగ్గరివాళ్లతో చాలా సరదాగా ఉండేవారు. 'గోవిందా.. గోవిందా' సినిమా సెట్స్‌లో ఒకరి మీద ఒకరం బాగా జోకులు వేసుకునేవాళ్లం. వర్మ మీద అయితే, ఆయన ఎదురుగానే శ్రీదేవి మాతో జోకులు పేల్చేవారు. అంత సరదా మనిషి... సినిమా, వ్యక్తిగత ఆరోగ్యం, సంరక్షణ అంటే అంత డిసిప్లీన్‌గా ఉండేవారు. చర్మ సంరక్షణ నుంచి ఆహార నియమాల దాకా ఆమె దగ్గర నుంచి నేను నేర్చుకున్నవి, నేర్చుకోవాల్సినవీ చాలా ఉన్నాయి. ఆమెకు నటన ప్రాణం. ఎలాంటి పాత్ర, ఎమోషన్ అయినా చాలా ఈజ్‌తో చేసేసేవారు. పాత్ర, డైలాగ్ డెలివరీ... అన్నీ మనసులో బాగా ప్రిపేర్ అయ్యేవారు. సెట్స్‌లో ఆమెకు ఉండే గౌరవం అంతా ఇంతా కాదు. ఆమె వస్తోందంటే సెట్‌లో అందరూ ఆటోమేటిగ్గా లేచి, నిల్చొనేవారు. అలాగే, సినిమాల్లో పాటలు చేస్తున్నప్పుడు ఆమె ఒక్క చూపులో వంద భావాలు పలికించేవారు. ఏడెనిమిది నెలల క్రితం ఓ పెళ్లికి వచ్చినప్పుడు ఆమెను కలిశా. పిల్లల గురించి, వాళ్ల యాక్టింగ్ కెరీర్ గురించి చాలాసేపు మాట్లాడారు. ఆమె వెళ్లిపోయారంటే, ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. ఇదంతా ఒక పీడకలలా ఉంది.


నాగార్జున


కృష్ణ

శ్రీదేవి చిన్నప్పటి నుంచీ అంటే ఆర్టిస్టు కాక ముందు నుంచీ తెలుసు. మద్రాసులోని పెరియార్ రోడ్‌లో శ్రీదేవి వాళ్ల ఇల్లు ఉండేది. దానికి ఎదురుగానే మా ఇల్లు. రోజూ ఆడుకోవడానికి మా ఇంటికి వచ్చేది. నరేశ్‌తో కలసి ఆడుకొనేది. నిర్మాత భావనారాయణగారు 'మా నాన్న నిర్దోషి' తీసే సన్నాహాల్లో ఉన్నారు. నేను, విజయనిర్మల హీరో హీరోయిన్లం. అందులో నా కొడుకు పాత్ర ఒకటుంది. ఒక రోజు నిర్మాత మా ఇంటికి వచ్చినప్పుడు అక్కడ ఆడుకొంటున్న శ్రీదేవిని చూసి 'ఈ పిల్ల బాగుందయ్యా.. మన సినిమాలో పెట్టేద్దాం' అన్నారు. ఈ మాటే వాళ్ల అమ్మ రాజేశ్వరిని పిలిచి చెప్పారు. ఆ మాట వినగానే వాళ్లమ్మ ముఖం వెలిగిపోయింది. అలా నా కొడుకు పాత్ర ద్వారా బాలనటిగా శ్రీదేవి తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది. సినిమా గురించీ, కెమెరా గురించీ ఏమీ తెలియని వయసు అది. అయినా కీలకమైన ఆ పాత్రను అద్భుతంగా పోషించింది. సీనియర్ నటీనటులున్నా ఏ మాత్రం తడబడకుండా షూటింగ్‌లో పాల్గొంది. తర్వాత చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఓ పది సినిమాలు నాతో చేసింది. ఇక హీరోయిన్‌గా శ్రీదేవిని నా పక్కన బుక్ చేసిన తొలి సినిమా 'సమాజానికి సవాల్'. అయితే దానికంటే ముందు 'బుర్రిపాలెం బుల్లోడు' విడుదల కావడంతో మా కాంబినేషన్‌కు అదే తొలి సినిమా. 'బుర్రిపాలెం బుల్లోడు' అలా రిలీజ్ అయిందో లేదో నా పక్కన పది సినిమాలకు శ్రీదేవిని బుక్ చేశారు.

3 సినిమాలు.. 10 పాటలు!

చిన్నప్పటి మహేశ్‌లా..

శ్రీదేవి చాలా కామ్ గోయింగ్. తన పనేమిటో తప్ప మిగిలిన విషయాలు పట్టించుకొనేది కాదు. పలకరిస్తే పలకడం తప్ప అతిగా మాట్లాడి ఎరుగదు. టైమ్‌కు చాలా విలువ ఇచ్చేది. ఎంత పెద్ద డైలాగ్ అయినా సింగిల్ టేక్‌లో ఓ.కే చేసేది. బాలనటిగా ఉన్నప్పుడే ఆమె ప్రతిభ అందరికీ అర్థమైంది. బాలనటుడిగా మహేశ్ ఎంత ఈజ్‌తో నటించేవాడో అంతగా శ్రీదేవి నటించేది. హీరోకున్నంత ఫాలోయింగ్ చిన్నప్పుడే అతనికి వచ్చింది. అలాగే శ్రీదేవికి కూడా. ఆ రోజుల్లో ఏ సినిమాలోనన్నా బాలనటిగా మంచి వేషం ఉందంటే శ్రీదేవిని వెదుక్కుంటూ వెళ్లేవాళ్లు.

నా సలహా పాటించారు

13 ఏళ్ల వయసులో శ్రీదేవి 'దేవుడులాంటి మనిషి' చిత్రంలో రాజబాబుకు జోడీగా నటించింది. నేను ఆ రోజు సెట్‌కి వెళ్లగానే శ్రీదేవి కనిపించింది. 'ఈ అమ్మాయి వేషం ఏమిటి' అని అడిగాను. రాజబాబు పక్కన అని చెప్పారు. వెంటనే వాళ్ల అమ్మని పిలిచి 'ఈ సినిమా చేస్తే చేశారు కానీ, ఇక ముందు ఎప్పుడూ ఇలా కమెడియన్ పక్కన నటించవద్దు. పెద్ద హీరోయిన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి' అని చెప్పాను. నా సలహా పాటించారు. తర్వాత ఏ చిత్రంలోనూ అలా నటించలేదు. కొంతకాలానికి 'పదహారేళ్ల వయసు'లో, అనంతరం ఎన్టీ రామారావుగారితో, నాతో నటించే అవకాశాలు రావడంతో శ్రీదేవి స్టార్ అయింది.

రామారావుగారి కాంబినేషన్‌లో శ్రీదేవి నటించిన 'వేటగాడు' పెద్ద హిట్. ఒకప్పుడు 'బడిపంతులు'లో రామారావుగారి మనవరాలిగా నటించింది. ఇంత చిన్న పిల్ల ఆయన పక్కన హీరోయినా అనుకొన్నారు. కానీ జనం అదేమీ పట్టించుకోలేదు. సినిమాను పెద్ద హిట్ చేశారు. దాంతో ఆమె నా పక్కన నటిస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలూ రాలేదు. ఎన్టీఆర్‌తో శ్రీదేవి చేసిన 'కొండవీటి సింహం', 'సర్దార్ పాపారాయుడు', 'జస్టిస్ చౌదరి', 'బొబ్బిలిపులి' ఇలా ఆయన పొలిటికల్‌ఎంట్రీకి ముందు వాళ్ల కాంబినేషన్ చిత్రాలన్నీ హిట్లే.

నా మాటే నిజమైంది!

'పదహారేళ్ల వయసు' తమిళంలో, తెలుగులో హిట్. హిందీలో 'సోల్వా సావన్' పేరుతో తీస్తే ఫ్లాప్. ఆమెతో హిందీలో ఎవరూ సినిమాలు తీయడానికి ముందుకు రాని తరుణంలో 'హిమ్మత్‌వాలా' (1983) నిర్మించి సూపర్‌హిట్ చేశాం.

(మిగతా నవ్య లోపలి పేజీలో..)


'కృష్ణార్జునులు'లో...

అందుకే పుట్టించాడేమో!

శ్రీదేవి అంటే సినీ చరిత్రలో ఒక శకం. ఒక నటి యాభయ్యేళ్ళ కాలం నటించడం, చిన్న వయసు నుంచి పెద్ద వయసు దాకా ప్రతి దశలో అగ్రస్థానంలో నిలబడడం అందరికీ సాధ్యం కాదు.

మేము స్కూల్లో ఉన్నప్పుడే...

ప్రాథమికంగా మేము మద్రాసులో స్కూలులో చదువుకుంటున్నప్పటికే శ్రీదేవి బాల నటిగా ఫేమస్. ఆ రోజుల్లోనే "ఒక చైల్డ్ ఆర్టిస్ట్ చాలా ఎక్సలెంట్‌గా చేస్తోంది. ఏది చెప్పినా సరే ఠక్కున అంది పుచ్చుకుంటూ, పెద్ద పెద్దవాళ్ళ కన్నా కూడా బాగా యాక్ట్ చేస్తోంది" అంటూ ఆ రోజుల్లో మద్రాసులో- ఇండస్ట్రీలో చెప్పుకొనేవారు. అలా ఒక బాల నటి దశలోనే ఆమె దక్షిణాది భాషా సినీ పరిశ్రమల్లో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇవాళ్టికీ మీరు ఆ పాత తమిళ సినిమాలు చూస్తే అద్భుతమైన హావభావాలతో, ఎనర్జెటిక్‌గా కనిపిస్తుంది. అలా చిన్న వయసులోనే అన్ని భాషల్లో పాపులారిటీ రావడం, స్టార్ కావడం అరుదైన ఎఛీవ్‌మెంట్. అవన్నీ చూస్తే, ఈ అమ్మాయి ప్రయాణం ఒక అద్భుతంగా సాగుతుందనేది ఆ దశలోనే రాసి పెట్టి ఉన్నట్లు అర్థమైపోతుంది. అందుకు తగ్గట్లే ఆమె పెద్ద హీరోయిన్ అయింది. ఇన్నేళ్ళు అందరి ఆరాధ్యదేవతగా కొనసాగింది. సినిమా కోసమే పుట్టి, సినిమా కోసమే బతికిన అరుదైన లెజెండ్స్‌లో శ్రీదేవి ఒకరు.


'క్షణక్షణం'లో...

డైరెక్టర్లకు హాట్ ఫేవరెట్!

శ్రీదేవి ఎప్పుడూ నిర్మాతలు, దర్శకుల నటి. ఒక నటుడిగా చూసినప్పుడు నాకు శ్రీదేవిలో కనిపించే గొప్పతనం ఏమిటంటే, ఆమె అటు డీగ్లామరైజ్డ్ పాత్రల్లో ఎంత అద్భుతంగా చేస్తుందో, ఇటు గ్లామరస్ పాత్రల్లోనూ అంతే అద్భుతంగా అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. అది కూడా అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. డ్రమెటిక్ ఎక్స్‌ప్రెషన్స్ కాకుండా సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో నటించే నటి శ్రీదేవి. అందుకే, ఆమె పాత్రపోషణ చేస్తే అందం, అభినయం... రాబట్టుకోగలమని టాప్ డైరెక్టర్లు భావించేవారు. వారందరికీ ఆమె ఫేవరెట్.

నాన్న గారు ఎప్పుడూ మెచ్చుకొనేవారు!

మా సురేష్ ప్రొడక్షన్స్ తీసిన తెలుగు, హిందీ చిత్రాలకు ఆమె హాట్ ఫేవరెట్. 'ముందడుగు', .'దేవత', 'తోఫా', 'మక్సద్' చిత్రాల షూటింగ్ నాకు ఇప్పటికీ గుర్తే. మా నాన్న గారు ఆ షూటింగ్‌ల నుంచి వచ్చినప్పుడు, "శ్రీదేవి ఎంత బాగా చేస్తోందిరా" అంటూ మెచ్చుకోలుగా మాట్లాడడం నాకు తెలుసు. ముఖ్యంగా, 'దేవత' సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు అప్పుడప్పుడు నేను కూడా వెళుతుండేవాణ్ణి. ఆమె ఎంత పర్‌ఫెక్ట్ ప్రొఫెషనల్ అనేది కళ్ళారా చూశా. అలాంటి మన తెలుగమ్మాయి అటు హిందీ ఫీల్డ్‌లోనూ 'హిమ్మత్‌వాలా', 'తోఫా'తో పెద్ద స్టార్ కావడం మాకెంతో హ్యాపీ.

ప్రొడక్షన్ రోజుల నుంచే...

నేను సినిమా నటుడిగా రంగప్రవేశం చేసిన తరువాత, మేమిద్దరం కలసి నటించాం. అది... 'క్షణక్షణం' (1991). మా కాంబినేషన్ కొత్త. ఆమెను చాలాకాలంగా చూసి, ఆమె గురించి ఎంతో విన్న నాకు అది చాలా ఎగ్జైటింగ్ కాంబినేషన్ కూడా. దర్శకుడు రాంగోపాల్ వర్మ మమ్మల్ని తీసుకొని భిన్నమైన సినిమాగా అది చేశారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు చేస్తున్న మేమిద్దరం మేకప్ కూడా లేకుండా సహజంగా ఉంటూ, సహజ నటనతో ఆ సినిమా చేశాం.

'ముందడుగు', 'తోఫా' లాంటి కొన్ని సినిమాలకు షూటింగులకు నేను అప్పడప్పుడు వెళ్ళడమే కాకుండా, వేసవి సెలవులు, పెద్ద కాంబినేషన్ లాంటి సందర్భాల్లో అడపాదడపా రెండు, మూడు రోజులు సరదాగా ప్రొడక్షన్ వ్యవహారాలు కూడా చూసేవాణ్ణి. దాంతో, నాతో కలసి నటించక ముందే రామానాయుడి గారి అబ్బాయిగా అప్పటికి చాలా కాలంగా నేను, శ్రీదేవికి తెలుసు. కాబట్టి, 'క్షణక్షణం' చేస్తున్నప్పటికి ఆమె చాలా పెద్ద స్టార్ అయినా, మా మధ్య ఎలాంటి ఇబ్బందీ రాలేదు. పైగా, తొందరగా ఒక రిథమ్ కలిసింది.

'క్షణక్షణం-2' చేయాలనుకున్నాం

ఆ సినిమాలో మా ఇద్దరి మధ్య వచ్చే సీన్లు సూపర్. ఇక, ఆ సినిమాలో మా ఇద్దరి మధ్య వచ్చే 'జాములాతిరి జాబిలమ్మ...' పాట స్పెషల్. నిజానికి, అప్పటికి శ్రీదేవి బాగా డ్యాన్సులు చేస్తుందని పేరు. నేను కూడా హీరోగా బాగా స్టెప్పులు వేస్తూ, చేస్తున్నా. అలాంటి సమయంలో ఇలాంటి ఒక భిన్నమైన పాట పెట్టడం గ్రేట్. ఆ పాటకు మేమిద్దరం ముందుగా కూర్చొని, చర్చించుకున్నాం. ఆ పాట నేను పాడడం, ఆ అమ్మాయి హావభావ ప్రకటన చేయడం... అలా ముందుగా ప్రిపేర్ అయ్యాం. రాము మా ఇద్దరి హావభావాలనూ బాగా రాబట్టుకొని, కెమేరాలో బంధించాడు. మరీ ముఖ్యంగా శ్రీదేవి ఎక్స్‌ప్రెషన్లు ఔట్‌స్టాండింగ్. నిజానికి, మా ఇద్దరి కాంబినేషన్‌లో 'క్షణక్షణం-2' చేద్దామని అప్పుడప్పుడు అనుకొనేవాళ్ళం. రాముతో చర్చించాం. కానీ, కుదరలేదు.

ఇది మరొకరికి అసాధ్యమైన జర్నీ!


వ్యక్తిగా చెప్పాలంటే, మొదటి నుంచి శ్రీదేవి కొద్దిగా సిగ్గరి. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేది కాదు. తన పని తప్ప మరో ధ్యాస ఉండేది కాదు. అందుకే ఆమె ఏ పాత్ర చేసినా అలా అద్భుతంగా రాణించింది. నటిగా శ్రీదేవికి క్లాసిక్ ఫిల్ములు చాలా ఉన్నాయి. శ్రీదేవి సినిమాల్లో బాగా ఇష్టమైనవి చెప్పాలంటే, 'పదహారేళ్ళ వయసు' సూపర్. ఇక, 'సద్మా'లో నటన ఔట్ స్టాండింగ్. 'జగదేక వీరుడు... అతిలోక సుందరి' గురించి చెప్పనే అక్కరలేదు. క్లాసిక్. రెగ్యులర్ కమర్షియల్ ఫిల్ములలో కూడా ఆమె అద్భుతమైన నటన చూపించిన 'దేవత', హిందీలో 'లమ్హే' చాలా బాగుంటాయి. అదీ ఇదీ అని కాదు... దర్శక, నిర్మాతలు ఏది ఇచ్చినా, చేయగలనని నిరూపించుకున్న నటి. అందుకే, ఒరిజినల్ ఫస్ట్ ఫిమేల్ సూపర్‌స్టార్ అంటే ఈ అమ్మాయే. శ్రీదేవి లాంటి గొప్ప సినీ ప్రయాణం మళ్ళీ మరొకరికి రాదు, రాబోదు. అందుకే, శ్రీదేవిని ఇలా సినీ రంగం కోసమే దేవుడు పుట్టించాడనిపిస్తుంది.


వెంకటేశ్



ఆ పదాలు డిక్షనరీలో తీసేయచ్చు!

- దర్శకుడు కె.రాఘవేంద్రరావు



గత ఆదివారం ఉదయం వేరే పని మీద ముంబయ్ వెళ్ళాల్సి ఉంది. అప్పటికే కొద్ది రోజులుగా ఎందుకనో మా ఆవిడ 'శ్రీదేవిని చూడాలని ఉంది' అంటోంది. వెళ్ళి, శ్రీదేవి వాళ్ళను కూడా చూసి వద్దామని అనుకున్నాం. ఆ రోజు ఇంకా నిద్ర లేచీ లేవక ముందే ఇంట్లో టీవీలో నుంచి 'సిరిమల్లె పూవా...' అంటూ 'పదహారేళ్ళ వయసు' సినిమాలో పాట వినిపిస్తోంది. 'ఏమిటా' అనుకొంటూ లేచా. ఊహించని దుర్వార్త తెలిసింది. ఆ ఉదయమే ముంబయ్ వెళ్ళాం. రెండు రోజులు అక్కడే ఉన్నా. ఇంతలో వివాదాలతో నా మనసు మరింత బాధ పడింది. అప్పటికి ఆమె పార్థివ శరీరం ఇండియాకు ఇంకా రాలేదు. ఇంకా ఆలస్యమవుతుందని టీవీల్లో చెప్పారు. మరోపక్క, అతిలోక సుందరిని అలా నిర్జీవంగా చూసే ధైర్యం కూడా నాకు సన్నగిల్లింది. చూడలేననీ, చూసి తట్టుకోలేననీ అనిపించింది. అంతే. నా కన్నుల్లో మిగిలిన శ్రీదేవి రూపాన్నే గుర్తుపెట్టుకోవాలనుకొని, హైదరాబాద్‌కి తిరిగొచ్చేశా. టీవీలో శ్రీదేవి భౌతికకాయం దృశ్యం వచ్చిందంటే, చూడలేక, కళ్ళు మూసుకొని తల దించేసుకుంటూ ఆమె వార్తలు తెలుసుకున్నా. కొద్ది రోజుల్లోనే మళ్ళీ ముంబయ్ వెళ్ళి, బోనీకపూర్ కుటుంబాన్ని పరామర్శించి వస్తా.

బాల నటి నుంచి మహా నటి దాకా...

శ్రీదేవితో నా జర్నీ సుదీర్ఘమైనది. ఆ అమ్మాయి బాలనటిగా మొదలై మహానటిగా ఎదిగినంత వరకు ఆ ప్రయాణంలో నేనూ ఉన్నా. దగ్గరుండి చూశా. ఇవాళ్టికీ ఆ అమ్మాయి నటించిన ఎన్నో సినిమాల్లోని దృశ్యాలు చూస్తూ ఉంటే, ఆశ్చర్యం అనిపిస్తుంది. మా ఇల్లున్న సందు, నిర్మాత రామానాయుడి గారింటి సందు, శ్రీదేవి వాళ్ళ ఇంటి సందు పక్క పక్కనే! శ్రీదేవి చిన్నప్పటి నుంచే మంచి నటి. మనం ఏం చెప్పినా, చిలక లాగా పలికించేసేది. మా నాన్న గారు కె.ఎస్. ప్రకాశరావు దర్శకత్వంలో వచ్చిన 'నా తమ్ముడు' (1971) చిత్రంలో శ్రీదేవి బాల నటి. ఆ సినిమాకు నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. అందులో చిన్న పిల్లగా, అలాగే దాదా నెహ్రూ వేషంలో శ్రీదేవి కనిపిస్తుంది. ఆ సినిమా చిత్రీకరణలో ఆమెను షాట్ షాట్‌కీ ఎత్తుకొని, తీసుకొని రావడం నాకు ఇప్పటికీ గుర్తే.

శ్రీదేవికి 16, ఎన్టీయార్‌కి 15...

శ్రీదేవి కాస్తంత పెద్దయి హీరోయిన్‌గా చేయడం మొదలుపెట్టాక, నిండా పదహారేళ్ళు కూడా రాక ముందే మా 'పదహారేళ్ళ వయసు' (తమిళంలో భారతీరాజా తీసిన 'పదునారు వయదునిలే' చిత్రానికి రీమేక్) సినిమాలో హీరోయిన్‌గా చేసింది. అంతకు ముందు 'అనురాగాలు', 'పాడవోయి భారతీయుడా', 'మా బంగారక్క' లాంటి సినిమాల్లో చేసినా, ఆమె హీరోయిన్‌గా ఫోకస్‌లోకి వచ్చింది 'పదహారేళ్ళ వయసు'తోనే! తెలుగులో ఆమె స్టార్ హీరోయిన్ అయింది కూడా ఎన్టీయార్ గారితో నా కాంబినేషన్‌లో వచ్చిన 'వేటగాడు' సినిమాతో. 'పదహారేళ్ళ వయసు' లాంటి మంచి పెర్ఫార్మెన్స్ పాత్రలు ఎన్ని చేసినా, ఒక నటికి స్టార్‌డమ్ రావాలంటే పేరున్న పెద్ద హీరోలతో సినిమాలు చేయాలి. అప్పుడే రెమ్యూనరేషన్ పెరుగుతుంది. కెరీర్‌లో దీర్ఘకాలం కొనసాగేలా రన్ వస్తుంది. 'వేటగాడు'తో అదే జరిగింది.

ఆ సినిమాకు శ్రీదేవిని హీరోయిన్ అయితే బాగుంటుందని నిర్మాతలకు మొదట చెప్పా. కానీ, ఎన్టీయార్ తిడతారంటూ వాళ్ళు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయన వేరే సినిమా షూటింగ్‌లో ఉన్నారు. ఆయనకు చెబుదామని ఆ సెట్స్‌కు వెళ్ళా 'మీ పక్కన హీరోయిన్‌గా ఎవరిని పెడదామంటార'ని ఆయననే అడిగా. 'మీరు ఏమనుకుంటున్నార'ని ఆయన నన్ను అడిగారు. "శ్రీదేవిని అనుకుంటున్నా. కానీ, ఆ అమ్మాయికి పదహారేళ్ళే అని నిర్మాతలు సందేహిస్తున్నారు" అని చెప్పాను. వెంటనే ఎన్టీయార్, "ఏమది... మీకు నమ్మకం ఉంటే పెట్టేయండి. ఆ అమ్మాయికి పదహారైతే, మాకు పదిహేనే కదా!" అని నవ్వారు. అలా ఎన్టీయార్ అంగీకారంతో ఆమెకు ఆ సినిమా ఛాన్స్ వచ్చింది. ఆ సినిమా, అందులో పాటలతో ఒక్కసారిగా స్టార్ అయిపోయింది.

'వేటగాడు' క్రేజ్‌తో జితేంద్ర ఫిదా!

గమ్మత్తేమిటంటే, హిందీలో శ్రీదేవి పెద్ద స్టార్‌గా అవతరించడానికి కారణమైన 'హిమ్మత్‌వాలా' కూడా నా దర్శకత్వంలోనే రూపొందడం. అంతకు ముందు ఆమె హిందీలో ఒకటి, రెండు సినిమాలు చేసింది. తెలుగు నిర్మాత ఎ.ఎస్.ఆర్. ఆంజనేయులు గారు హిందీలో నిర్మించిన 'పదహారేళ్ళ వయసు' రీమేక్ 'సోల్వా సావన్' కూడా చేసింది. అదీ ఫ్లాపే. ఆ తరువాత కొంతకాలానికి తెలుగు హిట్ 'ఊరుకి మొనగాడు'ను పద్మాలయా వాళ్ళకు హిందీలో 'హిమ్మత్‌వాలా'గా తీయాల్సి వచ్చింది. అంతకు ముందే జితేంద్రతో ఒకటి రెండు హిందీ సినిమాలు తీశా. ఈ



'వేటగాడు'లో ఎన్టీఆర్‌తో..

సినిమా చేసే ముందు శ్రీదేవిని హీరోయిన్‌గా పెడదామని జీతూ (జితేంద్ర)తో చెప్పా.

అప్పుడు హైదరాబాద్ సంధ్యలో 'వేటగాడు' ఆడుతోంది. జితేంద్రను తీసుకెళ్ళి చూపించా. శ్రీదేవి, ఎన్టీయార్ పాటలకు జనం చిల్లర నాణేలు విసిరేస్తూ, కేరింతలు కొట్టడం కనిపించింది. జీతూకు అనుమానమొచ్చి, "జనం నిజంగా వేస్తున్నారా, నువ్వు కావాలని అలా ఎరేంజ్ చేశావా?" అని అడిగాడు. "జనంలో ఉన్న అసలుసిసలు క్రేజ్" అని చెప్పగానే, జితేంద్ర ఆశ్చర్యపోయి, శ్రీదేవితో నటించడానికి ఒప్పుకున్నాడు. అదే 'హిమ్మత్‌వాలా'తో శ్రీదేవికి ఉత్తరాదిన తిరుగులేని ఇమేజ్ వచ్చింది. "ఆ సినిమాయే తీయకపోతే, బోనీ నా వెంట పడేవాడు కాదు. నన్ను పెళ్ళి చేసుకొనేవాడు కాదు" అని ఆ అమ్మాయే బాహాటంగా చెప్పింది. ఆ సినిమా తరువాత శ్రీదేవితో హిందీలో 'తోఫా' (తెలుగు హిట్ 'దేవత'కు రీమేక్), 'మాస్టర్జీ', 'సుహాగన్', 'జానీ దోస్త్' (తెలుగు మల్టీస్టారర్ 'అడవి సింహాలు'కు రీమేక్), 'ధర్మాధికారి' (తెలుగు హిట్ 'బొబ్బిలి బ్రహ్మన్న'కి రీమేక్) లాంటి అయిదారు సినిమాలు చేశా.

ఆల్ టైమ్ ఫేవరెట్ హీరోయిన్

ఎంత ఎత్తుకు ఎదిగినా సరే నాతో సహా సీనియర్ దర్శకులంటే ఆమెకు అమిత గౌరవం, మర్యాద. అందుకే, "నా సక్సెస్‌లో సగభాగం మీకే చెందుతుంది" అని కూడా నా గురించి బాహాటంగా చెప్పింది. కానీ, నిజం చెప్పాలంటే, శ్రీదేవి సొంత ప్రతిభతో, స్వయంకృషితో పైకి వచ్చిందే తప్ప, నేనేదో పైకి తెచ్చాననుకుంటే పొరపాటు. వామనావతార ఘట్టంలో వామనుడు విశ్వమంత ఎదిగినట్టుగా, ఆ అమ్మాయి కూడా సినీ రంగంలో ఎదిగింది. అందుకే, శ్రీదేవిపై 'ఇంతై ఇంతింతై...' అంటూ ప్రత్యేక దండకం ఒకటి మా టీవీ షో 'సౌందర్య లహరి'లో పెట్టా. ఆ అమ్మాయికి అందుకు తగ్గ అలాంటి పాత్రలు, అవకాశాలు కూడా వచ్చాయి. 'నగీనా', 'మిస్టర్ ఇండియా', 'ఖుదాగవా', తాజా 'ఇంగ్లిష్ వింగ్లిష్' ... ఇలా ఏ సినిమా చేసినా ఆమె ముద్ర. శ్రీదేవికి ముందు కానీ, సమకాలీనంగా కానీ, ఇప్పుడు కానీ సావిత్రి, వాణిశ్రీ, జయప్రద, జయసుధ, దీపికా పదుకోనే... ఇలా ఎంతోమంది మంచి నటీమణులు, స్టార్ హీరోయిన్లూ ఉన్నారు. వాళ్ళందరూ బ్రహ్మాండమైన నటీమణులు. అయితే, వాళ్ళకు అందం, అభినయం రెండూ కలసిన ఇలాంటి పాత్రలు, అందులోనూ ఇన్ని పాత్రలు రాలేదు. అందుకే, సినిమా వాళ్ళలో ఏ తరం వాళ్ళనైనా సరే కదిలిస్తే, 'ఫేవరెట్ హీరోయిన్ శ్రీదేవి' అని ముక్తకంఠంతో నిర్మొహమాటంగా చెప్పేస్తారు. కానీ, 'కొత్త తారల్లో ఎవరు ఫేవరెట్ ?' అంటేనే, తెలివిగా తప్పించుకోవాలని చూస్తారు. ఇది అతిశయోక్తి కాదు. వాస్తవం.

> 'జగదేక వీరుడు... అతిలోక సుందరి' మళ్ళీ తీయాలనీ, సీక్వెల్ చేయాలనీ గతంలో చాలాసార్లు ఆలోచన చేశాం. 'జగదేకవీరుడు'గా చిరంజీవి కొడుకు రామ్‌చరణ్‌ను పెట్టచ్చు. కానీ, శ్రీదేవి స్థానంలో 'అతిలోక సుందరి'గా ఎవరు? అనే ప్రశ్న దగ్గర ఆగిపోయాం. ఆ పాత్ర శ్రీదేవి చేసి ఉండకపోతే, ఇప్పుడు మరెవరితోనైనా రీమేక్ చేసి ఉండవచ్చు కానీ, శ్రీదేవి చేశాక, ఆమెకు దీటైన మరో ప్రత్యామ్నాయం లేదు, కనపడట్లేదు.

నన్ను అడిగాకే... ఓకే!

శ్రీదేవి తల్లి రాజేశ్వరి సినిమాల్లో చిన్న చిన్న వేషాలు వేసేవారు. ఆమె ఉగ్గుపాలతోనే శ్రీదేవికి క్రమశిక్షణ, మర్యాద నేర్పించారు. ఆమెకు కూడా నేనంటే గురి. 'వేటగాడు' ఘన విజయం తరువాత వరుసగా శ్రీదేవి హీరోయిన్‌గా బోలెడు సినిమాలు చేశా. వరుస హిట్లతో స్టార్ హోదా రావడానికి కారణమయ్యాననో ఏమో ఆ రోజుల్లో నన్ను అడగనిదే వాళ్ళు ఏ సినిమా ఒప్పుకొనేవారు కాదు. నా సినిమాల డేట్లకు మరొకరితో క్లాష్ అవుతుందనో, ఏమో మరి ఎప్పుడూ అలా చేసేవారు.


శ్రీదేవికి కాస్తంత మేకప్ కాన్షస్‌నెస్ ఎక్కువ. అయితే అంతకు మించి టైమ్ సెన్స్, టైమింగ్ సెన్స్ ఎక్కువ. మనిషి చాలా పద్ధతి గలది. ఆ రోజుల్లోనే హీరోయిన్ శ్రీదేవి ముక్కుకు కాస్మెటిక్ సర్జరీ చేయించుకోవడం పెద్ద వార్త. సర్జరీ చేయించుకున్నట్టు తెలుసు కానీ, ఎందుకనో ముందుగా నన్నేమీ సలహా అడగలేదు. అంతకు ముందు కూడా శ్రీదేవిని తెరపై చూపిస్తున్నప్పుడు నేనెప్పుడూ రాంగ్ యాంగిల్స్‌లో చూపించకుండా జాగ్రత్త పడేవాణ్ణి. ఇంతలో, సర్జరీ అయింది. సర్జరీ టైమ్‌లోనే మా 'కొండవీటి సింహం' వంద రోజుల ఫంక్షన్. దానికి కూడా ఆమె రాలేకపోయింది.

వ్యక్తిగతంగా ఆమె చాలా మంచి అమ్మాయి. చివరకు తన దగ్గర పనిచేసే పని అబ్బాయిని కూడా 'ఏమండీ' అనో, 'భయ్యా' అనో పిలుస్తుంది. అలాగే, తల్లితండ్రులంటే శ్రీదేవికి ఎంత ప్రేమో. ముందుగా వాళ్ళ నాన్న గారు (అయ్యప్పన్) చనిపోయారు. ఆ సంగతి నాకు ఇప్పటికీ గుర్తుంది. విదేశాల్లో షూటింగ్ నుంచి శ్రీదేవి మద్రాసు వచ్చారు. ఆమెను ఇంటికి తీసుకురావడానికి ఎయిర్‌పోర్ట్‌కి నేనే వెళ్ళా. నన్ను చూసి, జరగరానిది జరిగిందేమోనని అనుమానిస్తూ, కంగారు పడింది. వెంటనే చెబితే కష్టమని ఆమెకు చెప్పకుండా జాగ్రత్తగా ఇంటికి చేర్చా. చేరగానే విషయం తెలిసి, భోరున ఏడుస్తూ, శ్రీదేవి కుప్పకూలిపోయింది.

అప్పటికి బోనీ కపూర్, శ్రీదేవి అంత దగ్గర కాలేదు. ఆయన కేవలం అతిథిగా వచ్చి వెళ్ళారు. అయితే, ఆ తరువాత కొన్నేళ్ళకు వాళ్ళమ్మ చనిపోయారు. అంతే. శ్రీదేవి జీవితం దారం తెగిన గాలిపటమైంది. ఆ అమ్మాయికి సరైన మార్గదర్శనం చేయడానికి ఎవరూ ఉండేవారు కాదు. ఆ సమయంలో బోనీ ఆమెకు పూర్తిగా అండగా ఉండడమే కాక, ఆమెను అప్పటి నుంచి జాగ్రత్తగా చూసుకొంటూ వచ్చారు. ఇప్పటికీ, బోనీ ఎప్పుడు ఫోన్ చేసినా, "డైరెక్టర్ గారూ... యువర్ 'శ్రీ'..." అంటాడు.

ఇక... తీరని కోరికలు

శ్రీదేవిని ఆఖరుసారి చూసింది... 'మామ్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో. 'మీరు తప్పకుండా రావాల'ంటూ నన్ను, డి. సురేశ్‌బాబునీ ప్రత్యేకంగా పిలిచింది. శ్రీదేవితో, "మన కాంబినేషన్‌లో 24 సినిమాలు వచ్చాయి. ఇంకొక్క సినిమా చేస్తే, మన కాంబినేషన్‌కు సిల్వర్ జూబ్లీ చేసుకోవచ్చు" అని వేదికపై అన్నా. అంతే. శ్రీదేవి కచ్చితంగా చేద్దామనడమే కాక, నా కాళ్ళకు పాదాభివందనం చేసింది. అటు ఆమె వయసుకు తగినట్టుగా ఉంటూనే, ఇటు నా తరహా కమర్షియల్ అంశాలు కూడా ఉండేలా ఓ కథ చేయాలని రచయిత సత్యానంద్, నేను అనుకున్నాం. ఇంతలోనే ఈ దుర్వార్త వచ్చింది. "పెద్ద కూతురు జాన్విని సైతం తెలుగులో మీరే పరిచయం చేయాలి" అని శ్రీదేవి అంది. ఆ ముచ్చటా చూడకుండానే వెళ్ళిపోయింది.



'హిమ్మత్‌వాలా'లో జితేంద్రతో..

కొత్తతరం నటీనటులకు నటనకు సంబంధించి మెలకువలు బోధించే నా టీవీ షోలో కానీ, ఔత్సాహికులకు పాఠాలు చెప్పే 'కె.ఆర్. క్లాస్‌రూమ్' ఎపిసోడ్లలో కానీ నేను ఉదాహరణలుగా ఎక్కువగా చూపించేది శ్రీదేవి దృశ్యాలు, సన్నివేశాలే. ఫలానా షాట్ శ్రీదేవి ఎలా చేసిందో, ఎన్ని హావభావాలు పలికించిందో చూడమంటూ హీరోయిన్ రాశీఖన్నాకు కూడా ఆ మధ్య షోలో చూపించా. అలాంటి నటి శ్రీదేవి లేదంటే, ఇక రాదంటే ఇప్పటికీ నమ్మబుద్ధి కావడం లేదు.

మరణం ఎవరికైనా తప్పదు. కానీ, ఏదో ఒక అద్భుతం జరిగినట్టు దివి నుంచి భువికి వచ్చి ఆనందసాగరంలో తేలియాడేలా చేసి, అంతలోనే భువి నుంచి దివికి పయనమై దుఃఖసాగరంలో ముంచివేసిన వ్యక్తి శ్రీదేవి. ఆ అమ్మాయి తమ లోకానికి వస్తోందంటే, ఆకాశంలోని నక్షత్రాలన్నీ చిన్నబుచ్చుకొని ఉంటాయి. రంభ, ఊర్వశి, మేనక లాంటి దేవకన్యలందరూ ఇక తాము రిటైర్ అవ్వచ్చు అనుకుంటాయి. ఒక్కముక్కలో... అందం, అభినయం కలిపితే శ్రీదేవి. ఆమె చనిపోవడంతో నా దృష్టిలో ఇక నిఘంటువులో ఆ రెండు పదాలూ అవసరం లేదు. వాటి స్థానంలో 'శ్రీదేవి' అని పెడితే చాలేమో.

3 సినిమాలు... 10 పాటలు

(నవ్య మొదటి పేజీ తరువాయి)

- కృష్ణ

'ఒక సినిమా పోయినంతమాత్రాన శ్రీదేవి హిందీ ఫీల్డ్‌కు పనికిరాదని చెప్పడం కరెక్ట్ కాదు. మనం అవకాశం ఇస్తే 'హిమ్మత్‌వాలా'తో తప్పకుండా స్టార్ అవుతుంది' అని నమ్మి ముందుకు వెళ్ళాం. 'ఊరికి మొనగాడు'కు అది రీమేక్. ఒరిజినల్‌లో జయప్రద హీరోయిన్. హిందీలోకి వచ్చేసరికి దర్శకునిగా రాఘవేంద్రరావునే పెట్టుకొన్నాం. కానీ జయప్రద బదులు శ్రీదేవిని తీసుకొన్నాం. 'జితేంద్ర, శ్రీదేవి జంటగా 'హిమ్మత్‌వాలా' అని అనౌన్స్ చేశాం. బాలీవుడ్‌లో మాకు పర్మనెంట్ డిస్ట్రిబ్యూటర్స్ ఉండేవారు. వాళ్ళు ఈ న్యూస్ చూసి గోల చేశారు. అంతకు ముందు మేం తీసిన హిందీ చిత్రాలకు బాపయ్య దర్శకుడు, జయప్రద హీరోయిన్. 'ఒరిజినల్ వెర్షన్‌లో జయప్రద నటించింది.. బాపయ్యకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వాళ్ళిద్దరినీ కాదని ఇలా కొత్త వాళ్ళతో చేయడం ఎందుకు రిస్క్' అని డిస్ట్రిబ్యూటర్స్ వారించాలని చూశారు. 'లేదు. మేం అనుకొన్నాం. వీళ్ళతోనే సినిమా తీస్తాం' అని గట్టిగా చెప్పేశాం. దాంతో టోటల్ బిజినెస్‌లో పది లక్షలు తగ్గించి డబ్బులు కట్టారు.



'మా నాన్న నిర్దోషి'లో గుమ్మడితో..

'హిమ్మత్‌వాలా' విడుదలై అన్ని రికార్డ్స్ బ్రేక్ చేసింది. 50 వారాలు ఆడి చరిత్ర సృష్టించింది. శ్రీదేవి ఓవర్‌నైట్ సూపర్‌స్టార్ అయింది. రాఘవేంద్రరావుకు హిందీలో పెద్ద మార్కెట్ ఏర్పడింది. అలా చివరకు నా మాటే నిజమైంది.

మా కాంబినేషన్‌లో 31 సినిమాలు

హిందీలో ఎంత బిజీగా ఉన్నా నా సినిమా అనగానే వెంటనే డేట్స్ ఇచ్చేది శ్రీదేవి. ఎందుకంటే నా సినిమాలు చాలా స్పీడ్‌గా, తొందరగా పూర్తవుతాయి కనుక సినిమాకు 20 రోజులు కేటాయిస్తే చాలు అనుకొనేవారు. అలా 31 చిత్రాల్లో నా పక్కన నటించింది. వాటిలో చాలా భాగం హిట్లే.

మల్టీస్టారర్స్‌లో ఆమే నాయిక

'హిమ్మత్‌వాలా' తర్వాత 'మవాలి' తీశాం. 'చుట్టాలున్నారు జాగ్రత్త' రీమేక్. తెలుగులో శ్రీదేవి, కవిత హీరోయిన్లుగా నటించారు. హిందీలోకి వెళ్ళేసరికి శ్రీదేవి పోషించిన పాత్రను జయప్రదతో, కవిత పాత్రను శ్రీదేవితో చేయించాం. హిందీలో ఆ పాత్ర పరిధి పెంచాం. మాస్ కేరెక్టర్ కావడంతో శ్రీదేవికి మరింత పేరు వచ్చింది. నేను యాక్ట్ చేసిన సినిమాల్లో 'ముందడుగు'లో శ్రీదేవి శోభన్‌బాబు పక్కన, జయప్రద నా పక్కన నటించారు. 'కృష్ణార్జునులు'లో నా పక్కన శ్రీదేవి, శోభన్‌బాబు సరసన జయప్రద నటించారు. 'ఊరంతా సంక్రాంతి'లో నాగేశ్వరరావుగారి పక్కన జయసుధ, నా సరసన శ్రీదేవి నటించారు.



'ఖైదీ రుద్రయ్య'లో కృష్ణతో...

అలాగే 'వయ్యారిభామలు- వగలమారిభర్తలు' చిత్రంలో శ్రీదేవి రామారావుగారి పక్కన, రాధిక నా సరసన నటించారు. ఇలా మల్టీస్టారర్స్ అన్నింటిలో శ్రీదేవి ఉండేది.

ఏయన్నార్ వెయిట్ చేశారు

ఓ సారి ఊటీలో నేను నటించిన 'బంగారు బావ', 'భోగభాగ్యాలు', 'గడసరి అత్త- సొగసరి కోడలు' చిత్రాల షూటింగ్స్ వరసగా జరిగాయి. వాటిల్లో శ్రీదేవే హీరోయిన్. ఆ సమయంలోనే నాగేశ్వరరావుగారు, శ్రీదేవి కాంబినేషన్‌లో రూపుదిద్దుకొంటున్న 'ప్రేమకానుక' చిత్రం పాటల చిత్రీకరణ కూడా ఊటీలోనే జరుగుతోంది. ఒక రోజు వర్క్ మినహా వాళ్ళ షూటింగ్ అయిపోయింది. వేరే షూటింగ్‌కు వెళ్ళాల్సి రావడంతో శ్రీదేవి ఆ వర్క్ పూర్తి చేయకుండానే కేరళ వెళ్ళిపోయింది. మళ్ళీ మా షూటింగ్ కోసం నాలుగు రోజుల తర్వాత శ్రీదేవి తిరిగి ఊటీ వస్తుందని తెలుసుకొని, 'ప్రేమకానుక' యూనిట్ వెయిట్ చేసింది. శ్రీదేవి రాగానే నాగేశ్వరరావు గారు కబురు చేస్తే నేను వెళ్ళాను. 'ఒక్క రోజు వర్క్ మాకు మిగిలిపోయిందయ్యా. మీరు ఓ రోజు రెస్ట్ తీసుకొని శ్రీదేవిని మాకు ఇస్తే వర్క్ పూర్తి చేసుకొంటాం' అని అడిగారు. నేను సరేనన్నాను. 'ప్రేమకానుక' షూటింగ్ పూర్తయిపోయింది. ఇక మా షూటింగ్ మొదలు కావాలి. మేం తీసే పది పాటలకూ శ్రీను మాస్టర్ నృత్య దర్శకుడు. ఆ రోజు సాయంత్రం ఆయన నాగేశ్వరరావుగారి షూటింగ్‌కు వెళితే 'ఏ సినిమా చేస్తున్నావయ్యా' అని ఆయన అడిగారట.

'రేపటి నుంచి కృష్ణగారి షూటింగ్ అండీ' అని చెప్పాడట. 'అలాగా.. ఎన్ని పాటలు తీస్తున్నావేమిటి' అని అడిగారట. 'పది పాటలు తీయాలండీ' అనగానే 'పది పాటలా.. హీరో కృష్ణ సరే.. హీరోయిన్లు ఎవరూ' అని అడిగారట. 'హీరోయిన్ ఒక్కరేనండీ.. శ్రీదేవితోనే ఆ పది పాటలు తీయాలి' అన్నాడట. దాంతో అక్కినేని ఆశ్చర్యపోయి 'పది పాటలు ఒకేసారి ఒకే హీరోహీరోయిన్‌తో ఊటీలో తీస్తారా.. గొప్ప వాళ్ళేనయ్యా మీరు' అన్నారట. శ్రీదేవి డాన్స్ పర్‌ఫెక్ట్‌గా చేసేది. వర్క్ ఫాస్ట్‌గా అయ్యేది. రోజున్నరలో పాట పూర్తయ్యేది.

> **ముక్కుకు సర్జరీ**
>
> ముక్కుకు సర్జరీ చేయించుకొన్న తర్వాత శ్రీదేవి అందం మరింత మెరుగైంది. 'కృష్ణార్జునులు' షూటింగ్ సమయంలోనే కొంత గ్యాప్ తీసుకొని సర్జరీ చేయించుకొంది. ఆర్ముగం అనే డాక్టర్ ఆ సర్జరీ చేసినట్టున్నాడు. ఆయన చికాగోలో ఉండేవాడు. తమిళియన్ కావడంతో ఆరు నెలలకు ఒకసారి మద్రాసుకు వచ్చేవాడు. ఒకసారి అలా వచ్చినప్పుడే శ్రీదేవి సర్జరీ చేయించుకొంది.

అందుకే వెళ్ళలేదు

ఆమె మరణవార్తను టీవీలో చూసి చాలా షాక్ అయ్యా. ఇంత చిన్నవయసులోనే ఆమె అందరినీ వదిలి వెళ్ళిపోయిందా అని బాధపడ్డాను. నాకు బ్యాక్ పెయిన్ ఉండటం వల్ల ముంబై వెళ్ళలేకపోయాను. లేకపోతే తప్పకుండా వెళ్ళేవాడిని. నేను బయటికి ఎక్కడికీ వెళ్ళడం లేదు.

- వినాయకరావు

ఒక శకం ముగిసింది

- చిరంజీవి

(నవ్య మొదటి పేజీ తరువాయి)

డ్యాన్స్ అనగానే మా ఇద్దరి కాంబినేషన్ బాగుంటుందని చెప్పగానే నేను తప్పకుండా చేద్దామన్నా. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీఆర్ చేతుల మీదుగా సినిమా కూడా ప్రారంభమైంది. డ్యాన్స్ అనగానే చాలా ఆడుతూ పాడుతూ చేసేవాడిని. కానీ ఆమెతో ఈ సినిమాలో డ్యాన్స్ అనగానే కాస్త జాగ్రత్త పడ్డా. పైగా బాలీవుడ్ డ్యాన్స్ మూమెంట్స్, ఆ వేవ్స్ కాస్త కొత్తగా ఉంటాయి. కానీ శ్రీదేవి మాత్రం అలవోకగా చేసేస్తోంది. నేను మాత్రం టైమ్ తీసుకొంటున్నా. నాకేంటో అర్థం కాలేదు. ఇంతలో డ్యాన్సర్ నాకు అసలు సంగతి చెప్పగానే ఆశ్చర్యపోయాను. నాతో డ్యాన్స్ అనగానే ముందు రోజు రాత్రుళ్ళు ఆమె కూడా ప్రాక్టీస్ చేసేదని నాకు చెప్పారు. 'ఆ విషయం చెప్పుంటే నేనూ చేసేవాణ్ణి కదా!' అని అనుకొని తర్వాతి రోజు నుంచి కూడా నేనూ రిహార్సల్స్ చేయడం మొదలుపెట్టా. అలా ఆమె డ్యాన్స్ ముందు నన్ను నేను బ్యాలెన్స్ చేసుకోగలిగాను. ఒక సాంగ్ అయిపోయింది. కొన్ని సీన్లు కూడా పూర్తయ్యాయి. ఇంతలో సినిమా ఆగిపోయింది. ఆ సినిమా మిగిల్చిన తీపి జ్ఞాపకాల్లో ఒకటి శ్రీజ. ఆ సినిమాలో శ్రీదేవి పాత్ర పేరిది. సినిమా ఆగిపోయినా సరే నా మెదడులో ఆ పేరు అలా నిక్షిప్తమైంది. కొన్నాళ్ళ తర్వాత నా చిన్న కూతురికి 'శ్రీజ' అని పేరు పెట్టా.

చాందిని.... వైట్‌డ్రెస్!

అప్పట్లో మద్రాసులో పార్టీ కల్చర్ స్టార్ట్ చేసింది నేనే. హీరోలు, హీరోయిన్ల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలన్న సదుద్దేశంతో చెన్నైలోని మా 'హనీ గెస్ట్‌హౌస్'లో పార్టీలు ఏర్పాటు చేసేవాణ్ణి. అయితే తనకు పార్టీ ఇచ్చే అలవాటు లేదు. 'చాందినీ' హిట్ అయిన సందర్భంగా తొలిసారిగా పార్టీ ఇద్దామనుకుంది. అప్పుడు మా ఇంటికి వచ్చి సలహాలు, సూచనలు తీసుకొంది. చాందినీలో ఆమె తెల్లటి డ్రెస్, ఆమె లుక్ అప్పట్లో ఫేమస్. పార్టీకి వచ్చే గెస్ట్‌లు కూడా వైట్ డ్రెస్‌లో హాజరైతే బాగుంటుందని సురేఖ సలహా ఇచ్చింది. తనకూ ఆ ఐడియా నచ్చేసింది. చెప్పాలంటే సౌత్‌లో జరిగిన పార్టీల్లో డ్రెస్‌కోడ్ పెట్టడం అదే తొలిసారేమో! రామ్‌చరణ్ పెళ్లికి గానీ, నా 60వ పుట్టినరోజు వేడుకలకు శ్రీదేవి దంపతులు హాజరయ్యారు. అలాగే ఆమె మద్రాసు, ముంబైల్లో ఆమె ఇంట్లో జరిగిన వేడుకలకు కుటుంబసమేతంగా హాజరయ్యేవాడిని. ఏ హీరోయిన్‌తో లేని అనుబంధం, ఆత్మీయత మా ఇద్దరి మధ్య ఉన్నాయి.

మా ఇంట్లో మనిషిలా అనిపించింది!

'జగదేకవీరుడు-అతిలోకసుందరి'లో ప్రతి అనుభవం నాకో మంచి జ్ఞాపకం. ఈ సినిమాలో పాట 'దినక్కుతా...' పాట చిత్రీకరణ సమయానికి నాకు మలేరియా వచ్చింది. ఈ పాట మినహా షూటింగ్ అయిపోయింది. డబ్బింగ్ మొదలయింది. ఆ పాట చివర్లో చిత్రీకరించి, రిలీజ్ చేసేయాలి. అదీ ప్లాన్. నాకేమో నూట నాలుగున్నర డిగ్రీల జ్వరం. ఒళ్ళంతా నొప్పులు. ఒక డ్యాన్స్ మూమెంట్ చేయగానే కళ్ళు తిరిగి పడిపోయే పరిస్థితి. మద్రాసు విజయ-వాహినిలో షూటింగ్. అంతా డాక్టర్ పర్యవేక్షణలో జరుగుతోంది. 'ఆయన ఆరోగ్యం బాగోలేదు" అంటూ ఆమె ఇచ్చిన సపోర్ట్‌ను మర్చిపోలేను. 'ఏం తింటారు... ఏం తాగుతారు' అంటూ గ్యాప్‌లో ఆప్యాయంగా పలకరించేది. 'ఇంట్లో మనిషా' అన్న ఫీలింగ్ కలిగింది. లాస్ట్ షాట్ చేయడం, నేను స్పృహ తప్పిపోవడం, తర్వాత నన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్లడం అన్నీ టకటకా జరిగిపోయాయి.

శ్రీదేవి ఇచ్చిన గిఫ్ట్!

ఆ సినిమా తర్వాత శ్రీదేవి నాకో గిఫ్ట్ ఇచ్చింది. తను విదేశాలకు వెళ్లినప్పుడు కొన్న ఎలక్ట్రానిక్ చెస్ బోర్డు అది. సెట్‌లో ఉన్నప్పుడు దాంతో నేను ఆడుకొంటూంటే, "మీకిచ్చి నేను తప్పు చేశాను. నా గిఫ్ట్ నాకు ఇచ్చేయండి" అంటూ సరదాగా అనేది. ఇవన్నీ స్వీట్ మెమొరీస్. దశాబ్దాలుగా మా ఇద్దరికీ ఎంతో పరిచయం ఉన్నా సరే, ఎప్పుడూ నేను గానీ, తను గానీ 'నువ్వు' అని ఎప్పుడూ పిలుచుకోలేదు. ఎప్పుడూ గౌరవప్రదమైన సంభాషణ పిలుపులే మా మధ్య ఉండేవి. అది ఆమె సంస్కారానికి నిదర్శనం.



చిరంజీవి 60వ పుట్టినరోజు వేడుకలో..

వెరీ కల్చర్డ్ లేడీ.

అప్పటికీ ఇప్పటికీ అమాయకురాలే!

సినిమా, సినిమాకీ తన నటనలో, అందంలో తనను తాను మలుచుకొంటూ వచ్చిందే తప్ప, ఆమె వ్యక్తిత్వం మాత్రం మారలేదు. ప్రొఫెషనలిజమ్ మారలేదు. నటన తప్పించి ఏమీ తెలీదు. ఏదైనా సమాచారం కావాలంటే ఎంతో అమాయకంగా అడుగుతూంటుంది. భలే ముచ్చటేస్తుంది. నా తొలి హిందీ చిత్రం 'ప్రతిబంధ్' ప్రారంభోత్సవానికి పిలిచాను. "హిందీ చిత్రపరిశ్రమ మన తెలుగు పరిశ్రమలా ఉండదు. జాగ్రత్తగా ఉండాలి" అంటూ తాను ఎదుర్కొన్న మంచి, చెడు అనుభవాలను నాతో పంచుకొంది.



'ఎస్.పి.పరశురాం' సెట్స్‌లో చిరంజీవి సతీమణి సురేఖతో..

> **ఉప్పుచేప.. కోడిగుడ్డు.. ఉల్లిపాయ పులుసు**
>
> శ్రీదేవి సొంత సినిమా చేసే ముందు కూడా మా ఇద్దరికీ ఉన్న కామన్ ఫ్రెండ్స్ వల్ల ఆమె కుటుంబంతో స్నేహం కుదిరింది. అలా మా ఇద్దరి స్నేహం సినిమాలను దాటింది. నా భార్య సురేఖ అంటే శ్రీదేవికి చాలా ఇష్టం. మా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు ఎప్పుడూ ఉండేవి. శ్రీదేవికి మా ఇంట్లో చేసే ఉప్పుచేప, కోడిగుడ్డు- ఉల్లిపాయ పులుసు అంటే చాలా ఇష్టం. నాకూ, శ్రీదేవికి చాలా ఇష్టమైన వంటకం అది. మేం ముంబై వెళ్లినప్పుడు కూడా 'ఏమండి ఆ కూర పట్టుకురావచ్చు కదా" అనే వారామె. అందులో రాగిసంకటి కలుపుకొని తినడమంటే ఇంకా ఇష్టం. సురేఖ ఆ వంట చేయడంలో ఎక్స్‌పర్ట్. మా ఇంటికి వచ్చినప్పుడు కూడా ఎంతో ఇష్టపడి తినేది ఆమె.

'జగదేకవీరుడు..' పార్ట్-2 అనుకున్నాం కానీ..

జగదేకవీరుడు-అతిలోకసుందరికి పార్ట్ 2 గురించి బయట వార్తలు వచ్చాయి. అశ్వనీదత్‌గారే నిర్మాత. రామ్‌చరణ్ పెళ్లికి ముందే మా మధ్య ఈ సంభాషణ జరిగింది. "ఏంటండి ఇలా అనుకుంటున్నారు??" అని శ్రీదేవి అడిగింది. నేను కూడా మంచి కాంబినేషన్ అనీ, రామ్‌చరణ్, జాహ్నవీలది మంచి కాంబినేషన్ అని చెప్పాను కూడా. "బాగుంటుంది" అని శ్రీదేవి అంది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. జాహ్నవి తొలి చిత్రం ఫస్ట్ కాపీ చూడకుండానే ఆమె ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోవడం దురదృష్టకరం.

నిర్జీవంగా చూసి తట్టుకోలేకపోయా!

అంతిమ యాత్రలో శ్రీదేవిని నిర్జీవంగా చూసి తట్టుకోలేకపోయాను.గుండె పిండేసినట్లయింది. బోనీ కపూర్ అయితే నన్ను పట్టుకొని ఏడ్చేశారు. దేశానికీ, చిత్రపరిశ్రమకు, కుటుంబానికి తీరని లోటంటూ అనిల్‌కపూర్ బాధపడ్డారు. ఆల్‌ఇండియా సూపర్‌స్టార్స్ అంటూ ఇప్పటికీ ఎవరూ లేరు. రేఖ, పద్మిని, హేమమాలిని వీళ్లందరూ కేవలం హిందీకే పరిమితమైన స్టార్ యాక్టర్స్. నాకు తెలిసీ, భాషలకు అతీతంగా ఆల్ ఇండియా లేడీ సూపర్‌స్టార్ ఎవరంటే ఒక్క శ్రీదేవి మాత్రమే. గతంలో లేరు. భవిష్యత్తులో ఎవరూ రాబోరు కూడా. ఆ శకం తనతోనే ప్రారంభమైంది. తనతోనే అంతమైంది!

ఆమె రియల్ సూపర్‌స్టార్!

- ప్రకాశ్‌రాజ్





అందరూ 'శ్రీదేవి దివి నుంచి భువికి వచ్చిన దేవత' అని చెబుతున్నారు. నాకు మాత్రం 'భువి నుంచి దివికి వెళ్ళిన నక్షత్రం'లా కనబడుతుంది! నేను ఆమెతో కలిసి నటించలేదు. కానీ, చిన్నప్పట్నుంచి తనను చూసినట్టు ఉందేంటి? మా ఇద్దరిదీ ఇంచు మించు ఒకటే వయసు. తను నాకంటే రెండేళ్ళ పెద్ద అంతే. తనంటే ఎందుకంత పరిచయం ఉన్నట్టు అనిపిస్తుంది? ఎందుకంటే.. ఒక్కసారి ఆమె చేసిన చిత్రాలన్నీ చూడండి! శ్రీదేవి పాట పాడుతున్నా... డ్యాన్స్ చేస్తున్నా... మన (ప్రేక్షకుల) ముందు చేస్తున్నట్టు ఉంటుంది. మనల్ని పలకరిస్తున్నట్టు ఉంటుంది. తను నటించిన పాత్రలను దాటి, చిత్రాలు అన్నిటికీ న్యాయం చేస్తూనే... కెమెరా అనేది ఒక మెషీన్ కాదు, దాని వెనుక జన సమూహం ఉందని తెలిసిన అమ్మాయి శ్రీదేవి. కథను దాటి, కథలోని పాత్రలను దాటి నేను ప్రేక్షకులతో మాట్లాడుతున్నాననే భావన శ్రీదేవి తీసుకొచ్చింది. ప్రేక్షకులతో ఒక సంబంధం ఏర్పరుచుకుంది. మన (ప్రేక్షకుల) జీవితంలోని ఎన్నో క్షణాల్లో ఆమె ఇమిడిపోయింది. యాభై సంవత్సరాలు మనతో ఉందామె. అందుకు ఆమెకు కృతజ్ఞతలు చెబుతున్నా!

నటుడిగా నేను ఆమె దగ్గర నేర్చుకున్నది ఎంతో ఉంది. నటీనటుల ఆలోచనా విధానం ఎలా ఉండాలో తెలుసుకున్నాను. కెమెరా అంటే కెమెరా కాదు.. దాని వెనుక లక్షలాది మంది ప్రజలున్నారు. వాళ్ళని చూడాలనే ఫీలింగ్ ఆమె దగ్గర నేర్చుకున్నాను. మాటల మధ్యన ఉన్న మౌనంలో ఆమె చేసిన అభినయం ఉంది కదా? దాంతో ప్రేక్షకులకు చిన్న లవ్ లెటర్ పంపుతుంది కదా? అది ఆమె దగ్గర నుంచి నేర్చుకున్నా. ఆమెకు మాత్రమే సాధ్యమైన విద్య అది.

మనతోనే ఉన్నట్టుంది!

శ్రీదేవితో నేను కలిసి నటించకున్నా... ఆమెతో పరిచయం ఉంది. రెండు నెలల క్రితం కూడా విమానంలో కలిసి ప్రయాణించాం కూడా. మొన్న 'మామ్' చేసినప్పుడు "ప్రకాశ్‌గారూ... తెలుగు, తమిళ భాషల్లో మీ వాయిస్ ఉంటే బాగుంటుంది" అని నాతో చెప్పారు. 'అంతఃపురం' హిందీ రైట్స్ తీసుకుని సినిమా చేస్తున్నప్పుడు 'మీలాంటి నటులు ఎక్కడండీ! అన్నారు. నేను నటించి, నిర్మించిన 'అభియుమ్ నానుమ్' (తెలుగులో 'ఆకాశమంత'), ఆమెకు నచ్చేసి వాళ్ళ సంస్థలో ఆ సినిమా చేయాలని అడిగితే.. హిందీ రైట్స్ ఇచ్చాను. వాళ్ళింటికి వెళ్ళినప్పుడు నాకు వంట చేసి వడ్డించారు. అలాగే, 'కౌన్ బనేగా కరోడ్ పతి' తమిళ్ వెర్షన్ చేసినప్పుడు శ్రీదేవిని రెండు గంటలు ఇంటర్వ్యూ చేశా. అప్పుడు ఆమె ఆవిష్కరించిన అంతరంగం, విషయాలు నాకు సన్నిహితంగా అనిపించాయి. అదొక అనిర్వచనీయమైన అనుభూతి. అందుకే శ్రీదేవిని నిన్న మొన్న కలిసినట్టు లేదు. ఎప్పుడూ ఆమెతో ఉన్నట్టే ఉంటుంది.

ప్రతిభే ఆమె రహస్యం!

ఈ ప్రపంచంలో సౌందర్యం అనేది ఒక సిఫారసు లెటర్. ఆ సిఫారసు లెటర్‌తో వచ్చిన ఒక మనిషి, ఒక నటి శ్రీదేవి. ఎక్కడో ఒక చోట... కేవలం సౌందర్యరాశిగా, అందాల బొమ్మగా ఉంటే.. ఇంకో అందాల బొమ్మ వస్తే తనను మర్చిపోతారని ఆమెకు తెలుసు. అందుకని, నిరంతరం నటిగా శ్రమ పడింది. అందంతో కాకుండా ప్రతిభతో పైకి వచ్చింది. అదే ఆమె సీక్రెట్. యవ్వనంలో కాలేజ్ కుర్రాళ్ళగా ఉన్నప్పుడు నాలాంటి ఎంతోమందికి శ్రీదేవిలాంటి ఒక ప్రియురాలు ఉండాలనేది ఆశ మాత్రమే కాదు. అది ఒక కల. శ్రీదేవిని అభిమానిగా చూడడం కాదు. దర్శించాలనే ఒక తపన. ప్రతిసారి ఆమె వెండితెర మీద వస్తే... అదొక దర్శన భాగ్యమే మాకు. ఒక నటి.. ఒక మనిషిలో ప్రేమనో, కామాన్నో స్పృశించేలా చేయాలనేది రాయని ఒక రూలు. నాలాంటి ప్రేక్షకులు అలాగే చూస్తుంటారు. కానీ, దాన్ని శ్రీదేవి బద్దలుగొట్టింది. తను ఏడిస్తే... ఏడ్చేవాళ్ళం. తను నవ్వితే... నవ్వేవాళ్ళం. ఆమె మాట, చూపు, హావభావాలు... ఆమెలో ఉన్న ఒక చిన్నారిని (చైల్డ్‌ని) గుర్తు చేశాయి.

స్పందనలన్నీ మనకే!

'వసంత కోకిల' చిత్రంలో మతిపోయి పిచ్చి పట్టిన అమ్మాయిగా శ్రీదేవి నటించిందంతే! నిజంగా పిచ్చెక్కి తిరిగింది మాత్రం మనమే. పిచ్చెక్కింది మనకే. తనకి ఆ మతిమరుపు పోయి, అంతసేపూ ఎన్నో చేసిన కమల్‌హాసన్‌ని మరచిపోయినప్పుడు.... ఆమె ముందు కోతి వేషాలు వేసింది కమల్‌హాసన్ మాత్రమే కాదు. మనం కూడా! ఎక్కడో 'పదహారేళ్ళ వయసు'లో ఒక డాక్టర్ పాత్ర, శ్రీదేవిని అమాయకురాలిని చేసి మోసం చేస్తుంటే... ఇక్కడ మన గుండె కొట్టుకుంది. అదీ శ్రీదేవి అంటే!

తన వయసు రీత్యా ఇరవైయేళ్ళ తర్వాత చేయాల్సిన పాత్రలను చిన్నప్పుడే శ్రీదేవి చేసేసింది. హావభావాలను పలికించింది. ప్రతిసారీ అంతే! తనది ఎప్పుడూ సాధారణమైన జీవితం కాదు. భారతీరాజా, బాలు మహేంద్ర, బాలచందర్, మహేంద్రన్ లాంటి దర్శకుల సినిమాల్లో ఆమె చేసిన పాత్రలు వయసుకు మించినవి.

> **మహిళలకు మహాస్ఫూర్తి!**
>
> శ్రీదేవి మరణించిన వార్త తెలిసి మూడు రోజులుగా నా భార్య ఏడుస్తోంది. ఇప్పటివరకూ ఒక మగాడి దృష్టిలో శ్రీదేవిని చూశా. కానీ, మహిళ దృష్టిలో చూస్తే వేరేగా ఉంది. మగాళ్ళ సూపర్ స్టార్‌డమ్‌ను ఉపయోగించి ఒక కోట కట్టుకోవడం మనం చూశాం. మహిళలకు ఆ ఇది లేదు. సో... కొన్ని తరాల మహిళలకు శ్రీదేవి స్ఫూర్తినిచ్చింది. 'మనం కూడా అలా (శ్రీదేవిలా) నవ్వాలి. ఉండాలి. మనలో అలా మార్పు రావాలి' అనుకునేలా మహిళలకు శ్రీదేవి స్ఫూర్తి ఇచ్చింది.

వాళ్ళంతా ఎంత పెద్ద పెద్ద దర్శకులు! వాళ్ళ కథలకు ఈమె దొరికింది. ఈమె నటన ద్వారా తమ కథలు చెప్పగలిగారు. వాళ్ళ ఎదుగుదలలో ఈమె భాగస్వామ్యం ఉంది.

భారతీరాజా, బాలు మహేంద్ర, బాలచందర్, మహేంద్రన్, రజనీకాంత్, కమల్‌హాసన్, ఇళయరాజా... వీళ్ళందరూ శ్రీదేవి నటించిన సమయంలో లెజెండ్స్ అయ్యారు. వాళ్ళందరి వర్క్స్‌లో ఆమె భాగస్వామ్యం ఉంది. వాళ్ళతో వర్క్ చేసిన తర్వాత కమర్షియల్‌గా, బ్యూటిఫుల్ స్టార్‌గా ఎదిగిందామె. నటిగా కెరీర్ ప్రారంభంలో స్వచ్ఛమైన ప్రతిభ. పైన చెప్పుకున్న లెజెండ్స్‌తో సరిసమానమైన ప్రతిభ ఆమెది. 'పదహారేళ్ళ వయసు' (తమిళ వెర్షన్) భారతీరాజా తొలి చిత్రం అయితే? రజనీకాంత్, కమల్‌హాసన్ స్టార్స్ కాకముందు నటులు. ఆ చిత్రం నుంచి ఇళయరాజా ఎంతో ఎత్తుకి ఎదిగారు. వాళ్ళకు పేరు రావడంలో శ్రీదేవి సహకారం ఎంతో ఉంది.

ప్రతి భాషలోనూ తనే డైలాగులు చెప్పుకుంది. తనలో ఉన్న తపన అది. సౌందర్యం మాత్రం కాదు. ఇంకేదో ఉంది. అందుకే, కెరీర్ ఉచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు పిల్లల కోసం, కుటుంబం కోసం సినిమాలను వదిలి వెళ్ళినా... మళ్ళీ 'ఇంగ్లిష్ వింగ్లిష్'తో రిటర్న్ వస్తోందంటే... తెలుగు, తమిళ్ అన్ని భాషల వాళ్ళూ ఎదురు చూశారు. మళ్ళీ స్టార్‌గానే వచ్చింది.

పరిధిలకు ఆమె అతీతం!

మనం సినిమా ప్రపంచం అంటే... దక్షిణాది సినిమా, హిందీ సినిమా (బాలీవుడ్) అంటాం. హిందీలో సూపర్‌స్టార్‌గా పెద్ద పేరు పొందిన అమితాబ్ బచ్చన్‌గారికి అంతే ఎత్తున ప్రేమ, ఆదరణ ఇక్కడ (దక్షిణాదిలో) ఉందని చెప్పలేం! ఇక్కడ ప్రతి భాషకి ఒక సూపర్‌స్టార్ ఉన్నారు. ఇక్కడున్న సూపర్‌స్టార్లకి హిందీలో అంతే పేరుందని చెప్పలేం. ఇటువంటి అడ్డుగోడలకు శ్రీదేవి అతీతమైన వ్యక్తి. భాషల ఎల్లలు దాటేసి వెళ్ళింది. ప్రతిసారి కొత్త దిగంతాలే. ఎక్కడో విన్నాను... హిందీ సినిమాలో డైలాగ్ చెప్తుంటే పక్కన చెల్లితో తమిళంలో చెప్పేదట! అదేంటండీ? అనడిగితే... 'నేను ముందు భావం పట్టుకోవాలి' అని చెప్పారట! ముందు తెలిసిన భాషలో రిహార్సల్ చేసేవారు అన్నమాట. అంత కష్టపడిందామె.

ఆమె ఎదిగిన తీరు...

ఆమె నిశ్శబ్దంగా తీసుకొచ్చిన మార్పు... చిరస్మరణీయం!

పిల్లలకు శ్రీదేవి పేరు పెట్టడం ఏంటండీ?

శ్రీదేవిలా నవ్వితే మనల్ని ఎవరైనా ఇష్టపడతారని అమ్మాయిలు అనుకోవడం ఏంటండీ?

శ్రీదేవి వేసుకున్న లంగా ఓణీలు వంటివి వేసుకోవడం ఏంటి?

నేను కొందరు మహిళలతో మాట్లాడుతుంటే... వాళ్ళ చెల్లో, అక్కో, వాళ్ళ బంధువో మరణించినట్టు ఏడుస్తున్నారు. అది ఒక సైలెంట్ రివల్యూషన్. శ్రీదేవి ఓ రియల్ సూపర్‌స్టార్!

ఇదీ మన సంస్కారం!

కానీ, ఇలాంటి ఒక చావుకి నేను వెళ్తుంటే... నా బండి ఊగుతోంది. అభిమానులు గోల చేస్తున్నారు. ఏంటని చూస్తే... 'ఏయ్ ప్రకాశ్‌రాజ్, ఏయ్ జైకాంత్ శికరే' అని అరుస్తున్నారు. వీళ్ళెవరూ శ్రీదేవి చూడడానికి రాలేదే! శ్రీదేవిని కడసారి చూడడానికి వెళ్ళినప్పుడు మాత్రమే బంధువులు, ఆత్మీయులు కొందరు పెద్దవాళ్ళు, నాలాంటి సినిమా వ్యక్తులు వచ్చి వెళ్తున్నారు గానీ... జనాలు ఎవరూ శ్రీదేవి చివరిసారి చూడడానికి రాలేదే? అని ఆలోచిస్తూ రిటర్న్ ఫ్లైట్ క్యాచ్ చేయడానికి ముందు అరగంట టైమ్ ఉంటే కాఫీ తాగాలని ఒక చోట ఆగాం. నా బ్రదర్ ఇన్ లా డ్రైవర్‌కి 'కొంచెం కార్ అద్దాలు తుడువ్. అందరూ చేతులు వేయడంతో మసకబారాయి' అని చెబుతున్నాడు.

శ్రీదేవి మరణించిందనగానే హృదయఘాతంతో రాసిన మీడియా... పన్నెండు గంటల తర్వాత 'ఆమె పడిపోయిందంట' అనగానే యూటర్న్ ఎందుకు తీసుకుంది? 'మందు తాగిందా?', 'మందు తాగొచ్చా?' అని మోరల్ పోలీసింగ్ ఎందుకు స్టార్ట్ చేసింది? అంటే... మందు తాగడం తప్పా? ఇలా మాట్లాడేవాళ్ళు మందు తాగరా? వాళ్ళ చుట్టాల్లో ఎవరైనా మందుతాగి మరణిస్తే ఇలాగే ప్రవర్తిస్తారా? చావుకు ఉన్న గాంభీర్యాన్ని అలా ఎలా తీసేస్తారు? 'మందుతాగి అమ్మాయి మరణిస్తే త్రివర్ణ పతాకం ఏమిటి?' అని అడిగే హీనమైన స్థితికి వెళ్ళిపోయామా? దేశంలో మిగతావాళ్ళ గురించి వీళ్ళు ఆలోచించలేదు. ఎంత దారుణం చూడండి!

అక్కడ ఎక్కడో కూర్చుంటే... 'ఏమండీ? దుబాయ్‌లో డాక్టర్లు ఒక్క పైసా తీసుకోలేదు. అక్కడి ఆయిల్ కంపెనీ అరబ్ షేక్ ఒక ఫ్లైట్ పెట్టారు. ఇక్కడి నుంచి అంబానీ ఒక ఫ్లైట్ పెట్టాడు. మూడు రోజులు ఎయిర్‌పోర్ట్‌లో పార్కింగ్ ఫీజ్ తీసుకోలేదు. బాడీని తీసుకురావడానికి కష్టపడి గ్రీన్ కారిడార్ చేసి ట్రాఫిక్ లేకుండా ప్రయత్నించాం' అన్నారు. ఆ మాటలు చెప్పిన వ్యక్తిని ఒకసారి చూసి... 'అదంతా ఆమె సంపాదించినది రా! నువ్వు చేశావని ఎందుకు అనుకుంటున్నావ్?' అనుకున్నా.మనకి ఒక మనిషి ఎలా చచ్చాడనేది ముఖ్యమా? ఎలా బతికాడనేది ముఖ్యమా? అందుకనే... శ్రీదేవి నాకు మండుతున్న అగ్నిలో దిద్దుకున్న కర్పూరంలా కనిపిస్తుంది. ఆమె మరణాన్ని మనం చూసిన తీరు మన సంస్కారాన్ని తెలుపుతుంది.

అందరి ముందూ పాదాభివందనం చేసింది



'బంగారు భూమి'లో కృష్ణతో..

మా గురువు విక్టరీ మధుసూదనరావుగారి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే రోజుల్లో చెన్నైలోని కోడంబాకంలో ఉండేవాణ్ణి. ఆ పక్కనే ఉన్న 'పెరియార్ రోడ్‌'లో ఉన్న చిన్న ఇంట్లో శ్రీదేవి ఫ్యామిలీ ఉండేది. వాళ్ళ మదర్ రాజేశ్వరి కూడా ఆర్టిస్టే. 'ఇల్లరికం' తదితర చిత్రాల్లో నటించేవారు. జగపతి సంస్థ నిర్మించిన కొన్ని చిత్రాల్లో కూడా ఆవిడ నటించినట్లు గుర్తు. శ్రీదేవి వాళ్ళ నాన్న అయ్యప్పన్ లాయర్‌గా ప్రాక్టీసు చేసేవారు. శ్రీదేవి బాలనటిగా ఎస్టాబ్లిష్ అయ్యేవరకూ ఆయన ప్రాక్టీసు కొనసాగించారు. నీట్‌గా తయారై టై కట్టుకొని లాయర్ కోటు వేసుకొని బస్సుల్లో ఆయన కోర్టుకు వెళ్ళేవారు. పక్క పక్క వీధి వాళ్ళం కావడంతో కూరగాయలు అవీ కొనుక్కోవడానికి మార్కెట్‌కు వచ్చినప్పుడు వాళ్ళమ్మతో కలసి శ్రీదేవి కనిపించేది. 'మా అమ్మాయికి ఏమన్నా వేషాలు ఉంటే చూడండి' అని తరచూ అడుగుతుండేవారు రాజేశ్వరి. శ్రీదేవి చలాకీతనాన్ని గమనించిన నేను 'దర్శకునిగా నాకు అవకాశం వస్తే తప్పకుండా మీ అమ్మాయిని ఎంకరేజ్ చేస్తాను' అని చెప్పేవాణ్ణి. ఆ సమాధానం విని చాలా సంతోషించేది వాళ్ళమ్మ. అయితే 'అనూరాధ' సినిమాతో నేను దర్శకుడినయ్యే అవకాశం వచ్చినా, అందులో తగిన పాత్రలు లేకపోవడంతో శ్రీదేవికి ఛాన్స్ ఇవ్వలేకపోయాను. ఆ తర్వాత ఒకసారి కలసినప్పుడు 'ఏమండీ.. మా అమ్మాయిని మరిచిపోయారు' అని అడిగారు వాళ్ళమ్మ. పరిస్థితి వివరించి, ఈసారి తప్పకుండా ఇస్తానని హామీ ఇచ్చాను. ఆ సమయంలోనే 'అత్తలు-కోడళ్ళు' నిర్మాణంలో ఉంది. కృష్ణ, వాణిశ్రీ అందులో జంట. చిన్నప్పటి వాణిశ్రీ వేషం శ్రీదేవితో వేయించాను. చిన్న పాత్రే అయినా చాలా చక్కగా చేసింది. కృష్ణ నటించిన మరో సినిమా 'కొత్తకాపురం' లో హీరోయిన్ భారతి చిన్నప్పటి వేషం కూడా శ్రీదేవితో చేయించాను. ఇక 'మమత' (కృష్ణ, జమున జంట)లో కొంచెం ప్రాధాన్యం ఉన్న పాత్ర ఇచ్చాను. సీనియర్స్ ముందు ఏ మాత్రం తడబడకుండా ఆ పాత్ర పోషించి, సెట్‌లో అందరి మెప్పు పొందింది శ్రీదేవి.

> **అమ్మ ఎంత చెబితే అంత!**
>
> అప్పట్లో మా 'నందినీ ఫిల్మ్స్' ఆఫీసు శ్రీదేవి వాళ్ళున్న ఇంట్లోనే మేడ మీద ఉండేది. దాంతో రోజూ శ్రీదేవి కనపడేది. షూటింగ్ లేకపోతే శ్రీదేవి ఇంట్లోనే ఉండేది. స్కూల్‌కు కూడా వెళ్ళేది కాదు. చిన్న పిల్ల కదాని ఎవరైనా చాక్లెట్లు ఇస్తే తీసుకొనేది కాదు. వాళ్ళ అమ్మ తీసుకోమంటేనే తీసుకొనేది. చిన్నప్పటి నుంచీ అంత పద్ధతిగా, క్రమశిక్షణతో కూతుర్ని పెంచి పెద్ద జేసింది వాళ్ళమ్మ. షూటింగ్ స్పాట్‌లో కూడా ఇతర చైల్డ్ ఆర్టిస్ట్‌తో కలసి ఆడుకొనేది కాదు శ్రీదేవి. వాళ్ళ అమ్మ ఒళ్ళోనే కూర్చునేది.

'బడిపంతులు'లో అలా అవకాశం

ఎన్టీఆర్ నటించిన 'బడిపంతులు' సినిమా చేసేనాటికి కుట్టి పద్మిని బాలనటిగా బాగా పాపులర్. అందుకే ఆ చిత్రనిర్మాత పేర్రాజుగారు ఆమెను తీసుకుందామని అన్నారు. శ్రీదేవి చైల్డ్ ఆర్టిస్ట్‌గా అప్పటికే నేను మూడు సినిమాలు చేసి ఉండటంతో ఆమెనే పెడదామని నా ఆలోచన. పారితోషికం పరంగా కూడా శ్రీదేవి కంటే కుట్టి పద్మినికే ఎక్కువ. అయినా సరే ఆమెనే పెట్టుకుందామని పేర్రాజుగారు అన్నారు. స్టార్ పొజిషన్‌లో ఉన్న కుట్టి పద్మిని కన్నా, ఆర్థికంగా అవసరం ఉన్న శ్రీదేవి 'బడిపంతులు'లో నటిస్తే ఆమె భవిష్యత్ మరింత బాగుంటుందని నా ఆలోచన. 'నాకు మాత్రం కుట్టి పద్మినిని తీసుకోవాలని ఉంది. కానీ మీ ఇష్టం. దర్శకునిగా మీదే ఫైనల్ డెసిషన్' అన్నారు పేర్రాజుగారు. ఆయన 'మీ ఇష్టం' అని నాకు స్వేచ్ఛ ఇవ్వడం వల్లే కుట్టి పద్మినిని కాదని శ్రీదేవిని తీసుకోగలిగాను. నిర్మాత మాటే వేదవాక్కు. కనుక పేర్రాజుగారు గట్టిగా ఒత్తిడి చేస్తే కుట్టి పద్మిని ఆ చిత్రంలో నటించి ఉండేదేమో! అయితే కొన్ని సీన్లు, 'బూచాడమ్మా బుచాడు' పాట చిత్రీకరణ పూర్తయిన తర్వాత 'మీ డెసిషనే కరెక్ట్' అని రెండు మూడుసార్లు అన్నారు పేర్రాజుగారు.

రామారావుగారితో శ్రీదేవి చేసిన తొలి సినిమా ఇదే. అంతవరకూ తను చేసిన చిత్రాల్లో ఎక్కువసేపు కనిపించిందీ, లెంగ్త్ ఉన్న పాత్ర కూడా 'బడిపంతులు'లోనే. ఆ సినిమాలో అంజలీదేవిగారు, జయంతి, విజయలలిత ఉన్నారు. కానీ అంజలీదేవిగారి తర్వాత పేరు వచ్చింది శ్రీదేవి పాత్రకే.



'బడిపంతులు'లో

హీరోయిన్‌గా రెండు సినిమాలు

ఆమె హీరోయిన్ అయిన తర్వాత నా దర్శకత్వంలో నటించిన చిత్రం 'బంగారు భూమి'. ఆమె డేట్స్ చూసే ఎస్.వి. వెంకన్నబాబు ఆ చిత్రానికి నిర్మాత. 'మహేశ్వరి మూవీస్' అంటే అది శ్రీదేవి సొంత బేనరే అనుకొన్నాను మొదట. వెంకన్నబాబు చాలా బిజీ పర్సన్ కావడంతో షూటింగ్ బాధ్యతంతా నాకు అప్పగించేసి వేరే పనులు చూసుకొనేవాడు. దాంతో నాకు మరింత స్వేచ్ఛ వచ్చింది. ఆ చిత్రంలో చాలా బాగా నటించింది శ్రీదేవి. సెట్‌లోకి రాగానే 'మీరేం అనుకొంటున్నారు, మీకేం కావాలి' అని అడిగేది. మనం చెప్పినదానికి పది రెట్లు ఎక్కువగానే చేసేది. అలాగే కృష్ణ, శ్రీదేవి నటించిన 'భోగభాగ్యాలు' చిత్రానికి కూడా నేను దర్శకత్వం వహించాను. 'బంగారు భూమి' పెద్ద హిట్. 'భోగభాగ్యాలు' యావరేజ్ ఫిల్మ్.



- దర్శకుడు పి.సి.రెడ్డి

హిందీ సినిమా ఛాన్స్ అలా మిస్

రాజశేఖర్, జీవిత నటించిన 'తలంబ్రాలు' చిత్రాన్ని హిందీలో తీయాలనుకొన్నాం. ఆ చిత్రం రీమేక్ హక్కులు మద్రాసులోని 'సవేరా' హోటల్ రెడ్డిగారి దగ్గర ఉన్నాయి. ఆయన దగ్గర మేం కొనుక్కున్నాం. శ్రీదేవితో ఫోన్‌లో మాట్లాడాం. 'నాకు హిందీ సినిమాకు అవకాశం వచ్చింది. చాలా మంచి కథ. నువ్వు కథ వింటానంటే చెబుతాను' అన్నాను. 'నాకు మీరు కథ చెప్పనక్కర్లేదు. మీకు హిందీ సినిమా అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. మీకు ఎప్పుడు డేట్స్ కావాలంటే అప్పుడు ఇస్తాను. అమ్మతో ఓ మాట చెప్పండి చాలు' అంది. ఆ సమయంలో శ్రీదేవి ముంబైలో, వాళ్ళ అమ్మ చెన్నైలో ఉండేవారు. ఆ తర్వాత ఆమె చెన్నైకి వచ్చిన తర్వాత కలిశాను. అందులో హీరో పాత్రకు ఎవరిని తీసుకుందామని అడిగాను. 'ఇందులో నేను నటిస్తున్నాను. హీరో ఎవరన్నది దర్శకునిగా మీ ఇష్టం' అంది. పోనీ తెలుగు వాళ్ళని తీసుకుందామా, హిందీ వాళ్ళని తీసుకుందామా అని అడిగాను. దానికి కూడా ఆమె ఏమీ చెప్పకుండా 'మీ ఇష్టం' అంది. ఆ సమయంలో హిందీ చిత్రపరిశ్రమను శాసించే స్థానంలో ఉంది శ్రీదేవి. అయినా సరే హీరోని ఎంపిక చేసే బాధ్యతను నాకే వదిలెయ్యడం ఆమె గొప్పతనం. అయితే దురదృష్టవశాత్తు ఆ హిందీ సినిమా చేయలేకపోయాం. శ్రీదేవి ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోయాం.

పరిగెత్తుకుంటూ ఎదురొచ్చింది

ఒకసారి ఏదో పని మీద ముంబై వెళ్లాను. తెలిసిన వాళ్ళ షూటింగ్ ఫిల్మిస్తాన్ స్టూడియోలో జరుగుతుంటే అక్కడికి వెళ్లాను. ఆ పక్క ఫ్లోర్‌లో శ్రీదేవి షూటింగ్ జరుగుతోందని విని ఆమెను పలకరించడం కోసం ఆ ఫ్లోర్ దగ్గరకి వెళ్లాను. కానీ నేనెవరో వాళ్ళకి తెలీదుగా అందుకే ఫ్లోర్ బయటే నన్ను ఆపేశారు. దాంతో కొంచెం నేను అవమానంగా ఫీలయ్యాను.' తెలుగులో పెద్ద దర్శకుడిని: నన్నే ఆపేస్తారా' అని మనసులో అనుకొన్నాను. అయినా కోపాన్ని కాస్త అణచుకొని ' మద్రాసు నుంచి దర్శకుడు పి.సి.రెడ్డి వచ్చాడని శ్రీదేవికి చెప్పు' అన్నాను గట్టిగా. నేను దర్శకుడనని తెలియగానే గేటు దగ్గరున్న వ్యక్తి కాస్త మెత్తబడ్డాడు. చెప్పి వస్తానని లోపలకు వెళ్లాడు. సరిగ్గా అప్పుడే షాట్‌లో పాల్గొనడానికి రెడీ అవుతోంది శ్రీదేవి. కెమెరా ముందుకు వెళ్ళబోతుంటే ఆ వ్యక్తి వచ్చి నా గురించి చెప్పగానే 'ఏక్ మినిట్' అని దర్శకునికి చెప్పి, పరుగులాంటి నడకతో నా దగ్గరకు వచ్చింది. 'రెడ్డిగారూ.. బాగున్నారా.. ఎప్పుడు వచ్చారు.. రండి' అని నా చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. సెట్‌లో అంతా ఆమె వంకే చూస్తున్నారు. నన్ను కూర్చోమని చెప్పి అందరి ముందు పాదాభివందనం చేసింది. అటువంటివి నాకు అలవాటు లేకపోవడంతో కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాను. నిర్మాతకు, దర్శకుడికి నన్ను పరిచయం చేసింది. ఆ సెట్‌లోనే అమితాబ్ కూడా ఉన్నారు. కొద్ది దూరంలో ఉన్న ఆయన దగ్గరకు వెళ్లబోయేంతలో తనే మా దగ్గరికి వచ్చారు. ఆయనకి నా గురించి గొప్పగా చెప్పింది. 'నువ్వు అంత హడావిడిగా బయటకు వెళ్లావంటే ఎవరో ప్రత్యేకమైన వ్యక్తే వచ్చి ఉంటారనుకొన్నాను' అంటూ అమితాబ్ కూడా నాకు పాదాభివందనం చేశారు. ఇదీ శ్రీదేవి సంస్కారం.

నా సలహా పాటించింది

ఆమే కాదు తల్లి, చెల్లెలు, పిన్నమ్మ, బాబాయి.. అందరూ అలా ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. హీరోయిన్‌గా శ్రీదేవి మంచి పొజిషన్‌లోకి వచ్చిన తర్వాత తన బంధువులనందరినీ తన దగ్గరకి రప్పించుకొంది. అందరూ కలిసే ఉండేవారు. వాళ్ళ అమ్మా వాళ్లది తిరుపతి. రెడ్డి ఫ్యామిలీ. ఒకసారి శ్రీదేవి నాతో అంది 'మా బాబాయి (పిన్ని భర్త) ఖాళీగా ఉన్నాడు. మీ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేర్చుకోండి' అని. 'అసిస్టెంట్ డైరెక్టర్‌గా వద్దమ్మా.. ప్రొడక్షన్ మేనేజర్‌గా ట్రైనింగ్ ఇప్పించు. నీకు సంబంధించిన వ్యవహారాలన్నీ చూసుకొంటాడు' అన్నాను నవ్వుతూ. అలాగే వాళ్లింట్లోనే ఉండి లెక్కలు అవీ చూసుకొంటూ ఉండేవాడు. అతని పేరు కృష్ణారెడ్డి అనుకొంటా.. మనిషి చాలా మంచివాడు.

- వినాయకరావు

శ్రీదేవి దుబాయ్‌లో ఉంది అందుకే!



- పింకీ రెడ్డి

శ్రీదేవి చిన్నప్పటి నుంచి మా నాన్న గారికి (పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు టి. సుబ్బిరామిరెడ్డి) బాగా తెలుసు. శ్రీదేవికి తొమ్మిదేళ్ళు ఉన్నప్పుడే మా ఇంటికి నాన్న గారి దగ్గరకు ఒకసారి వచ్చింది. నాకు అప్పుడు పదమూడు, పద్నాలుగేళ్ళు ఉంటాయేమో! తరువాత కూడా ఆమె ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా, మా ఇంటికి వచ్చేది. నిజం చెప్పాలంటే, శ్రీదేవి చెల్లెలు (శ్రీలత), నేను మొదట మంచి స్నేహితులం. తరువాత గడచిన పదిహేనేళ్ళుగా శ్రీదేవి, నేను దగ్గరయ్యాం. నేను బొంబేకి షిఫ్ట్ అయిన దగ్గర నుంచి, పదేళ్ళుగా మేమిద్దరం మరింత దగ్గరయ్యాం.

పెళ్ళితో అలసిపోయింది...

దుబాయ్‌కి పెళ్ళికని వెళ్ళే ముందు రోజు కూడా శ్రీదేవి నాతో ఫోన్‌లో మాట్లాడింది. "పింకీ నాకు అస్సలు ఒంట్లో బాగాలేదు. జ్వరం, గొంతు ఇన్‌ఫెక్షన్ ఉన్నాయి. యాంటీ బయాటిక్స్ వాడుతున్నా. కానీ, మా ఆడబిడ్డ కొడుకు పెళ్ళి కాబట్టి, తప్పనిసరిగా దుబాయ్‌కి వెళ్ళాల్సిందే!" అని చెప్పింది. అలాగే దుబాయ్‌కి వెళ్ళింది. పంజాబీ పెళ్ళిళ్ళంటే ఎంత హంగామాగా ఉంటాయో చెప్పనక్కర లేదు. బహుశా, ఆ పెళ్ళి పనులు, హడావిడితో ఆమె బాగా దస్సిపోయింది. పెళ్ళి అవగానే వాళ్ళ అత్తగారు, బంధువులు... అందరూ వెనక్కి వచ్చేశారు. కానీ, శ్రీదేవి "ఒకరోజు ఇక్కడే ఉండిపోయి, కాస్తంత సేద తీరి, కావాల్సినవి కొన్ని షాపింగ్ చేసి వస్తాను" అంది. అక్కడే దుబాయ్‌లో ఉండిపోయింది. శ్రీదేవి షాపింగ్‌కు వెళతానంటే, మా ఫ్రెండ్ తన కారు పంపించిందట!

కూతురి సినిమాతో నెర్వస్!

పెద్ద కూతురు జాన్వి హీరోయిన్‌గా నటిస్తున్న తొలి చిత్రం త్వరలో విడుదల కావాల్సి ఉంది. శ్రీదేవి ఎంత నెర్వస్‌గా ఉందంటే చెప్పలేం. "పింకీ! సినిమా బాగా వస్తోందని రషెస్ చూసినవాళ్ళంతా అంటున్నారు" అంటూ ఆనందం వ్యక్తం చేసింది. అంతే కాకుండా, శ్రీదేవికి కూడా మరో రెండు కొత్త సినిమాలు వచ్చాయి. అవి చేయడానికి ఆమె ఒప్పుకుంది. దాంతో ఆమె మరింత ఎగ్జైటెడ్‌గా ఉంది. కరణ్ జోహార్ ఆమెకు ఓ అద్భుతమైన పాత్ర ఆఫర్ చేశారట. దుబాయ్‌లో ఆమె ఆగిపోవడానికి అది కూడా ఓ కారణం. "ఒక రోజు ప్రశాంతంగా నేనొక్కదాన్నే ఉండిపోయి, నాతో నేను గడుపుతూ, ఆ పాత్ర మూడ్‌లోకి వెళ్ళాలనుకుంటు"న్నట్టు కూడా శ్రీదేవి చెప్పిందట. ఇంతలోనే ఇలా అయిపోయింది.

ముంబయ్‌లో నేను, శ్రీదేవి, ఇంకా కొంతమంది స్నేహితులం ఓ గ్రూపు ఉన్నాం. అందరం కలుస్తుండేవాళ్ళం. కలసి బయటకు వెళుతుంటాం. ఊళ్ళు తిరుగుతుంటాం. నాతో కలసి శ్రీదేవి బయటకు వస్తోందంటే, బోనీ కపూర్ నిశ్చింతగా ఉండేవాళ్ళు అసిస్టెంట్లు, బాడీ గార్డ్‌లు... ఎవరూ లేకుండానే ఆమెను పంపేవాళ్ళు అలాంటిది ఇప్పుడు శ్రీదేవి వెనక్కి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయింది.

ఆమె ఓ చెదరని కల!



- దర్శకుడు సుకుమార్

నేను శ్రీదేవిగారిని ఎప్పుడూ నేరుగా కలవలేదు! చూసిందీ లేదు! ఇటీవల ఓసారి బోనీ కపూర్‌గారిని కలిశా. అప్పుడు ఆయనకు ఫోన్ వచ్చింది. అవతల అతిలోక సుందరి. బయటకు వాయిస్ వినిపిస్తోంది. నేను అక్కణ్ణుంచి 'పక్కకు వెళ్ళనా' అని బోనీగారిని అడిగా. ఆయన 'పర్వాలేదు! ఇక్కడ ఉండవచ్చు' అన్నారు. నా కళ్ళు పుస్తకం మీద ఉన్నా చెవులు మాత్రం శ్రీదేవి మాటల మీదే! ఆ విధంగా శ్రీదేవిగారి మాటలు విని అదృష్టం లభించింది. కానీ, నాకు శ్రీదేవిగారు పరిచయమే.

'ఎలా' అనే సందేహం వచ్చిందా? సినిమాల ద్వారా! నా తొలిప్రేమ శ్రీదేవి! బహుశా... అప్పట్లో ఊహ వచ్చిన ప్రతి అబ్బాయి సినిమాలు చూసి శ్రీదేవితో ప్రేమలో పడి ఉంటారంటే అతిశయోక్తి కాదు. శ్రీదేవిలా నవ్విందని ఒకమ్మాయిని ప్రేమించి... శ్రీదేవిలా సిగ్గుపడిందని ఒకమ్మాయిని ఇష్టపడి... శ్రీదేవిలా నడుస్తుందని ఒకమ్మాయిని ఆరాధించిన అబ్బాయిలు అప్పట్లో కోకొల్లలు! శ్రీదేవిలా లేదని అమ్మాయిని ప్రేమించడం మానేసినవాళ్ళూ ఉన్నారు. చివరకు, చాలా మంది అబ్బాయిల జీవితాలను శ్రీదేవి ఎలా మార్చిందంటే... నిజంగా అందంగా ఉన్న అమ్మాయిలు కూడా వాళ్ళ కళ్ళకు అందంగా కనిపించలేదు. కేవలం అమ్మాయి శ్రీదేవిలా లేదనే కారణమే! కాలేజీలో ఎంతమంది అందగత్తెలు ఉన్నా... శ్రీదేవిలా ఉన్న అమ్మాయే అందగత్తె. అప్పట్లో అమ్మాయిలు కూడా శ్రీదేవిలా ఉండడానికి ప్రయత్నించేవారు. అలా చాలామంది ప్రేమ జీవితాలను శ్రీదేవి ప్రభావితం చేసింది.

'జగదేకవీరుడు - అతిలోక సుందరి'... నేను మళ్ళీ మళ్ళీ చూసిన చిత్రాల్లో ఒకటి. నేను ఎక్కువగా చూసిన శ్రీదేవి చిత్రమూ అదే! తుపాను తీవ్రత బీభత్సంగా ఉన్న సమయంలో... హోరు గాలిలో, వాన నీటిలో చలికి దిగురుటాకులా వణుకుతూ రాజోలు దగ్గరలోని తాటిపాకలో అన్నపూర్ణ థియేటర్‌లో అడుగుపెట్టాను. తెరపై శ్రీదేవిని చూడగానే చలీ లేదు. గిలీ లేదు. కన్నార్పకుండా ఆమె అందాన్ని చూస్తుండిపోయా. ఆమె కోసం చాలాసార్లు సినిమా చూశా. నిజంగానే ఆమె దేవత. తెరపై ఆమెను చూసిన తొలి క్షణాలు నాకింకా గుర్తున్నాయి.

చిన్నప్పటి నుంచి శ్రీదేవి కెమెరా ముందు పెరిగారు. బయట ప్రపంచం ఎలా ఉంటుందో ఆమెకు తెలీదు. అయినా... పాత్రల్లో అంత సహజంగా ఎలా నటించగలిగారు? వాటిలో ఎలా ఒదిగిపోయారు? అనేది నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. సాధారణంగా నేను ఆరాధించేవాళ్ళతో సినిమాలు చేయాలనుకోను. వాళ్ళను దగ్గరగా చూడాలనుకోను. ఎందుకంటే... మనకు వాస్తవం కన్నా ఊహ ఎప్పుడూ గొప్పగా ఉంటుంది. అది అలా ఉంటే ఉంచేస్తే మంచిదని నా అభిప్రాయం. మరణం తర్వాత ఇంతవరకూ ఆమెకు సంబంధించిన వార్తలేవీ నేను చూడలేదు. చదవలేదు. కావాలనే పక్కన పెట్టేశా. నాకిష్టం లేదు. నా కల కలగానే ఉంటే మంచిది. అనుకున్నవన్నీ నిజాలు కావడం లేదని కలగంటే... కలలను కూడా చంపేస్తే ఎలా? నా కలను చంపదలుచుకోలేదు. నా కలల రాణి శ్రీదేవి చిరంజీవి!

డైలీ సుడోకు - 121

7	8		3		9			1
			8	2				9
			6		1	4		
3				9			1	7
4		2				6		3
1	6			3				4
		1	2		3			
2				7	4			
6			9		5		3	2

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్ళు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-120 సమాధానం

4	6	9	8	2	1	3	7	5
7	5	8	6	3	9	2	4	1
3	1	2	7	5	4	6	9	8
8	7	1	5	4	2	9	3	6
6	4	5	3	9	8	1	2	7
2	9	3	1	7	6	5	8	4
9	2	6	4	8	5	7	1	3
5	3	4	2	1	7	8	6	9
1	8	7	9	6	3	4	5	2


తల్లితో జాన్వీ

నువ్వు గర్వపడేలా ఉంటానమ్మా!

– జాన్వీ కపూర్

అమ్మ పంచిన ప్రేమ వారికి ఒక జ్ఞాపకంగా మిగిలిపోయింది. 'ఆమె' ఇక లేదు! అని మనసుకు సర్దిచెప్పుకోవడం కష్టమే! శ్రీదేవి కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ల బాధ వర్ణనాతీతం. అమ్మ లేదన్న బాధను, ఆమె లేని జీవితాన్ని ఊహించుకోలేక కుంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో జాన్వీ కపూర్ తన తల్లికి రాసిన ఉత్తరం అందర్నీ కలచివేస్తోంది.

"ఎన్నటికీ భరించలేని బాధ, దుఃఖం నా హృదయాన్ని కుంగదీస్తున్నాయి. ఈ వెలితితోనే మిగతా జీవితం ఉంటుందన్న కఠోర వాస్తవాన్ని ఇప్పుడిప్పుడే నెమ్మదిగా అర్థం చేసుకొంటున్నా. నువ్వు లేని లోటు ఉన్నప్పటికీ నేను ఇంకా నీ ప్రేమను పొందుతున్నాను. అదే నన్ను ఈ ఆవేదన నుంచి సంరక్షిస్తుందేమో అనిపిస్తోంది. కళ్లు మూసుకున్న ప్రతిసారి నువ్వే కనిపిస్తున్నావు. నీతో పంచుకున్న మధుర క్షణాలే నా కళ్లముందు మెదులుతున్నాయి. దానికి కారణం నువ్వేనని నాకు తెలుసు. ఎంతటి కష్టమైనా అంత పెద్దగా అనిపించేది కాదు. ఎందుకంటే నా కోసం నువ్వు ఉన్నావు. మా కోసం నువ్వు పడిన ఆరాటం ఇంకా మా కళ్లముందు మెదులుతోంది. మా జీవితాల్లో నువ్వు ఉండటం మేం చేసుకున్న అదృష్టం. నీ హృదయంలో ఉన్న స్వచ్ఛత, ప్రేమ అనంతం. అందుకేనేమో ఆ దేవుడు నిన్ను త్వరగా తీసుకెళ్లిపోయాడు. 'నువ్వింత ఆనందంగా ఎలా ఉండగలుతున్నావు' అని నా స్నేహితులు అప్పుడప్పుడూ అడిగేవారు. నా ఆనందమంతా నీ వల్లే, నీ ప్రేమ వల్లేనని ఇప్పుడు అర్థమవుతోంది. నేను జీవితంలో ఇప్పటివరకూ ఎవరి మీదా ఆధారపడలేదు. ఆ అవసరం కూడా రాలేదు. ఎందుకంటే నాకు కావాల్సింది నువ్వే! నువ్వు నా ప్రాణస్నేహితురాలివి. 'ఏదో ఒక రోజు నన్ను చూసి నువ్వు గర్వపడాలి' అనే ఆశతోనే ప్రతిరోజూ నిద్రలేచేదాన్ని. ఇప్పుడూ అంతే. నువ్వు గర్వపడేలా ఉంటాను. ఎందుకంటే ఎప్పటికీ మాతోనే ఉంటావు. మాలో నిండిపోయావు. నీ ప్రభావం మా ముగ్గురి మీద (తండ్రి బోనీ కపూర్, సోదరి ఖుషీ కపూర్) ఎంతో ఉంది. నువ్విచ్చిన మనోధైర్యంతోనే మేం ముందుకెళుతున్నాం. కానీ అది పూర్తిగా చాలదేమో. ఐ లవ్ యు మై ఎవ్రీథింగ్ "

వారి బంధాన్ని అపహాస్యం చేయద్దు!

తన తల్లిదండ్రుల అన్యోన్యత గురించి కూడా ఆమె మరో పోస్ట్‌లో ప్రస్తావించారు. ఆ ఉత్తరం కూడా క్లుప్తంగా.... "నా పుట్టినరోజు (మార్చి 7) సందర్భంగా మీ అందర్నీ కోరేది ఒక్కటే. మీ తల్లిదండ్రులను ప్రేమించండి. అలాగే, అమ్మ ఆత్మశాంతి కోసం ప్రార్థించండి. మా అమ్మ, నాన్నలు ఒకరినొకరు ఎంతో అర్థం చేసుకున్నారు. ప్రేమించుకున్నారు. దయచేసి వారి ప్రేమని అపహాస్యం చేయవద్దు. వారి బంధాన్ని గౌరవించండి. నేను, మా చెల్లి ఖుషి తల్లిని కోల్పోయాం. కానీ నాన్న(బోనీ కపూర్) తన సర్వస్వాన్ని పోగొట్టుకున్నారు. ఓ తల్లిగా, భార్యగా, కథానాయికగా తన పాత్రలన్నిటినీ ఎంతో సమర్థవంతంగా పోషించింది మా అమ్మ. కేవలం ప్రేమను ఇవ్వడం, తీసుకోవడం ఒక్కటే తెలుసు ఆమెకు. ప్రపంచంలోని కుళ్లు, ఈర్ష్యాసూయల గురించి ఆమెకు తెలీదు. అర్థం కాదు కూడా. అలాగే మీ హృదయాలను ప్రేమతో నింపండి. కొన్ని రోజులుగా మీరు మా కుటుంబంపై చూపుతున్న ప్రేమ, ఆప్యాయతలకు ఎంతో రుణపడి ఉంటాం. ఇదే మాకు ఎంతో మనోధైర్యానిచ్చింది"!

విడదీయరాని బంధం


'అనురాగదేవత'లో ఎన్టీఆర్, శ్రీదేవి

అందాల అభినేత్రి శ్రీదేవి ఎన్ని భాషల్లో నటిస్తే, అన్ని భాషలవారూ ఆమెను తమ సొంత ప్రాంతానికి చెందిన అమ్మాయిగా ఆరాధించడం విశేషం. అది ఆమె అభినయ వైభవం గడించిన కీర్తికి నిదర్శనం. అయితే ఎవరు అవునన్నా, కాదన్నా శ్రీదేవి కన్నవారు ఇద్దరూ తెలుగువారే. తండ్రి అయ్యప్పన్ తమిళనాట స్థిరపడ్డ తెలుగువారు. ఇక తల్లి రాజేశ్వరి తిరుపతికి చెందినవారు. 'మామ్' సినిమా విడుదలకు ముందు కొన్ని నేషనల్ ఛానల్స్‌లో శ్రీదేవి ఇచ్చిన ఇంటర్వ్యూలలోనూ తన మాతృభాష తెలుగేనని శ్రీదేవి నొక్కి చెప్పారు. అన్ని భాషల్లోకన్నా తెలుగులోనే ఆమె ఎక్కువ చిత్రాల్లో నటించారు. తమిళ చిత్రాలద్వారా శ్రీదేవి పరిచయం అయి ఉండవచ్చు, నటిగా గుర్తింపు పొంది ఉండవచ్చు. అయితే ఆమెను సూపర్ స్టార్‌డమ్‌కు చేర్చింది మాత్రం తెలుగు చిత్రాలే.

తెలుగుతోనే స్టార్‌డమ్

శ్రీదేవి సైతం తెలుగు దర్శకుడు రాఘవేంద్రరావు కారణంగానే తనకు అంతటి గుర్తింపు లభించిందని అంగీకరించారు. శ్రీదేవి తెలుగునాట టాప్ హీరోస్ అందరితోనూ బాలనటిగానూ నటించింది, తరువాత వారి సరసనే పరువాల పాపగానూ అలరించింది. ఇలాంటి చరిత్ర మరో నటి ఎవ్వరి జీవితంలోనూ కనిపించదు. అలాగే తెలుగునాట మూడు తరాల హీరోలతోనూ సూపర్ హిట్స్ చూసిన ఘనత సైతం శ్రీదేవి సొంతం. శ్రీదేవి అత్యధిక చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది తెలుగు హీరో కృష్ణతోనే. ఇలా తెలుగు చిత్రాలతో శ్రీదేవి అనుబంధాన్ని చెరిపి వేయాలన్నా చెరిగిపోనిది. శ్రీదేవి కెరీర్‌లో బాలనటిగా, నాయికగా ఎన్ని చిత్రాలు చేసినా, అవన్నీ ఒక ఎత్తు మహానటుడు నటరత్న యన్టీఆర్‌తో నటించిన చిత్రాలు మరో ఎత్తు. ఎందుకంటే నటరత్నకు మనవరాలిగా శ్రీదేవి నటించిన 'బడిపంతులు' చిత్రం బాలనటిగా ఆమె కెరీర్ లోనే 'ది బెస్ట్!' అని జనం కీర్తించారు. అంతకు ముందు కొన్ని చిత్రాల ద్వారా అందాల నాయికగా పేరొందిన శ్రీదేవి టాప్ హీరోయిన్ గా మారింది కూడా యన్టీఆర్ సరసన 'వేటగాడు'తో నాయికగా నటించిన తరువాతే! 'వేటగాడు' టైంలోనే హైదరాబాద్‌లో ఒక పక్క 'వేటగాడు', మరోపక్క 'బడిపంతులు' రిలీజైనప్పుడు, జనం ఎలా రిసీవ్ చేసుకుంటారోనని కంగారు పడ్డాననీ, కానీ జనం ఆదరించడంతో ఊపిరి పీల్చుకున్నాననీ శ్రీదేవే స్వయంగా గతంలో 'జ్యోతిచిత్ర'తో చెపాcరు.

బాక్సాఫీస్ వేటలో... సంచలన కాంబినేషన్


యన్టీఆర్ సరసన పన్నెండు చిత్రాల్లో శ్రీదేవి నాయికగా నటించారు. వాటిలో తొలి చిత్రం 'వేటగాడు' సాధించిన విజయం గురించి అప్పట్లో కథలు కథలుగా చెప్పుకున్నారు. ఎందుకంటే ఓ నటునికి మనవరాలిగా నటించి మెప్పించి, మళ్ళీ అదే నటుని సరసన హీరోయిన్‌గా అలరించడం ఈ నాటికీ ఓ విశేషమే! ఇక యన్టీఆర్ తో శ్రీదేవి నటనాప్రస్థానం ఓ చరిత్ర. వీరిద్దరూ కలసి నటించిన 'వేటగాడు', 'ఆటగాడు', 'సర్దార్ పాపారాయుడు', 'గజదొంగ', 'సత్యం-శివం', 'కొండవీటి సింహం', 'అనురాగదేవత', 'జస్టిస్ చౌదరి', 'బొబ్బిలిపులి', 'వయ్యారిభామలు-వగలమారి భర్తలు' చిత్రాలు శతదినోత్సవం జరుపుకున్నాయి. 'రౌడీ రాముడు-కొంటెకృష్ణుడు', 'అగ్గిరవ్వ' చిత్రాలు రిపీట్ రన్‌లో అలరించాయి. ఇక వరుసగా నాలుగేళ్ళు 'బ్లాక్ బస్టర్ హిట్స్' చూసిన జంట కూడా యన్టీఆర్- శ్రీదేవిదే. వారిద్దరూ నటించిన 'వేటగాడు (1979), సర్దార్ పాపారాయుడు (1980), కొండవీటి సింహం (1981), బొబ్బిలిపులి (1982)' బ్లాక్ బస్టర్స్‌గా నిలిచాయి. యన్టీఆర్‌తో శ్రీదేవి నటించిన మొత్తం పన్నెండు చిత్రాల్లో ఆరు రజతోత్సవాలు ఉన్నాయి. అందులో నాలుగు బ్లాక్ బస్టర్స్‌తో పాటు 'గజదొంగ, జస్టిస్ చౌదరి' సైతం సిల్వర్ జూబ్లీ హిట్స్. వీటిలో 'గజదొంగ' మినహాయిస్తే మిగిలిన ఐదు చిత్రాలు త్రిశతదినోత్సవం జరుపుకున్నాయి. మళ్ళీ వీటిలోనే 'వేటగాడు' వజ్రోత్సవం, 'బొబ్బిలిపులి' స్వర్ణోత్సవం జరుపుకోవడం అరుదైన చరిత్ర. ఇన్ని రకాల రికార్డ్స్ కలిగిన జంట తెలుగులో మరొకటి లేదేమో. యన్టీఆర్‌తో శ్రీదేవి సాధించిన రికార్డులు ఈ నాటికీ పదిలంగానే ఉండడం గమనార్హం. ఆ కాంబినేషన్ జైత్రయాత్రతో ఇతర హీరోల సరసనా వరుస అవకాశాలు లభించాయి. ఒకే సినిమాలో తండ్రీకొడుకుల పాత్రలు రెండూ వేస్తున్నప్పుడు ఎన్టీయార్ చూపించే వేరియేషన్ తనను అబ్బురపరిచేదని ఆ రోజుల్లో శ్రీదేవి తన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

'అన్నదాతా సుఖీభవ'... దాసరికి అంకితం


ఆర్. నారాయణమూర్తి

"అందరికీ అన్నం పెట్టే రైతు నేడు ఉనికిని కోల్పోతున్నాడు. రైతు వెన్నెముక విరిగిపోతోంది. అన్నదాతా సుఖీభవ అనే రోజులు పోయి.. అన్నదాత దుఃఖీభవ అనే రోజులు నడుస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే ఏం చేయాలి? అన్నదాతను ఎలా కాపాడుకోవాలి అనే అంశాలతో నేను తెరకెక్కిస్తోన్న చిత్రం 'అన్నదాతా సుఖీభవ'. ఈ చిత్రాన్ని మా గురువుగారు దాసరి నారాయణరావుగారికి అంకితం ఇస్తున్నాను" అని అన్నారు ఆర్. నారాయణమూర్తి. స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై ఆయన తెరకెక్కిస్తోన్న 30వ చిత్రం 'అన్నదాత సుఖీభవ' ప్రెస్‌మీట్ శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ "పొద్దు పొడవక ముందే నాగలి భుజాన వేసుకుని పొలానికి వెళ్లే కరుణామయుడు రైతు. అందరికీ అన్నం పెట్టే రైతు పరిస్థితి నేడు ఘోరంగా ఉంది. రైతు తన ఉనికిని కోల్పోతున్నాడు. రైతే రాజు అనే నానుడి ఇప్పుడు లేదు. అన్నమో రామచంద్రా అని రైతులు ఏడుస్తున్నారు. అందుకు కారణం రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడమే. 2009 నుండి ఇప్పటిదాకా 3.25లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2005లో ఏర్పాటైన స్వామినాథన్ కమిషన్ రైతు పంటకు ఉన్న ధర కంటే 50 శాతం అదనంగా గిట్టుబాటు ఇవ్వాలని సిఫారసు చేసింది. అది ఇంకా అమలు కాలేదు. దాన్ని వెంటనే అమలు చేయాలని మా చిత్రం ద్వారా చెబుతున్నాం. ఆత్మహత్యలు పరిష్కారమార్గం కాదని రైతన్నలకు చెబుతున్నాం. .వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని చెప్పే చిత్రమే మా 'అన్నదాతా సుఖీభవ'. వంగపండు రాసిన పాటను బాలసుబ్రమణ్యంగారు అద్భుతంగా పాడారు. గద్దర్, గోరేటి వెంకన్న, సుద్దాల అద్భుతమైన పాటలు రాశారు" అని అన్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో చర్చలు జరుగుతున్న ఈ నేపథ్యంలో దక్షిణాది చలనచిత్ర పరిశ్రమ థియేటర్లలో ప్రదర్శనలను నిలిపివేయడం సబబేనని చెప్పారు.

ఆస్కార్ విజేతలు వీళ్లేనా?


గ్యారీ ఓల్డ్‌మ్యాన్


గుల్లెర్మో

రేసులో గుర్రాలు ఎన్నైనా ఉండొచ్చు. కానీ, విజేతగా నిలిచేది మాత్రం ఒక్కటే! రెండు సెకన్లు ఆలస్యంగా రేసు పూర్తి చేసినా విజేత అనరు. క్షణికాలంలో ఏమైనా జరగొచ్చు. ఆస్కార్ అవార్డుల రేసులోనూ అంతే! నటనలో... దర్శకత్వంలో... చిత్రనిర్మాణంలో... ఇలా 24 శాఖలలో అసమాన ప్రతిభ కనబరిచిన వారిని ఆస్కార్ వరిస్తుంది. అవార్డు అందుకోవాలంటే 24 ఫ్రేముల్లోనూ ప్రతిభ కనబరచాలి. క్షణికాలం అలసత్వం ప్రదర్శించినా ఆస్కార్ అందని ద్రాక్ష అవుతుంది. మరికొన్ని గంటల్లో 90వ ఆస్కార్ అవార్డు విజేతలను ప్రకటిస్తారు. ఈలోపు ప్రేక్షకుల్లో ఒక్కటే ఉత్కంఠ! వాళ్ళ ఉత్కంఠకు తగ్గట్టు హాలీవుడ్ విమర్శకులు ఆస్కార్ రేసులో ఎవరు విజేతగా నిలవచ్చు? ఎవరు విజేతగా నిలుస్తారు? అని అంచనా వేస్తున్నారు. ఉత్తమ చిత్రంగా ఏది నిలుస్తుంది! ఏది నిలిస్తే బాగుంటుంది? అని జోస్యం చెబుతున్నారు. హాలీవుడ్ విమర్శకుల ఊహలపై ఓసారి లుక్కేయండి! విమర్శకుల ఊహలు నిజం కావొచ్చు లేదా విజేతలుగా కొత్త పేర్లు రావొచ్చు!

ఉత్తమ చిత్రం: 'ది షేప్ ఆఫ్ వాటర్'?


'ది షేప్ ఆఫ్ వాటర్'లో ఓ దృశ్యం

ఈ ఏడాది ఆస్కార్ బరిలో ఉత్తమ చిత్రం విభాగంలో మొత్తం తొమ్మిది చిత్రాలు పోటీ పడుతున్నాయి. అందులో 'ది షేప్ ఆఫ్ వాటర్'కి అవార్డు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఒక వింత జీవితో ప్రేమలో పడిన అమ్మాయి, ఆ జీవికి పొంచి ఉన్న ప్రమాదం నుంచి దాన్ని ఎలా కాపాడిందనేది 'ది షేప్ ఆఫ్ వాటర్' కథాంశం. ఈ చిత్రానికి మొత్తం 13 నామినేషన్లు వచ్చాయి. అంటే... నటీనటులు, సాంకేతిక నిపుణులు ఏ స్థాయిలో ప్రతిభ కనబరిచారో అర్థం చేసుకోవచ్చు. దీనికి 'డంకర్క్', 'కాల్ మి బై యువర్ నేమ్', 'డార్కెస్ట్ అవర్', 'లేడీ బర్డ్', 'ఫాంటమ్ త్రెడ్', 'ది పోస్ట్', 'త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ', 'గెట్ అవుట్' చిత్రాల నుంచి పోటీ ఉంది. వాటిలో 'కాల్ మి బై యువర్ నేమ్'కి అవార్డు వస్తే బాగుంటుందని విమర్శకుల అభిప్రాయం. 'గే' కథాంశంతో ఆ చిత్రం తెరకెక్కింది.

ఉత్తమ నటుడు: గ్యారీ ఓల్డ్‌మ్యాన్?

ఐదుగురున్నారు... ఉత్తమ నటుడిగా అవార్డు అందుకోవడానికి! వారిలో గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఆస్కార్ లేడీని ముద్దాడడం ఖాయమని అంచనా! రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన 'డార్కెస్ట్ అవర్'లో బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టల్ చర్చిల్ పాత్రకు గ్యారీ ఓల్డ్‌మ్యాన్ జీవం పోశాడనేది విమర్శకుల అభిప్రాయం. అతడి నటన ముందు మిగతావారు దిగదుడుపే అంటున్నారు. మరోపక్క... 'కాల్ మి బై యువర్ నేమ్'లో వయసు రిత్యా తన కంటే పెద్దవాడైన వ్యక్తి (మగ) పట్ల ఆకర్షితుడు అయిన యువకుడిగా నటించిన టిమోతీ చలమెట్‌కి అవార్డు రావాలనే అభిలాషను వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ నటి: ఫ్రానిక్స్ మెక్ డొర్మండ్? / సావొర్సె రోనన్?


సావొర్సె రోనన్

'త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' చిత్రంలో కన్నకూతురిపై అత్యాచారం చేసి, అత్యంత పాశవికంగా హత్య చేసిన దుర్మార్గులకు శిక్ష పడాలని న్యాయం కోసం పోరాడే తల్లిగా నటించిన 60 ఏళ్ళ ఫ్రానిక్స్ మెక్ డొర్మండ్‌కి తప్ప ఇంకెవరికీ ఆస్కార్ వచ్చే అవకాశం లేదంటున్నారు. అదే సమయంలో 'లేడీ బర్డ్'లో సావొర్సె రోనన్ నటననూ తక్కువ అంచనా వేయడం లేదు. ఆ చిత్రంలో తన స్వేచ్ఛకు సంకెళ్ళు వేయాలనుకునే తల్లితో సంఘర్షించే టీనేజ్ గాళ్‌గా సావొర్సె రోనన్ నటించారు. వీరితో పాటు మార్గట్ రాబీ, స్యాలీ హాకిన్స్, మెరిల్ స్ట్రీప్ ఆస్కార్ లేడీ కోసం పోటీ పడుతున్నారు.

ఉత్తమ దర్శకుడు: గుల్లెర్మో డెల్ టోరో?

ఐదుగురు దర్శకులు ఈ విభాగంలో పోటీ పడుతున్నా... ప్రధానంగా అందరి దృష్టి ఇద్దరి మీద ఉంది. ఇద్దరిలో 'ది షేప్ ఆఫ్ వాటర్' దర్శకుడు గుల్లెర్మో డెల్ టోరో రెండు అడుగులు ముందున్నాడు. ఇప్పటికే ఆయనకు గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా అవార్డులు వచ్చాయి. వీటికి తోడు చిత్రకథ, తెరకెక్కించిన తీరు అద్భుతమంటున్నారు. ఇద్దరిలో ఇంకొకరు... 'డంకర్క్' చిత్రదర్శకుడు క్రిస్టోఫర్ నోలన్. ఈ 'ఇంటర్‌స్టెల్లార్' దర్శకుడికి అవార్డు వచ్చి తీరాలనేది ఆశ! నింగి, నేల, నీరు... మూడు నిప్పుగా మారి దహించడానికి ముందుకొస్తుంటే? రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో జర్మనీ ముప్పేటదాడి నుంచి యూరప్ సైన్యం ఎలా తప్పించుకుందనే కథతో ఆయన 'డంకర్క్' తీశారు.

భారత కాలమాన ప్రకారం సోమవారం ఉదయం ఆస్కార్ విజేతలను ప్రకటిస్తారు

గదిలో కుర్రాడి గేమ్!


విజయ్ దేవరకొండ, శివానీ సింగ్

కంప్యూటర్ గేమ్స్‌కి బానిసైన ఓ కుర్రాడి జీవితాన్ని, ఆన్‌లైన్‌లో పరిచయమైన అమ్మాయి ఎలా మార్చింది అనే కథతో రూపొందిన చిత్రం 'ఏ మంత్రం వేశావె'. విజయ్ దేవరకొండ, శివానీ సింగ్ జంటగా నటించారు. గోలీసోడా ఫిలిమ్స్ తెరకెక్కించింది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో దర్శకనిర్మాత శ్రీధర్ మర్రి మాట్లాడుతూ "మానవ విలువలను తెలియజేసే సినిమా ఇది. సెన్సార్ క్లీన్ యు ఇచ్చింది. అందరి అంచనాలను చేరుకునేలా ఉంటుంది సినిమా" అని అన్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ " ఈనెల 9న చిత్రాన్ని విడుదల చేయాలని అనుకుంటున్నాం. 'ఎవడే సుబ్రమణ్యం', 'పెళ్ళిచూపులు', 'అర్జున్ రెడ్డి' చిత్రాల తరహాలో విజయ్ దేవరకొండకు మంచి పేరు తెచ్చిపెట్టే చిత్రమిది. దాదాపు 600-700 థియేటర్లలో విడుదల చేస్తాం. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల పట్ల నిరసనగా చలనచిత్ర పరిశ్రమ నిర్వహిస్తోన్న బంద్ అప్పటిదాకా కొనసాగితే మా సినిమా విడుదల తేదీని వాయిదా వేసుకుంటాం" అని అన్నారు.

పసిబిడ్డపై పగ!

- గొంతు నులిమి.. ఆపై నీటి కుండీలో పడేసి..
- హేళన చేశారని దారుణానికి ఒడిగట్టిన మహిళ.. నిందితురాలి అరెస్టు



మృతి చెందిన బాలుడి (ఫైల్), నిందితురాలు రజియా

కడప క్రైం, మార్చి 3: తన కుమార్తె నీటిలో పడి చనిపోతే హేళన చేయడాన్ని భరించలేని ఓ మహిళ దారుణానికి ఒడిగట్టింది. పక్కింటికి చెందిన ఏడాదిన్నర వయసున్న పసిబిడ్డను గొంతు నులిమి పాశవికంగా హత్యచేసింది. దీనికి సంబంధించి కడప డీఎస్పీ కార్యాలయంలో శనివారం డీఎస్పీ షేక్ మసూమ్‌బాషా, అర్బన్ సీఐ భాస్కర్‌రెడ్డితో కలిసి విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చెన్నూరు మండలం శాటిలైట్ సిటీకి చెందిన షేక్ రజియా సుల్తానా కడపకు చెందిన ఓ యువకుడిని పెళ్లి చేసుకుని కొన్నేళ్ల తరువాత విడాకులు తీసుకుంది. అనంతరం షేక్ ఇలియాస్‌తో రెండేళ్లు సహజీవన చేసింది. వీరికి తస్లిం అనే పాపపుట్టింది. తర్వాత ఇలియాస్‌ను కూడా వదిలేసి.. కడప ఇందిరానగర్‌లో సందీప్‌తో ఏడాది పాటు సహజీవనం సాగించింది. ఆ తర్వాత సందీప్‌ను వదిలేసి.. అతడి స్నేహితుడైన షేక్ సాహెబ్ జాన్‌ను వివాహం చేసుకుని శాటిలైట్ సిటీలో నివాసం ఉంటోంది. వీరి దాంపత్యానికి గుర్తుగా ఓ పాప (షేక్ తక్బీర్ భాను.. 5 నెలలు) పుట్టింది. ఈ నేపథ్యంలో గత నెల 17న చుట్టుపక్కల వారితో కలిసి ఆదినిమ్మాయపల్లె డ్యామ్ వద్దకు విహారయాత్రకు వెళ్లారు. రజియా సుల్తానా భర్త, పిల్లలు ప్రమాదవశాత్తు అక్కడి నీటి కుంటలో ఇరుక్కోవడంతో వారిని స్థానికులు రక్షించారు. రజియా సుల్తానా పెద్ద కుమార్తె తస్లిం తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందింది. బిడ్డ చనిపోయిన బాధలో ఉన్న రజియా సుల్తానా గురించి 'నీకు ఇలాగే కావాలంటూ...' పక్కింటి హసీనా, ఆమె అత్త ఖాసింబీ హేళనగా మాట్లాడారు. దీంతో ఆమె వారిపై కక్ష పెంచుకుంది. శనివారం మధ్యాహ్నం హసీనా చిన్న కుమారుడు హనీఫ్ ఇంటి మేడపై ఒంటరిగా ఆడుకుంటుండగా, ఆ పిల్లాడి గొంతు నులిమి నీటి ట్యాంకులో పడేసింది. బిడ్డ హనీఫ్ కనిపించకపోవడంతో తల్లి దండ్రులు చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాలుకా ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, చెన్నూరు ఇన్‌చార్జి ఎస్ఐ హజరత్ ఆలీ, టూటౌన్ ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, రుష్యేంద్రబాబు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. షేక్ రజియా సుల్తానా ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నీటిట్యాంకులోని బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పరీక్షల కోసం రిమ్స్‌కు తరలించామన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ఇలా చేస్తే పిల్లలు పుడతారట!

చుట్టూ కణకణలాడే నిప్పు కణికలు. వాటి మధ్యలో ఓ చిన్న బండరాయి. దానిపై మహిళలు కూర్చొని తెలిసిన వారి పిల్లలకు పాలు పడుతున్నారు. ఇలా చేస్తే తమకూ సంతాన భాగ్యం కలుగుతుందని ఆ మహిళల విశ్వాసం. అందుకే కాళ్లు కాలిపోయినా.. శరీరం మంట ఎక్కినా లెక్క చేయడం లేదు. తమిళనాడులోని సేలం జిల్లా శౌర్యపాళయంలో ఉన్న మహాశక్తి మారియమ్మన్ ఆలయంలో ఈ తంతు జరుగుతోంది. మాసి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అభిషేక, ఆరాధనలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరిగింది. పలువురు మహిళలు అగ్నిగుండం చుట్టూ మూడుమార్లు తిరిగి.. అందులో ఏర్పాటు చేసిన చిన్నరాయిపై కూర్చొని పిల్లలకు పాలు తాగించారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

అగ్నిగుండంలో కూర్చొని పాలు తాగిస్తున్న భక్తురాలు

సిరు.. ద్యోగులు

జీతం వేలలో..ఆస్తులు కోట్లలో.. సెటిల్‌మెంట్లతో భారీగా ఆస్తులు

- విశాఖ రేంజ్‌లో ఏసీబీ సోదాలు
- ముగ్గురు సిబ్బంది ఇళ్లలో తనిఖీ
- జీవీఎంసీ మజ్దూర్ ఆస్తి 10 కోట్లు
- వీఆర్వో వద్ద రూ.40 కోట్ల పత్రాలు
- చదువుకొనే కొడుకు పేరిట బిజినెస్
- ఐదుగురు బినామీలతో భారీ ఆస్తులు
- రూ.12కోట్లు వెనకేసిన మరో వీఆర్వో

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వీరంతా చిరుద్యోగులు. నాలుగు అంకెలు దాటని జీతగాళ్లు. అలాంటివారి ఇళ్లలో కనీస సౌకర్యాలే అంతంతమాత్రం. అలాంటిది వీరి నివాసాల్లో మాత్రం కళ్లు చెదిరే సంపదను ఏసీబీ అధికారులు గుర్తించారు. శనివారం విశాఖ రేంజ్ పరిధిలో ఒకేసారి ముగ్గురు ఉద్యోగులపై ఏసీబీ విరుచుకుపడింది. రెవెన్యూ శాఖకు చెందిన కాండ్రేగుల సంజీవ్‌కుమార్, వెంకటేశ్వరరావుఅనే వీఆర్వోలు, జీవీఎంసీలో మజ్దూర్‌గా పనిచేస్తున్న మునికోటి నాగేశ్వరరావు నివాసాల్లో సోదాలు జరిపింది.

ఇంట్లో డమ్మీ పిస్టల్

విశాఖజిల్లా మునగపాక మండలం చూచుకొండకు చెందిన కాండ్రేగుల సంజీవ్‌కుమార్ 2008లో వీఆర్వోగా రెవెన్యూ శాఖలో చేరాడు. ప్రస్తుతం మల్కాపురం క్లస్టర్ వీఆర్వోగా పనిచేస్తున్నాడు. భూకబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేయడంలో సంజీవ్‌కుమార్ సిద్ధహస్తుడని చెబుతున్నారు. అనకాపల్లిలోని అతని ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఒక డమ్మీ పిస్టల్ దొరికింది. సెటిల్‌మెంట్ల సమయంలో ఈ తుపాకీని సంజీవ్ వాడతాడని చెబుతున్నారు. ఆయన కుమార్తె హరిచందన ఎంటెక్ చదవగా, కొడుకు దినేష్‌ను రూ.70 లక్షలు కట్టి విజయనగరం మిమ్స్‌లో ఎంబీబీఎస్‌లో చేర్పించాడు. పత్రాల్లో దినేశ్‌ను వ్యాపారవేత్తగా చూపించి, అతని పేరిట అనేక పరిశ్రమలు, సంస్థలు స్థాపించడం గమనార్హం. సంజీవ్, అతని బినామీల ఇళ్లలో రూ. 40 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు.

సంజీవ్ అక్రమాల చిట్టా..

మద్దిలపాలెంలో రూ.1.7 కోట్లతో అపార్టుమెంటు, చినగంట్యాడలో భవనం, వడ్లపూడి వద్ద 88సెంట్ల స్థలం, అనకాపల్లిలో జీ+2 భవనం, కారు (ఇవి భార్యపేరిట).. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో మెడికల్ సెంటర్లు, పెదగంట్యాడలోని ఆటోనగర్‌లో సిమెంట్ క్లింకర్ తయారీ పరిశ్రమ, గాజువాక ఆటోనగర్‌లో సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ (ఇవి కుమారుడి పేరిట)... చినవాల్తేరు, చినగదిలి, పరదేశిపాలెం, ఎండాడ, వేపగుంట, చంద్రవానిపాలెం, మద్దిలపాలెం, మధురవాడలలో పలు ఖరీదైన స్థలాలకు అడ్వాన్సులు చెల్లింపు (ఇవి బినామీల పేరిట).. 733 గ్రాముల బంగారం, 6 లక్షల విలువైన గృహోపకరణాలు, ఓ బ్యాంకులో లాకర్.



వీఆర్వో సంజీవ్‌కుమార్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు

నాగుల పుట్టలు..

గంభీరంలో రెండు స్థలాలు, హెచ్‌బీ కాలనీలో జీ+2 భవనం, రెండు కార్లు. 555 గ్రాముల బంగారం, కిలో వెండి వస్తువులు, రూ.మూడు లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.ఐదు లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రూ.41 లక్షల బ్యాంక్ బాలెన్స్, రూ.1.21 లక్షల నగదు.

తవ్వినకొద్దీ..

పొలిశెట్టి వెంకటేశ్వరరావు వీఆర్వోగా 2008లో రెవెన్యూ శాఖలో చేరాడు. ప్రస్తుతం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని మద్దిలపాలెం క్లస్టర్‌లో పనిచేస్తున్నాడు. గాజువాకలోని వెంకటేశ్వరరావు ఇల్లు, సీతమ్మధార, గోపాలపట్నం, ఎస్.రాయవరం మండలం దర్లపూడి, నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లిలోని బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లభ్యమైన ఆస్తుల విలువ డాక్యుమెంట్ ప్రకారం రూ.1.11 కోట్లు కాగా, మార్కెట్ విలువ రూ.12 కోట్లు వుండవచ్చునని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆస్తుల వివరాలు..

మారుతీ స్విఫ్ట్ కారు, చినగంట్యాడలో 290 గజాల స్థలం, రెండంతస్తుల భవనాలు రెండు, 190 గ్రాముల బంగారం, నాలుగు లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.3.7 లక్షల నగదు, యాక్సిస్ బ్యాంకు ఎన్ఏడీ బ్రాంచిలో లాకర్.

క్రిమినల్‌తో కలిసి..

జీవీఎంసీ మజ్దూర్ మునికోటి నాగేశ్వరరావు నివాసంతోపాటు విశాఖ రేంజ్‌లో మరో నాలుగు చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నాగేశ్వరరావు 1997లో జీవీఎంసీలో చేరాడు. చాలాకాలం డిప్యుటేషన్‌పై టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేశాడు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ విభాగంలో మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యాసిడ్ శివ అనే క్రిమినల్‌తో కలిసి నాగేశ్వరరావు దందాలు సాగించినట్టు ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో నాగేశ్వరరావు ఇంటితోపాటు శివ నివాసంలోనూ అధికారులు సోదాలు నిర్వహించారు. మజ్దూర్ ఇంట గుర్తించిన ఆస్తుల విలువ రూ.1.31కోట్లు కాగా, మార్కెట్ విలువ రూ.10 కోట్లకుపైనే ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు.



బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో టోమోథెరపీ రేడియేషన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

సేవకు మారుపేరు బసవతారకం ఆస్పత్రి

- ఇండియాలోనే బెస్ట్ ఆస్పత్రిగా నిలవాలి: చంద్రబాబు
- త్వరలో అమరావతిలో భూమిపూజ: బాలకృష్ణ
- ఆస్పత్రిలో టోమోథెరపీ యంత్రం ప్రారంభం

హైదరాబాద్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : ఇండియాలోనే బెస్ట్ కేన్సర్ ఆస్పత్రి ఏడాదిలోగా అమరావతికి రావాలని... అది బసవతారకం కేన్సర్ ఆస్పత్రే కావాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో రూ.20 కోట్లతో ఏర్పాటు చేసిన టోమోథెరపీ యంత్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సేవకు మారుపేరుగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నిలుస్తోందన్నారు. ఎన్టీఆర్ పుట్టిన జిల్లాలో ఇలాంటి ఆస్పత్రి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అమరావతిలో బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి 15 ఎకరాలు కేటాయించామని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొన్ని ఇబ్బందులుంటాయని, ట్రస్టు ఆస్పత్రులైతే ప్రైవేట్‌కు దీటుగా సేవలందించే అవకాశం ఉంటుందని తెలిపారు. లాభాపేక్షలేకుండా వైద్య సేవలు అందించే ఆస్పత్రుల్లో బసవతారకం ఆస్పత్రి నంబర్ వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ టోమోథెరపీ యంత్రంతో కచ్చితత్వంతో కేన్సర్ కణతులను తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. రెండువారాల్లో విజయవాడలో శాటిలైట్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామని, బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామని వెల్లడించారు. ఆస్పత్రిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు నివాళులర్పించారు.

ఏమిటీ టోమోథెరపీ ?

కేన్సర్ చికిత్సలో రేడియోథెరపీ, టోమోగ్రఫీని కలగలిపి రూపొందించిన ఆధునిక విధానమే టోమోథెరపీ. అత్యాధునిక ఇమేజింగ్, రేడియేషన్ వ్యవస్థలను మేళవించడం ద్వారా కేన్సర్ కణుతులున్న ఆకారానికి అనుగుణంగా కచ్చితత్వంతో చికిత్స అందించడం దీని ప్రత్యేకత. దీని ద్వారా రేడియేషన్ చికిత్స సమయం తగ్గుతుంది. శరీరంలో అవసరమైన భాగానికే చికిత్స అందించడం ద్వారా ఇతర అవయవాలకు ఎలాంటి హానీ ఉండదు.

ఐటీ వినియోగంలో ఏపీది అగ్రస్థానం: చంద్రబాబు

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) వినియోగంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి నలుగురు ఐటీ ప్రొఫెషనల్స్‌లో ఒకరు ఆంధ్రప్రదేశ్ నుంచి ఉన్నారని చెప్పారు. హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ మెమోరియల్ పాఠశాలలో ఎన్టీఆర్ ట్రస్టు 20వ వార్షికోత్సవంలో మాట్లాడుతూ ఇప్పుడు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం పెద్ద కష్టం కాదన్నారు. మొన్నటివరకూ మగపిల్లలు కట్నం అడిగేవారని, వారే కట్నం ఇచ్చి పెళ్లిచేసుకునే రోజు ఎంతో దూరంలో లేదని చమత్కరించారు. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులను గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దేలక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నారాలోకేశ్, బ్రాహ్మణి దేవాన్, ట్రస్టు సీఈవో విష్ణువర్ధన్, డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి పేరు రాయలేరు.. ఆరో ఎక్కం చెప్పలేరు!

- మున్సిపల్ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల తీరిదీ...
- రాష్ట్రంలో 15శాతం మంది పరిస్థితి ఇదే
- ప్రత్యేకాధికారి పరిశీలనతో వెలుగులోకి



పదో తరగతి విద్యార్థులను ప్రశ్నిస్తున్న ప్రత్యేకాధికారి చంద్రమౌళీశ్వరరెడ్డి

మదనపల్లె టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వారు పేరుకే పదో తరగతి విద్యార్థులు. తండ్రి పేరును తెలుగులో రాయలేరు.. తాము చదువుతున్న బడి పేరును చూసి కూడా తప్పుల్లేకుండా రాయలేరు.. కనీసం ఆరో ఎక్కం కూడా చెప్పలేరు... చిత్తూరు జిల్లా మదనపల్లె మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థుల సామర్థ్యం. మున్సిపల్ విద్యాశాఖ రాష్ట్ర ప్రత్యేకాధికారి చంద్రమౌళీశ్వర రెడ్డి పరిశీలనలో వెలుగు చూసిన నిజాలివి. శనివారం మదనపల్లెలోని హోప్, వివేకానంద మున్సిపల్ హైస్కూళ్లను సలహాదారుడు వెంకటరమణతో కలసి ఆయన పరిశీలించారు. హోప్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులను వీరు ప్రశ్నించారు. ఒక విద్యార్థికి చేతికి తెల్ల కాగితం ఇచ్చి తండ్రి పేరును తెలుగులో రాయమంటే రాయలేకపోయాడు. ఇంకో విద్యార్థి తాను చదువుతున్న స్కూల్ పేరును చూసి రాయమంటే కూడా తప్పుల తడకగా రాశాడు. ఇద్దరు విద్యార్థినులను పిలిచి ఆరో ఎక్కం చెప్పమంటే తప్పుల్లేకుండా చెప్పలేకపోయారు. పది రోజుల్లో పబ్లిక్ పరీక్షలు రాయాల్సిన విద్యార్థుల తీరుతో అధికారులు నివ్వెరపోయారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని, అదేవిధంగా చదువులోనూ వారి సామర్థ్యం తెలుసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం చంద్రమౌళీశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 319మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికి 217 స్కూళ్లను పరిశీలించామని చెప్పారు. దాదాపు 15శాతం మంది పదో తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం కూడా చేతకావట్లేదని, ఆరో తరగతి నుంచి సరైన విద్యాబోధన, సామర్థ్య పరీక్ష నిర్వహణ జరగకపోవడమే దీనికి ప్రధాన కారణమని వివరించారు. తమ పరిశీలనపై మంత్రి నారాయణకు నివేదిక ఇస్తామని పేర్కొన్నారు.

జువైనెల్ కోర్టులపై చర్యలేంటి: హైకోర్టు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జువైనెల్ జస్టిస్ చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణలో జిల్లాలవారీగా ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయడానికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేమిటో తెలపాలని హైకోర్టు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది.

పీజీ వైద్య సీట్ల భర్తీ పై మంత్రుల మంతనాలు

హైదరాబాద్, మార్చి3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రుల లక్ష్మారెడ్డి, కామినేని శ్రీనివాస్ శనివారం భేటీ అయ్యారు. ఈ ఏడాది నుంచి వైద్య విద్య ప్రవేశాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు నేషనల్ పూల్‌లో చేరడంతో పీజీ వైద్య సీట్ల భర్తీ ఎలా చేయాలనే అంశంపై చర్చించారు. ప్రధానంగా పీజీ సీట్ల భర్తీకి వెయిటేజీ ఎంత ఇవ్వాలి? అన్‌రిజర్వ్‌డ్ ఉంచాలా? వద్దా? అనే అంశాలపై చర్చించారు. దీనిపై త్వరలోనే నిబంధనల ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

'మిషన్' పాజిబుల్!

- అసాధ్యాన్ని సాధ్యం చేసిన బీజేపీ
- దేశంలోనే తొలిసారి లెఫ్ట్-రైట్ పోరు
- బీజేపీ శైలిలోనే ఎన్నికల ఆపరేషన్
- విజయవంతం చేసిన ఆర్ఎస్ఎస్
- ఐదేళ్లలోనే సున్న నుంచి అధికారానికి

భారత రాజకీయాల్లో బీజేపీ, వామపక్షాలు సిద్ధాంతపరంగా పూర్తి భిన్న ధ్రువాలు. కానీ, విచిత్రంగా ఇంతవరకు ఆ రెండు సిద్ధాంతాల మధ్య ఏ రాష్ట్రంలోనూ ముఖాముఖి పోరు జరగలేదు. తొలిసారి అలాంటి రసవత్తర పోరుకు ఈశాన్య రాష్ట్రం త్రిపుర వేదికైంది. పాతికేళ్లుగా అక్కడ సీపీఎం రాజ్యమేలుతోంది. దాంతో ఆ రాష్ట్రంలో వామపక్ష వ్యతిరేక శక్తులకు వేదిక అవసరమైంది. యాభై ఏళ్లుగా త్రిపురలో చాపకింద నీరులా పని చేస్తున్న ఆర్ఎస్ఎస్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. లెఫ్ట్-రైట్ మధ్య చరిత్రాత్మక పోరుకు తెరలేచింది. బీజేపీ సాధించిన విజయాల్లోకెల్లా త్రిపురలో సాధించిన విజయం ఆ పార్టీకి అత్యంత మధురం. ఇందులో ఆర్ఎస్ఎస్ ఐదేళ్ల శ్రమ ఉంది. మోదీ ప్రధానిగా ఎన్నికవగానే సంఘ్ ఆపరేషన్ త్రిపుర మొదలెట్టింది. వారణాసిలో మోదీ ఎన్నికల ప్రచార వ్యవహారాలు చూసిన సునీల్ దేవ్‌ధర్(52)ను త్రిపుర ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనతో పాటు ఢిల్లీలో స్థిరపడిన త్రిపుర సంఘ్ కార్యకర్త విప్లవ్ కుమార్ దేవ్ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా తిరిగి సొంత రాష్ట్రానికి వచ్చారు. 2013 శాసనసభ ఎన్నికల్లో కేవలం 1.3 శాతం ఓట్లు సాధించిన కాషాయదళం ఇప్పుడు ఏకంగా 42.5 శాతానికి ఎదిగింది. సున్న సీట్ల నుంచి మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. ఈ విజయంలో ప్రధాన పాత్ర సంఘ్‌దే.

సంఘ్: ఆర్ఎస్ఎస్ ఏకంగా ఓటర్ లిస్టులో ఒక్కో పేజీ కోసం ఒక్కో ఇన్‌చార్జిని(పన్నా ప్రముఖ్) రంగంలోకి దింపింది. పేజీలో ఉన్న 60 మంది ఓటర్లను ఎన్నికలకు రెండు నెలల ముందే కలవడం పన్నా ప్రముఖ్‌కు ఇచ్చిన టార్గెట్. ఈ లక్ష్యంతో 42,000 మంది పన్నా ప్రముఖ్‌లు పని చేశారు.



మోదీ: ఈశాన్య రాష్ట్రాల ప్రజల్లో మోదీ ప్రభావం అధికంగా ఉంది. ఆయన్ను సత్తా ఉన్న ప్రధానిగా చూస్తున్నారు. అందుకే బీజేపీ కూడా స్థానిక నేతలను కాకుండా మోదీనే చూపించి ప్రచారం నిర్వహించింది.

అభివృద్ధి: ప్రజల ఆకాంక్షలు మారాయని, వారు అభివృద్ధిని కోరుకుంటున్నారని సీపీఎం గ్రహించలేకపోయింది. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రాగానే ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపింది. మిలిటరీ రాకపోకల కోసం భారీ ఎత్తున రైలు, రోడ్ల నెట్‌వర్క్‌లను విశాలంగా తీర్చిదిద్దింది. దాంతో తొలిసారిగా త్రిపురకు అభివృద్ధి పరిచయమైంది.

బీజేపీ: దేశంలో అతిపెద్ద సాధనా సంపత్తి ఉన్న పార్టీ బీజేపీ. ఇప్పటికే 29 రాష్ట్రాల్లో 19 రాష్ట్రాలు మిత్రపక్షాలతో కలిపి దాని చేతిలోనే ఉన్నాయి. నిజానికి త్రిపురలో బీజేపీ అనుసరించిన వ్యూహం కొత్తదేమీ కాదు. క్షేత్రస్థాయి వరకు పార్టీ వ్యవస్థను విస్తరించడం. ప్రజల సుపరిపాలన ఆకాంక్షలను నెరవేర్చగలమని నమ్మకాన్ని కల్పించడం, ఇతర పార్టీల ముఖ్యనేతలను పార్టీలోకి తెచ్చుకోవడం ఇతర రాష్ట్రాల్లో అనుసరించిందే. దేశంలోకెల్లా అతిపేద ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్... మోదీ, అమిత్‌షాల ప్రచార మోహరింపును తట్టుకోలేక పోయారు. గత రెండేళ్లలో 52 మంది కేంద్ర మంత్రులు రాష్ట్రంలో పర్యటించారు. చివర్లో భారీ నేతలంతా ప్రచారానికి వచ్చారు. దాంతో బీజేపీ ప్రచారం పతాక స్థాయికి చేరింది. నేతల రాకతో సీపీఎం కార్యకర్తలతో పోరాడుతున్న బీజేపీ కేడర్‌కు ఆత్మస్థైర్యం పెరిగింది.

అసోం బీజేపీ: అసోం నుంచి భారీఎత్తున బీజేపీ కార్యకర్తలు వచ్చి ప్రచారం చేశారు.

వ్యతిరేక ఓటు: గత కొన్ని దశాబ్దాలుగా త్రిపురలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెసే. సీపీఎంకు ప్రత్యామ్నాయంగా మాత్రం అది ఎదగలేక పోయింది. ఆ శూన్యాన్ని ఆక్రమించడమే బీజేపీ చేసిన పని. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పది సీట్లు గెలవగా ఏడుగురు తృణమూల్ కాంగ్రెస్‌లోకి జంప్ చేశారు. చివరకు ఎన్నికలకు ఆర్నెల్ల ముందు బీజేపీలోకి వచ్చి చేరారు. దాంతో కాంగ్రెస్ నైతికంగా ఘోరంగా దెబ్బతింది. దాని ఓట్ల వాటా 36.5 శాతం నుంచి 2 శాతానికి పడిపోయింది. కాంగ్రెస్ వైఫల్యంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటును సొంతం చేసుకొనే పార్టీగా బీజేపీ మారింది.

పొత్తు: రాష్ట్రంలో 28 శాతం గిరిజనులు ఉన్నారు. మొత్తం 60 సీట్లలో 33 సీట్లు రిజర్వుడు సీట్లే. స్థానిక గిరిజన పార్టీ ఐపీఎఫ్‌టీ వేర్పాటువాద పార్టీ కావడంతో దాంతో పొత్తు పెట్టుకోవడానికి రాష్ట్రంలోని ఏ పార్టీ కూడా ఇష్టపడదు. కానీ, బీజేపీ ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంది. ఐపీఎఫ్‌టీతో పొత్తు ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ప్రతీ ఓటును సొంతం చేసుకుంది. 7.5 శాతం ఓట్లు సాధించిన ఐపీఎఫ్‌టీ బీజేపీ ఘనవిజయంలో కీలక భూమిక పోషించింది. సీపీఎంకు 42.7 శాతం ఓట్లు వస్తే బీజేపీకి 43 శాతం ఓట్లు వచ్చాయి. ఐపీఎఫ్‌టీ పుణ్యాన మూడింట రెండొంతుల మెజారిటీని సొంతం చేసుకుంది. త్రిపురలో గిరిజనుల అరాచకం ప్రబలుతుందేమోనని భయపడే దిగువ తరగతి బెంగాలీలు మాత్రం సీపీఎంకు అండగా నిలిచారు. అందుకే, తమ పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నా సీపీఎం చెప్పుకోదగ్గ ఓట్ల శాతం సాధించింది.

బంగ్లా హిందువులు: బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన బెంగాలీ హిందువులకు భారత పౌరసత్వం ఇవ్వడానికి బీజేపీ మద్దతు ఇస్తోంది. దాంతో మొత్తం త్రిపురలోని బెంగాలీలందర్లో బీజేపీ పట్ల సానుకూల వాతావరణం ఏర్పడింది.

ఉద్యోగులు: ఏడో వేతనసంఘం సిఫార్సులకు అనుగుణంగా జీతాలు ఇస్తామని చెప్పడంతో ఉద్యోగులంతా బీజేపీకి మద్దతు పలికారు.

ఇక దక్షిణ దండయాత్రే!

- కర్ణాటకలో ఊపుతెచ్చిన త్రిపుర విజయం

న్యూఢిల్లీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి):పాతికేళ్లుగా త్రిపురలో అధికారంలో ఉన్న వామపక్షాలను చిత్తుగా ఓడించి బీజేపీ అధికారం సాధించడం, త్రిపుర, నాగాలాండ్‌లలో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోవడం దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రతిపక్షాలను అప్రమత్తం చేసింది. త్రిపురలో వచ్చిన ఊపు కర్ణాటకలో కూడా పని చేస్తుందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. నిజానికి కర్ణాటకలోని స్థితికీ త్రిపురలో ఉన్న పరిస్థితికీ తేడా ఉన్నప్పటికీ బీజేపీకి దేశంలో తిరుగులేదన్న భావన కర్ణాటక ప్రజల్లో మానసికంగా కలుగచేసేందుకు ఆపార్టీ యథాశక్తి ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయాలంటే కర్ణాటకలో కాంగ్రెస్, ప్రతిపక్షాలు మరింత బలంగా కృషి చేయకతప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. కర్ణాటకలో బీజేపీ విజయం సాధిస్తే దేశంలో సాధారణ ఎన్నికలకు మోదీ సర్కార్ వెంటనే సిద్ధపడుతుందని, మోదీని ఎదుర్కోవడం అంత సులభంకాదని వారంటున్నారు. గతంలో వాజపేయి హయాంలో కర్ణాటకలో విజయం సాధించినపుడు అదే దక్షిణభారతంలో బీజేపీ ముఖద్వారంగా భావించారని, ఇప్పుడు అదే ముఖద్వారంతో దక్షిణాదిన ప్రవేశం చేందుకు మళ్లీ ఒకసారి ప్రయత్నాలు చేస్తుందని పరిశీలకులు అంటున్నారు. త్రిపురలో హిందూ బెంగాలీ, గిరిజన ఓటర్లను ఆకట్టుకుని, కాంగ్రెస్ ఓటుబ్యాంకును హస్తగతం చేసుకుని విజృంభించిన మాదిరే కర్ణాటకలో కూడా దక్షిణ కర్ణాటక, మధ్య కర్ణాటకలో భావోద్వేగాల కారణాల ఆధారంగా బీజేపీ బలోపేతం అవుతోందని, పట్టణప్రాంతాల్లో బీజేపీ గతంలో లేనంతగా బలపడిందని ఆపార్టీ నాయకుడొకరు చెప్పారు. త్రిపురలో మెజారిటీ బెంగాలీ ఓటర్లు, గిరిజనులు, నిరుద్యోగ యువకులు, నాగాలాండ్‌లో క్రైస్తవ ఓటర్లు కూడా బీజేపీవైపు మొగ్గు చూపారు. ప్రకాశ్ కరత్ వర్గానికి చెందిన మాణిక్‌సర్కార్ పరాజయం చెందడంతో బీజేపీయేతర మహా కూటమి ఏర్పాటు చేయాలన్న సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాంఏచూరి వాదనలకు బలం చేకూరనుంది. త్రిపురలో విజయం తర్వాత బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలున్న రాష్ట్రాలు కర్ణాటక, ఒడిసా కాగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కనీసం ఒక రాష్ట్రాన్ని బీజేపీ చేజారిపోకుండా కాపాడుకుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. త్రిపురలో బెంగాలీ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడం బెంగాల్‌లో కూడా పరిస్థితి మారిందనడానికి నిదర్శనమని అంటున్నారు. ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని మరోసారి ప్రశ్నార్థకం చేశాయి. కర్ణాటకలో కూడా బీజేపీ గెలిస్తే ఇది దేశవ్యాప్తంగా కాంగ్రెస్ లో చిచ్చు రేపుతుందని, మొత్తం ప్రతిపక్షాల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తుందని పరిశీలకులు అంటున్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తున్న సమయంలో రాహుల్‌గాంధీ హోలీ పండగ కోసం ఇటలీ వెళ్లడంపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను మరింత ఇబ్బంది పెట్టేవే.

కాంగ్రెస్‌కు ఘోర పరాభవం

- త్రిపుర, నాగాలాండ్‌లో సీట్లు సున్నా త్రిపురలో వచ్చిన ఓట్లు 1.8%
- నాగాలాండ్‌లోనూ అదే పరిస్థితి

అగర్తల, మార్చి 3: స్వాతంత్ర్యానంతరం త్రిపురలో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌దే పెత్తనం.. పాతికేళ్లుగా సీపీఎంకు ప్రత్యామ్నాయ పార్టీ. కానీ, ఆ పార్టీ పరిస్థితి ఇప్పుడు దారుణంగా తయారైంది. ఎంతలా అంటే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలుచుకోలేకపోయింది. ఓట్లపరంగా కూడా ఆ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. ఈ ఎన్నికల్లో మొత్తం 25,05,997 మంది ఓటు హక్కును వినియోగించుకోగా కేవలం 45,108 ఓట్లు మాత్రమే కాంగ్రెస్‌కు వచ్చాయి. శాతం పరంగా చూసుకుంటే అది కేవలం 1.8%. అదీ కాక, ఏ ఒక్క అసెంబ్లీ స్థానంలోనూ రెండో స్థానంలో లేదంటే పార్టీ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 22,02,065 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్‌కు 8,04,457(36.5%) ఓట్లు వచ్చాయి.

దారుణ పరిస్థితికి కారణమేంటి?

1963 నుంచి 1993 వరకు కాంగ్రెస్ పార్టీకి త్రిపుర కంచుకోట. ఆ తర్వాత సీపీఎం పట్టు నిలబెట్టుకుంటూ వచ్చింది. ప్రతీసారి ఇక్కడ కాంగ్రెస్, సీపీఎంల మధ్య ద్విముఖ పోరు జరిగేది. అయితే, పార్టీ నుంచి వలసలు, పేరున్న నాయకుడు లేకపోవడంతో ఈసారి ఘోర పరాభవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎన్నికలకు ముందు ఆరుగురు కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు కీలక నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో పార్టీ ప్రాభవాన్ని కోల్పోయింది. ఎన్నికలకు ముందు సీపీఎం నేత ప్రకాశ్ కరత్ కూడా బీజేపీతోనే తమ పోటీ అని ప్రకటించడం విశేషం. ఎన్నికలు దగ్గర పడుతున్నా ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నుంచి ఒక్క ప్రకటనా వెలువడలేదు.

నాగాలాండ్‌లోనూ: కాంగ్రెస్‌కు ఇక్కడ ఎప్పుడూ గడ్డు కాలమే. అభ్యర్థులను బరిలో నిలిపేందుకూ ఇబ్బంది పడింది. ఈ సారి 18 పార్టీ టికెట్ తీసుకోగా అందులో ఐదుగురు ఓటింగ్‌కు ముందే పోటీ నుంచి తప్పుకోవడం గమనార్హం. 2013లో 56 సీట్లకుగానూ కాంగ్రెస్‌కు 8 సీట్లు వచ్చాయి. కానీ, ఈ సారి ఒక్క సీటూ రాలేదు. అక్కడ ఆశలు లేక ఎన్నికల ప్రచారానికి పార్టీ పెద్దలెవ్వరూ రాలేదు.

నీరవ్‌మోదీ అరెస్ట్‌కు ఎన్‌బిడబ్ల్యు



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ను నిండా ముంచిన నీరవ్ మోదీ ఆయన మేనమామ మెహుల్ చోక్సీకి వ్యతిరేకంగా నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బిడబ్ల్యు)జారీ అయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అభ్యర్థన మేరకు ముంబైలోని పిఎంఎల్‌ఎ స్పెషల్ కోర్టు ఈ వారెంట్లు జారీ చేసింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాల్సిందిగా కోరుతూ ఇడి జారీ చేసిన సమన్లను నీరవ్ మోదీ, చోక్సీ పట్టించుకోలేదు. ఈ ఇద్దరూ దేశం విడిచిపారిపోయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో ప్రమోటర్లు సింగ్ బ్రదర్స్ ఆర్థిక అక్రమాలకు సంబంధించి దర్యాప్తు జరుపుతున్న సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కొంత సమాచారం, మరికొన్ని కీలక పత్రాల కోసం కంపెనీకి నోటీసులు పంపింది. ఈ విషయాన్ని కంపెనీ కూడా ధృవీకరించింది.



సేవ కోసం రూ.3,250 కోట్లు

ఫేస్‌బుక్ షేర్లు విక్రయించిన జుకర్‌బర్గ్

వాషింగ్టన్ : సోషల్ మీడియా సర్వీసులు అందిస్తున్న ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ సేవా కార్యక్రమాల బాట పట్టారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం ఫేస్‌బుక్ ఈక్విటీలో తన వాటాలోని కొన్ని షేర్లను అమ్మి నిధులు సమీకరిస్తున్నారు. గత ఫిబ్రవరిలోనే ఇందుకోసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.3,250 కోట్లు) విలువైన 27 లక్షల ఫేస్‌బుక్ షేర్లను ఆయన విక్రయించారు. ఇందులో 12.85 కోట్ల డాలర్ల విలువైన 6.85 లక్షల షేర్లను ఫిబ్రవరి నెల 26-28 మధ్య విక్రయించారు. తన నిర్వహణలోని చాన్ జుకర్‌బర్గ్ ఇనిషియేటివ్ (సిజెఐ) అనే స్వచ్ఛంద సంస్థకు అవసరమైన నిధుల కోసం జుకర్‌బర్గ్ ఈ షేర్లు విక్రయించారు.

99 శాతం వాటా దానం చేస్తా...

ప్రపంచవ్యాప్తంగా సైన్సు, ఎడ్యుకేషన్, జస్టిస్, అవకాశాలు వంటి విషయాలకు ఆర్థిక సాయం అందించేందుకు జుకర్‌బర్గ్ తన భార్య ప్రిసీలియా చాన్ పేరు కలిసొచ్చేలా 2015 డిసెంబరులో సిజెఐ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. అప్పుడే ఫేస్‌బుక్ ఈక్విటీలో 99 శాతం వాటా షేర్లను ఈ సంస్థ కోసం దానం ఇస్తానని ప్రకటించారు. అప్పట్లోనే ఫేస్‌బుక్ షేర్ల మార్కెట్ విలువ 4,500 కోట్ల డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఇది దాదాపు రూ.2.92 లక్షల కోట్లకు సమానం.

మరిన్ని షేర్ల అమ్మకం?

కొన్ని సంవత్సరాలకు సరిపడా సిజెఐకి పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తానని, జుకర్‌బర్గ్ గత ఏడాది సెప్టెంబరులోనే ప్రకటించారు. ఇందుకోసం ఫేస్‌బుక్‌లో తనకున్న షేర్లలో 3.5 కోట్ల నుంచి 7.5 కోట్ల షేర్లను వచ్చే ఏడాదిన్నర కాలంలో విక్రయించనున్నట్టు ఆయన చెప్పారు. ఫేస్‌బుక్ షేర్ల ప్రస్తుత మార్కెట్ ధరను పరిగణనలోకి తీసుకుంటే ఈ అమ్మకం ద్వారా 1,300 కోట్ల డాలర్లు (సుమారు రూ.84,500 కోట్లు) సమకూరుతాయి. జుకర్‌బర్గ్ గత రెండేళ్లలోనే దాదాపు 160 కోట్ల డాలర్ల విలువైన షేర్లు అమ్మారు. దీంతో త్వరలో ఫేస్‌బుక్‌లో ఆయన మరిన్ని షేర్లను సిజెఐ కోసం విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

షేర్ల అమ్మకంపై సందేహాలు!

జుకర్‌బర్గ్ షేర్ల అమ్మకాలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ వంటి ఇతర సోషల్ మీడియాలతో పోలిస్తే ఇటీవల ఫేస్‌బుక్ వృద్ధి రేటు పడిపోయింది. నిన్న మొన్నటి వరకు రోజులో ఎక్కువ సేపు ఫేస్‌బుక్‌కే అతుక్కు పోయిన యువతరంలో ఎక్కువ మంది తమ ఫేస్‌బుక్‌ను క్లోజ్ చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. పెద్ద వాళ్లు కూడా అడపాదడపా తప్పించి ఫేస్‌బుక్ వాడడం లేదని ఓ సంస్థ ఇటీవల తెలిపింది. దీంతో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఉద్దేశంతోనే జుకర్‌బర్గ్ షేర్ల అమ్మకాలకు దిగారా? అనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.

లాలాజలంతో చక్కెర వ్యాధి గుర్తింపు



- వ్యాధి నిర్ధరణకు ప్రత్యేక స్ట్రిప్స్
- ఒక పరీక్ష ఖరీదు రూ.65
- అభివృద్ధి చేసిన డయాబెటోమిక్స్
- హైదరాబాద్‌లో ప్లాంట్ ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : మధుమేహ (చక్కెర) వ్యాధి నిర్ధారణ కోసం ఇకపై డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదు. కేవలం లాలాజలంతో ఈ వ్యాధి ఉందో లేదో నిర్ధారించుకోవచ్చు. హైదరాబాద్‌కు చెందిన డయాబెటోమిక్స్.. ప్రత్యేకమైన టెక్నాలజీతో లాలాజలాన్ని పరీక్ష చేయటం ద్వారా శరీరంలో చక్కెర స్థాయిలను తెలుసుకునే విధంగా స్ట్రిప్‌లను అభివృద్ధి చేసింది. ఈ తరహా ఉత్పత్తిని అభివృద్ధి చేయటం ప్రపంచంలోనే ఇది తొలిసారి. అంతేకాదు ఈ స్ట్రిప్ ధర కూడా కేవలం 65 రూపాయలు (ఒక డాలర్) మాత్రమే. ఈ స్ట్రిప్స్ తయారీ కోసం డయాబెటోమిక్స్ హైదరాబాద్ సమీపంలోని ముప్పిరెడ్డిపల్లిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. శనివారం నాడిక్కడ ఈ ప్లాంట్‌ను తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు, డయాబెటోమిక్స్ మెడికల్ లిమిటెడ్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, సిఇఒ శ్రీనివాస్ నాగళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్ నాగళ్ల మాట్లాడుతూ.. ప్రస్తుతం చక్కెర వ్యాధిని గుర్తించటానికి ప్లాస్మాగ్లూకోజ్, బ్లడ్ బ్లాస్ట్ విధానాలు ఉన్నాయని, అయితే డయాబెటోమిక్స్ తయారు చేసిన స్ట్రిప్స్‌ను లాలాజలం ఉపయోగించటం ద్వారా టైప్-2 మధుమేహాన్ని గుర్తిచవచ్చని చెప్పారు.ఈ తరహా ఉత్పత్తిని అభివృద్ధి చేయటం ప్రపంచంలో ఇదే తొలిసారని, దీనికి సంబంధించి బహుళ పేటెంట్లను దాఖలు చేసినట్లు వివరించారు. 25 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కోటి స్ట్రిప్స్, 15 వేల రీడర్స్ అని తెలిపారు. ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి ఈ ఉత్పత్తి వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందని చెప్పారు. తొలుత ఈ ఉత్పత్తిని అమెరికా, యుకె మార్కెట్లకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌కు మరింత గుర్తింపు..

డయాబెటోమిక్స్.. మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం సరికొత్త ఉత్పత్తిని తీసుకురావటంతో హైదరాబాద్‌కు మరింత గుర్తింపు లభించనుందని పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. శాంతా బయోటెక్నిక్స్ ఫౌండర్ అయిన వరప్రసాద్ రెడ్డి.. హైదరాబాద్‌ను ఇప్పటికే వాక్సిన్ హబ్‌గా మార్చారని, తాజాగా అందుబాటు ధరల్లో డయాబెటిక్ నిర్ధారణ ఉత్పత్తిని తీసుకువచ్చి మరింత పేరు తీసుకువచ్చారని అన్నారు.

2025 నాటికి రూ.10,000 కోట్ల టర్నోవర్

ఏటా 2.5 లక్షల కార్ల విక్రయ లక్ష్యం: వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్

హైదరాబాద్, విజయవాడ, బెంగళూరులో ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం


వాహనాల విక్రయ రంగంలో దేశంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది వరుణ్ మోటార్స్. వారసత్వంగా వచ్చిన ఈ వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించి మరింత వృద్ధిలోకి తీసుకువెళ్లారు వరుణ్ గ్రూప్ చైర్మన్ వి ప్రభు కిశోర్. ఆటోమొబైల్ రంగంతో పాటు హాస్పిటాలిటీ, రియల్టీ రంగాల్లో వరుణ్ గ్రూప్ తనదైన ముద్ర వేసింది. గ్రూప్ ప్రస్థానం, భవిష్యత్ ప్రణాళికలు, లక్ష్యాలను ఎబిఎన్ ఆంధ్రజ్యోతి 'బెస్ట్ ఇన్ ది బిజినెస్'తో పంచుకున్నారు ప్రభు కిశోర్. ఆ వివరాలు..

మీ వ్యాపారం విజయవాడ నుంచి విశాఖకు ఎలా విస్తరించింది ?

● మా నాన్న కేశవ రావు చౌదరి 1950లో పద్మజా కమర్షియల్ కార్పొరేషన్ పేరుతో ట్రాక్టర్లు, మోటార్ సైకిల్స్ విక్రయించేవారు. పాతికేళ్ల తర్వాత ఈ వ్యాపారం అంతా సాఫీగా సాగకపోవటంతో అమెరికాకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఆలోచనలను పక్కకుబెట్టి తండ్రికి చేదోడువాదోడుగా ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టాను. 1975-77లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో చదువుకున్నాను. అప్పటి నుంచి నాకు విశాఖ అంటే ఇష్టం ఏర్పడింది. దీంతో 1986లో వైజాగ్‌లో కొన్ని స్థలాలను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రవేశించాను. అదే సమయంలో బజాజ్ డీలర్‌షిప్.. వైజాగ్‌లో కావాలని అడగటం.. అప్పుడే వరుణ్ అనే బ్రాండ్‌ను పరిచయం చేయటం జరిగింది. 1950 నుంచి ఆటోమొబైల్ వ్యాపారంలో ఉన్నా 1986-90మధ్యకాలంలో వరుణ్ మోటార్స్ పేరుతో బజాజ్ షోరూమ్‌ను ప్రారంభించటం ఒక గేమ్‌చేంజర్‌గా నిలిచింది.

వరుణ్ మోటార్స్ సక్సెస్ మంత్ర ఏమిటీ ?

● ముందు నుంచి నేను చాలా అగ్రెసివ్‌గా ఉండేవాడిని. 1990కి ముందు బజాజ్ స్కూటర్స్‌కు పదిహేనేళ్ల వెయిటింగ్ పీరియడ్ ఉండేది. మేము షోరూమ్‌ను ప్రారంభించిన తర్వాత లభ్యత పెరిగింది. అప్పట్లో వినియోగదారులను స్కూటర్స్‌ను తాకనిచ్చేవారు కాదు. మేము వినియోగదారులు ప్రత్యక్షంగా స్కూటర్‌ను పరిశీలించేందుకే కాకుండా, టెస్ట్ డ్రైవ్‌కూ అవకాశం ఇచ్చాం. స్కూటర్ కొనుగోలుకు ఫైనాన్స్ సదుపాయాలు కల్పించటం, కేవలం మూడు నాలుగు గంటల్లో వాహనం డెలివరీ చేయటం ఇవన్నీ వరుణ్ మోటార్స్‌కు పేరు తెచ్చిపెట్టాయి. మా మార్కెట్ వాటా ఏకంగా 80 శాతం పెరిగిపోయింది. మా పోటీని తట్టుకోలేక కొన్ని డీలర్‌షిప్స్ కూడా మూతపడ్డాయి. అప్పుడు ప్రారంభించిన ఫైనాన్స్ వ్యాపారం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఈ విభాగం కింద 300 కోట్ల రూపాయల వరకు ఫైనాన్స్ చేస్తు న్నాం. ఉద్యోగులను సొంత కుటుంబ సభ్యులుగా చూసుకోవటం కూడా వరుణ్ గ్రూప్ వృద్ధికి తోడ్పడింది. ప్రస్తుతం గ్రూప్‌లో 12 వేల మంది ఉద్యోగులున్నారు.



పాతికేళ్లుగా బజాజ్ అటో, మారుతి సుజుకీతో ఉన్న అనుబంధం మీరు ఎలా చూస్తారు ?

● మేము ఇక్కడ ఉన్నామంటే మాన్యుఫ్యాక్చరర్స్ మాత్రమే కారణం. అలాగే వారి ఉత్పత్తులను విక్రయించటం కోసం మేం పనిచేస్తున్నాం. వ్యాపారపరంగా ఇరువురు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సాగుతుంటాం. దీర్ఘకాలం పాటు సంబంధాలను కొనసాగించటం నాకు ముఖ్యం. మాన్యుఫ్యాక్చరర్స్, బ్యాంకర్లు, ఉద్యోగులతో నేను ఎలా వ్యవహరిస్తానో నా వారసులు అదే కొనసాగిస్తున్నారు. మా కుమారుడు వరుణ్ కూడా గ్రూప్‌లో కొన్ని బాధ్యతలను చేపట్టాడు. ఎక్కడా కూడా అతడికి ఇబ్బందులు ఎదురుకాలేదు.

కాంపిటీషన్‌ను తట్టుకోవటానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

● నలభై ఏళ్ల క్రితం ఈ వ్యాపారంలో ప్రవేశించినప్పుడు దేశంలో నెలకు కేవలం 5,000 కార్లు మాత్రమే ఉత్పత్తి అయ్యేవి. ఇప్పుడు నెలకు 3 లక్షలకు పైగా కార్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందుకు తగ్గట్టుగానే డీలర్‌షిప్ నెట్‌వర్క్, వర్క్ షాప్స్ పెరిగిపోయాయి. పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసుకుంటూ నెట్‌వర్క్‌ను పెంచుకుంటూ వెళ్లిన వారు వృద్ధిలోకి వచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ వ్యాపారాన్ని, రియల్టీ వ్యాపారాన్ని కలిపి చేసిన వారు మరింత వృద్ధిపథంలోకి చేరారు. మేము ఈ రెండింటిని పాటించటంతో పోటీదారులకు అందనంత దూరంలో ఉన్నాం.

2030నాటికి ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకురానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై మీరేమంటారు?

● ప్రభుత్వం నిర్దేశించుకున్న సమయానికి పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ కార్లను తీసుకురావటం సాధ్యంకాకపోవచ్చు. 2030 నాటికి నెలకు 6 లక్షలకు పైగా కార్లు అమ్ముడవుతాయని అంచనా. ఈ సమయంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల పేరుతో ఎలక్ట్రిక్ కార్లను తీసుకురావటం అసాధ్యం. ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన విద్యుత్‌ను అందించటం సవాల్‌తో కూడుకున్న పని, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఆలోచన చేయలేదు. బ్యాటరీల ఉత్పత్తి, వాటిని నాశనం చేయటంవంటి అంశాలపై ఇంకా స్పష్టత లేదు. 2030 నాటికి పూర్తిగా ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి చేయాలన్న లక్ష్యం సాధ్యంకాకపోవచ్చు. కొంత మార్పురావటం మాత్రం ఖాయం.

హాస్పిటాలిటీ రంగంలోకి ఎలా ప్రవేశించారు?

● వరుణ్ గ్రూప్ సరైన సమయంలో హాస్పిటాలిటీ రంగంలోకి అడుగు పెట్టింది. వైజాగ్‌లో బీచ్ రోడ్డులో వరుణ్ నోవాటెల్ హోటల్ చాలా అద్భుతంగా నిర్మించాం. భీమిలిలో వరుణ్ రిసార్ట్ కూడా చక్కగా నడుస్తోంది. హాస్పిటాలిటీ వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో కెబిఆర్ పార్క్ ఎదురుగా 120 గదులతో ఒక హోటల్ నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. విజయవాడలో ఏర్పాటు చేస్తున్న నోవాటెల్ మరో మూడు నెలల్లో అందుబాటులోకి రానుంది. అలాగే బెంగళూరులో హెబ్బల్‌లో 225 గదుల హోటల్‌ను నిర్మిస్తున్నాం. ఈ హోటల్ పనులు వచ్చే మూడు నెలల్లో ప్రారంభం కానున్నాయి. అలాగే విజయవాడలో పద్మజా కార్పొరేషన్‌కు చెందిన ఆస్తులున్నాయి. వీటిల్లో రిటైల్ మాల్, ఐబిస్ పేరుతో ఆకోర్‌తో కలిసి బడ్జెట్ హోటల్‌ను ఏర్పాటు చేయనున్నాం. వరుణ్ మోటార్స్‌ను దాదాపు పాతికేళ్లుగా నిర్వహిస్తున్నా.. రాని గుర్తింపు వరుణ్ హాస్పిటాలిటీతో కొన్ని సంవత్సరాల్లోనే వచ్చింది.

భవిష్యత్ ప్రణాళికలేమిటి ?

● 2022-23 నాటికి ఏటా 2.5 లక్షల కార్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే దేశంలో ఎక్కువగా కార్లు విక్రయిస్తున్నది వరుణ్ గ్రూప్ మాత్రమే. ప్రస్తుతం గ్రూప్ టర్నోవర్ 4,000 కోట్ల రూపాయలుగా ఉంది. 2025నాటికి 10,000 కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే ప్రభు ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. ఈ ట్రస్ట్ కిందికి గ్రూప్‌లోని ఆస్తులను మొత్తం తీసుకురానున్నాం.

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకంతో

అమెరికాకే నష్టం



ఐఎంఎఫ్ హెచ్చరిక.. ట్రంప్ దెబ్బకు మార్కెట్లు ఫట్

60,000 కోట్ల డాలర్లు నష్టపోయిన మార్కెట్లు

వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకం విధించాలన్న అమెరికా నిర్ణయం వల్ల ఆ దేశానికే కాకుండా దాని భాగస్వామ్య దేశాలకు కూడా ఇబ్బందిని కలిగిస్తుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో వర్తకపరమైన విభేదాలను నిర్మాణాత్మకంగా పరిష్కరించుకునేందుకు అన్ని దేశాలు కృషి చేయాలని సూచించింది. ఉక్కు దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం దిగుమతులపై 10 శాతం సుంకాన్ని విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. తమ దేశంలోని కంపెనీల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన చెబుతున్నారు. అయితే ఈ నిర్ణయం అమెరికా వెలుపలి దేశాలనేకాకుండా అమెరికాను కూడా ప్రభావితం చేస్తుందని ఐఎంఎఫ్ అధికారప్రతినిధి జెర్రీ రైస్ అన్నారు. అల్యూమినియం, ఉక్కును అధికంగా వినియోగిస్తున్న మాన్యుఫ్యాక్చరింగ్, నిర్మాణ రంగాలను ఇబ్బందులకు గురి చేస్తుందని చెప్పారు. అమెరికా దాని వర్తక భాగస్వాముల మధ్య నెలకొన్న వర్తకపరమైన అడ్డంకులు తగ్గేందుకు, వాణిజ్యపరమైన విభేదాలు పరిష్కరించేందుకు తాము కృషి చేయనున్నట్టు ఆయన చెప్పారు. కాగా ట్రంప్ ప్రకటన పట్ల కెనడా, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, మెక్సికో దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. తమ ప్రయోజనాలు కాపాడుకునేందుకు చర్యలు తీసుకోనున్నట్టు యూరోపియన్ కమిషన్ చీఫ్ జీన్ క్లాడ్ జంకర్ తెలిపారు. ఉక్కు, అల్యూమినియంపై సుంకాలు విధించడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని కెనడా, జర్మనీ స్పష్టం చేశాయి.

కంపెనీలకు కష్టమే..

స్టీల్, అల్యూమినియంపై సుంకాల పెంపు వల్ల వీటిని దిగుమతి చేసుకునే ఆటోమొబైల్, విమానాల తయారీ సంస్థలపై అదనపు భారం పడనుంది. వాస్తవానికి స్టీల్, అల్యూమినియం రంగాల్లో పనిచేసే కార్మికుల కంటే వాటి దిగుమతులను వినియోగించుకునే కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య చాలా ఎక్కువ. అందువల్ల ట్రంప్ నిర్ణయం అమెరికా ఆర్థిక రంగానికి నెగిటివ్ అన్న వాదనలు కూడా ఉన్నాయి. ఇప్పటికే అమెరికా స్టాక్ మార్కెట్ కుప్పకూలడంతో దాదాపు 60,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.39 లక్షల కోట్లు) స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్ హరించుకుపోయింది. 500 మంది అమెరికన్ కుబేరుల స్థూల సంపద విలువ 10,700 కోట్ల డాలర్లు తుడిచిపెట్టుకుపోయింది.

కెనడాకు కష్టమే..

ఉక్కు, అల్యూమినియంపై అమెరికా సుంకాలను విధించడం వల్ల కెనడాకు ఎక్కువ ఇబ్బంది కలగనుంది. ఇప్పటికే ఈ జిడిపి బలహీనంగా ఉంది. నాలుగో త్రైమాసికంలో ఈ దేశ జిడిపిలో కేవలం 1.7 శాతమే వృద్ధి నమోదైంది. ఇప్పటికే దేశీయ స్టాక్ మార్కెట్ 5 శాతం క్షీణించింది. అమెరికా అల్యూమినియం దిగుమతుల్లో కెనడా వాటాయే 41 శాతంగా ఉంది.

యూట్యూబ్‌లో తెలుగు జోరు

- ఎపి, తెలంగాణలో భారీగా పెరుగుతున్న వీడియోల సృష్టికర్తలు, వీక్షకులు
- యూట్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్ హెడ్ సత్య రాఘవన్



కంటెంట్ క్రియేటర్లతో సత్య రాఘవన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి విభిన్న రకాల వీడియోలు సృష్టిస్తూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువత సంఖ్య గణనీయంగా పెరిగిందని, అన్ని రకాల వీడియోలు వీక్షించే వారి సంఖ్య కూడా ఈ రాష్ట్రాల్లో జోరుగా పెరుగుతోందని భారత్‌లో యూట్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్ హెడ్ సత్య రాఘవన్ తెలిపారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల నుంచే కాకుండా చిన్న గ్రామాల్లోని ఔత్సాహికులు కూడా తమ ప్రాంతానికి సంబంధించిన సంస్కృతి, మాండలికాలకు సంబంధించిన వీడియోలను సృష్టిస్తూ చాలా పాపులర్ అవుతున్నారని ఆయన చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో 'యూట్యూబ్ ఫ్యాన్‌ఫెస్ట్' సందర్భంగా సత్య రాఘవన్ విలేకరులతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

ఐదు నగరాల్లో నిర్వహణ

వంటకాల నుంచి మ్యూజిక్, టెక్నాలజీ, వెబ్ సీరిస్, డ్యాన్స్, హెల్త్, ఆటో, విద్య తదితర విభాగాల్లో అన్ని భాషలకు చెందిన వీడియోలు యూట్యూబ్‌లో అప్‌లోడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ భాష ల్లో ఎక్కువ పాపులర్ అయిన యూట్యూబ్ వీడియో సృష్టికర్తలను అభిమానులకు పరిచయం చేసేందుకు యూట్యూబ్ ఫ్యాన్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నాం. ఇంతకు ముందు ఏటా ఒక్క నగరంలోనే ఈ కార్యక్రమం నిర్వహించాం. ఇప్పుడు ఐదు నగరాల్లో నిర్వహిస్తున్నాం. హైదరాబాద్ తర్వాత చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబైలో ఫ్యాన్ ఫెస్ట్ ఉంటుంది.. హైదరాబాద్ ఫ్యాన్‌ఫెస్ట్‌లో మై విలేజ్ షో, వైవా, మహాతల్లి, చాయ్ బిస్కెట్, తెలుగు వన్, కంత్రి గౌజ్, కిరాక్ హైదరాబాదీజ్, గర్ల్ ఫార్ములా, శణ్ముఖ్ జస్వంత్, విజ య తుపురాణి, వరంగల్ డైరీస్, వైరల్లీ పేర్లతో వీడియోలు సృష్టించి ఎక్కువ మంది వీక్షకులను సంపాదించుకున్న క్రియేటర్లను అభిమానులకు పరిచయం చేస్తున్నాం. తప్పుదారిపట్టించే, అవాస్తవ వీడియోలను నిరంతరం తొలగిస్తూనే ఉంటాం. ఇలాంటి వీడియోలు వీక్షకుల దృష్టికి వస్తే వెంటనే మాకు తెలియజేయాలి.

యూట్యూబ్ కమ్యూనిటీ మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వీటికి అనుగుణంగా లేని వీడియోలను కచ్చితంగా తొలగిస్తాం.

పెళ్లిళ్ల సీజన్‌తో పసిడికి గిరాకీ

హైదరాబాద్‌లో 10 గ్రాముల ధర రూ.31,520

హైదరాబద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : బులియన్ మార్కెట్ మళ్లీ కళకళలాడుతోంది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్) పసిడి ధర శనివారం 31,520 రూపాయలకు చేరింది. శుక్రవారంతో పోలిస్తే ఇది రూ.190 ఎక్కువ. కిలో వెండి ధర 600 రూపాయలు పెరిగి 39,800 రూపాయలకు చేరింది. విజయవాడ మార్కెట్లో శనివారం బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. కిలో వెండి ధర రూ.40,000 వద్ద ముగిసింది. విశాఖలో బంగారం, వెండి ధరలు శుక్రవారం స్థాయిలోనే కొనసాగాయి.

కన్సాలిడేషన్ దశలో...

పెళ్లిళ్ల సీజన్ డిమాండ్‌తోపాటు, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలహీనపడటం బులియన్ మార్కెట్‌కు కలిసివస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. స్టాక్ మార్కెట్లో నెలకొన్న ఆటుపోట్లూ ఇందుకు దోహదం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కు, అల్యూమినియం ధరలు పెంచాలన్న నిర్ణయంతో వాణిజ్య ఉద్రిక్తతలు మరింత పెరిగి బులియన్ మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉందన్నది మార్కెట్‌వర్గాల అంచనా. 'పసిడి ధర ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉంది. ఏ కారణం వల్లనైనా 10 గ్రాముల ధర రూ.29,000-30,000 స్థాయికి వస్తే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు ఈ ధరలో కొనుక్కోవచ్చు' అని జెన్ సెక్యూరిటీస్, జెన్ కమొడిటీస్ డైరెక్టర్ నమశ్శివాయ చెప్పారు.

రూ.41,500 దాటిన వెండి


తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి ధర 40,000 రూపాయలకు అటుఇటుగా ట్రేడవుతోంది. చెన్నైలో మాత్రం కిలో ధర ఇప్పటికే 41,500 రూపాయలు దాటిపోయింది. శనివారం మరో 200 రూపాయలు పెరిగి 41,600 రూపాయలకు చేరింది. నాణేలతోపాటు, పారిశ్రామిక అవసరాల కోసం వెండికి డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే దూకుడు కొనసాగితే వచ్చే వారం పది రోజుల్లోనే కిలో వెండి ధర రూ.42,000కు చేరే అవకాశం ఉందని అంచనా.

బులియన్




బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,520	31,500	31,280	31,400	30,680
క్రితం ముగింపు	31,330	---	31,280	31,380	30,490
22 క్యారెట్లు	29,180	29,200	28,770	29,120	29,220
క్రితం ముగింపు	29,010	---	28,770	29,090	29,040
వెండి (కిలో)	39,800	40,000	39,200	39,800	41,600
క్రితం ముగింపు	39,200	---	39,200	39,700	41,400

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	72.00	విజయవాడ	73.00
కరీంనగర్	73.00	గుంటూరు	72.00
వరంగల్	72.00	ఒంగోలు	75.00
మహబూబ్‌నగర్	72.00	చిత్తూరు	68.00
కర్నూలు	72.00	నెల్లూరు	70.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	67.00
గోదావరి	72.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	345.00	చిత్తూరు	378.00
వరంగల్	347.00	చెన్నై	385.00
విజయవాడ	340.00	నమక్కల్	370.00
గోదావరి	340.00	బెంగళూరు	375.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00



మోదీతో వియత్నాం అధ్యక్షుడు త్రాన్ దాయ్ క్వాంగ్ కరచాలనం

చైనాకు భారత్ చెక్

» వియత్నాంతో పలు ఒప్పందాలు

న్యూఢిల్లీ, మార్చి 3: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సైన్యాన్ని మోహరిస్తూ తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని తహతహలాడుతున్న చైనాకు భారత్ చెక్ పెట్టింది. భద్రతా నిర్మాణం, అణు విద్యుత్తు, వాణిజ్య, వ్యవసాయ రంగాలు, చమురు నిల్వల వెలికితీత తదితర ఒప్పందాలపై ఇరు దేశాలు శనివారం సంతకాలు చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ, వియత్నాం అధ్యక్షుడు త్రాన్ దాయ్ క్వాంగ్‌ల చర్చల నేపథ్యంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. 'ఇక్కడ మేము ఇండో-పసిఫిక్ రీజియన్‌లో కలిసి పనిచేస్తాం. అంతర్జాతీయ న్యాయానికి లోబడి, ఇరుదేశాల సార్వభౌమత్వానికి విఘాతం కలుగకుండా నడుచుకుంటాం' అని ఈ సందర్భంగా మోదీ వివరించారు.

హెచ్-1బీ భాగస్వాములకు ఊరట!

వారి ఉద్యోగాల తొలగింపుపై నిర్ణయాన్ని జూన్‌కి వాయిదా వేసిన ట్రంప్ సర్కారు



వాషింగ్టన్, మార్చి 3: హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములకు అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా ఊరటనిచ్చింది. వీరిని ఉద్యోగాల నుంచి తొలగించే అంశంపై నిర్ణయాన్ని జూన్ వరకూ వాయిదా వేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్) తెలిపింది. ఈ నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని అంచనా వేయడానికి గాను తమకు కొంత సమయం కావాలని, అప్పటి వరకూ వారి ఉద్యోగాలకు ఏ ఇబ్బందులూ ఉండబోవని కోర్టుకు నివేదించింది. దీంతో 'హెచ్-1బీ' వీసాలపై అమెరికాలో పెద్దసంఖ్యలో ఉద్యోగాల్లో ఉన్న భారతీయ కుటుంబాలకు స్వల్ప ఊరట లభించినట్టయింది. హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, గ్రీన్‌కార్డ్ కోసం ఎదురు చూస్తున్నవారి భాగస్వాములు 'హెచ్4 డిపెండెంట్ వీసాల'తో అమెరికాలో ఉద్యోగాలు చేయొచ్చని పేర్కొంటూ 2015లో అప్పటి ఒబామా ప్రభుత్వం ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. 2018 ఫిబ్రవరి 28 నుంచి దీన్ని రద్దు చేస్తామని ట్రంప్ ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే దీనిపై ఏ నిర్ణయమూ తీసుకోలేదని, అందుకు ఇంకా సమయం కావాలని డీహెచ్‌ఎస్ వర్గాలు కోర్టుకు దాఖలు చేసిన నివేదికలో వెల్లడించాయి. ఈ విధానంలో చాలా మార్పులు చేయాల్సి ఉందని, వాటి ప్రభావాన్ని పూర్తిగా విశ్లేషించిన తర్వాతే తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నాయి. హెచ్-1బీ వీసాదారుల వల్ల తాము ఉద్యోగావకాశాలు కోల్పోతున్నామంటూ యూఎస్‌కు చెందిన ఐటీ నిపుణులు కొందరు 'సేవ్ జాబ్స్ యూఎస్‌ఏ' సంస్థను ప్రారంభించారు. ఒబామా సర్కారు నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఈ సంస్థ జడ్జిల కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై వాదనల సందర్భంగా డీహెచ్‌ఎస్ పైవిధంగా స్పందించింది. కాగా, డీహెచ్‌ఎస్ తాజా నివేదికపై 'సేవ్ హెచ్-4 ఈఏడీస్' గ్రూప్ హర్షం వ్యక్తం చేసింది.

ఆ డిగ్రీ కాలేజీలపై చర్యలేవీ!?

ఏళ్ల తరబడి లీజు భవనాల్లోనే కొనసాగింపు.. షోకాజ్ నోటీసులకూ స్పందన కరువు

» యథేచ్ఛగా అడ్మిషన్లు, పరీక్షలకు అనుమతులు

» చర్యలకు ఉన్నత విద్యా మండలి మల్లగుల్లాలు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న డిగ్రీ కాలేజీలపై చర్యలు తీసుకోవడానికి ఉన్నత విద్యామండలి మల్లగుల్లాలు పడుతోంది. రాష్ట్రంలోని 194 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు లేవు. ఇవి ఏళ్ల తరబడి లీజు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాల్లోకి విద్యార్థులను తరలించడంపై ఆయా కాలేజీ మేనేజ్‌మెంట్లు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిఏటా యథేచ్ఛగా అడ్మిషన్లు చేపట్టడంతో పాటు తమ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వర్సిటీల నుంచి అనుమతులు కూడా తెచ్చుకుంటున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న మొత్తం 467 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 2017 ఏప్రిల్‌లో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అనుమతుల పొడిగింపునకు ఏటా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 273 కాలేజీలు మాత్రమే దీనికి స్పందించి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఏడాదిలోగా సొంత భవనంలోకి తరలిపోవాలన్న నిబంధనను మాత్రం పాటించలేదు. మరో 194 కాలేజీలు మాత్రం ఇంతవరకు మండలి ఇచ్చిన షోకాజ్ నోటీసుకు కనీస స్పందన లేదు. అద్దె భవనాల్లోనే యథాతథంగా నడుస్తున్నాయి. అయినా కూడా ఆయా కాలేజీల్లో అడ్మిషన్లు నిలిపివేయకుండా మండలి అధికారులు కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆషామాషీగా నడుస్తున్న ఇలాంటి కాలేజీల వల్ల విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకేసారి కాలేజీల అఫిలియేషన్ రద్దుచేస్తే అందులో చదువుతున్న విద్యార్థులకు నష్టం జరుగుతుందని, తాజా 2018-19 విద్యా సంవత్సరంలో ప్రస్తుత అడ్మిషన్లను నిలిపివేస్తే సదరు కాలేజీల నిర్వాకం విద్యార్థులు, తల్లిదండ్రులకు అర్థమవుతుందని పలువురు అంటున్నారు. వీటిపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సిఫారసు చేయాలంటూ ఉన్నత విద్యామండలి ఓ కమిటీని నియమించింది. ఏఎన్‌యూ రిటైర్డ్ రిజిస్ట్రార్ రంగయ్య నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో ఎస్వీయూ లా ప్రొఫెసర్ జయశ్రీ, ఉన్నత విద్యా మండలి డిప్యూటీ డైరెక్టర్ టి.వి. కృష్ణమూర్తి, అకడమిక్ సెల్ లెక్చరర్ బి.ఎస్. సెలీనా, అన్ని వర్సిటీల డీన్లు ఉన్నారు. ఇప్పటివరకు రెండుసార్లు సమావేశమైన కమిటీ ఈనెల 7న మరోసారి భేటీ కానుంది. పాత డిగ్రీ కాలేజీల విషయం ఇలా ఉంటే.. రాష్ట్రంలో కొత్త ప్రైవేట్ డిగ్రీ కాలేజీల ఏర్పాటుపై సర్వే జరుగుతోంది.



వధువు కావలెను



★ CNB/ BC/ లేట్ మ్యారేజ్ / 40y / 5'4" / BA, P.Job / No Bad Habbits / పొలం రయితులే మంచి మనసున్న మరి సూటిగ చేయగల వధువు కావలెను. లేట్, డైవర్స్, విడో ఓకే. ఫోన్: 9000709397 AJH-450092

★ కమ్మ / 46y / 5'7" / ఎరుపు ఆరోగ్యవంత మైన డైవర్స్ దగ్గరకు వెల్ సెటిల్డ్ రిచ్ వధువు కావలెను. Hyd. (నో బ్రోకర్స్). ఫోన్: 9441692101 whatsapp 8019841181 AJH-088

★ రెడ్డి / 28 / డిగ్రీ సాంప్రదాయ వరుడుకి వధువు కావలెను. 1వ, 2వ, డైవర్స్, విడో అయినా సరే కావలెను. ఇల్లరికం ఓకే. డైరెక్ట్ 9642549489 AJK-449530

★ చౌదరి(కాపు) /35/5'6"/ M.Sc., B.Ed., / Govt E.O., పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్ / సెంత ధరం.65000/- PM గల వయసికి OC, BC వధువు కావలెను. సం.ప్ర. సెల్: 7730872529, వాట్సాప్: 8555979484. AJR-452892

★ కమ్మ/ 37 సం/ నెల్లూరుటౌన్‌లో 2 కోట్లు ఆస్తి గల పుట్టు వెంకటేశ్వర్లకి కమ్మ లేక ఏ కులం అయినాసరే వధువు కావలెను. డైరెక్ట్ సం.ప్ర. 9494645928, 9948058613. AJR-452891

★ యాదవ 2nd M, Govt. టీచర్, 2-C, 40, 5-2, రోడ్డు ప్రమాదంలో భార్య చనిపోయిన వరుడుకు ఏ బాదరబందీలేని విడో, ఎంప్లాయి, వెల్‌సెటిల్డ్ వధువు కావలెను. క్యాస్టబార్ మ్యారేజ్ బ్యూరో, VJA. ఫోన్: 70139 22269, 98495 09749 AJB-454472

★ కమ్మ, రెడ్లలకు మాత్రమే! కమ్మ M.A / వ:38 / 5'7"/ Business / ఆస్తి లేదు. 25,000/- PM / Min డిగ్రీ చేసిన వధువు కావలెను. నెల్లూరు, ఫోన్: 9515544939 AJG-456910

వరుడు కావలెను



★ కుల పట్టింపులేదు (2వ పెళ్లి) / 50y / 5'3" / డిగ్రీ / ఓన్ ట్రేడ్ బిజినెస్ / 50 వేలు P.M. / 1 Cr. ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్:8790045436/8978894173 AJH-088

★ గౌడ / డైవర్స్ / 30 / 5'4" / SWE / 60,000/- PM / Hyd లో Own House (Rents) / సొంత ఊరు నిర్మించిన / పిల్లలులేని వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9948070006 AJH-088

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / 40 / 5'4" / విడో / Own బిజినెస్ / 8 కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7893575126 AJH-088

★ వైశ్య / విడో / 40 / 5'4" / Govt. Job / Bank / 35,000/- P.M./ Hyd లో వెల్ సెటిల్డ్ / 3 Cr. ప్రాపర్టీ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912038880 AJH-088

★ రెడ్డి / విడో / 42 / 5'4" / డిగ్రీ / Hyd లో గైనకాలజిస్ట్ / సొంత ఊరు కరీంనగర్ / Own House Rents / వధువుకు (35-60 సంలు) FC/BC వరుడు కావలెను. ఫోన్:9912916046 AJH-088

★ పద్మశాలి / విడో / 54 / డిగ్రీ / V.Fair / ఫ్యామిలీ పెన్షనర్ / సొంత్ర దాయ వధువుకు వరుడు కావలెను. ఫోన్:8125469489 AJH-088

★ FC / విడో / 60 / రిటైర్డ్ పెన్షనర్ / సొంత ఇల్లు / రెంట్స్ గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్:8499909096 AJH-088

★ బ్రాహ్మణ శ్రీ / 38 / విడో / ఆయుర్వేదిక్ డాక్టర్ / 80,000/- P.M. / సొంత ఇల్లు / 20 ఎకరముల వరి పొలము కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్:9502993350 AJH-088

★ క్షత్రియ / 48 / విడో / 5'4" / PG / సొంత స్కూల్ & సొంత బిజినెస్ / ఫ్లాట్స్ / 20 ఎకరముల పొలము ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9989394054 AJH-088

★ కాపు / డైవర్స్ / 33y / 5'4" / Fair / రియల్ ఎస్టేట్ & చేపల చెరువులు గల అందమైన వధువుకు కుల పట్టింపులు లేని వరుడు కావలెను. ఫోన్: 8686683575 AJH-411640

★ కమ్మ / డైవర్స్ / ఒంటరి / 32y / 5'5" / Pvt School టీచర్ (B.Ed) వధువుకు కుల పట్టింపులు లేని వరుడు కావలెను. సొంత ఇల్లు. ఫోన్: 8790527332 AJH-411640

★ గౌడ / లేట్ మ్యారేజ్ / 29y / 5'5" / ట్రావెల్ బిజినెస్ / 13 కోట్లు ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ఫోన్:9515337427 AJH-088

★ కుల పట్టింపులేదు / 48y / 5'4" / విడో / డిగ్రీ / అనంతపూర్ / ఫ్యామిలి పెన్షనర్ / 35,000/- P.M. / Own House (Rents) / వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9912753645 AJH-088

★ కుల పట్టింపులేదు (2వ పెళ్లి) / 40y / 5'4" / ఇంటర్ / ఓన్ శారీస్ బిజినెస్ / 40 వేలు P.M. / సొంత ఇల్లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్:8978894043/8978894173 AJH-088

★ రెడ్డి / డైవర్సీ / 30y / 5'4" / Air Force జాబ్ (Govt.) / 15 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్:9515060514 AJH-088

★ రెడ్డి / విడో / 23 / 5'3" / డిగ్రీ / ఆంధ్రాలో ఇల్లు / ఓన్ బిజినెస్ / 50,000/- PM / మంచి ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్:7095911287 AJH-088

★ రెడ్డి / విడో / 35y / 5'5" / అనంతపురంలో సొంత ఇల్లు, పొలాలు ఉండి వడ్డీ వ్యాపారం చేస్తున్న డిగ్రీ చదివిన అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9966386750 AJH-411640

★ రెడ్డి / విడో / 36y / 5'6" / ఒంగోలులో సొంత ఇల్లు, సొంత కాంప్లెక్స్‌లు, ఒక పాప కలిగిన డిగ్రీ చదివిన అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9966386750 AJH-411640

★ కాపు / విడో / 46y / 5'3" / Fair / డిగ్రీ / ఓన్ ఐరన్, సిమెంట్ కంపెనీ, బిల్డర్, గల వధువుకి వరుడు కావలెను. నో బ్రోకర్స్. (CNB) ఫోన్: 7730915235/ 9515552539 AJH-088

★ రెడ్డి / 30y / 5'4" / విడో / అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్ : 7997913167 AJH-088

★ రెడ్డి / విడో / 29y / B.Tech / వధువుకి వరుడు కావలెను. అస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు. మీ ఫోటో డిటేల్స్ Whatsappలో send చేయండి. ఫోన్: 7207214624 AJH-088

www.prabhakarreddymatrimony.com



20 సంవత్సరాల అనుభవం అన్ని కులములు 1వ, 2వ లేట్, India / Abroad Email: prabhakarpinnama@gmail.com

Head Office: L.B.Nagar, Hyderabad Ph: 9391198332 9059430595.

Branch Office: సీతాఫల్‌మండి, Secunderabad, Ph: 7095596623.

వరుడు కావలెను

★ రెడ్డి / 25 / 5'7" / Fair, B.Tech, MBA, Asst. Manager, 6 Lacs P.A. / 2 Cr. ఆస్తిగల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ రెడ్డి / 28 / 5'6" / Fair, B.Tech / Sr. Application / 10 Lacs P/A 2 Cr ఆస్తిగల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ మున్నూరు కాపు / 24 / 5'4" / Fair, B.Tech, Genpact / SWE / Eng. / 40,000/-P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ ముదిరాజ్/ 23 / 5'3" / Fair / B.Tech / SWE /Hyd / 18000/- P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ యాదవ / 25 / 5'5" / Fair / M.Sc, B.Ed, P.G. / Teacher, Pvt. / 20000/- P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ గౌడ్ / 27 / 5'3" / Fair / M.Sc, B.Ed / Pvt. Job / 15000/- P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ ముస్లిం / 23 / 5'2" / Fair / B.Com, MBA & PG DBM/ Pvt. Bank Emp. / 25000/- P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ SC మాల / 20 / 5'2" / Fair / B.Tech/ Pvt. Job / 12000/- P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ రెడ్డి, రెండవ పెళ్ళి / 25 / 5'3" / Fair / MBA / Pvt. Job / 30,000/- P/M గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

★ రెడ్డి, రెండవ పెళ్ళి / 29 / 5'4" / Fair / B.Tech / MS-USA / 100 K / 1 Cr. ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. ఫోన్:9059430595

వధువు కావలెను

★ రెడ్డి / 27/5'11"/ Fair / B.Tech / IIT & M.Tech / Sr. SWE-Eng. / 12 Lacs P.A. / 5 Cr. ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ రెడ్డి/27/5'8"/Fair / B.Tech, M.Tech / Bits Pilani / SWE-Emp. / 15 Lac P/A / 3Cr. ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ మున్నూరుకాపు / 30 / 5'10" / Fair / B.Tech / MS-London / Team Leader / Hyd / 7 Lacs P.A. / 2 Cr. ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ యాదవ / 29 / 5'9" / Fair, MCA /Sr. Quality Analyst / 7 Lacs P.A. / 2 Cr. ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ గౌడ్ / 29 / 5'7" / Fair, B.Tech / Asst. Professor / 30,000/-P.M. / 50 Lacs ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ ముదిరాజ్ / 30 / 5'7" / Fair / Degree / LLB / Advocate & Business / 25,000/- PM / 60 Lacs ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ పద్మశాలి / 26 / 5'11" / Fair / M.Pharm, PG / Executive Officer / 25,000/- PM / 3 Cr. ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ వైశ్యా / 29 / 5'8" / Fair / MBBS / PG / Doctor / 5,40,000/- PA / 2 Cr. ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ రెడ్డి: రెండవపెళ్లి / 30 / 5'8" / Fair / TTC /M.Sc, B.Ed / Govt. Teacher / 50,000/- PM గల పిల్లలులేని వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

★ పద్మశాలి:రెండవపెళ్లి / 30 / 5'10" / Fair / B.Tech, MS / SWE-Emp / 1 Lac PM / 5 Cr. ఆస్తిగల పిల్లలులేని వరుడుకి వధువు కావలెను. ఫోన్:9391198332

పర్వతనేని (కమ్మ) వివాహ వేదిక

పర్వతనేని రామబ్రహ్మం గారి ఆధ్వర్యములో 23 సం॥లుగా కమ్మవారి కోసం స్థాపించబడిన ఏకైక సంస్థ. సత్య అపార్ట్‌మెంట్, ఫార్చ్యూన్ మురళి రోడ్డు (కంధారి లైన్), విజయవాడ. ✆ 9849350056, 8977662544 e-mail: pmc.brahmam@yahoo.com



పర్వతనేని శ్రీకాంత్, షాప్ నెం 219, పద్మావతి ప్లాజా, కె.పి.హెచ్.బి. మెయిన్‌రోడ్డు, హైదరాబాద్ ✆ 40077535, 8886664567, mail:pmc_kammamarriages@yahoo.com

వధువు కావలెను

కమ్మ- 26 6' MS $100K 40Cr; 26 5'10 MS $75K 25Cr; 26 6'1 MS 3L 15Cr; 25 5'10 MS $120K 5Cr; 30 5'11 Ph.D 20Cr ;30 5'10 MS $60K 5Cr

కమ్మ- 26 5'11 MS $85K 15Cr; 29 6 MS $120K 40Cr; 31 5'11 MS $75K 20Cr; 30 6 MS $85K 10Cr; 37 5'9 MCA $95K 40Cr; 24 5'11 MS 2L 4Cr.

కమ్మ- 28 6 MS $108K 8Cr; 30 5'8 MS $300K 10Cr; 32 5'7 MS 30Cr; 33 5'11 MS $100K 10Cr; 32 5'10 MS 10Cr; 32 5'11 MBA 12Cr

కమ్మ- 26 6'2 MS 2L 20Cr; 28 6'1 BE 6L 20Cr; 29 5'9 BE 2L 20Cr; 30 5'8 BE 5L 10Cr; 31 5'7 BE 15Cr; 30 5'11 ME 9L 5Cr; 30 6'2 BE 50Cr.

కమ్మ- 28 5'11 BE 55L 15Cr; 27 5'9 BE 7L 10Cr; 29 5'8 BE 7L 7Cr; 26 6 BE 5L 3Cr; 29 5'11 BE 10L 5Cr; 31 5'11 BE 6L 8Cr; 28 5'8 ME 9L 3Cr.

కమ్మ- 30 5'9 ME 8L 25Cr; 28 5'8 MS 11L 9Cr; 27 6'1 BE 6L 6Cr; 30 5'11 MCA 300Cr; 29 6'4 ISB 16L 5Cr; 27 5'9 BE 6L 5Cr.

Business: 29 5'8 BE 80Cr; 30 5'10 BE 60Cr; 32 5'10 BE MS 100Cr; 32 5'8 MS 40Cr; 31 5'9 MBA 30Cr; 34 5'11 BE 25Cr; 40 6'1 MSMBA 100Cr.

Doctors: 25 5'11 MBBS 25Cr; 26 6'2 MDS 2Cr; 30 5'8 MS 1L 10Cr; 29 5'8 MS 20Cr; 32 5'10 PGGM 2L 12Cr; 31 5'10 PGGM 150Cr.

Divercee: 29 5'8 ME 15L10Cr; 30 5'8 MBA 35Cr; 35 6'2 MD 15Cr; 35 5'10 MBA 30Cr; 40 5'5 BE 50Cr; 36 5'11 BE 7Cr; 35 34 5'10 MS $130K 50Cr

వరుడు కావలెను

కమ్మ- 28 5'6 MS $125K 50Cr; 28 5'6 MS $70K 25Cr; 28 5'8 MS 25Cr; 27 5'2 BE $90K 10Cr; 28 5'6 MS $70K 20Cr; 25 5'4 MS 8Cr

కమ్మ- 26 5'4 MS $100K 50Cr; 27 5'7 MS $85K 20Cr; 24 5'7 MS $70K 6Cr; 28 5'7 MS $120K 8Cr; 27 5'5 MS $100K 4Cr; 27 5'9 MS 4Cr

కమ్మ-26 5'5 MS 50Cr; 26 5'5 MS 20Cr; 26 5'7 MS 10Cr; 27 5'3 MS $105K 10Cr; 28 5'3 MS 15Cr; 25 5'6 MS 10Cr; 29 5'6 MS $85K 15Cr.

కమ్మ- 24 5'6 BE 50Cr; 28 5'7 M Sc 12L 8Cr; 27 5'6 MS 8.5L 20Cr; 25 5'8 ME 10Cr 29 5'6 BE 10Cr; 26 5'6 BE 5L 7Cr; 26 5'5 BEMBA 10Cr.

కమ్మ- 27 5'4 BEMS 20Cr; 27 5'8 BEMBA 15Cr; 23 5'1 BE 10Cr; 26 5'5 ME 4L 10Cr; 30 5'6 ME 10Cr; 22 5'8 BE 5Cr 27 5'6 BE 5L 6Cr.

కమ్మ- 23 5'6 BEMBA 30Cr; 22 5'3 BE 3L 15Cr; 25 5'4 MBA 4L 6Cr; 28 5'5 MBA 30Cr; 32 5'7 MS 40Cr; 24 5'8 BE 6L 6Cr; 25 5'6 BEMBA 6Cr.

కమ్మ- 24 5'4 M.Com 15Cr; 27 5'8 M.Pharm 10Cr; 25 5'9 CA 8L 5Cr; 27 5'2 MBA 7L 6Cr; 32 5'8 PG 30Cr; 26 5'4 BBM 8Cr; 27 5'1 PG 20Cr.

Doctors: 25 5'1 MS Gynic 12Cr; 24 5'6 BDS 2Cr; 24 5'5 PG 10Cr; 26 5'3 MD 8Cr; 28 5'6 MBBS 20Cr; 27 5'5 PG 8Cr; 30 5'3 MD 18L 20Cr.

Divorcee: 26 5'8 Ph.D., 150Cr; 27 5'5 BE 5L 10Cr; 28 5'4 MS 12Cr; 35 5'4 PG 10Cr; 26 5'5 ME 3Cr; 35 5'5 MBA 50Cr; 31 5'6 MS 8Cr.

అన్నపూర్ణ మ్యారేజెస్

● అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును ●

www.annapurnamarriages.com

గుంటూరు హెడ్ ఆఫీస్ - 9397979718, విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ - 83673 44466, ఒంగోలు బ్రాంచ్ ఆఫీస్ - 93937 63666, తెనాలి బ్రాంచ్ ఆఫీస్ - 99851 44113, నెల్లూరు బ్రాంచ్ ఆఫీస్-93979 79750

పెళ్ళి కావలసిన వరుడు, వధువు మీ పూర్తి వివరములను FREEగా ఇచ్చి IDగా రిజిష్టర్ చేసుకోగలరు.

వరుడు కావలెను

★ కమ్మ- (27554); A-25; 5'3"; MS - OBG (Medical) Studying; ఆస్థి-15 Crores ప్రాపర్టీ ఉన్న అందమైన సాంప్రదాయమైన వధువుకి MD/MS చదివిన వెల్‌సెటిల్డ్ Doctor వరుడు కావలెను. 9397979718

★ రెడ్డి- (27853); A-35; 5'4"; B.Pharm; ఆస్థి-1.5 Cr ప్రాపర్టీ ఉన్న అందమైన సాంప్రదాయమైన వధువుకి B.Tech చదివి SWE/Business చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979750

★ కాపు- (29338); A-32; 5'5"; Cancer Biology (Ph.D) at USA; Research Scholar ; ఆదాయం- 15.54 La/pa; ఆస్థి- పొలం + Gold; ప్రాపర్టీ ఉన్న అందమైన వధువుకు MS(Eng)/ Ph.D చదివి USA లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979750

★ రెడ్డి-(28122); A-24; 5'6"; B.Tech; SWE; ఆదాయం- 4La/pa; ఆస్థి- 7Cr; ప్రాపర్టీ ఉన్న అందమైన సాంప్రదాయమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979718

★ కాపు-(31120); A-23; 5'1"; House Surgeon; ఆస్థి- 1Cr; ప్రాపర్టీ ఉన్న అందమైన సాంప్రదాయమైన వధువుకు MD/MS చదివిన వెల్‌సెటిల్డ్ Doctor వరుడు కావలెను. 9397979750

★ బ్రాహ్మణ-(32169); A-22; 5'3"; B.Tech; చదివిన అందమైన సంప్రదాయమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367055566

★ కమ్మ - కన్వర్టెడ్ - (31904); A-29; 5'3"; M.Sc, MPT; ఆస్థి- 3Cr; ప్రాపర్టీ ఉన్న అందమైన వధువుకు Doctor/SWE జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367344466

★ యాదవ-(32008); A-24; 5'2"; డిగ్రీ; ఆస్థి- 2 ఎకరాల పొలం ప్రాపర్టీ ఉన్న అందమైన సాంప్రదాయమైన వధువుకు B.Tech చదివి Govt / Pvt. Job చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979718

★ పెరిక-డైవర్సి-(31521); A-35; 5'3"; Ph.D; Asst. Professor; ఆదాయం- 3.60La/pa; ఆస్థి- 1Cr; ప్రాపర్టీ ఉన్న అందమైన వధువుకు కులపట్టింపు లేని SWE/Govt. Job చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367244499

వధువు కావలెను

★ కమ్మ-(25530); A-34; 5'11"; M.Tech; Web Developer; ఆదాయం- 16.50 La/Pa, ఆస్థి- 3 crores ప్రాపర్టీ కలిగిన వెల్‌సెటిల్డ్ వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ గౌడ-(25889); A-31; 5'8"; MS(Eng); SWE at USA; ఆదాయం- 50 La/Pa, ఆస్థి- 6 crores ప్రాపర్టీ కలిగిన వరుడుకు MS(Eng) చదివి USA లో SWE జాబ్ చేస్తున్న అందమైన వధువు కావలెను. 9397979750

★ కమ్మ-(19003); A-28; 5'8"; B.Com; Pvt. Job; ఆదాయం- 2.4 La/Pa, ఆస్థి- 50 Lakhs ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ రెడ్డి-(31825); A-33; 5'8"; MS (Eng); Job at USA; ఆదాయం- 14 La/Pa, వున్న వెల్‌సెటిల్డ్ వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367244499

★ రెడ్డి-(31964); A-37; 5'11"; B.Tech; Business; ఆదాయం- 18 La/Pa, ఆస్థి- 10 acres land & House ప్రాపర్టీ కలిగిన వరుడుకు చక్కటి చదువు కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8886953666

★ రజక-(30318); A-27; 5'6"; 10th; ఆదాయం- 2 La/Pa, ఆస్థి- 1 House ప్రాపర్టీ కలిగిన వరుడుకు 10th చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055599

★ కమ్మ-(31679); A-35; 5'9"; M.Com; Pvt. Job; ఆదాయం- 2.4 La/Pa, ఆస్థి- 10 Crores ప్రాపర్టీ కలిగిన వరుడుకు చక్కటి చదువు కలిగిన అందమైన వధువు కావలెను. 9397979718

★ యాదవ-(31353); A-24; 5'10"; M.S (Eng); Job at australia; ఆదాయం- 24 La/Pa, వున్న వెల్‌సెటిల్డ్ వరుడుకు చక్కటి చదువు కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ విశ్వబ్రాహ్మణ-(32170); A-31; 5'9"; B.Tech; SWE; ఆదాయం- 11 La/Pa, ఆస్థి- 1 House ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివి Pvt. Job చేసే సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ కమ్మ / 29y / 5'3" / MBA / లేట్ మ్యారేజ్ / ఫేయిర్ / సొంత బిజినెస్ / ఫ్యాషన్ డిజైనర్ అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్: 9386494014 AJH-088

★ యాదవ / 42y / విడో / B.Ed Govt Job 50,000/- pm. హోటల్ మేనేజ్‌మెంట్ / సొంత ఫైనాన్స్ /Hyd.లో సొంత ఇల్లు / వెల్ సెటిల్డ్ వధువుకి కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్: 7799284519 AJH-088

★ రెడ్డి / 34y / 5'5" /M.Sc, Agri. Govt. Officer 40,000 P.M. Fair / ప్రాపర్టీ గల వధువుకి కుల ధన ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్: 6309112458 AJH-088

★ కుల పట్టింపు లేదు / క్షత్రియ /38y /విడో / గవర్నమెంట్ లెక్చరర్ / విజయవాడలో సొంత ఇల్లు మరియు అగ్రికల్చర్ ల్యాండ్స్ / వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్: 9959936450 AJH-088

★ కమ్మ/34y /విడో /B.Sc, B.Ed., గవర్నమెంట్ టీచర్ / గుంటూరులో ల్యాండ్స్ మరియు బిజినెస్ / వధువుకి FC/BC వరుడు కావలెను. (కుల, ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 9705019602 AJH-088

★ చౌదరి/ 48y /5'4"/B.Com/ Govt. Job/ VRS / Own House / Own Business ఉన్న వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8187873088 AJH-078

★ రెడ్డి/ 50y /5'4"/డిగ్రీ /Central Govt. Job / VRS / ఆంధ్రాలో పొలాలు / Own House / Business / Well settled / వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8096757854 AJH-078

★ రాజులు / 48y / విడో / 5'4" / PG Gold Shop / House వధువుకు / FC/BC వరుడు కావలెను. ఫోన్: 9704442356 AJH-078

★ వెలమ / 49y / విడో / 5'5" / MA, B.Ed / Govt. Teacher / VRS / PM 35,000/- / Own Business / Own House వధువుకు / FC/BC వరుడు కావలెను. ఫోన్: 7659864753 AJH-078


★ గౌడ, 25y, Fair, 5'5", Hyd ప్రముఖ వ్యాపారసంస్థలు గల, విలువైన ప్రాపర్టి కలిగిన అందమైన వధువుకి (కుల, ఆస్తి పట్టింపులేని) సాంప్రదాయ కుటుంబం కలిగిన వరుడు కావలెను. Ph/Whtsapp : 9581760255 AJA-444495

★ చౌదరి విడో, 31 సం॥, 5.3, డిగ్రీ, ఫుల్‌ఫెయిర్, భర్తను కోల్పోయిన 22 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు 1,2 వరుడు కావలెను. Whatsapp 9966285684 AJG-1800

★ చౌదరి, 24 సం॥, 5.5, B.Tech, Full Fair, 16 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు వరుడు కావలెను. Whatsapp 9705338881 AJG-1801

★ చౌదరి విడో, 37 సం॥, 5.4, MBA, ఫుల్‌ఫెయిర్, Govt. JOB, నెల జీతం 90,000, పిల్లలు పుట్టే అవకాశం లేదు. 25 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు 1,2 వరుడు కావలెను. Whatsapp 8897209186 AJG-1799

★ హిందూ మాల: 23Y, B.Tech, SWE, Infosys (Hyd) జాబ్ జీతం : 60వేలు గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ /డాక్టర్ జాబ్ / ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న హిందూ లేక క్రిస్టియన్ వరుడు కావలెను. డైరెక్ట్ : 9121191105. AJG-456785



కళ్యాణ వేదిక

★ వనస్థలిపురం మ్యారేజ్ బ్యూరోలో అన్ని కులాల, మతాల వారికి 1వ, 2వ విడో, డైవర్సీ, దేశ, విదేశ సంబంధాలు వెంటనే కుదుర్చబడును. ఫోన్: 7660971900, email : devirazia@gmail.com AJH-088

★ శ్రీ గజలక్ష్మి మ్యారేజ్ బ్యూరో. అన్ని కులాల వారికి దేశ, విదేశ, విడో, డైవర్సీ, లేటు, 1వ, 2వ సంబంధాలు వెంటనే కుదుర్చబడును. ఫోన్: 9059900033. AJH-088

★ యాదవ వివాహ పరిచయ వేదిక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులు, విదేశ యాదవ వధూవరుల సంబంధముల కొరకు సంప్ర॥ సెల్: 94943 98845, 92471 14891 AJB-447591

★ సూజిత్ మ్యారేజ్ బ్యూరో / అన్ని కులాల వారికి వయసుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ. ఫ్రీ, పు. సర్వీస్ చార్జ్ ఓన్లీ .ఫోన్:7893688483 AJH-5342

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో / 1వ, 2వ లేట్ మ్యారేజస్ / డైవర్సీస్ / విడో / విడోవర్స్ / పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా సంబంధాలు కుదుర్చబడును .(స్త్రీలకు ఫ్రీ రిజి.) ఫోన్:7416303057 AJH-088

★ సెకండు మ్యారేజెస్‌లకు మాత్రమే. శ్రీ బాలాజీ మ్యారేజ్ బ్యూరో. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తంలేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ఫోన్:8555980066 / 8328388014 AJH-088

★ Whats app your Photo & Biodata to 9347262769. We will send the suitable matches www.pellisandadi.com. ESTD.1991 AJH-088



గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



మీ దగ్గరలోని ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయాలలో సంప్రదించండి

మహబూబ్‌నగర్	: 9985411365	రంగారెడ్డి	: 9985410909	ఒంగోలు	: 9985411483
నిజామాబాద్	: 9985411453	మెదక్	: 9985410904	గుంటూరు	: 9985411217
కరీంనగర్	: 9985411273	కర్నూలు	: 9985411363	విజయవాడ	: 9985411614
ఆదిలాబాద్	: 9985411293	అనంతపురం	: 9985411165	తణుకు	: 9985411543
వరంగల్	: 9985411172	కడప	: 9985411183	కాకినాడ	: 9985411204
ఖమ్మం	: 9985401672	తిరుపతి	: 9985411423	విశాఖపట్నం	: 9985411641
నల్గొండ	: 9985410384	నెల్లూరు	: 9985411013	శ్రీకాకుళం	: 9985411066
				విజయనగరం	: 9985411522

ప్రతి 4 లైన్ల ప్రకటనకు రూ.800/- (కంబైన్డ్) ప్రతి అదనపు లైన్‌కు రూ.130/- (GST అదనం)

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నం.76, రోడ్ నం.70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లిహిల్స్, హైదరాబాద్ - 33. ఫోన్ : 040-23558233/44/55/66. సెల్ : 9985921380.

మైదాన్
MYDAN
విజయవాడ • ఆదివారం 4 మార్చి 2018

గిరిజన పుత్రిక.. సాకర్‌లో దిట్ట!



హైదరాబాద్ నుంచి మేటి క్రీడాకారులు దేశానికి ఆడడంతో ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వెలుగు వెలిగిన క్రీడ ఫుట్‌బాల్. కానీ, కాలగమనంలో మన సాకర్ ఖ్యాతి క్రమంగా దిగజారిపోయింది. ఇప్పుడు చిన్నారులు క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్ వెంటపడుతున్నారు. ఇక, ఫుట్‌బాల్ మరుగున పడింది అనుకుంటున్న సమయంలో.. నేనున్నానంటూ ఓ వర్ధమాన తార దూసుకొచ్చింది. పుట్టింది గిరిజన కుటుంబంలో.. అదీ మూరుమూల తండాలో.. అయితేనేం, స్వీయ ప్రతిభతో ఆమె వెలిగింది. 16 ఏళ్లకే అండర్-14, 16, 19 విభాగాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌కు ఎంపికై ఔరా అనిపించింది.
ఆ అమ్మాయే నిజామాబాద్ జిల్లాకు చెందిన గుగులోత్ సౌమ్య.

మూడేళ్లలో సీనియర్ జట్టుకు ఆడాలి

నేను ఫుట్‌బాల్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి.. ఇప్పుడీ స్థాయిలో ఉండడానికి కోచ్ నాగరాజు సారే కారణం. అమ్మానాన్నలను ఒప్పించి నన్ను ప్లేయర్‌గా మార్చారు. కోల్‌కతాలో జరిగిన ఏఎఫ్‌సీ అండర్-14 టోర్నీలో పాల్గొన్న తర్వాత నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. ఏ టోర్నీకి హాజరైనా ఇతర రాష్ట్రాలు, దేశాల క్రీడాకారులను చూసినా ఆత్మస్థయిర్యం కోల్పోలేదు. వారికంటే నేను మెరుగ్గా ఆడగలనన్న విశ్వాసం నాలో ఉంటుంది. మరో మూడేళ్లలో జాతీయ సీనియర్ జట్టులోకి రావాలన్నదే నా లక్ష్యం. ఆ దిశగా శ్రమిస్తున్నా.

- సౌమ్య



సైనాతో ఎఫైరా....?

కోర్టులోపల కానీ, వెలుపల కానీ నాకెవరైనా ఆత్మీయులు ఉన్నారంటే అది సైనా నెహ్వాల్ మాత్రమే. సైనా చాలా ఏళ్లుగా నాకు తెలుసు. 11ఏళ్లుగా మా స్నేహబంధం కొనసాగుతోంది. మేమిద్దరం కలిసి ప్రాక్టీస్ చేస్తాం.. బయట తిరుగుతాం.. పార్టీలు చేసుకుంటాం.. టూర్లకు వెళుతుంటాం. ఆమెతో నాకున్న అనుబంధం ప్రత్యేకమైనదని చెప్పగలను. అంతేకానీ, అందరూ అనుకుంటున్నట్టుగా మా మధ్య ఎలాంటి ఎఫైర్ లేదు. మేం డేటింగ్‌లో ఉన్నామంటూ ఏడేళ్ల నుంచి మీడియాలో వార్తలు వస్తూనే ఉన్నాయి. గాసిప్స్ కామనే. వివరణ ఇచ్చుకుంటే దాన్ని మరింత పెద్దగా చేస్తారు. అందుకే ఈ వార్తలు చూసి నవ్వుకోవడం తప్ప ఏం చేయలేం. ఆటకు సంబంధించి సైనా నుంచి సలహాలు స్వీకరిస్తాను. వైఫల్యాల్లో ఉన్నప్పుడు సైనా చాలా మద్దతిస్తుంది. రెండేళ్ల క్రితం సైనా కూడా నాలాగే ఫామ్ కోల్పోయి ర్యాంకుల్లో వెనకబడింది. ఆమె నైరాశ్యంలో ఉన్నప్పుడు అండగా నిలిచాను. ఇలా ఒకరికొకరం మానసిక స్థైర్యాన్ని కల్పించుకుంటూ ఆటలో ముందుకు సాగుతుంటాం.

- పారుపల్లి కశ్యప్

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

బాల్‌గాళ్‌ను ఏడిపించి..
వింబుల్డన్ బయటకు

హాకీ, ఫుట్‌బాల్, రగ్బీ వంటి బృంద క్రీడల్లో ఆటగాళ్లను మైదానం నుంచి బయటకు పంపించడం సాధారణమే. ఆటలో అతి చేయడం.. ప్రత్యర్థులకు హాని కలిగించినప్పుడు రెడ్‌కార్డుతో వేటు వేయడం చూస్తుంటాం. కానీ, టెన్నిస్ లాంటి వ్యక్తిగత క్రీడలో ఒక ప్లేయర్‌పై ఆట మధ్యలోనే అనర్హత వేటు వేయడమన్నది చాలా అరుదు. ఇలాంటి ఘటన వింబుల్డన్ ఓపెన్‌లో చోటు చేసుకుంది. బ్రిటన్ మాజీ టెన్నిస్ ప్లేయర్ టిమ్ హెన్మన్‌కు టైగర్ టిమ్ అన్నది ముద్దు పేరు. 1995 వింబుల్డన్‌లో జెరెమీ బేట్స్‌తో డబుల్స్ బరిలోకి దిగిన అతను.. మ్యాచ్ మధ్యలోనే వేటుకు గురయ్యాడు. కారణం బాల్‌గాళ్స్‌ను ఏడిపించడం. ఆ మ్యాచ్‌లో పాయింట్ కోల్పోయిన ఆవేశంతో ఒక బంతిని అవతలి వైపునకు బలంగా కొట్టాడు. కానీ, అది నెట్ వద్ద ఉన్న బాల్‌గాళ్ కరోలిన్ హాల్ నుదుట గట్టిగా తాకింది. ఆ బాధతో హాల్ వెక్కివెక్కి ఏడ్చింది. హెన్మన్ కావాలని ఆమెను గాయపరచకపోయినా.. మ్యాచ్‌ను ఆపేసిన అంపైర్ అతణ్ణి వింబుల్డన్ నుంచి తప్పిస్తున్నట్టు ప్రకటించారు. దీనికి హెన్మన్ - బేట్స్ ఆందోళన చేసినా ఫలితం లేకపోయింది. దాంతో, వింబుల్డన్‌లో ఆట మధ్యలో అనర్హతకు గురైన తొలి ప్లేయర్‌గా హెన్మన్ చెత్త రికార్డును సొంతం చేసుకున్నాడు.


హెన్మన్



పారుపల్లి కశ్యప్.. మొన్నటిదాకా భారత బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో స్టార్‌డమ్ చవిచూసిన తెలుగు కుర్రాడు. కెరీర్ ఆరంభంలో వరుస విజయాలతో గోపీచంద్ వారసుడిగా నీరాజనాలందుకున్నవాడు. ఆ తర్వాత గాయాలతో ఫామ్ కోల్పోయి కొన్నాళ్లు ఆటకు దూరమై కెరీర్ పతనం అంచులదాకా వెళ్లినా.. పట్టుదలగా శ్రమించి మళ్లీ గాడిలో పడ్డాడు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఆస్ట్రియా ఓపెన్ టైటిల్ నెగ్గి పునర్వైభవం దిశగా అడుగులేస్తున్న 'కామన్వెల్త్' చాంపియన్ కశ్యప్‌తో సరదాగా కాసేపు..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

మేమిద్దరం ప్రియ మిత్రులం

- సైనాతో ప్రేమబంధం కాదు.. స్నేహబంధమే!
- కెరీర్‌లో పునర్వైభవం దిశగా అడుగేస్తున్నా
- ఆస్ట్రియా ఓపెన్ విజేత పారుపల్లి కశ్యప్

హాయ్ కశ్యప్... కంగ్రాట్స్. చాలా రోజుల తర్వాత అంతర్జాతీయ టైటిల్ గెలిచినట్టున్నారు.

అవును... మూడేళ్ల క్రితం భారత్‌లో సయ్యద్ మోడీ టోర్నీలో విజేతగా నిలిచాను. ఆ తర్వాత అంతర్జాతీయ టైటిల్ గెలవడం ఇదే తొలిసారి. ఆస్ట్రియా ఓపెన్ టైటిల్ నెగ్గడం చాలా సంతోషంగా ఉంది. ఇన్నాళ్లకు మళ్లీ ఉత్తేజంగా కనిపిస్తున్నాను.

2016 అంతగా కలిసిరాలేదు.. భుజం గాయంతో చాలారోజులు విరామం తీసుకున్నావు. ఆ సమయంలో ఏం చేశావు?

గాయం నాకు పెద్ద దెబ్బ. దీని కారణంగానే రియో ఒలింపిక్స్‌కు దూరమవ్వాల్సి వచ్చింది. కొన్నాళ్లు ఆటకు దూరమవడంతో ఎక్కువగా ఇంట్లో టీవీ చూసేవాడిని. వీడియోగేమ్స్‌తో కాలక్షేపం చేసేవాడిని. అంతర్జాతీయ టోర్నీల్లో మిగతా ఆటగాళ్ల వీడియోలు చూస్తూ మెళకువలు నేర్చుకునేవాణ్ని. ఈ విరామం కూడా మంచే చేసింది. ముఖ్యంగా మానసికంగా ఎంత ప్రశాంతంగా ఉండాలో నేర్చుకున్నాను. ఇది నాకిప్పుడు ఆటలో ఎంతో ఉపయోగపడుతోంది. ప్రస్తుతం నేను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాను.

విరామ సమయాల్లో సినిమాలు, షికార్లకు వెళుతుంటావా?

సినిమాలు ఇష్టం లేదు. మూడుగంటలు థియేటర్‌లో కూర్చోవడం నాకు నచ్చదు. సహచర షట్లర్లు సైనా నెహ్వాల్, గురుసాయి దత్‌లతో ఎక్కువగా సమయం గడుపుతుంటా. వాళ్లతో ఉంటే టైమే తెలియదు. ఖాళీ సమయాల్లో కార్డ్స్ ఆడతాం లేదంటే పార్టీలకు వెళుతుంటాం. మేం చాలా సరదాగా ఉంటాం.

మళ్లీ గోపీ గూటికి రావడం వెనక..

మా నాన్నది రాజమండ్రి.. అమ్మది కాకినాడ. నా చిన్నప్పుడే మేం హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నాకు 11ఏళ్లప్పటి నుంచి బ్యాడ్మింటన్ ఆడుతున్నా. అప్పటినుంచే నాకు గోపీ అన్నతో సాన్నిహిత్యం ఉంది. అతను కోచ్ కాకముందు ఆటగాడిగా ఉన్నప్పుడు నేను జూనియర్‌ని. అప్పట్లో నేను చురుకుగా ఆడడం చూసి కోచ్ అయ్యాక గోపీ నన్ను శిష్యునిగా స్వీకరించారు. అతని సారథ్యంలోనే లండన్ ఒలింపిక్స్‌లో క్వార్టర్‌ఫైనల్ దాకా వెళ్లగలిగా. అయితే, మధ్యలో మోకాలి గాయంతో చాన్నాళ్లు ఆటలో వెనకబడ్డాను. దాంతో ఫిజికల్ ఫిట్‌నెస్ కోసమని చాలారోజులు బెంగళూరులో ప్రాక్టీస్ చేశా. కానీ, గోపీ అన్నను మరిచిపోలేదు. నేను ఇప్పుడు ఈస్థాయిలో ఆడుతున్నానంటే అందుకు గోపీ అన్ననే కారణం.

కామన్వెల్త్ క్రీడల్లో టైటిల్ నిలబెట్టుకుంటావన్న విశ్వాసముందా.. భవిష్యత్ లక్ష్యాలేంటి?

2014 కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల సింగిల్స్‌లో విజేతగా నిలిచాను. అప్పట్లో చాలామంది నన్ను ప్రశంసించారు. గోపీకి వారసుడివంటూ పొగిడారు. అయితే, ఆ తర్వాత గాయాలతో నా కెరీర్ ప్రమాదంలో పడే స్థితికి చేరుకుంది. ఈలోపు నాకు జూనియర్లయిన కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, సమీర్ వర్మలాంటి షట్లర్లు అద్భుతంగా ఆడుతూ పైకెదిగారు. ఒకప్పుడు ప్రపంచ 6వ ర్యాంకర్‌గా ఉన్న నేను ఏకంగా 50లోపు ర్యాంకుకు పడిపోయాను. అయినా ఏమాత్రం నిరాశ చెందలేదు. పట్టుదలగా ప్రాక్టీస్ చేసి మళ్లీ ఫామ్‌లోకొచ్చాను. ప్రస్తుతం నా ర్యాంకు 40లో ఉంది. ఆస్ట్రియా ఓపెన్ విజయంతో ర్యాంకు మెరుగయ్యే అవకాశముంది. వచ్చేనెలలో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో టైటిల్ నిలబెట్టుకోవడంపై దృష్టి సారించాను. ఆ తర్వాత యూరప్ టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఈవెంట్లలో ఆడతాను. వీటిలో రాణించి.. మే, జూన్‌లో జరిగే సూపర్‌సిరీస్ టోర్నీల్లో సత్తాచాటడమే ప్రస్తుత లక్ష్యం. ఇప్పుడు నాకు ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్పాన్సర్‌షిప్ సహకారముంది.

తెలుగు రాష్ట్రాల ఫుట్‌బాల్‌లో సౌమ్య ఇప్పుడో సంచలనం. చిన్న వయసులోనే జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె ఎందరో వర్ధమాన ప్లేయర్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది. మెరుపు వేగంతో బంతిని గోల్ పోస్టులోకి పంపే ఈ స్ట్రయికర్ అసలు ఫుట్‌బాల్‌ను కెరీర్‌గా ఎంచుకోవడమే యాదృచ్ఛికం. ఆమెకు క్రీడలపై చిన్నప్పటి నుంచి ఆసక్తి లేదు. చదువు, ఇల్లు.. ఇవే లోకం. కానీ, ఏడో తరగతిలో ఉండగా సహచరులను చూసి తనకు ఆటలు ఆడాలనిపించింది. అలా మైదానంలో దిగిన ఆమె తొలుత అథ్లెటిక్స్‌లో పోటీ పడింది. జిల్లాస్థాయి టోర్నీలో 100, 200 మీటర్లలో పరుగు తీసి ఆకట్టుకుంది. దాంతో, పరుగే తన ప్రాణం అనుకుంది. కానీ, ఓ రోజు అథ్లెటిక్స్ పోటీలో సౌమ్య పరుగును పీఈటీ, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు చూడడం ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. బక్కపలుచగా ఉన్న సౌమ్య మెరుపువేగంతో పరుగులు తీయడం నాగరాజును ఆకట్టుకుంది. ఆ వేగం, ఉత్సాహం, ఎనర్జీ చూసిన కోచ్.. ఈ లక్షణాలతో సౌమ్య ఫుట్‌బాలర్‌గా కచ్చితంగా రాణించగలదని అనుకున్నాడు. వెంటనే ఆమె దగ్గరికెళ్లి ఫుట్‌బాల్ ఆడతావా అని అడగడం.. అందుకు సౌమ్య సరే అనడం చకచకా జరిగిపోయాయి. అంతే.. అంకితభావం, క్రమశిక్షణకు మారుపేరైన నాగరాజు శిక్షణలో 2012లో సాకర్‌లో ఓనమాలు దిద్దిన సౌమ్య.. ఏడాదిలోపే జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటి జాతీయ స్కూల్‌గేమ్స్‌లో సత్తా చాటింది. మూడేళ్లలో ఏఐఎఫ్‌ఎఫ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ నేషనల్స్‌లో పోటీపడింది. తనపేరు దేశానికి తెలిసేలా 2015, 16లో ఏఎఫ్‌సీ అండర్-14, అండర్-16, అండర్-19 విభాగాల్లో భారత జట్టుకు ఎంపికైంది. ఏఎఫ్‌సీ అండర్-16 ఈవెంట్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుకుంది.

తల్లిదండ్రులు ససేమిరా..

వాస్తవానికి సౌమ్యను ఫుట్‌బాల్ ఆడించడం ఆమె తల్లిదండ్రులకు మొదట ఇష్టం లేదు. దానికి బలమైన కారణం లేకపోలేదు. వారిది గిరిజన (లంబాడా) కుటుంబం. నిజామాబాద్ పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలోని కూనెపల్లి కిషన్ తండా వారి స్వస్థలం. తండ్రి గోపీ స్కూల్ టీచర్. ముగ్గురు ఆడ పిల్లలు, ఒక అబ్బాయిలో మూడో సంతానం సౌమ్య. మారుమూల నేపథ్యం.. క్రీడలపై అవగాహన, బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడంతో ఆమెను పంపించబోం అని నాగరాజుకు తేల్చి చెప్పారు. అయినా నాగరాజు ఒత్తిడి తేవడంతో ఒకదశలో గొడవకు దిగారు. బుద్ధిగా చదువుకుంటున్న తమ అమ్మాయిని ఇబ్బంది పెట్టవద్దన్నారు. పైగా, చిన్నప్పుడే ఆమెకు అపెండిసైటిస్ ఆపరేషన్ కావడం కూడా వారిని వెనకడుగు వేసేలా చేసింది. కానీ, సౌమ్య మాత్రం సాకర్ ఆడతానని మారాం చేసేది. అన్నం మానేసి మరీ గ్రౌండ్‌కు వచ్చేది. సౌమ్య సామర్థ్యం గురించి వివరించి ఎలాగోలా తల్లిదండ్రులను ఒప్పించిన నాగరాజు.. ఆమెకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాడు. స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటడంతో సౌమ్య తల్లిదండ్రుల్లో విశ్వాసం ఏర్పడింది.



కోచ్ అండగా ముమ్ముందుకు..

ఆరంభంలోనే ఎంతో ఉత్సాహంతో కనిపించిన సౌమ్య ఆ తర్వాత వెనుదిరిగి చూసింది లేదు. తన సహజసిద్ధ ప్రతిభకు అంకితభావంతో పని చేసే నాగరాజు శిక్షణ తోడవడంతో ఆమె కెరీర్ దూసుకెళ్లింది. స్నేహితులు సుధాకర్, తులసీకృష్ణ, రైమల్ సహకారంతో 2011లో హైదరాబాద్ కేర్ ఫుట్‌బాల్ అకాడమీని ఏర్పాటు చేసిన నాగరాజు పలువురు నిరుపేద క్రీడాకారులకు ఉచిత వసతితో శిక్షణ ఇస్తున్నాడు. అకాడమీలో చేరిన వారికి స్కూల్ ఫీజులో రాయితీ ఇప్పిస్తున్నాడు. ఇప్పుడు ఆ అకాడమీలో 120 మంది యువ ప్లేయర్లు శిక్షణ తీసుకుంటున్నారు. వారిలో 20మంది ఇప్పటికే వివిధ వయో విభాగాల్లో జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. ఇదే అకాడమీలో సౌమ్య రాటుదేలింది. కోచింగ్‌కు వచ్చేసరికి ఎక్కడా రాజీపడకుండా, కఠినంగా ఉండే నాగరాజు అబ్బాయిలతో కలిసి సౌమ్యను ప్రాక్టీస్ చేయించేవాడు. ఇక, చదువు కోసం కుటుంబంతో నగరానికి మకాం మారిన సౌమ్య రోజూ ఉదయం 5 గంటల్లోపే కోచ్ ఇంటిముందు వాలిపోయేది. ఉదయం, సాయంత్రం రెండేసి గంటలు కఠోర శిక్షణతో ఆటలో మెరుగులు దిద్దుకుంది. నిజామాబాద్‌లో టర్ఫ్ మైదానాలు లేకపోయినా.. గాయాల భయం లేకుండా సాధారణ గ్రౌండ్‌లోనే ప్రాక్టీస్ చేసేది. టర్ఫ్‌పై శిక్షణ కోసం సౌమ్య, నాగరాజులకు తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి సహకారం అందించాడు. హైదరాబాద్‌లో శిక్షణకు ఏర్పాట్లు చేసేవారు. వీటిని సద్వినియోగం చేసుకున్న సౌమ్య చిన్న వయసులోనే.. తక్కువ కాలంలోనే జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకుంది. దాంతో, ప్రతిష్ఠాత్మక ఐ లీగ్ (మహిళల) అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. సెలెక్షన్ ట్రయల్స్‌లో మూడు గోల్స్ కొట్టిన సౌమ్య ఇండియా రష్ క్లబ్ కు ఎంపికైంది. ఈ సీజన్‌లో ఐ లీగ్‌లో చోటు దక్కించుకున్న తెలుగు ప్లేయర్‌గా నిలిచింది. క్వాలిఫయింగ్‌లో ఆ జట్టు సత్తా చాటడంతో మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ పరీక్షలకు హాజరవుతున్న సౌమ్య అవి ముగియగానే ఐ లీగ్ మెయిన్స్‌పై దృష్టి పెట్టనుంది. క్రిస్టియానో రొనాల్డోను ఆరాధించే ఈ అమ్మాయి భారత సీనియర్ జట్టులో చోటే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ప్రతిభ, పట్టుదల, సాధించాలనే తపన, కష్టపడేతత్వం ఉంటే నేపథ్యంతో సంబంధం లేకుండా క్రీడల్లో ఎవరైనా రాణించవచ్చనేందుకు సౌమ్యనే నిదర్శనం.

సౌమ్యను తొలిసారి 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నప్పుడు చూశా. ఆమె వేగం, ఉత్సాహం చూసి ఫుట్‌బాల్‌లో మంచి భవిష్యత్ ఉంటుందని భావించా. మైదానంలో ఆమె ఎప్పుడూ చాలా దూకుడుగా ఉంటుంది. చాలా వేగంగా గోల్స్ చేయడం ఆమె బలం. ఎప్పుడూ ప్రాక్టీస్‌కు ఎగ్గొట్టేది కాదు. ఎంత కఠినమైన శిక్షణ తీసుకొన్నా.. ఏ రోజూ అలసిపోయేది కాదు. అందుకే ఇంత తక్కువ కాలంలో ఈ స్థాయికి చేరుకుంది. వీలైనంత త్వరలో ఆమె సీనియర్ జట్టుకు ఆడుతుందన్న విశ్వాసం ఉంది.

-కోచ్ నాగరాజు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

ఆంధ్రజ్యోతి



బజరంగ్, వినోద్ కాంస్య పట్టు

• ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో నిరుడు విజేత బజరంగ్ పూనియా ఈసారి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. కాగా పురుషుల 70 కిలోల విభాగంలో వినోద్ కుమార్ ఓంప్రకాష్ కూడా కాంస్య పతకం సాధించాడు. దీంతో స్వర్ణం, రజతంతోపాటు ఆరు కాంస్యాలతో కలిపి భారత పతకాల సంఖ్య ఎనిమిదికి చేరింది. శనివారం జరిగిన 65 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో గతేడాది స్వర్ణం సాధించిన బజరంగ్.. క్వార్టర్స్‌లో 5-7తో దైచి టకాటని (జపాన్) చేతిలో ఓడాడు. కానీ దైచీ ఫైనల్ చేరడంతో పూనియాకు రెపిచేజ్ అనే అవకాశం దక్కింది. కాంస్య పోరులో బజరంగ్ 10-4 తో యోనెస్ అలిఅక్బర్ ఎమామిచోఘై (ఇరాన్)పై విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో ఓడిన వినోద్ కుమార్‌కు కూడా రెపిచేజ్‌లో అదృష్టం కలిసి వచ్చింది. ఉత్కంఠ భరితంగా జరిగిన పతక బౌట్‌లో వినోద్ 3-3తో ఎల్మాన్ దాగ్దుర్‌బెక్ ఉలు (కిర్గిస్థాన్)తో సమంగా నిలిచాడు. కానీ నిబంధనల ప్రకారం చివరగా పాయింట్ సాధించిన వినోద్ చాంపియన్‌గా నిలిచాడు.

ఆసియా క్రీడల్లో షూటింగ్ ఈవెంట్ల తొలగింపు

పుణె: ఆసియా క్రీడల నిర్వాహకులు భారత్‌కు షాక్ ఇచ్చే నిర్ణయం తీసుకున్నారు. జకార్తాలో ఆగస్టు 18న ప్రారంభమయ్యే ఈ గేమ్స్‌లో షూటింగ్ నుంచి పలు విభాగాలను తొలగించారు. ఆసియాడ్ సంప్రదాయ ఈవెంట్లు రైఫిల్ 50 మీ. ప్రోన్ (పురుషులు, మహిళలు), 50 మీ. పిస్టల్, 25 మీ. సెంటర్ ఫైర్ పిస్టల్, 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ విభాగాలను తొలగించారు. అయితే ఈ విభాగాలన్నీ ఒలింపికేతర ఈవెంట్లే అయినా.. భారత్‌పై పెద్ద ప్రభావమే చూపనున్నాయి. ఎందుకంటే ఈ విభాగాల్లో ముఖ్యంగా టీమ్ ఈవెంట్లలో భారత్‌దే హవా. 2014 ఆసియా క్రీడల్లో భారత్ షూటింగ్‌లో ఓ స్వర్ణం, మరో రజతం, ఏడు కాంస్య పతకాలు గెలుపొందింది. ఇందులో మెజారిటీ పతకాలు జకార్తలో తొలగించిన విభాగాల్లోనివే కావడం గమనార్హం. ఇక ఈ నిర్ణయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రనిందర్ సింగ్ తప్పుబట్టారు.




మరో పచ్చబొట్టు..

ముంబై: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీకి టాటూస్ అంటే ఎంతిష్టమో అభిమానులకు తెలిసిందే.. ఇప్పటికే తన ఎడమ చేతిని గమనిస్తే మణికట్టు నుంచి భుజం వరకు రకరకాల ఆకృతులు కనిపిస్తుంటాయి. తాజాగా ఇప్పటికే భుజం పైనున్న 'గాడ్స్ ఐ' ఆకారానికి చుట్టూ మరో కొత్త టాటూను జత చేసుకున్నాడు. శనివారం బాంద్రాలోని ఏలియన్స్ టాటూలో బాడీ ఆర్టిస్ట్ ఆలన్ గోయిస్‌తో కోహ్లీ టాటూ వేయించుకున్నాడు. ఈ ఫొటోలను గోయిన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యాయి.

నాన్నకు ప్రేమతో..



బర్మింగ్‌హామ్: ఐవరీకోస్ట్ అథ్లెట్ మురీలీ అహౌర్ వరల్డ్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ మహిళల 60 మీ. పరుగులో (6.97 సెకన్లు) స్వర్ణ పతకం సాధించింది. క్యాన్సర్‌తో మరణించిన తండ్రికి ఈ పతకాన్ని అంకితం ఇస్తున్నట్టు 30 ఏళ్ల అహౌర్ తెలిపింది. 'రేస్‌కు ముందు ఆయనతో మాట్లాడాను. ప్లీజ్ నాన్న.. ఈ రేస్ గెలిచేలా చేయి' అని వేడుకున్నానని ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకొంటూ అహౌర్ చెప్పింది.



తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, చాముండేశ్వరీ నాథ్

ఈరోజు కోసం వేచిచూశా

- జిమ్నాస్టిక్స్‌లో దీప తర్వాత అరుణ అనడం గర్వంగా ఉంది
- ఇక అమ్మ కోసం ఆడతా
- కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం సాధిస్తా
- ఒలింపిక్ పతకం సాధించడమే అంతిమ లక్ష్యం
- 'ఆంధ్రజ్యోతి'తో ప్రపంచ జిమ్నాస్టిక్స్ పతక విజేత అరుణా రెడ్డి





అమ్మతో..



చిన్నప్పుడు కరాటేలో పతకంతో ..

రాజేంద్రనగర్ / ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి: ఆటల్లో మిగతా వాటితో పోలిస్తే జిమ్నాస్టిక్స్ విభిన్నం. ఈ క్రీడను కెరీర్‌గా ఎంచుకోవాలంటే తొలుత కావాల్సింది ధైర్యం. ఇక శరీరాన్ని రబ్బరు బొమ్మలా వంచే ఈ క్రీడలో రాణించడం ఆషామాషీ కాదు. కఠోర శిక్షణ, సమయస్ఫూర్తికి తోడు ఆత్మస్థైర్యం ఎంతో ముఖ్యం. అలాంటి జిమ్నాస్టిక్స్‌లో ఏకంగా ప్రపంచ కప్‌లో పతకం గెలిచే స్థాయికి ఎదిగింది తెలుగమ్మాయి బుద్ధారెడ్డి అరుణ. రియో ఒలింపిక్స్‌లో దీపా కర్మాకర్ తన ప్రదర్శనతో యావత్తు దేశ ప్రజలతో ఔరా అనిపించుకుంది. అలాగే అరుణ కూడా జిమ్నాస్టిక్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవడమే కాదు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ జరిగిన ప్రపంచ కప్‌లో వాల్ట్ విభాగంలో కాంస్యం చేజిక్కించుకుని తెలుగు రాష్ట్రాల 'దీపా కర్మాకర్'గా జేజేలు అందుకుంటోంది. తాను ప్రస్తుతం ఈస్థాయికి చేరానంటే అందుకు తన తండ్రి నిరంతరం వెన్ను తట్టి ప్రోత్సాహించడమే కారణమంటోంది అరుణ. దురదృష్టవశాత్తు ఈ విజయాన్ని ఆస్వాదించేందుకు ఆయన లేకపోవడం ఎంతో బాధాకరమని పేర్కొంది. ఇప్పటివరకూ తండ్రి ఆశయ సాధన కోసం శ్రమించానని ఇకపై.. తనకు సర్వస్వం అయిన తల్లి కోసం మరింత కష్టపడి మరెన్నో పతకాలు సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్న అరుణతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

మూడేళ్ల వయస్సు నుంచే..

మా కుటుంబంలో క్రీడాకారులెవరూ లేరు. కానీ నా తండ్రి నారాయణరెడ్డికి ఆటలంటే ఎంతో ఇష్టం. అందుకే నాకు మూడేళ్ల వయస్సున్నప్పుడే కరాటేలో చేర్పించారు. హైదర్‌గూడలోని అకాడమీలో కరాటే ఓనమాలు నేర్చుకున్న నేను ఏడేళ్లకే బ్రౌన్ బెల్ట్ సాధించా. కరాటేలో నేను జంప్ చేసే తీరుకు అచ్చెరువొందిన కరాటే మాస్టర్ బాల సుబ్రహ్మణ్యం నన్ను జిమ్నాస్టిక్స్‌లో చేర్పిస్తే తిరుగుండదని నా తండ్రికి సూచించారు. అలా రెండో తరగతి చదువుతున్న సమయంలో ఎల్బీ స్టేడియంలో జిమ్నాస్టిక్స్ శిక్షణలో చేరాను. ప్రతిరోజు స్కూల్ అయిపోయాక నాన్న నన్ను జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్‌కు తీసుకెళ్లేవారు.

> **కామన్వెల్త్, ఆపై ఒలింపిక్స్..**
> ప్రపంచకప్‌లో సాధించిన కాంస్య పతకం నాలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింజేసింది. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం మళ్లీ ప్రాక్టీస్ ప్రారంభిస్తా. ఏప్రిల్‌లో గోల్డ్‌కోస్ట్ (ఆస్ట్రేలియా)లో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో పసిడి పతకం చేజిక్కించుకోవడమే నా లక్ష్యం.. ఆపై 2020 ఒలింపిక్స్‌లో పతకం గెలవడమే ధ్యేయంగా శ్రమిస్తా.

స్వర్ణ పరంపర..

2005లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ నేషనల్స్‌లో స్వర్ణ పతకం నెగ్గా.. ఆ తర్వాత చండీగఢ్, అలహాబాద్‌లో సబ్‌జూనియర్ నేషనల్స్‌లోనూ పసడి పతకాలు గెలిచా. అలాగే జైపూర్, కటక్, బెంగుళూరుల్లో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు కైవసం చేసుకున్నా.

ఆ సమయం..

నిరంతరం నా వెంట ఉండి, నా క్రీడా జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్న తండ్రి నారాయణరెడ్డి 2010లో మరణించడం నన్ను ఎంతో కుంగదీసింది. ఆ షాక్ నుంచి కోలుకొనేందుకు ఎంతో సమయం పట్టింది. ఓ దశలో.. మళ్లీ క్రీడా జీవితాన్ని కొనసాగిస్తానని అనుకోలేదు. కానీ అక్క పావని, బావ జనార్దన్‌రెడ్డిల ప్రోత్సాహంతో ఆ విషాదం నుంచి బయటపడి మళ్లీ కెరీర్ మొదలు పెట్టా.

'టాప్'లో..

2017లో రాహుల్ ద్రావిడ్ ఫండింగ్ చేస్తున్న గో స్పోర్ట్స్‌కు ఎంపికయ్యా. దాంతో పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు లేవు. కేంద్ర ప్రభుత్వం 'టాప్' స్కీమ్‌కూ అర్హత సాధించా. ఫలితంగా విదేశాల్లో శిక్షణ ఖర్చులు కేంద్రం భరిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం నుంచి..

క్రీడాకారులను తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది. అయితే ఎల్బీ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ శిక్షణకు సంబంధించిన వసతులు లేవు. వాటిని ఏర్పాటు చేస్తే అనేక మంది జిమ్నాస్ట్‌లకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారు సానుకూలంగా స్పందించారు.

ఆటలు ఆడాలి..

విద్యార్థులు, యువత తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలి. స్పోర్ట్స్ ఆడితే మైండ్ యాక్టివ్‌గా, షార్ప్‌గా ఉంటుంది. మనం ఎంత చురుగ్గా ఉంటే మనలో ఆత్మవిశ్వాసం అంత మెండుగా ఉంటుంది. ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించచ్చు. కానీ, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మన లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలి.



> **దీపా కర్మాకర్ స్ఫూర్తి**
> రియో ఒలింపిక్స్‌లో దీపా కర్మాకర్ రాణించిన తీరు నాలో ఎంతో స్ఫూర్తి నింపింది. ప్రొడునోవాలో ఆమె విన్యాసాలు నన్ను ఎంతో ఉత్తేజితం చేశాయి. మెల్‌బోర్న్‌లో నేను పతకం నెగ్గడానికి దీప ఇచ్చిన స్ఫూర్తి కూడా కారణం.

ఇప్పటికీ ఎంతో ప్రోత్సాహం..

చిన్ననాటి కరాటే కోచ్ బాలసుబ్రహ్మణ్యం ఇప్పుడూ నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ధైర్యాన్ని నింపుతూ వస్తున్నారు. నేను కాంస్య పతకం గెలవడం పట్ల బాలసుబ్రమణ్యం ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

బ్రాండ్ అంబాసిడర్...

ప్రపంచ కప్ పతకంతో అంతర్జాతీయస్థాయిలో భారత ఖ్యాతిని ఇనుమడింపజేసిన అరుణకు స్పాన్సర్‌షిప్ లభించింది. సువర్ణ అవని ఎస్టేట్ ఇండియా లిమిటెడ్ అరుణను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ కుమార్ అంబాసిడర్ నియామకాన్ని ప్రకటించారు.



నజరానా రూ. 20 లక్షలు

ప్రపంచకప్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన అరుణా రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం నజరానా ప్రకటించింది. ఆమె ప్రతిభకు ప్రోత్సాహకంగా రూ. 20 లక్షలు అందజేసింది. శనివారం ఎల్బీస్టేడియంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో అరుణను క్రీడాశాఖ మంత్రి పద్మారావు గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూ. 20 లక్షల చెక్కును అరుణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎండీ దినకర్‌బాబు, ముఖ్య కార్యదర్శి (స్పోర్ట్స్) బుర్రా వెంకటేశం, అరుణ తల్లి సుభద్రమ్మ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



చెస్ క్రీడాకారుడు పెంటేల హరికృష్ణ వివాహం సెర్బియాకు చెందిన నద్జాతో శనివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హారిక హాజరైంది.

ముక్కోణపు సిరీస్‌కు షకీబ్ దూరం

ఢాకా: శ్రీలంకలో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్‌కు బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబుల్ హసన్ దూరమయ్యాడు. వేలి గాయం నుంచి అతడు ఇంకా కోలుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పేర్కొంది. మంగళవారం నుంచి ఈ సిరీస్ జరుగుతుంది. జనవరిలో శ్రీలంకతోనే జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో షకీబ్ గాయపడ్డాడు.

'దుబాయ్' రన్నరప్ పేస్ జోడీ

దుబాయ్: భారత టెన్నిస్ వెటరన్ స్టార్ లియాండర్ పేస్ దుబాయ్ డ్యూటీ ఫ్రీ చాంపియన్‌షిప్‌లో డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచాడు. పురుషుల డబుల్స్ ఫైనల్లో పేస్-జేమీ సెర్రెటాని (అమెరికా) జోడీ 2-6, 6-7 (2-7)తో జులియన్ రోజర్ (నెదర్లాండ్స్)-హోరియా టెకావు (రొమేనియా) జంట చేతిలో ఓటమి పాలై రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది.

ఆసీస్‌కు భారీ ఆధిక్యం

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. మూడో రోజు శనివారం వెలుతురు లేమితో ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 71.4 ఓవర్లలో 213/9 పరుగులు చేసింది. దీంతో ఆసీస్ 402 పరుగుల భారీ ఆధిక్యంతో ఉంది. బాన్‌క్రాఫ్ట్ (53) అర్ధ సెంచరీ చేయగా స్మిత్ (38), షాన్ మార్ష్ (33) ఫర్వాలేదనిపించారు. క్రీజులో కమిన్స్ (17), హాజెల్‌వుడ్ (4) ఉన్నారు. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉండడంతో అద్భుతం జరిగితే తప్ప ఆసీస్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. మోర్న్ మోర్కెల్, స్పిన్నర్ కేశవ్ మహరాజ్ మూడేసి వికెట్లు తీశారు.

ఆఖరి ఓవర్‌లో గట్టెక్కారు

• న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ విజయం

వెల్లింగ్టన్: చివరి ఓవర్‌లో న్యూజిలాండ్ విజయానికి కావాల్సిన పరుగులు 15.. క్రీజులో సెంచరీ (112)తో ఊపు మీదున్న కెప్టెన్ విలియమ్సన్ ఉన్నాడు.. దీనికి తగ్గట్టుగానే నాలుగు బంతుల్లో ఓ సిక్సర్‌తో 10 పరుగులు సాధించాడు. మిగిలిన రెండు బంతుల్లో ఒక్క సిక్స్ కొట్టినా విజయం ఖాయం.. కానీ పట్టు వీడని పేసర్ క్రిస్ వోక్స్ మరొక్క పరుగు కూడా ఇవ్వకపోవడంతో శనివారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ నాలుగు పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో పర్యాటక జట్టు 2-1తో ఆధిక్యంలో ఉంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 234 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మోర్గాన్ (48), స్టోక్స్ (39) రాణించారు. సోధికి మూడు, బౌల్ట్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత స్వల్ప లక్ష్యం కోసం బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 230 పరుగులే చేయగలిగింది.



పోరాడి ఓడారు

- భారత్‌పై 3-2తో అర్జెంటీనా గెలుపు
- సుల్తాన్ అజ్లాన్ షా కప్

ఇపో (మలేసియా): సీనియర్లు లేకుండానే బరిలోకి దిగిన భారత యువ జట్టు తమ ప్రారంభ మ్యాచ్‌లో పోరాడి ఓడింది. ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనాతో ఆఖరి నిమిషం వరకు నువ్వా నేనా అనే రీతిలో ఆడగలిగినా 2-3తో పరాజయం పాలైంది. నేడు (ఆదివారం) ఇంగ్లండ్‌తో భారత జట్టు రెండో మ్యాచ్ ఆడనుంది. సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున అమిత్ రోహిదాస్ (26, 31వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించాడు. అర్జెంటీనాకు పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్ గోంజలో పిల్లట్ (13, 24, 33వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో నమోదైన ఐదు గోల్స్ కూడా పెనాల్టీ కార్నర్ ద్వారానే వచ్చాయి. ఆరంభంలో భారత్ దూకుడుగా ఆడి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. అయితే తొలి క్వార్టర్ ముగుస్తుందనగా 13వ నిమిషంలో అర్జెంటీనా బోణీ చేసింది. 24వ నిమిషంలో పిల్లట్ రెండో గోల్ సాధించగా మరో 2 నిమిషాలకే రోహిదాస్ భారత్‌కు తొలి గోల్ అందించాడు. నాలుగో క్వార్టర్‌లో ఉరుములతో కూడిన వర్షం కారణంగా మ్యాచ్‌ను గంట సేపు ఆపారు. ఆ తర్వాత భారత్‌కు అవకాశాలు దక్కకపోవడంతో స్కోరును సమం చేయలేకపోయింది.

బీసీసీఐ ఏసీయూ చీఫ్‌గా అజిత్

న్యూఢిల్లీ: అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) హెడ్‌గా రాజస్థాన్ మాజీ డీజీపీ అజిత్ సింగ్ షెకావత్ నియామకానికి బీసీసీఐ సర్వం సిద్ధం చేసింది. నీరజ్ కుమార్ స్థానంలో ఆయనను బోర్డు నియమించనుంది. వచ్చే నెల 7న ఐపీఎల్ ఆరంభం కానుండగా.. అంతకు ముందే షెకావత్ బాధ్యతలు స్వీకరిస్తారని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. అజిత్ సింగ్ 1982 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. రాజస్థాన్ అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) అడిషనల్ డైరెక్టర్‌గా సింగ్ మంచి పేరు సంపాదించారు.

ఎర్రకోటపై కాషాయ జెండా

త్రిపుర

పార్టీ	2013	2018
సీపీఎం	49	15
బీజేపీ	0	44
కాంగ్రెస్	10	0

(మొదటిపేజీ తరువాయి..)


అధికార సీపీఎం 16 స్థానాల్లో విజయం సాధించింది. విచిత్రం ఏమిటంటే, 2013 త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో 50 సీట్లలో బీజేపీ పోటీ చేసింది. ఏకంగా 49 సీట్లలో డిపాజిట్లు కూడా కోల్పోయింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ 48 స్థానాల్లో బరిలోకి దిగి పదిచోట్ల గెలిచింది. అధికార సీపీఎం 55 స్థానాల్లో పోటీ చేసి ఏకంగా 49 సీట్లలో విజయం సాధించింది. వరుసగా నాలుగోసారి మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ, కేవలం ఐదేళ్లలోనే అక్కడ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎన్నికల్లో కేవలం 1.4 శాతం ఓట్లను సాధించిన బీజేపీ ఇప్పుడు ఏకంగా 43 శాతం ఓట్లను సాధించింది. సీపీఎం ఐదుశాతం ఓట్లు తగ్గి 42.7 శాతం ఓట్లు మాత్రమే సాధించింది. ఈసారి ఏకంగా ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఏకంగా ఓటమి అంచుల్లోకి వెళ్లిపోయి బయట పడ్డారు. కౌంటింగ్ మొదలైన తర్వాత తొలి ఫలితాల్లో సీపీఎం ఆధిక్యంలో ఉన్నట్లు వచ్చింది. దాంతో, ఆ పార్టీలో ఉత్సాహం నెలకొంది. కానీ, కౌంటింగ్ మొదలైన నాలుగు గంటల తర్వాత పరిస్థితి మారిపోయింది.



ఇది విప్లవాత్మక తీర్పు

ఈ ఫలితాలతో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం. త్రిపురలో సీపీఎం గట్టి పోటీ ఇచ్చినా మార్పును కోరుతూ బీజేపీ చేసిన ప్రకటనను ఓటర్లు స్వాగతించారు. మార్పునకు పట్టంకట్టారు. ఇదో విప్లవాత్మక, చరిత్రాత్మక తీర్పు. ఈ విజయం వెనుక ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కృషి ఉంది.

-బీజేపీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్







త్రిపురలో 'విప్లవ'ం!

కాబోయే సీఎం విప్లవ్ దేవ్?

న్యూఢిల్లీ, మార్చి 3: విప్లవ్ కుమార్ దేవ్! పేరును బట్టి వామపక్ష భావజాలం ఉన్న నేత కావొచ్చేమో అనుకుంటాం. కానీ ఈయన భారతీయ జనతా పార్టీ నాయకుడు! త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయంలో కీలకభూమిక పోషించిన యువనేత! బీజేపీ త్రిపుర అధ్యక్షుడిగా ఉన్న విప్లవ్ దేవ్(48).. ఇప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేసులో అందరికన్నా ముందున్నారు. త్రిపురలో పాతికేళ్ల సీపీఎం కోటను కూల్చి, తొలిసారిగా ఆ రాష్ట్రంలో బీజేపీకి అధికార పీఠం కట్టబెట్టడంలో విప్లవ్‌దేవ్ అన్నీతానై వ్యవహరించారు. విప్లవ్ దేవ్ ఆర్ఎస్ఎస్ మూలాలున్న వ్యక్తి. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో పాగావేయాలనే బీజేపీ ప్రణాళికలో భాగంగా 2016 జనవరి 7న విప్లవ్‌ను అధిష్ఠానం ఏరికోరి త్రిపుర పార్టీ అధ్యక్షుడిగా నియమించింది. రాష్ట్రంలో బీజేపీకి అధికారంలోకి తెచ్చేందుకు విప్లవ్.. ఆర్ఎస్ఎస్ నేత సునీల్ దేవ్‌ధర్, సీనియర్ నేత రామ్‌మాధవ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో గట్టి కృషిచేశారు. దక్షిణ త్రిపురలోని ఉదయ్‌పూర్‌లో జన్మించిన విప్లవ్.. బాల్యమంతా త్రిపురలోనే గడిచింది. త్రిపురలో బీఏ పూర్తి చేసి పైచదువుల కోసం ఢిల్లీ వెళ్లారు. పీజీ పూర్తయ్యాక ఆర్ఎస్ఎస్‌లో చేరి నాగపూర్‌లో సంఘ్ బాధ్యతలు నిర్వహించారు. కాగా, త్రిపుర ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టేందేందుకు తాను సిద్ధంగా ఉన్నానని విప్లవ్ దేవ్ ప్రకటించారు. ఈ విషయంలో తుది నిర్ణయం బీజేపీ పార్లమెంటరీ బోర్డుదేనన్నారు.

తెర వెనుక దేవ్‌ధర్

న్యూఢిల్లీ, మార్చి 3: త్రిపురలో బీజేపీకి అధికార పీఠం కట్టబెట్టడంలో ప్రధాన పాత్ర ఆ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విప్లవ్ దేవ్‌దే! తెర వెనుక మాత్రం అంతా నడిపించింది గతంలో త్రిపుర పార్టీ ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధరే! 54 ఏళ్ల దేవ్‌ధర్ ఆర్ఎస్ఎస్ నేత! బీజేపీకి కేంద్రంలో అధికారం కట్టబెట్టడంలో భాగంగా 2013లో నరేంద్ర మోదీకి ఆయన ప్రచార వ్యవహారాల పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధిష్ఠానం ఆయనను 2014లో త్రిపుర పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా పంపింది. పార్టీకి అధికారాన్ని కట్టపెట్టడంలో భాగంగా రాష్ట్రంలోని బీజేపీ నేతలను కలుపుకొని పోవడంలో దేవ్‌ధర్ కీలకపాత్ర పోషించారు. మాణిక్ సర్కార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లోని లొసుగులను ఎండగట్టడం, అదే సమయంలో పార్టీని జనాల్లోకి తీసుకెళ్లడం అనే ప్రణాళికను అనుసరించారు. దేవ్‌ధర్ వ్యూహాలు.. అధికారం కట్టబెట్టే దిశగా సాగుతుండడంతో బీజేపీ త్రిపురపై మరింత దృష్టిపెట్టింది. రాష్ట్రంలో ప్రజలను బీజేపీకి అనుకూలంగా మార్చడం కన్నా.. అధికార మాణిక్ సర్కార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారాన్ని నిర్వహించేందుకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చామని ఎన్నికల్లో విజయం అనంతరం దేవ్‌ధర్ వ్యాఖ్యానించారు.

నాగాలాండ్‌లో హంగ్ మేఘాలయలో

రెండు పెద్ద పార్టీలూ బీజేపీ మిత్రులే

ఖాతా తెరవని కాంగ్రెస్

కోహిమా, మార్చి 3: నాగాలాండ్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. అధికార పీఠానికి అవసరమైన ఆధిక్యతను ఏ పార్టీ సాధించలేకపోయింది. 60 స్థానాలకు ఎన్నికలు జరగగా అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్పీఎఫ్)కు 29 స్థానాలు, బీజేపీ, ఎన్డీపీపీ కూటమికి 29 సీట్లు లభించాయి. ఇద్దరు స్వతంత్రులను ఎవరు కలుపుకోగలిగితే వారిదే అధికారం అవుతుంది. విచిత్రంగా ఎన్పీఎఫ్ అధికారం కోసం బీజేపీతో జట్టు కట్టేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 2003 నుంచి ఎన్పీఎఫ్‌తో చేసిన దోస్తీకి స్వస్తి పలికి.. కొత్తగా అవతరించిన నేషనలిస్ట్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్డీపీపీ)తో జట్టుకట్టింది. పోటీ చేసిన 20 స్థానాల్లో 12 చోట్ల గెలుపొంది, తమ బలాన్ని గణనీయంగా పెంచుకుంది. కాంగ్రెస్ ఖాతా తెరవలేక చతికిలపడింది. 15ఏళ్ల క్రితం రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ 18 స్థానాల్లో పోటీ చేసినా.. ఒక్క సీటూ గెలవలేదు. ఇటీవలికాలంలో నాగాలాండ్ అస్తవ్యస్త రాజకీయ పరిస్థితులను చవిచూసింది. 2 దశాబ్దాల పాటు తిరుగుబాటుదారుల సమస్యతో పాలన గాడి తప్పింది. తాజా ఫలితాల నేపథ్యంలో బీజేపీతో చెలిమి పునరుద్ధరణకు జెలియాంగ్ పావులు కదిపారు. సంకీర్ణ సర్కారు ఏర్పాటుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎన్డీపీపీ అధినేత నిఫైరియో దీనిపై స్పందిస్తూ.. ఎవరు సరైన మిత్రులో బీజేపీయే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. ఇతర పార్టీల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి, నాగాలాండ్ బీజేపీ ఇన్‌చార్జి కిరణ్ రిజిజు వెల్లడించారు.


పార్టీ	2013	2018
ఎన్డీపీపీ+బీజేపీ	1	29
ఎన్పీఎఫ్+	38	29
కాంగ్రెస్	8	0
ఇతరులు	13	2

21 స్థానాలతో అతి పెద్ద పార్టీగా కాంగ్రెస్

పుంజుకున్న ఎన్‌పీపీ... 19 స్థానాలు వశం

షిల్లాంగ్, మార్చి 3: మేఘాలయలో మళ్లీ హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. ఏ రాజకీయ పార్టీకీ పూర్తి మెజారిటీ లభించలేదు.పదేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్, ఎన్‌పీపీ మధ్య తేడా కేవలం 2 స్థానాలే! మేఘాలయ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉండగా... 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అధికార పీఠం అధిష్ఠించాలంటే మేజిక్ ఫిగర్ 31 స్థానాలు సాధించాలి. కాంగ్రెస్‌కు 21, ఎన్‌పీపీకి 19, యునైటెడ్ డెమోక్రాటిక్ పార్టీ (యూడీపీ)కి 8, బీజేపీకి 2, ఇతరులకు 9 స్థానాలు లభించాయి. 2013లో ఒక్క స్థానం కూడా దక్కని బీజేపీ ఈసారి 2 స్థానాలు తన ఖాతాలో వేసుకుంది. మేఘాలయ ఓటర్లు ఈసారి కూడా 40 ఏళ్ల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. తాజా ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తిరిగి అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించినా... పెద్ద విజేత మాత్రం ఎన్‌పీపీయే! లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా ఎన్‌పీపీని స్థాపించారు. ఎన్‌పీపీ... ఎన్డీయేలో భాగస్వామపక్షం అయినా ఈ ఎన్నికల్లో విడిగా పోటీ చేసింది.అలాగే బీజేపీ భాగస్వామ్య పక్షం యూడీపీ పుంజుకుని 6 స్థానాలను ఖాతాలో వేసుకుంది. ప్రభుత్వ ఏర్పాటులో ముగ్గురు స్వతంత్రులతో పాటు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ముఖ్యం కానుంది. కాగా, మేఘాలయా సీఎం, కాంగ్రెస్ అభ్యర్థి ముకుల్ సంగ్మా పోటీ చేసిన 2 స్థానాల్లోనూ విజయం సాధించారు.

పార్టీ	2013	2018
కాంగ్రెస్	29	21
ఎన్‌పీపీ	2	19
బీజేపీ	0	2
యూడీపీ+	8	8
ఇతరులు	21	9



అంతలో ఎంత మార్పు!

న్యూఢిల్లీ, మార్చి 3: ఇంతింతై వటుడింతై అన్నట్లుగా బీజేపీ తన ప్రభావాన్ని దేశవ్యాప్తంగా పెంచుకుంటూ పోతోంది. నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీ కేవలం 7 రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే.. కాంగ్రెస్ చేతిలో 13 రాష్ట్రాలుండేవి. కానీ కేవలం నాలుగేళ్లలో పరిస్థితి తారుమారైంది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల కంచుకోటలను సైతం పెకిలిస్తూ ఎవరి అంచనాలకు అందకుండా బీజేపీ 13 రాష్ట్రాల్లో అధికార బలాన్ని పెంచుకుని 20 రాష్ట్రాలకు విస్తరించింది. ఏడు దశాబ్దాలుగా దేశంలో ఏకఛత్రాదిపత్యం కొనసాగించిన హస్తం పార్టీ కమలం దెబ్బకు కుదేలైంది. నాలుగేళ్లలో 10 రాష్ట్రాల్లో అధికారం కోల్పోయి 3 రాష్ట్రాలకే పరిమితమైంది. 8 ఈశాన్యరాష్ట్రాల్లో 2013లో బీజేపీ ఖాతాలో కేవలం నాగాలాండ్ మాత్రమే ఉండేది. 4 లోక్‌సభ స్థానాలుండేవి. కానీ నేడు(2018లో) 6 రాష్ట్రాలకు తన అధికారాన్ని విస్తరించింది. లోక్‌సభ స్థానాలు సైతం రెట్టింపయ్యాయి.

ఇక మిగిలింది కేరళే!

త్రిపురలో ఓటమితో లెఫ్ట్ కుదేలు

కేరళ సీపీఎం నేతల్లో గుబులు

న్యూఢిల్లీ, మార్చి 3: త్రిపురలో కూడా ఓడిపోయిన వామపక్ష కూటమికి ఇక మిగిలింది కేరళే! దేశం మొత్తం మీద ఎర్ర కూటమి అధికారంలో ఉన్నది ఇక్కడే! తాజాగా త్రిపురలో బీజేపీ భారీ విజయం కేరళ ఎర్రదండును కలవరపెడుతోంది! మరోవైపు బీజేపీ నేతలు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. ఇప్పుడు త్రిపురలో గెలిచామని, 2021లో కేరళలోనూ అధికారం తమదేనని చెబుతున్నారు. పశ్చిమబెంగాల్‌ను మూడు దశాబ్దాల పాటు పాలించిన లెఫ్ట్ ఫ్రంట్.. 2011లో తృణమూల్ కాంగ్రెస్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. అక్కడ్నుంచే కూటమి పతనం ప్రారంభమైంది! తాజాగా మూడు ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లోనూ వామపక్ష కూటమికి కోలుకోలేని దెబ్బ తగిలింది. నాలుగు సార్లు త్రిపుర సీఎంగా పనిచేసిన మాణిక్ సర్కార్ మూటాముల్లే సర్దుకోవాల్సి వచ్చింది. 1996లో వామపక్ష కూటమి కేంద్రంలో అధికారానికి చేరువైంది. దేశ రాజకీయాల్లో 1996 నుంచి 2004 వరకు వామపక్ష కూటమి బలమైన శక్తిగా ఉంది. లోక్‌సభలో 62 స్థానాలు గెలుచుకుని యూపీఏ-1 సర్కారుకు బయటి నుంచి మద్దతిచ్చింది. అక్కడి నుంచి కూటమి ప్రభ క్రమంగా తగ్గిపోతూ వచ్చింది. 2009లో వామపక్ష కూటమి కేవలం 24 లోక్‌సభ సీట్లే గెలుచుకుంది. ఐదేళ్ల తర్వాత 2014లో నరేంద్ర మోదీ ప్రభంజనానికి వామపక్ష కూటమి దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. కేవలం 4.8 శాతం ఓట్లతో 12 సీట్లకే పరిమితమైంది. సీపీఎంలోని ముఠాలు, వర్గాలే వామపక్ష కూటమి పతనానికి కారణమని మిత్రపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేరళ, బెంగాల్‌లోని పార్టీ నేతలు అనేక అంశాలపై బహిరంగంగానే విమర్శలకు దిగారు. కేరళ వర్గానికి ప్రకాశ్ కరత్, బెంగాల్ వర్గానికి సీతారాం ఏచూరి నేతృత్వం వహిస్తున్నారు. వీరిమధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం క్షేత్రస్థాయి కార్యకర్తల్లో నిరుత్సాహాన్ని నింపిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అదేసమయంలో వామపక్ష కూటమిలోని సీపీఎం, సీపీఐ, ఆర్ఎస్పీ, ఏఐఎఫ్‌సీలు కలిసి పనిచేయడంలో విఫలమయ్యాయి. కూటమిపై సీపీఎం పెత్తనం పెరిగిపోతోందని, పెద్దన్నలా ప్రవర్తిస్తోందని సీపీఐ వర్గాలు ఆరోపిస్తున్నాయి. సీపీఎం వల్లే వామపక్ష కూటమి ప్రాంతీయ, జాతీయ స్థాయిలో ఓటమిపాలవుతోందని మిగిలిన చిన్న పార్టీలూ విమర్శిస్తున్నాయి.

శూన్యం నుంచి శిఖరాగ్రానికి

హింసాకాండ, భయోత్పాతంపై ప్రజాస్వామ్య విజయం: మోదీ



న్యూఢిల్లీ, మార్చి 3: 'ఎరుపు రంగుతో సూర్యాస్తమయం.. కాషాయ వర్ణంతో సూర్యోదయం.. ఇది ఈశాన్య భారతానికి నూతన శకం' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బీజేపీ శూన్యం నుంచి శిఖరాగ్రానికి చేరిందన్నారు. ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో బీజేపీ అనూహ్య విజయాలు సాధించిన నేపథ్యంలో ఆ సంతోషాన్ని ఆయన శనివారం సాయంత్రం బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో పంచుకున్నారు. అంతకుముందు విజయాలపై హర్షం వ్యక్తంచేస్తూ వరుస ట్వీట్లు చేశారు. ఈశాన్య భారతంలో పార్టీ విజయానికి కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారని.. వారి త్యాగాల వల్లే పార్టీ విజయం సాధించిందని, వారిని స్మరించుకుంటూ కాసేపు మౌనం పాటిద్దామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో సూచించారు. మౌనం పాటించాక ఆయన ప్రసంగించారు. వామపక్షాలపై విరుచుకుపడ్డారు. బెంగాల్, కేరళ, త్రిపురల్లో వామపక్షాలు, మావోయిస్టులు ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను హత్య చేశారని.. ఈ విజయాలను అమరులైన మన కార్యకర్తలకు అంకితమిస్తున్నామని తెలిపారు. 'త్రిపురలో బీజేపీ విజయం.. క్రూర హింసాకాండ, భయోత్పాతాలపై ప్రజాస్వామ్యం సాధించిన గెలుపు. ఇది సాధారణ ఎన్నికల విజయం కాదు. ఎన్డీఏ అనుసరిస్తున్న దృఢతర అభివృద్ధి ఎజెండా.. బీజేపీ సంస్థాగత బలంతో శూన్యం నుంచి శిఖరాగ్రానికి చేరాం. ఏళ్ల తరబడి అవిశ్రాంతంగా పనిచేస్తున్న ప్రతి బీజేపీ కార్యకర్తకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మన సానుకూల, అభివృద్ధి ఎజెండాను ప్రజలు ఎంతో విశ్వసిస్తున్నారు. నకారాత్మక, విచ్ఛిన్న, అసంబద్ధ రాజకీయాలను వారు సహించరు. వాటిని పట్టించుకోవడానికి వారికి తీరిక కూడా లేదు' అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమన్నారు. 'కానీ త్రిపురలో పరాజయం తర్వాత వామపక్షాల స్పందన చూస్తే వారు క్రీడాస్ఫూర్తిని నేర్చుకోవలసి ఉందనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్/కేరళ/త్రిపురలో వాళ్ల ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోరు. హింసకు దిగజారతారు. అయినా మనం మౌనం వహించాం. త్రిపురలో మావోయిస్టు సిద్ధాంతాలతో ప్రజాకాంక్షలకు విరుద్ధంగా భయోత్పాతాలు సృష్టించారు. అక్కడి ప్రజలు ఏం జరుగుతోందో గమనించారు. తమ ఓట్లతో జవాబిచ్చారు' అని స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'మనం ఏవైనా చర్యలకు ఉపక్రమిస్తే రాజకీయ కక్ష సాధిస్తున్నారని గగ్గోలుపెడతారు. కానీ అది రాజకీయ కక్ష కాదు.. చర్యలు తీసుకోవడానికే ప్రజలు మనకు అధికారమిచ్చారు' అని తేల్చిచెప్పారు. ఒకప్పుడు దేశంలోని పలు ప్రాంతాల్లో బీజేపీకి ఉనికే లేదని, ఇప్పుడు దేశం మూలమూలలా మర్రి చెట్టులా శాఖోపశాఖలుగా విస్తరించిందని చెప్పారు. ఏమీ లేని స్థితి నుంచి విజేతగా ఆవిర్భవించామన్నారు.

కాంగ్రెస్ పరిస్థితి మనకు పాఠం..

దేశంలోనే అతి ప్రాచీనమైన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి స్థాయిలో ఎప్పుడూ పతనం కాలేదని ప్రధాని చెప్పారు. 'త్వరలో జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత కాంగ్రెస్‌కు దేశంలో పాండిచ్చేరి సీఎం నారాయణస్వామి ఒక్కరే ఉంటారు. ఆ సంగతి ఆయనకే చెప్పాను. కాంగ్రెస్‌లో మీరు చాలా అదృష్టవంతులని అన్నాను. కాంగ్రెస్ ఒకప్పుడు ఎలా ఉండేదో చెప్పడానికి మిమ్మల్ని ఉదాహరణగా చూపుతారని చెప్పాను. భుజాలపైకెత్తుకుని మాక్కూడా ఓ సీఎం ఉన్నారని సంబరపడతారని అన్నాను. పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. అక్కడి ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్‌ను తన నేతగా పరిగణించదు. ఆయన కూడా కాంగ్రెస్‌ను సొంత పార్టీగా భావించరు. ఆయన స్వతంత్ర సైనికుడు' అని వ్యాఖ్యానించారు. సరిగ్గా సాయంత్రం 6.23కి ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రెండు నిమిషాలకే.. సమీపంలోని మసీదు నుంచి 'అజా' వినిపించింది. దాంతో ఆయన ప్రసంగాన్ని ఆపారు. 'అజా' పూర్తయ్యాక తిరిగి ప్రారంభించారు.

అమిత్ షాకు కితాబు

'కొందరు హోదా రీత్యా పెద్దవారు. కానీ స్థాయి దిగజార్చుకుంటారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీనుద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. ఇందుకు భిన్నంగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అనేక రాష్ట్రాల్లో పార్టీకి విజయాన్ని అందిస్తూ ఎదిగారని తెలిపారు. షా విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి తనకు తెలుసన్నారు. పార్టీని అత్యున్నత శిఖరానికి తీసుకెళ్లారని కొనియాడారు. వాస్తుశాస్త్రంలో తాను నిపుణుడిని కానని, అయితే ఇంట్లో ఈశాన్య దిశే కీలకమని అందరూ అంటుంటారని, దానికి అనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తారని మోదీ గుర్తుచేశారు. తన ప్రభుత్వం కూడా ఈశాన్య భారతానికి ప్రాధాన్యమిచ్చి అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. 'తమను పరాయివారుగా చూస్తున్నారన్న భావన ఈశాన్య ప్రజల్లో ఇంతకుముందు ఉండేది. దానిని తొలగించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ఎంతో కష్టపడింది. నాలుగేళ్లుగా కేంద్ర మంత్రులు ఈ ప్రాంతంలో తరచూ పర్యటించి.. రాత్రిళ్లు బస చేసి.. అక్కడి సమస్యలు తెలుసుకుని.. పరిష్కరిస్తున్నారు. గతంలో ఇలా జరగలేదు' అని తెలిపారు.



భావి ఫలితాలకు సూచిక

'ఈశాన్య' విజయం ఘనత మోదీదే

వామపక్షాలు దేశానికి రైట్ కాదు: అమిత్

న్యూఢిల్లీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు.. కర్ణాటక అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు సూచికగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అభివర్ణించారు. 'భారతదేశానికి వామపక్షాలు సరికాదు.. (లెఫ్ట్ ఈజ్ నాట్ రైట్)' అని కూడా ఇవి చాటుతున్నాయన్నారు. కాంగ్రెస్ సైతం సరైన ప్రత్యామ్నాయం కాదని సంకేతమిచ్చాయని తెలిపారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన శనివారమిక్కడ బీజేపీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా బీజేపీ వీరవిజృంభణ చేస్తోంది. అయితే ఇది పార్టీకి స్వర్ణయుగం కాదు. ఒడిసా, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలను కూడా చేజిక్కించుకున్నప్పుడే బీజేపీకి స్వర్ణయుగం ప్రారంభమైనట్లు లెక్క' అని స్పష్టం చేశారు. తమకు ఓటేసి ప్రభుత్వాన్ని నెలకొల్పే అవకాశం ఇచ్చినందుకు త్రిపుర, నాగాలాండ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 'ఇవాళ నాకు, కోట్ల మంది బీజేపీ కార్యకర్తలకు సంతోషదాయకమైన రోజు. వామపక్షాలు మొదట పశ్చిమ బెంగాల్‌ను కోల్పోయాయి. ఇప్పుడు త్రిపురలో ఓడిపోయాయి. బీజేపీ విస్తరణకు ఇదే స్పష్టమైన సంకేతం. బెంగాల్, కేరళలో కమ్యూనిస్టుల హింసను ఎదుర్కొంటున్న మా కార్యకర్తలకు ఈ తీర్పు మరింత ఉత్సాహానిచ్చింది. వీధుల్లో కమ్యూనిస్టు హింసకు బలైన మా కార్యకర్తలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాను. వారు హింసను అత్యంత ధైర్యంగా ఎదుర్కొన్నారు. చాలా మంది అమరులయ్యారు కూడా. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి కష్టపడి బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించారు' అని ప్రశంసించారు. ఇదే తరహా ఫలితాలు రానున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగుతాయని ధీమా వ్యక్తం చేశారు. 'బీజేపీ కేవలం హిందీ రాష్ట్రాలకే పరిమితమైన పార్టీ అన్నారు. అది తప్పని ఇప్పుడు రుజువైంది' అని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.